ఈనాడు


విజయవాడ 10-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 61

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఈనాడు



విజయవాడ 10-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 61

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

లోపలి పేజీల్లో

ప్రొటీన్లపై పరిశోధనలకు నోబెల్

రసాయన శాస్త్రంలో డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లను వరించిన పురస్కారం

కులాల పేరుతో హిందువుల విభజనకు కుట్ర

కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం

లేపాక్షి భూముల కోసం 'ఈడీ'తో సంప్రదింపులు

ఆ భూముల్లో భారీ పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ప్రతిపాదన

కేంద్ర అనుమతుల కోసం పంపిన రాష్ట్ర ప్రభుత్వం

విశాఖలో టీసీఎస్

డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్న టాటా గ్రూపు

- 10 వేల మందికి ఉపాధి
- మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థ సుముఖత
- ఫలించిన మంత్రి లోకేశ్ ప్రయత్నం




ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థ టాటా గ్రూప్ సుముఖత వ్యక్తం చేసింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. దీని ద్వారా 10 వేల మందికి ఉపాధి లభిస్తుంది. టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేశ్ ముంబయిలో మంగళవారం జరిపిన సంప్రదింపుల తర్వాత సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్డీయే అధికారం చేపట్టాక టాటా సంస్థ విశాఖలో కార్యకలాపాలను ప్రారంభించేందుకు ముందుకు రావడం కీలక ముందడుగనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు ప్రముఖ ఐటీ కంపెనీలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇది రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది.

అనువైన వాతావరణమే కారణం

ఐటీ రంగం అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం విశాఖలో ఉండటం కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. దీంతో ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తల రాకపోకలకు మరింత వెసులుబాటు పెరుగుతుంది. ఇప్పటికే ఇక్కడ టెక్‌మహీంద్రా, సింబయోసిస్‌తో పాటు పలు ప్రముఖ ఐటీ సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. (మిగతా 8లో)

ఉపాధి కల్పనపై ప్రభుత్వ దృష్టి

ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వచ్చే ఐదేళ్లలో సుమారు 5 లక్షల మందికి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అందుకు అనుగుణంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా విశాఖ కేంద్రంగా ఐటీ, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీ), డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ప్రస్తుతం విశాఖ మిలీనియం టవర్స్‌లో అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని (స్పేస్) ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు కేటాయించనుంది. అది పూర్తయ్యే నాటికి కొత్త స్పేస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. అలాగే కృత్రిమ మేధోరంగానికి (ఏఐ)భవిష్యత్తులో విస్తృత అవకాశాలు ఉంటాయని అంచనావేస్తోంది. దీని ప్రాముఖ్యాన్ని గుర్తించి.. 'ఏపీ ఏఐ మిషన్' పేరిట పాఠశాల స్థాయి నుంచే బోధన, స్టార్టప్ ఎకో సిస్టం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ఐటీ రంగానిది కీలక భూమిక అని కూటమి ప్రభుత్వం విశ్వసిస్తోంది.



నింగికేగిన పారిశ్రామిక రత్నం

టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా కన్నుమూత


ముంబయి: దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా (86) బుధవారం రాత్రి కన్నుమూశారు. అనారోగ్య సమస్యల కారణంగా ముంబయి బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స పొందుతూనే రాత్రి 11.30 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. రతన్ టాటా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సోమవారం వార్తలు రాగా, 'నా ఆరోగ్యం బాగానే ఉంది. వైద్య పరీక్షల కోసమే ఆసుపత్రికి వెళ్లాను. ఎలాంటి ఆందోళన అవసరం లేదు' అని ఆయన అదే రోజు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పష్టతనిచ్చిన సంగతి తెలిసిందే. రతన్ టాటా ఇక లేరని బాధాతప్త హృదయంతో ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా తొలుత ప్రకటించారు. తదుపరి టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఆ విషయాన్ని ధ్రువీకరించారు. 'ఒక అసాధారణ నాయకుడికి వీడ్కోలు పలుకుతున్నాం. టాటా గ్రూప్‌నే కాకుండా దేశ రూపురేఖలను మార్చిన వ్యక్తి రతన్ టాటా. నాకు ఆయన మిత్రుడు, మార్గదర్శి, గురువు. వినూత్నత, ప్రతిభ, ప్రత్యేకతలతో ఆయన వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపించారు' అని ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

ప్రపంచ పారిశ్రామిక ధీరుడు

అత్యంత నిరాడంబరుడు

ఘన వారసత్వాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చిన రతన్ టాటా

9లో





విజయవాడ ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి వస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ కేశినేని శివనాథ్

దుర్గమ్మ దయతో..

అమరావతి, పోలవరం నిర్మాణం

రాష్ట్రంలో ప్రవహించే నదులన్నింటి అనుసంధానం జరగాలి: సీఎం చంద్రబాబు

దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

8లో

సరస్వతీదేవి రూపంలో దుర్గమ్మ

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూలానక్షత్రం రోజైన బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. చదువుల తల్లి సరస్వతీదేవి రూపంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది.






LLOYD
A HAVELLS Brand
LLOYD FESTIVAL OF FORTUNE
BIKE
STELLAR AC
SUV CAR
CASH PRIZE
NOVANTE WASHING MACHINE
LLOYD FRIDGE
CASH PRIZE
LLOYD LED TV
SPIN AND WIN BIG
Get Unique Scratch Card On Every Purchase To Spin And Win
Chance to win SUV Car/ Bike/ Lloyd products or cashback. Assured prize on every purchase*.
Assured Exclusive Gift Coupons Worth Around ₹ 25 000/- On Every Purchase*.
Discover The All New Range Of Lloyd Products
LLOYD Novanté IOT WASHING MACHINE
5D ULTRA WASH TECHNOLOGY
LLOYD STELLAR
— AIR CONDITIONER —
India's 1st* Designer AC
Mood ON MOOD LIGHTING
COOLS EVEN AT 60°C
LLOYD REFRIGERATORS WITH RAPID FREEZE TECHNOLOGY
MAKES ICE IN 29 MINUTES
LLOYD QLED TV RANGE WITH FAR FIELD TECHNOLOGY
VOICE COMMAND OPERATION. NO REMOTE NEEDED.
4K ULTRA HD
Google TV
Offers not applicable in Tamil Nadu & Kerala. *T&C Apply. For details visit website www.havells.com/lloyd
JUST PAY ₹1/-* & Take Home a Lloyd Product
JUST PAY ₹2 024/-* Fixed EMI
GET Extended Warranty*
FREE Installation* on Select Models
UP TO ₹10 000 INSTANT CASHBACK*
On Credit Card EMI Transaction.
AMERICAN EXPRESS
AXIS BANK
DBS
FEDERAL BANK
HSBC
ICICI Bank
IDFC FIRST Bank
SBI card
YES BANK
Powered By: Pine Labs | Paytm
Scan QR Code to view complete range of Lloyd products
/MyLloydIndia /MyLloydIndia YouTube/MyLloyd /MyLloydIndia
All trademarks used herein are property of their respective owners. Any use of third party trademarks is for identification purposes only and does not imply endorsement.
CARE 360 ASSURANCE • REACH • EFFICIENCY
Reach us on WhatsApp @ +91-9711773333 for any service related query.
For CARE 360, Call us at : Customer Care No. : 0804-577-5666
WORLD OF EXPERIENCE: MEGHANA MALL, KAKINADA – 9246618925, RAJCO ELECTRONICS, JAGGAMPETA -9985295953, PURUSHOTHAM ENTERPRISES, NELLORE-9052831667, VSL ELECTRONICS, PEDDAPURAM-7660077188, DESHAY AGENCIES, KADAPA-9966901717, LLOYD GALLERY-JYOTHI ELECTRONICS, GUDURU-9704713121, MEGHANA MALL, VISAKHAPATNAM-9246618925, SRI SIDDHI VINAYAKA AGENCIES, YANAM-9000145449, HS ENTERPRISES, TIRUPATI-7997993786, SAI KRISHNA ENTERPRISES, PALAKOLLU-9849467671, SALES & SERVICE CENTRE: VIJAYA DURGA REFRIGERATION, RAVULAPALEM-9440007744, PAVANI RAC SYSTEMS, VISAKHAPATNAM-9966399885, CHINNI BALASAI AIR CONDITIONERS & REFRIGERATION WORKS, ELURU-9441078687, ELITE COOLING SOLUTIONS, BHIMAVARAM-9908665978, KRISHNA, GUNTUR: JEEVAN KUMAR THOTA – 9949644797, SRINIVASA VEPURI-9030099117, SHAIK JANI-9177436093, VENKATA SAI KRISHNA-7989866373, WEST GODAWARI: BHANUTEJA UDIGA-9441078687, NELLORE: HARIKRISHNA VANA-9493382271, ONGOLE-V.SURESH- 9515482888, VISHAKAPATNAM: P. VINOD KUMAR-9160001199, SIVA-9493736914, EAST GODAVARI DIST: ANISETTI SRINIVAS-9133862233, VIJAY-8555067859, SRIKAKULAM: SHANMUKH-9963414832, TIRUPATI & KADAPA: TULASI RAMIREDDY-8121869989, KURNOOL, BALAM KISHORE KUMAR-9701886368, ANANTAPUR: GANDLURU BABU ACHARI-9949900950, LLOYD GALLERY- HYDERABAD, VEL AIRCONDITIONERS-9848195080, COOL SOLUTION-8309475911, DHARANI AIR CONDITIONERS-9704606516, NISSY ENTERPRISES-9515788979, NALGONDA, HAMEEDA SYSTEM-8121217860, KARIMNAGAR, SAI DEPARTMENTAL STORES-9866227244, PEDDAPALLY, ROYAL ENTERPRISES-9100748488, WARANGAL: S S ELECTRONICS-9160211211, HYDERABAD: SRINIVAS-9059392007, SHOYAB-9000984366, RAJU VENKATAPURAM- 87904 07468, PRASHANTH-7093660333, VENKATACHALAM- 9642955444, VENKAT- 9246419499, SURYAPET, MAHABUBNAGAR, NALGONDA PABHA SHASHIKANTH-919912740342, KHAMMAM & MFR ROH ANIL SAGI-9642723334, NIZAMABAD & ADILABAD, KARIMNAGAR, SIDDIPET, WARANGAL: SHEKAR-9985487436.


LOVED IN 70 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
ఈ పండగకి
ఎంచుకోండి డేరింగ్‌గల దసరా
ఆదా ₹10 000/-* వరకు
N160
NS125
150
NS200
*ఇతర పల్సర్ మోడల్ పైన కూడా క్యాష్‌బ్యాక్ ఆఫర్ లభ్యం
Flipkart మరియు amazon.in పై అదనపు ఆఫర్స్ లభ్యం
pulsar
DEFINITELY DARING
72198 21111
BAJAJ SECURE
pine labs PAY LATER
HDFC BANK
*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి. *ఎంపికచేయబడిన రకాలకు మాత్రమే ఆఫర్. నవంబర్ 7, 2024 వరకు ఆఫర్ వర్తిస్తుంది. ఎలాంటి ముందు సూచన లేకుండానే ఏదైనా లేదా అన్ని ఆఫర్స్‌ని విరమించుకునే హక్కు బజాజ్ ఆటోకే ఉంటుంది. *మోడల్ పైన ఆధారపడి ₹5,000/-* క్యాష్‌బ్యాక్ తో పాటు ఆదా చేసుకోండి ₹10000/- వరకు ఆదాచేసుకోండి మరియు హెచ్‌డిఎఫ్‌సి కార్డ్‌తో ₹5,000/-* క్యాష్‌బ్యాక్. స్టంట్స్‌ని సాధారణ జనం లేదా జనం లేని రోడ్ల పైన, నియంత్రణగల మరియు కట్టుదిట్టమైన వాతావరణంలో నిపుణుల పర్యవేక్షణలో, నిపుణుల ద్వారా కొనసాగించడం జరిగింది. ఈ స్టంట్స్‌ని కాపీ చేసే ప్రయత్నం చేయకండి మరియు ఎల్లప్పుడు ట్రాఫిక్ మరియు భద్రత నియమాలు పాటించండి. ప్రదర్శించిన మోడల్స్ మరియు ప్రత్యేక రాష్ట్రాలలో ఏఎమ్‌సి అందుబాటులో ఉంటుంది. రోడ్‌సైడ్ సహకారాన్ని అందిస్తున్నవారు మూడో వ్యక్తులు మరియు వారి నియమాలు మరియు నిబంధనల ప్రకారం ఉంటుంది. క్యాష్‌బ్యాక్ ఆఫర్ అక్టోబర్ 15 వరకు పైన్ లాబ్స్ మెషీన్స్ ద్వారా హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డ్‌తో కొనసాగించిన ఈఎమ్ఐ లావాదేవీలకు అందుబాటులో ఉంటుంది. ఈ -కామర్స్ ప్లాట్‌ఫారమ్స్ ఆఫర్స్ వారి నియమాలు మరియు నిబంధనలకు లోబడి ఉంటాయి.
Authorised Dealers For Bajaj Auto Ltd.: Vijayawada VARUN BAJAJ 9885180282,9966383555 • Gudivada VARUN BAJAJ 9885180311 • Guntur SRI SIDDHI VINAYAKA BAJAJ 9100961204, 9121008788 • KOTHAPETA 9100559456, 9100551152 • Tenali VARAHI BAJAJ 9959234569 ,08644226778 • Bhimavaram VARUN BAJAJ 8142511888 • Eluru MOHANA SAI BAJAJ 7799771997 • Ongole TIRUMALA BAJAJ 6309601833 • Chirala TIRUMALA BAJAJ 9292002004 • Nellore MGB BAJAJ GT ROAD 9247000009, 9299999987, Mini Bye-Pass 9299999976, 9246777133. Authorised Service Centre: I TOWN 9885180278, GANDHI NAGAR 9885180286, NUNNA 9885706839, KANURU 8297265444, BHAVANIPURAM 9885180307, MACHAVARAM 8297215333, AUTO NAGAR 8297544427, NANDIGAMA 9885180284, KANCHIKACHERLA 9885001463, IBRAHIMPATNAM 9885180274, MYLAVARAM 9052421177, TIRUVURU 9885180306, 9885810692, GAMPALAGUDEM 9394001636, NUZIVIDU 9885180296, VISSANNAPET 9391812551, 9391812629, JAGGAYYAPET 9885180279, AGIRIPALLI 8297913888, MACHILIPATNAM 9885110333, KAIKALURU 9885180281, KALIDINDI 8297066111, CHALLAPALLI 9885114445, AVANIGADDA 9703219996, VUYYURU 9885107476, KANKIPADU 9885163222, GANNAVARAM 9885180263, HANUMAN JUNCTION 8297181666, GURAJALA 9705276999, KORITIPADU 9100961209, SATTENAPALLI 8978972567, NARASARAOPET 9100992644, VINUKONDA 9440138786, MACHERLA 9866455436, PIDUGURALLA 9100961207, DACHEPALLE 9100992655, CHILAKALURIPET 9246758222, AMARAVATHI 9866834699, MANGALAGIRI 9100961208, REPALLE 8712418610, CHERUKUPALLI 9866638571, PONNUR 9490762038, BAPATLA 9949949690, KOLLURU 8886977666, PALAKOLLU 9885300571, NARASAPURAM 8297126444, AKIVEEDU 9703500077, TANUKU 9391812651, TP.GUDEM 8341816664, MOGULTUR 9985159666, GANAPAVARAM 9581457111, DEVARAPALLI 8297011888, NIDADAVOLE 9052511888, KOUVR 9642888149, CHINTALAPUDI 7989683559, NALLAJARLA 9494433533, JANGAREDDIGUDEM 9490359595,, JEELUGUMILLI 7075673000, KOYYALAGUDEM 9885180268, BHIMADOLE 9908353443, KAMAVARAPUKOTA 7386796664 , NARAYANAPURAM 9391812631, RAMNAGAR 9912899192, KANDUKUR 9866244688, SINGARAYAKONDA 7207831555, CHIMAKURTHY 7207832555, PAMURU 9160609062, DARSI 9346225079, , MARKAPURAM 9491242338, KANIGIRI 9440873458, MADDIPADU 9849345709, GIDDALURU 9441355850, EAST GANGAVARAM 8897098369, MARTUR 9246465401, INKOLLU 7207830555, ADDANKI 9701050818, GUDUR 9848877391, KOTA 9848680172, NAIDUPET 9246777142, SULLURPET 8885012647,VENKATAGIRI 9885499280, KAVALI 8008654909, ATMAKUR 8019738534, BUCHI 8919020446, DUTTALURU 9440921543.


MARUTI SUZUKI
NEXA
ధైర్యవంతులకు విజయం అనుకూలంగా ఉంటుంది.
ఈ నవరాత్రికి, NEXA ప్రీమియం హ్యాచ్ బ్యాక్ Balenoను ఇంటికి డ్రైవ్ చేయండి మరియు అద్భుతమైన పండగ ఆఫర్లను ఆనందించండి.
CREATE. INSPIRE.
BALENO
3 years 100 000 km WARRANTY* EXTENDABLE UPTO 6 YEARS
THE NEW AGE
BALENO
TECH GOES BOLD
₹ 47 100** వరకు ప్రయోజనాలు. పరిమిత సమయం వరకు ఆఫర్ చెల్లుతుంది.
ఆధునిక Baleno గురించి మరింత తెలుసుకోండి
WhatsAppపై చాట్ చేయడానికి స్కాన్ చేయండి
VIJAYWADA: NEXA VIJAYAWADA EAST (SANTOSH AUTOMOTORS PVT LTD PH: 9246559777), NEXA MG ROAD (PARAMSHIVA MOTORS PH: 08062216763),
NEXA RING ROAD (VARUN MOTORS PH: 08062216729), NELLORE: NEXA AYYAPA TEMPLE (BHARGAVI AUTOMOBILES PH: 08062511249),
BHIMAVARAM: NEXA BHIMAVARAM WEST (NOVELTY REDDY AND REDDY MOTORS PVT. LTD. NEXA DIVISION PH: 08062511081),
GUNTUR: NEXA AUTONAGAR (JAYALAXMI AUTOMOBILES PH: 08062512593), ONGOLE: NEXA ONGOLE NORTH (JAYALAKSHMI AUTOMOTIVES PVT. LTD. PH: 08062512629).
1800-200-[6392], 1800-102-[NEXA]-ని సంద్రదించండి మరియు ఆన్‌లైన్‌లో బుక్ చేయడానికి సందర్శించండి: www.nexaexperience.com
నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి. ఆఫర్స్ కొనుగోలు చేసిన మోడల్ మరియు వేరియంట్ ప్రకారం మారవచ్చు. అన్ని ఆఫర్లు 31st October'24 వరకు లేదా స్టాక్స్ ఉన్నంత వరకు చెల్లుతుంది. **అన్ని ఆఫర్లను NEXA డీలర్స్ మాత్రమే అందచేస్తున్నారు. Maruti Suzuki స్మార్ట్ ఫైనాన్స్ ఇప్పుడు భారతదేశంవ్యాప్తంగా అందుబాటులో ఉంది. Maruti Suzuki సబ్ స్క్రైబ్ కేవలం ఎంపిక చేయబడిన పట్టణాలలో మాత్రమే లభిస్తుంది. Maruti Suzuki ముందస్తుగా తెలియచేయకుండానే ఏ సమయంలోనైనా ఆఫర్లను ఉపసంహరించవచ్చు. సృజనాత్మక దృశ్యీకరణ. *3 సంవత్సరాలు లేదా 10000 కిమీ, ఏది ముందు జరిగితే తదనుగుణంగా.

ఈనాడు

రైతుకు దక్కుతున్నదేంటి?

అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్లుగా తయారైంది పరిస్థితి! ఎలాగో పెట్టుబడి సమకూర్చుకుని శ్రమకోర్చి కూరగాయలను సాగుచేస్తున్న సాధారణ రైతులకు దక్కుతున్నది అరకొర ప్రతిఫలమే. అవే కాయగూరల కొనుగోలుకు మార్కెట్‌కు వెళ్తున్న సామాన్యులేమో అక్కడి ధరల దెబ్బకు ఠారెత్తిపోతున్నారు. అటు సాగుదారులను అడ్డగోలుగా దోచేస్తూ, ఇటు వినియోగదారుల జేబులకు చిల్లి పెడుతున్న మార్కెట్ మాయాజాలంలో దళారీలే లాభాల పంట పండించుకుంటున్నారు. కూరగాయలు, పండ్లకోసం జనం ధారపోస్తున్న డబ్బులో మూడో వంతు మాత్రమే రైతులకు దక్కుతోంది. మిగిలిన సొమ్మంతా ట్రేడర్లు, హోల్‌సేలర్లు, రీటైలర్ల వాటాలూ ఛార్జీలకే చెల్లిపోతున్నట్లు ఆర్‌బీఐ నిపుణుల బృంద అధ్యయనం తాజాగా తేల్చింది. కాయగూరలూ పండ్లనేముంది- అనేక వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఇదే మాయదారి అవ్యవస్థ వేళ్లూనుకుపోయింది. సిండికేట్‌గా మారి రైతుల నెత్తిన చెయ్యిపెడుతున్న వ్యాపారులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అన్నదాతలూ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన సర్కారీ యంత్రాంగమేమో మొద్దునిద్ర నటిస్తోంది!

కూరగాయల వ్యాపారమంతా దళారుల పరం కావడంతో మూడున్నర దశాబ్దాల కిందట పంజాబ్ ప్రభుత్వం ఓ వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. కాయగూరలూ పండ్ల రైతులకు, వినియోగదారులకు ఉభయతారకంగా 'అప్నామండీ'లను ప్రారంభించింది. వాటి స్ఫూర్తితోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుబజార్లు పురుడుపోసుకున్నాయి. తాము పండించిన వాటిని రైతులే విక్రయించుకోగలిగితే సేద్యం గిట్టుబాటు కావడమే కాదు- సామాన్యజనానికీ కాస్త తక్కువ ధరలకు కూరగాయలు లభిస్తాయన్నది రైతుబజార్ల ఏర్పాటు వెనక ఉద్దేశం. కాలక్రమంలో చాలాచోట్ల అవి దళారులకు ఆవాసాలు అయ్యాయన్నది బహిరంగ రహస్యం. ఒకవేళ సాగుదారులెవరైనా రైతుబజార్లకు నేరుగా కాయగూరలను తీసుకొచ్చి, కాస్త తక్కువ ధరకు అమ్మబోతే వ్యాపారులు అడ్డం పడుతున్న సంఘటనలు కొన్ని ప్రాంతాల్లో వెలుగుచూస్తున్నాయి. సరఫరా గొలుసులో ఆమూలాగ్రం ఏం జరుగుతోందో కనిపెట్టుకుని ఉండాల్సిన ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. మార్కెట్ ధరవరల స్థిరీకరణ, అనైతిక వ్యాపార పోకడల నియంత్రణలో సర్కారీ వైఫల్యం ప్రజలకు పెనుభారమవుతోంది!

'భారతదేశానికి రైతే రాజు కానీ, అతణ్ని బానిసగా మార్చేశాం' అని దశాబ్దాల క్రితమే తీవ్ర ఆవేదన వ్యక్తంజేశారు గాంధీజీ. స్వతంత్ర భారతంలోనైనా సాగుదారుల కష్టాలు తీరతాయనుకున్న జాతినేతల కలలన్నీ కల్లలయ్యాయి. గత అధ్యయనాల ప్రకారం, దేశీయంగా వ్యవసాయ కుటుంబాల రోజువారీ ఆదాయం 277 రూపాయలు మాత్రమే. దాంతో రైతన్నలు ఎలా బతుకుతారు... భార్యాబిడ్డలను ఎలా పోషించుకోగలుగుతారు? మద్దతు ధరలకు దిక్కులేని వాతావరణంలో అన్నదాతల ఆదాయాన్ని పెంచుతామన్న ప్రభుత్వాల ప్రకటనలన్నీ నీటిపై రాతలవుతున్నాయి. ఫలసాయాలకు శాస్త్రీయంగా విలువ కట్టకపోతుండటంవల్ల మన రైతాంగం ఏడాదికి సుమారు రూ.2.65 లక్షల కోట్లు కోల్పోతున్నట్లు లోగడ వెల్లడైంది. దానికితోడు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలు ఇంకా విపరీతమవుతుండటంతో కర్షకులెందరో సాగుకు దూరమవుతున్నారు. పండించేవారే లేకపోతే పాలించేవారికీ అన్నం ముద్ద పుట్టదు. ఆ వాస్తవాన్ని గుర్తెరిగి వ్యవసాయ సంక్షోభ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా సంసిద్ధం కావాలి!

అంతర్యామి

బతుకమ్మ పండుగలో తాత్వికత

బతుకమ్మ పండుగ మధుర జ్ఞాపకాల పరంపర. సహజ సౌందర్య ప్రతీక. స్త్రీల అచ్చట్ల ముచ్చట్ల చప్పట్ల ఆనంద హేల. పండుగల కలికితురాయి. ప్రకృతి పర్యావరణాల మూలపుటమ్మ. కళల సమాహార రూపం. కుటుంబ, సమాజ సంబంధాలకు ఆలవాలం. ఆడబిడ్డల ఆటవిడుపు. జానపదాల విజ్ఞానఖని. అనుభవాల కలబోత. 'పెద్దలకు వచ్చింది ఉయ్యాలో పెత్తరామాస ఉయ్యాలో బాలలకు వచ్చింది ఉయ్యాలో బొడ్డెమ్మ పండుగ ఉయ్యాలో' అని పాట. బొడ్డెమ్మను ఆనవాయితీ ఉన్న ఇళ్లల్లో వేసి కన్నె ముత్తయిదులు తమ స్నేహితులతో కలిసి ఆడుకుంటారు. బొడ్డెమ్మను నిద్రపుచ్చుతూ 'నినుగన్న తల్లికి నిండ నూరేళ్లు పాలిచ్చే తల్లికి బ్రహ్మ వెయ్యేళ్ళు, పిల్లి పెసరకాయ పిట పీట అల్లం కొమ్ము జోజోట' అని పాడటంలో మాతృ ప్రశంస, సంతాన సూచనగా అల్లం కొమ్ము కనపడుతుంది అంటే- ఈ బాలికలు పరోక్షంగా పెళ్లిని కోరుకోవడమే.

భాద్రపద బహుళ పాడ్యమి నుంచి మహాలయ అమావాస్య వరకు ఉండే పితృపక్షాల రోజుల్లో కొందరు పెద్దలను స్మరించుకుంటారు. మహాలయ అమావాస్య నాడు పెద్దల తిథిగా జరుపుకోవడం ఆచారంగా ఉంది. ఇక బతుకమ్మ పండుగ విషయానికొస్తే ధర్మాంగదుడి కూతురు, మహిషాసురమర్దని అయిన దుర్గాదేవి, కుసుమ శ్రేష్ఠి కూతురు వాసాంబిక, రుద్రమదేవిని రక్షించబోయి చనిపోయిన ఆమె అనుయాయిగానే కాకుండా వదినచే హతురాలైన ఆడబిడ్డ స్మరణగా బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలను చెబుతూ ఉంటారు. చనిపోయిన ఆడబిడ్డను పాతిపెట్టిన చోట తంగేడు చెట్టు మొలిసిందని కథనం. అందుకే బతుకమ్మలో తంగేడుకు ప్రాధాన్యం. బతుకమ్మలో తంగేడుతోపాటు సహజసిద్ధంగా పూసే గునుగు, కట్ల, గోరింట, రుద్రాక్ష, పోక బంతి, సీత జడలు లేదా బొడ్డు మల్లెలను పేరుస్తారు. ఇవి ఔషధ గుణాలు కలిగినవి, తేలికైనవి, వాడిపోనివి. సింగిడిలా ఈ ఏడు రంగుల పూలు జానపదుల స్వచ్ఛతకు ప్రతీక. బతుకమ్మ పేర్చటంలో శిల్పం, ఆడటంలో సంగీత సాహిత్య నృత్యాలను మొత్తంగా చిత్రకళను దర్శించవచ్చు. బతుకమ్మను అష్టమి వరకు ఆడతారు. ఆ చివరి రోజును సద్దుల బతుకమ్మ అంటారు. ఆ రోజు రెండు రకాల పులిహోరలు, దద్ధోజనంతోపాటు పెసర, పల్లి, నువ్వుల లడ్డూలు లేదా బెల్లంతో కలిపిన పొడితోపాటు రెండు రకాల ఫలాలను ప్రసాదాలుగా పెడతారు. ఈ ప్రసాదాలలో గర్భిణికి పెట్టేలాంటి బలవర్ధకమైన ఆహారం కనపడుతుంది. కొన్ని ప్రాంతాల వారు జొన్న రొట్టెలో బెల్లం కలిపి మలీద ముద్దలు చేస్తారు. ఈ ప్రసాదాలలో ఉపయోగించే ధాన్యాలు ఈ కాలంలో చేతికి వచ్చే పంటలు. అంటే ఆయా కాలాల్లో లభించే ధాన్యాలను తినడం ఆరోగ్యదాయకమనే సూచన కూడా ఈ ప్రసాదాల్లో కనబడుతుంది.



బతుకమ్మను చివరగా సాగనంపుతూ 'ఉసికల పుట్టే గౌరమ్మ ఉసికల పెరిగే గౌరమ్మ ఉసికెల వసంతమాడే గౌరమ్మ' అంటూ సాగనంపడంలో ప్రకృతిలో పుట్టి ప్రకృతిలో లీనమయ్యే తత్వం కనబడుతుంది. బతుకమ్మ ఆడిన తర్వాత స్త్రీలంతా ప్రసాదాలను పంచుకోవడం, కలసి ఆరగించడం ఒక సమష్టి తత్వానికి నిదర్శనం. పండుగ మొత్తంగా స్త్రీల అస్తిత్వాన్ని నిలపడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆ పాటలు కాలానుగుణమైన స్త్రీల మనోభావాలకు అద్దం పడతాయి.

– దేవకీదేవి తిరునగరి



సినిమాలు... సమైక్యతా సాధనాలు!

సమాజంపై బలమైన ముద్ర వేయగల సాధనం సినిమా. సమాజంలో విలువలకు ప్రోది చేయడంతో పాటు దాన్ని ఐక్యంగా ఉంచడంలోనూ సినిమా కీలకంగా నిలుస్తుంది. అలాంటి చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది.

మానవాళిని ఐక్యం చేసే సాధనంగా చలనచిత్రానికి ఉన్న శక్తిని అభివర్ణిస్తూ 'సినిమా మాట్లాడే భాష విశ్వజనీనం' అన్నారు సత్యజిత్ రే. భాష, సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక అయిన భారతీయ సినిమా- దేశం నలుమూలలా ప్రజానీకాన్ని ఏకం చేస్తోంది. పైపై భేదాలెన్ని ఉన్నా మనమంతా ఒకటేనని చాటుతుంది. ప్రాంతీయ, భాషా పరిమితుల్ని అధిగమిస్తూ భారతీయ సినిమా ఒక బలమైన జాతీయ సమైక్యతా సాధనంగా ఎదిగింది. రాజ్‌కపూర్ రూపొందించిన అపురూప చిత్రం 'శ్రీ 420' నుంచి, మణిరత్నం దర్శక సారథ్యంలో నిర్మితమైన 'రోజా' వరకూ భారతీయ సినిమాలన్నీ మానవాళి మొత్తానికి వర్తించే భావోద్వేగాలను దర్శించాయి. అందుకే భారతదేశంలో సినిమా ఒక బలమైన సమైక్యతా శక్తి అని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

విలువలకు తార్కాణం

మన సినిమాల విశ్వజనీనతను శ్లాఘించేందుకే ఉత్తమ చిత్రాలు, దర్శకులు, నటీనటులకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఫిలిమ్ అవార్డులు అందజేయడాన్ని ఆనవాయితీగా పాటిస్తున్నాం. మన జాతీయ ఫిలిమ్ అవార్డుల ఉత్సవాలు ఇతర సంస్థల కార్యక్రమాల్లా కళ్లు జిగేల్‌మనిపించే ఆర్భాటాలు కావు. ప్రతిభను గుర్తించి తద్వారా అద్భుతాలు సృష్టించిన వారికి, ఉత్తమ కథకులకు, నటీనటులకు గుర్తింపు, గౌరవం అందించే వేడుకలవి. అనేక భాషలు, యాసలు, సంస్కృతుల సమ్మేళనమై బహువర్ణ శోభితమైన భారతీయ వైవిధ్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి జోహార్లు అర్పిస్తాయవి.

తివా భాషలో రూపొందిన 'సికైసాల్'ను ఉత్తమ చిత్రంగా ఎంపిక చేయడం మన నేషనల్ ఫిలిమ్ అవార్డుల ప్రత్యేకత. ఈశాన్య భారతంతో పాటు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల్లోని టిబెటో బర్మీస్ జాతి ప్రజలు 'తివా' మాట్లాడతారు. 70వ నేషనల్ ఫిలిమ్ అవార్డుల కోసం 32 భాషల్లో ఫీచర్ ఫిలిం కేటగిరీ కింద 309 చలన చిత్రాలను, నాన్ ఫీచర్ ఫిలిమ్ కేటగిరీ కింద 128 చలన చిత్రాలను పరిశీలించి వాటిలోంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేశారు. ఫీచర్ ఫిలిమ్ కేటగిరీ కింద నాలుగు చలనచిత్రాలకు స్వర్ణకమలం దక్కింది. వీటిలో ఒకటి హర్యానవీ భాషలో రూపొందింది. ఇదే కేటగిరీ కింద అయిదేసి చొప్పున హిందీ, తమిళ చిత్రాలకు వెండి కమలం దక్కింది. మలయాళం, గుజరాతీ, కన్నడ, హర్యానవీ, బెంగాలీ భాషా చిత్రాలూ ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో ప్రస్తావించిన భాషల్లో రూపొందిన 10 చిత్రాలకు వెండి కమలం లభించింది. హిందీ, ఉర్దూ భాషల్లో విడుదలైన ఒక చిత్రానికి నాన్ ఫీచర్ ఫిలిమ్ కేటగిరీ కింద స్వర్ణ కమలం దక్కింది.

'నాటు నాటు' ప్రత్యేకత

రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లోని విభేదాలను విడనాడి ఐక్యతకు బాటలు వేసే చిత్రాలను రూపొందించడం మన సినీ రూపకర్తల ప్రత్యేకత. మనదేశ కథా కథన విధాన మౌలిక లక్షణమే సమైక్యత. కళాత్మక చిత్రాలు కానీ, మాస్ చిత్రాలు కానీ, వాణిజ్య సినిమాలు కానీ, ఓటీటీ చిత్రాలు కానీ. . మనందరం వాటిని చూసి సమష్టిగా స్పందిస్తాం. మెచ్చుకుంటాం. సంబరపడతాం. తెలుగులో రూపొందిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్ని పొందింది. ఈ పాట భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సూపర్ హిట్ అనిపించుకుంది. అన్ని భాషా జాతులకు చెందిన ప్రజలనూ ఆ పాట అలరించింది.



భాషాప్రయుక్త రాష్ట్రాలతో కూడుకున్న మన గణతంత్రదేశం ఆవిర్భవించి 75 సంవత్సరాలైంది. సంకుచిత రాజకీయవాదుల వాదనలెలా ఉన్నా ఈ ఏడున్నర దశాబ్దాల్లో భాషల అడ్డుగోడలు తొలగిపోయాయన్నది వాస్తవం. బాలీవుడ్ సినిమాలు హిందీని అన్ని ప్రాంతాలకూ తీసుకెళ్లాయి. అయితే అది భిన్నత్వంతో కూడుకున్న భారతీయ సామాజిక పటంపై సినిమా చూపిన ప్రభావానికి ఒక పార్శ్వం మాత్రమే. ఇతర భాషా సమూహాల అస్తిత్వాన్ని గుర్తించడంతోపాటు 'ఒకే భారత్ శ్రేష్ఠ భారత్' అనే సమైక్యతా భావనను పెంపొందించడం ప్రజల మనసులపై సినిమా చూపిన మరో ప్రభావం.

సినిమాకు సంబంధించినంత వరకూ 'ఒకే భారత్, శ్రేష్ఠ భారత్' అనేది కేవలం నినాదం కాదు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వైవిధ్యానికి అతీతంగా మనల్ని విలువలు, నైతికత కలిగిన ఒకే ప్రజానీకంగా సమైక్యపరిచే గొప్ప సాధనం మన సినిమా. దాని రూపకర్తలు, ప్రేక్షకులు అంతరంగ సమైక్యతతో పరస్పరం అర్థం చేసుకొనే విశ్వజనీనమైన విలువలు, నైతికత లేని కథ ఏదీ మనదేశంలో సినిమాగా రూపొందదు. ప్రపంచ చరిత్రలో మహా గాథలైన రామాయణ, మహాభారతాలు మన కథా విలువలకు తార్కాణాలు.

ఇదే నిదర్శనం

భారతీయ సినిమాను ప్రపంచ వేదికపై మెరిసేలా చేసేందుకు ప్రతిభను ప్రోత్సహించడం, చిత్ర రూపకర్తల కోసం మౌలిక సదుపాయాలు కల్పించడం, విధానాల సరళీకరణ అనే మూడు రకాల చర్యలను ప్రభుత్వం తీసుకుంటోంది. అందులో భాగంగానే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవలే ప్రకటించింది. సినీ రంగంలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు, దాని అభివృద్ధి కోసం కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై ఉందనడానికి ఇదే నిదర్శనం. వేగంగా పరివర్తన చెందుతున్న ప్రస్తుత ప్రపంచంలో భారతీయ సినిమా నిత్యనూతనంగా పరిణమిస్తూ తన సరిహద్దుల్ని నిరంతరం విస్తరిస్తోంది. జాతీయ సమైక్యతకు బలమైన ఉత్ప్రేరకంగా సినిమాను తీర్చిదిద్దేందుకు కొత్త కథా కథన రీతుల్ని అందిపుచ్చుకుంటున్న మన సినీ రూపకర్తల కృషి సర్వదా శ్లాఘనీయం.




అశ్వినీ వైష్ణవ్

కేంద్ర సమాచార ప్రసారాలు, రైల్వే, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖామాత్యులు

ఆనందానికి రాజమార్గం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం. నేటి తరం ఇంటాబయటా అనేక ఒత్తిళ్లకు గురవుతోంది. ఎంతో మంది యువతీ యువకులు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. వాటి నుంచి బయటపడి ఆనందాన్ని ఆస్వాదించడానికి సరైన మార్గం- సేవా తత్పరత!



మానసిక అనారోగ్యమనేది నేడు ప్రపంచంలోని అతిపెద్ద సమస్యల్లో ఒకటిగా తయారైంది. మా చిన్నతనంలో కుంగుబాటు వంటి మానసిక సమస్యల గురించి, ఆత్మహత్యల గురించి ఎప్పుడూ పెద్దగా వినలేదు. వెనకటి తరాల్లో యువతకు తమ భవిష్యత్తుపై ఆశ, కొత్తవి తెలుసుకోవాలనే ఉత్సుకత ఉండేవి. వారు ప్రపంచాన్ని అన్వేషించి, క్రమక్రమంగా కొత్త విషయాలను కనిపెడుతూ వచ్చారు. ఈరోజు ఇంటర్నెట్ ద్వారా ఆ అనుభవాలన్నీ ఏమాత్రం శ్రమ లేకుండానే నవతరానికి అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఇలా అనుభవాలన్నీ చాలా త్వరగా అందడంవల్ల వాటి మోహంలో పడి కొట్టుకుపోయే ప్రమాదముంది. అంతే వేగంగా వాటిపై ఆసక్తి సన్నగిల్లి ఎక్కడికి వెళ్లాలో, ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టాడే పరిస్థితి వస్తుంది. తమ పూర్వీకుల జీవితం ఆనందంగా లేదని నేటి తరానికి తెలుసు. కాబట్టి, వారు జీవించిన విధానంలో వెళ్లాలనిపించదు. సుఖభోగాలు, సంపదలు ఉన్నవారిని కూడా ఈ తరం చూసింది. అయితే, ఆ జీవితాలు కూడా ఏమంత సంతోషంగా లేవు. కాబట్టి, ఆనందాన్ని ఎలా పొందాలనే కోరిక సహజంగానే ఉంటుంది. దాన్ని పొందే ఆరాటం ఈరోజుల్లో చాలా చిన్నవయసు నుంచే మొదలవుతోంది. భావితరానికి సరైన దిశను చూపకపోతే, వారి జీవితాల్లో నిరాశ గూడుకట్టుకునే ప్రమాదముంది.

ఒత్తిడి నుంచి విముక్తి

ప్రతికూల భావోద్వేగాలను ఎలా నియంత్రించాలనే విషయాన్ని మనకు బడిలో గానీ, ఇంట్లో గానీ ఎవరూ నేర్పడంలేదు. డెంటల్ హైజీన్- అంటే పళ్లు తోముకోవడం ఎలాగో చిన్నప్పుడే నేర్పుతారు. కానీ మెంటల్ హైజీన్- అంటే మనసును ఎలా శుభ్రం చేసుకోవాలో నేర్పడం మరచిపోతున్నాం. ఊరకే మాట్లాడటం, సలహాలివ్వడం వల్ల ఒత్తిడి తగ్గదు. దాన్ని దూరం చేసి, మనసుకు ప్రశాంతతను చేకూర్చేందుకు కొన్ని పద్ధతులు, విధానాలను నేర్చుకోవాలి. ఒత్తిడి నుంచి విముక్తి పొందడంలో ధ్యానం, శ్వాసక్రియ వంటి పద్ధతులు ముఖ్యమైన పాత్ర పోషించగలవు. అవి మీ మనసును ప్రశాంతంగా ఉంచేందుకు సహాయపడే సాధనాలు. మీరు అంతర్గతంగా ఆనందం పొందడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. ఇతరులు మీ నుంచి దూరం చేయలేని ఆనందాన్ని మీకు అందించడమే ఆధ్యాత్మికత లక్ష్యం. ఆనందం రెండు రకాలు. మొదటిది- పొందడం, లేదంటే తీసుకోవడం ద్వారా కలుగుతుంది. చిన్న పిల్లలు వస్తువులను తీసుకోవడం ద్వారా ఆనందిస్తారు. ఇది బాల్యావస్థలోని ఆనందం. వస్తువులను సొంతం చేసుకోవాలనే కోరికను ఇది సూచిస్తుంది. అయితే, తీసుకోవడం వల్ల కలిగే ఆనందం కంటే ఇవ్వడం వల్ల కలిగే సంతోషం చాలా ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. ఇది రెండో రకం. మనం దేనినైనా ఇతరులతో పంచుకున్నప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో ఎప్పుడైనా గమనించారా? ఉదాహరణకు, మీరు ఒక మంచి సినిమాను చూశారనుకోండి... దాని గురించి అందరికీ చెబుతారు. అంతేకాదు, వారిని తప్పకుండా చూడమని సిఫార్సు చేస్తారు. అలా చెప్పినందుకు ఆ సినిమా నిర్మాత మీకేమీ డబ్బు ఇవ్వడంలేదు కదా? మీకు ఆనందం కలిగింది కాబట్టి, మీకు ప్రియమైనవారికి కూడా అదే అనుభవం కలగాలని భావిస్తారు. ఇది పరిణతి చెందిన ఆనందం. ఇది ఇవ్వడం ద్వారా, పంచుకోవడం ద్వారా సిద్ధించేది.

తీసుకునే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగడమనేది మనసును పరిశుద్ధంచేసి, అపారమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. కుంగిపోయినట్లు అనిపించినప్పుడు గది నుంచి బయటకు వచ్చి 'మీ కోసం నేను ఏమి చేయగలను?' అని ఇతరులను అడిగి చూడండి. మీరు చేసే సేవ మీలో విప్లవాత్మకమైన మార్పును తెస్తుంది. ఇతరులకు సాయం చేయడంలో నిమగ్నమైనప్పుడు, దైవం మిమ్మల్ని చాలా బాగా చూసుకుంటున్నాడని గ్రహిస్తారు. ప్రేమ, కృతజ్ఞతలతో మీ జీవితం నిండిపోతుంది.


అదే జీవిత లక్ష్యమైతే...

మనం ధ్యానం, ప్రాణాయామం చేస్తున్నప్పటికీ కొన్నిసార్లు అసౌకర్యంగా అనిపించవచ్చు. అప్పుడు ఇతరులకు ఆనందాన్ని, ఓదార్పునూ కలిగించే సాయమేదైనా తప్పకుండా చేసి చూడండి. ఇతరులకు అనేక మార్గాల్లో సేవ చేయొచ్చు. మన సమయాన్ని వారి కోసం వెచ్చించడం, ధన సాయం చేయడం, వారితో సానుకూల విషయాల గురించి మాట్లాడటం వంటివి చేయవచ్చు. అటువంటి సేవ మన చైతన్యంలో మార్పు తీసుకొస్తుంది. సేవ మీ జీవిత లక్ష్యం అయినప్పుడు- అది భయాన్ని తొలగించి, జీవితానికి ఒక అర్థాన్ని ఇస్తుంది. మీరు దీర్ఘకాలిక ఆనందాన్ని అనుభవిస్తారు, మీ మనసు ప్రశాంతతను పొందుతుంది. ఇతరుల మానసిక స్థితిని మెరుగుపరచడం అనేది సేవకు అత్యుత్తమ రూపం. కాబట్టి- 'మన చుట్టూ ఉన్నవారికీ, ఈ ప్రపంచానికీ మనం ఎలా ఉపయోగపడగలం?' అని మనల్ని మనమే ప్రశ్నించుకుందాం. సేవలో నిమగ్నమవుదాం.



కుంగుబాటును జయించాలంటే...

మనకు కలిగిన దాన్ని ఇతరులతో పంచుకోవాలనే నిస్వార్థ కోరికతో... ఎటువంటి ప్రతిఫలమూ ఆశించకుండా పరులకు సాయం చేయడాన్ని సేవ అంటారు. సేవ మనల్ని ఇతరులతో కలుపుతుంది. అది మన ఆనందానికి అడ్డంకులను తొలగిస్తుంది. ధ్యానం, సేవ మీ మనసును, చర్యలను శుద్ధిచేసి మిమ్మల్ని ఆనందంలో ఓలలాడిస్తాయి. సేవా కార్యక్రమాలను ఒక అలవాటుగా మార్చుకోవాలి. దాంతోపాటు రోజూ కొద్ది నిముషాల పాటు ధ్యానం, ప్రాణాయామం చేయడం ద్వారా మనసులోని ప్రతికూల భావోద్వేగాలను తొలగించుకోవచ్చు. తద్వారా మానసిక అనారోగ్య సమస్యలను, కుంగుబాటును సమర్థంగా అధిగమించవచ్చు.



శ్రీశ్రీ రవిశంకర్

'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు



చూసి తెద్దురూ!

వంటొచ్చా, పాటొచ్చా, కుట్లొచ్చా అంటూ వెనకటి రోజుల్లో పెళ్లిచూపులకని కూర్చున్న అమ్మాయిని పట్టుకుని సవాలక్ష ప్రశ్నలడిగేవారు అబ్బాయి తరపువారు. ఆ క్వశ్చన్‌బ్యాంక్ పెళ్లికొడుకులను ఎదురు అడిగి తీరాల్సిన ఓ ప్రశ్నను మాత్రం పెళ్లికూతుళ్లు అప్పుడే కాదు, ఇప్పుడూ అడగడం లేదు. దానివల్ల ఎన్ని కాపురాల్లో మినీ కురుక్షేత్ర యుద్ధాలు జరుగుతున్నాయో తెలుసా! ఇంతకూ ఆ ప్రశ్నేంటంటారా... 'కూరగాయలు కొనడం వచ్చా?' అని. బజారుకెళ్లి కంటికి కనపడిన నాలుగు కాయగూరలను సంచిలో వేసుకురావడం కాదు, శ్రీమతికి నచ్చేట్లుగా నిగనిగలాడే తాజా కూరగాయలను ఓపిగ్గా ఏరి బేరమాడి కొనడం రావాలి! నూటికి తొంభై మంది పురుషపుంగవులకు ఆ పని రాదని చెప్పడానికి ఆలోచించాల్సిన పనిలేదు. మగవాళ్లు అంతరిక్షంలోకి రాకెట్లు ప్రయోగించగలరు. కంప్యూటర్ ప్రోగ్రాములు రాయగలరు. చివరికి గరిటె తిప్పి నలభీముడి వారసులం అనిపించుకోనూగలరు. కానీ, చచ్చులూ పుచ్చులూ లేని కాయగూరలను మాత్రం ఏ కొద్దిమందో తప్ప అందరూ తేలేరు. అందులోనూ ఇల్లాలి మనసుకు నచ్చేవి తేవడమంటే బ్రహ్మదేవుడి తరం కూడా కాదేమో!

గృహిణులకైనా, ఉద్యోగినులకైనా గబుక్కున బయటకెళ్లి కూరగాయలు కొని తేవడం కుదిరే పని కాదు. అందుకని ఆఫీసులో పని చేసుకుంటూనో, ఇంట్లో పిల్లలచేత హోంవర్కు చేయిస్తూనో కావాల్సిన కూరగాయల లిస్టు రాసి ఇంటాయనకు వాట్సప్ మెసేజ్ పెడతారు. సంత నుంచో, సూపర్ మార్కెట్ నుంచో తెగ ఆయాసపడుతూ అయ్యగారు మోసుకొచ్చే కూరగాయల గురించి ఏవేవో ఊహించుకుంటారు. తీరా సంచి నిండా తెచ్చిన ఆ కాయగూరల్ని ఆత్రుతగా ఆరబోసి చూస్తే ఏముంది... నల్లమచ్చల బంగాళాదుంపలూ పట్టుకుంటే చితికిపోతాయనిపించే టొమాటోలూ ముదిరిన బెండకాయలూ ఎర్రని దొండకాయలూ గోటి నొక్కులతో సొలిపోయిన సొరకాయలూ పుచ్చు వంకాయలూ తలవాల్చేసిన ఆకుకూరలు... ఆ కళాఖండాల గురించి వర్ణించడానికి తెలుగు భాషలోని పదాలు సరిపోవనిపిస్తుంది. తాజాగా నవనవలాడుతూ నోరూరిస్తాయనుకున్న కూరగాయలు కాస్తా 'వీటితో వంటెలాగురా దేవుడా' అని తల పట్టుకునేలా చేస్తాయి. కాబట్టే... ఓ రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి అర్ధాంగి ఆయా కూరగాయల బొమ్మలు గీసి మరీ రాసిన లిస్టు ఆ మధ్య సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఉద్యోగ జీవితమంతా అడవుల సంరక్షణ కోసమే ధారపోసిన ఆయనకు ఆకుకూరలూ కూరగాయల మంచీచెడూ ఏం తెలుస్తాయి చెప్పండి. అందుకే ఏయే కూరగాయలు ఎలా ఉంటాయో, వేటినెలా ఎంచుకోవాలో, ఎంత మొత్తం కొనాలో వివరంగా రాసిచ్చిందా ఇల్లాలు. సోషల్ మీడియాలో దాన్ని చూసి ఆడవాళ్లు నవ్వుకుంటే మగవాళ్లు పెదవి విరిచారు. వాళ్లకేం తెలుసు- సరైన కూరగాయలు తేనప్పుడు ఆడవాళ్ల మనసులో చెలరేగే ఉప్పెన గురించి!

– శ్రీగీతాన్విక


హాయ్! బుజ్జీ!!

అనుకోని అతిథి!

ఓ పుట్ట లోపల చీమల కుటుంబం నివసిస్తుండేది. అవి ఒకరోజు భోజనం చేస్తుండగా, అనుకోని అతిథిగా ఎలుక వచ్చింది. చీమలు దాన్ని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాయి. ధాన్యం తింటుండగా రైతు తరిమితే పారిపోయి వచ్చిన ఎలుక, ఆ విషయం చెప్పకుండా... 'ఫర్వాలేదులే! మీరు ఎలా ఉన్నారో చూద్దామని వచ్చాను' అని ఎంతో ప్రేమను నటిస్తూ అంది. 'మొహమాటపడకు, వచ్చి కూర్చుని తిందువు రా' అని చీమల కుటుంబం ఆహ్వానించింది. 'వద్దులే.. వద్దులే..' అంటూనే ఎలుక వచ్చి భోజనానికి కూర్చుంది. చీమలు చక్కని విస్తారాకులో గింజలు, బెల్లం, రొట్టెలు, పప్పును వడ్డించాయి.

చీమల వైభవాన్ని చూసి ఎలుకకు ఈర్ష్య పెరిగింది. ధాన్యం రాశులుగా పోసి ఉన్న చీమల ఇంటిని సొంతం చేసుకోవాలనే దురాశ పుట్టింది. తిన్న తర్వాత చేతులు కడుగుతూ... 'మీకు ఇంత పెద్ద ఇల్లు అక్కర్లేదు కదా! నాలాంటి పెద్ద మనిషికి ఇస్తే బాగుంటుంది. మీరంతా ఖాళీ చేసి వెళ్లండి' అంది ఎలుక.

'మీకు ఈ ఇల్లును అప్పగించడానికి మేం సిద్ధమే! కానీ ఇక్కడికి సమీపంలోనే మాకు మరో పెద్దపుట్ట ఉంది. దానిలో ఎంతో ధాన్యం ఉంది' అని అవి ఎలుకతో చెప్పాయి. 'అయితే అది ఎక్కడుందో చూపించండి!' అంది. చీమలు దూరంగా ఉన్న మరో పుట్టను చూపాయి.




మరుక్షణం ఆలస్యం చేయకుండా... పరుగు పరుగున పుట్టలోకి దూరింది ఎలుక. వెంటనే దానికి గుండె ఆగినంత పనైంది. ఓ తాచుపాము మీదపడి పట్టుకోబోయింది. అతికష్టం మీద తప్పించుకుంది. చీమల మీద విపరీతమైన కోపం వచ్చినా, వాటి జోలికి వెళ్లడం తన ప్రాణాలకే ప్రమాదం అని గ్రహించింది. అప్పటి నుంచి ఎలుక తన బతుకేదో తాను బతికింది.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

గడుల్లో గప్‌చుప్!

బొమ్మల పేర్లను కిందున్న ఖాళీ గడుల్లో రాయాలి. రంగు డబ్బాల్లో ఉన్న అక్షరాలను సరిజేసి రాస్తే, అర్థవంతమైన పదం వస్తుంది. ప్రయత్నించండి మరి.

1 

2 

3 

4 


బజాజ్ ఎలక్ట్రానిక్స్
దసరా శుభాకాంక్షలు
1కోటి
నగదు బహుమతి
గెలుచుకోండి ₹50 లక్షలు
డ్రా తేది: 8 జనవరి, 2025
గెలుచుకోండి ₹30 లక్షలు
డ్రా తేది: 6 నవంబర్, 2024
గెలుచుకోండి ₹20 లక్షలు
డ్రా తేది: 16 అక్టోబర్, 2024
గెలుచుకోండి 30 ఆల్టో K10 కార్లు
డ్రా తేది: 8 జనవరి, 2025
₹22,500* వరకు క్యాష్ బ్యాక్
CASHBACK UPTO ₹10,000/-* BAJAJ FINSERV
CASHBACK UPTO ₹22,500/-* IDFC FIRST Bank
CASHBACK UPTO ₹5,000/-* TVS CREDIT
7.5% INSTANT DISCOUNT* SBI card
CASHBACK UPTO ₹4,500/-* HDFC BANK On CC / DC EMI
CASHBACK UPTO ₹21,000/-* HDB FINANCIAL SERVICES
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹4,500 per card. Valid only on EMI Trxns. Validity: 05 Oct - 03 Nov 2024. T&C Apply.
SONY BRAVIA 7 XR Mini LED THIS FESTIVE SEASON
GET BRAVIA 2 (43S25) on purchase of BRAVIA 7
Range starts from Rs.1,82,990/-
SPECIAL OFFERS! 3 YEARS WARRANTY | INSTANT CASHBACK UP TO Rs.12,500 | BUY NOW AT Rs.2,995/- | 1 EMI FREE | SOUNDBAR COMBO OFFER SAVE UPTO Rs.52,490/-
LG LG OLED DAYS
3rd to 13th October, 2024
26% CASHBACK | 1 EMI FREE | FIXED EMI ₹999 | 30% OFF LG SOUNDBAR | OLED CIRCLE | 5-YEAR GUARANTEED
Life's Good.
SAMSUNG BIG TV FESTIVAL
Light up your festivities with AI powered Samsung TV
14th Sept. - 10th Nov. '24
Exclusive Festive Offers
Free TV worth up to ₹290000 | Free Soundbar HW-Q990D worth ₹100000 | 3 Year warranty | 1 EMI off
Long tenure EMI up to 36 months | Up to 20% cashback + 10% Samsung Axis Bank Credit Cards
LG Life's Good.
Light up this Diwali with exciting offers on the LG Objet Collection with MoodUP Refrigerator Series and let your mood set the vibe.
CELEBRATION OFFERS
INSTANT CASHBACK UP TO ₹45,000* | FIXED EMI Starting from ₹9999
0 DOWN PAYMENT | FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000
SAMSUNG Bespoke AI Festival
28th Sept - 5th Nov, 24
Upgrade to AI - Powered French Door & Side by Side refrigerators and enjoy amazing Offers
20% CASHBACK up to ₹20,000*
EMI Starting ₹3990/- | 20 Year Warranty**
Haier
VICTORIES START WITH rama CELEBRATION STARTS WITH HAIER
OPEN THE DOOR TO MORE WITH 3-DOOR CONVERTIMAX SIDE BY SIDE REFRIGERATOR
EXCITING OFFERS
20% INSTANT DISCOUNT | 18 MONTHS | 0 DOWN PAYMENT | 2 Years Complete Warranty on Product & 10 Years on Compressor
LG
Light up this Diwali by bringing home the New Form of Laundry with exciting offers on LG WashTower.
CELEBRATION OFFERS
CASHBACK UP TO 20%* Max up to ₹12000/-*
(Applicable on 10 kg and Above Select Models)
SAMSUNG Bespoke AI Festival
28th Sept - 5th Nov, 24
NEW ARRIVAL
No load too big
Bespoke AI Laundry now available in 12kg.
WW12DB8B54GBTL
MRP ₹ 74999
Special Offer Price ₹ 59000
20% cashback of up to ₹8,000* | EMI Starting @ ₹ 2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
WASHING ASSURANCE 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT | FIXED EMI STARTING ₹994* | 20% CASH BACK | 5 YEARS WARRANTY
iPhone
iPhone 16 128GB MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹36,900/-*
iPhone 13 128GB MRP ₹49,900/- EFFECTIVE PRICE ₹22,900/-*
24 Months - No Cost EMI
SAMSUNG
S24 Ultra 12GB + 256GB MRP ₹1,29,999/- EFFECTIVE PRICE ₹1,09,999/-*
S24 8GB + 256GB MRP ₹79,999/- EFFECTIVE PRICE ₹64,999/-*
*Price Including Upgrade / Cashback
vivo
V40e 8GB + 128GB MRP ₹33,999/- AVAILABLE NOW EFFECTIVE PRICE ₹26,100/-*
Y28s 4GB + 128GB MRP ₹17,999/- EFFECTIVE PRICE ₹12,499/-*
Effective Price Includes Cashback & Offers*
oppo
F27 5G 8GB + 128GB MRP ₹27,999/- EFFECTIVE PRICE ₹18,999/-*
A3 Pro 5G 8GB + 128GB MRP ₹20,999/- EFFECTIVE PRICE ₹16,499/-*
Effective Price Includes Cashback & Offers*
mi
Redmi Note 13 5G 8GB + 128GB MRP ₹20,999/- EFFECTIVE PRICE ₹14,999/-*
Redmi 13 C 5G 4GB + 128GB MRP ₹15,999/- EFFECTIVE PRICE ₹10,499/-*
*Effective Price Includes Cashback & Offers
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్‌ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in

వరద సాయంపై తప్పుడు ప్రచారం

- దుర్వినియోగం కాకూడదనే ఐఏఎస్‌ల నియామకం
- యుద్ధప్రాతిపదికన గణన పూర్తిచేసి సాయం జమ చేశాం
- వరద సాయం వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఇటీవల వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన 4,06,059 బాధిత కుటుంబాలు, వ్యక్తులకు ఆర్థికసాయం కింద రూ.602 కోట్లు అందించామని ప్రభుత్వం వివరించింది. ఆహారానికి రూ.368 కోట్లు, అగ్గిపెట్టెలకు రూ.26 కోట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23 కోట్లు ఖర్చుచేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపింది. వరద బాధితులను ఆదుకునేందుకు వచ్చిన విరాళాల్లో దుర్వినియోగం చేశారంటూ వైకాపా చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొంది. ఒక్క పైసా దుర్వినియోగం కాకుండా చూసేందుకు వార్డుల వారీగా ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించామని వివరించింది. వరద సాయంపై వివరాలతో బుధవారం ప్రకటన విడుదల చేసింది. అందులోని వివరాలు..

✦ విజయవాడలోని 32 వార్డులు, చుట్టుపక్కల రెండు గ్రామాల్లోని 1లక్షల మంది ముంపు ప్రభావానికి గురయ్యారు. వారంపాటు వారికి సహాయ చర్యలు అందించాం. వరద పరిస్థితి, సహాయచర్యలపై ఎన్టీఆర్ కలెక్టరేట్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు రోజూ సమీక్షించారు. తక్షణ సహాయచర్యలు, ఇతర ఖర్చులకు జిల్లాలకు రూ.149 కోట్లు విడుదల చేశాం. అందులో ఎన్టీఆర్ జిల్లాకు రూ.88 కోట్లు ఇచ్చాం.

✦ బాధిత కుటుంబాల గణనను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి మూడు వారాల్లో నగదు బదిలీ ద్వారా సాయం అందించాం.

✦ ఎన్టీఆర్ జిల్లాలో 10వేలు, కృష్ణా 1,130, అల్లూరి సీతారామరాజు జిల్లా 3,237, బాపట్ల జిల్లాలో 821 పశువులు అందగా.. వాటిని పరిష్కరించి సాయం జమచేశాం.

✦ 59 డ్రోన్ల ద్వారా.. గండ్ల పూడ్చివేత చర్యలు, ముంపుప్రాంతాల్లో లైవ్‌ఫీడ్ అందించడంతోపాటు ఆహార ప్యాకెట్లు, తాగునీరు, మందులు కూడా పంపిణీ చేశాం.

✦ అర్బన్ కంపెనీ ద్వారా సేవలకు 12,750 అభ్యర్థనలు వచ్చాయి. 10,136 మందికి సేవలందించాం.

✦ 1,474 మందికి రూ.30.61 కోట్ల వ్యవసాయ పంట రుణాలు, 532 మందికి రూ.16.44 కోట్ల పంటరుణాలు రీషెడ్యూల్ చేశారు. చిన్న పరిశ్రమలు, రిటైల్ రుణాలు, వినియోగ రుణాలు కలిపి మొత్తం 9,436 మందికి 481.86 కోట్ల రుణాలు రీషెడ్యూల్ చేయడంతోపాటు కొత్తగా రూ.34.42కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి.

✦ వివిధ రకాల 12,227 వాహనాలకు రూ.139.13 కోట్లకు క్లెయిమ్‌లు అందగా.. 9,985 పరిష్కరించి రూ.57.36కోట్లు చెల్లింపులు జరిగాయి.

✦ సహాయ చర్యల కోసం జిల్లాల్లో రూ.19.58 కోట్లు ఖర్చు చేశారు. ఎన్టీఆర్ జిల్లాకే కేటాయించిన మొత్తంలో రూ.9 కోట్లు ఇంకా అందుబాటులో ఉన్నాయి.

✦ సామాజిక మాధ్యమాల్లో ఆరోపిస్తున్నట్లు రూ.534 కోట్ల నిధుల దుర్వినియోగం జరగలేదు. వరద బాధితుల కోసం దాతలు ఇచ్చిన విరాళాల్లో అవినీతి లేదు.

✦ వరద సహాయం కింద మొత్తం 12 జిల్లాల్లో రూ.19.59కోట్లు ఖర్చు చేశాం. అందులో కాకినాడ రూ.12.41కోట్లు, బాపట్ల రూ.5.17కోట్లు, గుంటూరు 1.68కోట్లు వినియోగించాం.

ఎన్టీఆర్ జిల్లాలో సహాయ కార్యక్రమాలకు చేసిన ఖర్చు

అంశం	ఖర్చు (రూ.కోట్లలో)
తాత్కాలిక వసతి	8.42
ఆహారం	92.51
తాగునీరు	11.22
వైద్య సహాయం	4.55
పారిశుద్ధ్య, పునరావాసం	20.56
ఉపశమన వస్తువులు, పదార్థాలు	1.95
విద్యుత్తు, లైట్లు/కొవ్వొత్తులు, జనరేటర్లు	0.23
మొత్తం	139.44

4.06 లక్షల మందికి రూ. 601 కోట్లు అందించాం

- వరదసాయంపై తప్పుడు ప్రచారాలా?
- వైకాపా అధినేత జగన్‌పై మంత్రులు నారాయణ, అనగాని, అనిత మండిపాటు

ఈనాడు, అమరావతి: ఇటీవలి వరదల్లో బాధితులకు అందజేసిన సాయంపై విజయవాడ నగరంతోపాటు, ఏయే జిల్లాల్లో ఎంతెంత ఖర్చుచేశామో వర్గీంచేందుకు సిద్ధంగా ఉన్నాము.. దీనిపై ప్రజా సమక్షంలో ముఖాముఖిగా మాట్లాడే దమ్ము ఉందా? అని వైకాపా అధినేత జగన్‌కు.. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, అనిత సవాల్ చేశారు. వరద బాధితులకు రూ. 601 కోట్ల సాయం అందజేస్తే.. రూ. 534 కోట్లు దుర్వినియోగమని ఎలా చెబుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు ప్రజల మధ్యలోనే తిరిగి, ప్రతి ఒక్కరికీ అన్నీ అందేలా సాయం అందేలా చూస్తే.. జగన్ మాత్రం ప్యాలెస్‌లో కూర్చొని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముగ్గురు మంత్రులు బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో మంత్రులు వంగలపూడి అనిత, నారాయణ

జగన్ నోటికొచ్చినట్లు రాయిస్తున్నారు

- నారాయణ

'వరద ముంపు సమయంలో ప్రతి పూట 12 లక్షల ఆహార పొట్లాలు, 30 లక్షల వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, లక్షల సంఖ్యలో పాల ప్యాకెట్లు అందజేశాం. విజయవాడ నగర పరిధిలో తాత్కాలిక వసతికి రూ. 8.42 కోట్లు, ఆహారానికి రూ. 92.51 కోట్లు, తాగునీటికి రూ. 11.22 కోట్లు, మెడికల్ కేర్‌కు రూ. 4.55 కోట్లు, పారిశుద్ధ్య పనులు, పునరావాస క్యాంప్‌లకు రూ. 20.56 కోట్లు, ఉపశమన వస్తువులకు రూ. 1.95 కోట్లు, విద్యుత్ లైట్లు, జనరేటర్లు, కొవ్వొత్తులు తదితరాలకు రూ. 23 లక్షలు కలిపి మొత్తం రూ. 139.44 కోట్లు ఖర్చుచేశాం. అయినాసరే జగన్ 'సాక్షి'లో ఇష్టమొచ్చినట్లు రాయించడం సరికాదు.

సహచట్టం కింద అడిగే ధైర్యముందా?

- అనగాని సత్యప్రసాద్

'జగన్.. తన పత్రికలో తప్పుడు రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మొత్తం రూ. 4.06 లక్షల మందికి రూ. 601 కోట్లు అందించాం. జగన్ సహచట్టం ద్వారా సమాచారం అడిగితే అన్నీ ఇస్తాం.

రూ.23 లక్షలకు, కోట్లకు తేడా తెలియదా?

- వంగలపూడి అనిత

'వరద సాయం అంతా పారదర్శకంగా చేశామని గర్వంగా చెప్పగలుగుతున్నాం. మీవద్ద ఎగ్ పఫ్స్‌కు ఖర్చుచేసినట్లు కాదు. విద్యుత్ లైట్లు, జనరేటర్లు, కొవ్వొత్తులకు రూ.23 లక్షలు ఖర్చయితే, రూ.23 కోట్లు అని ప్రచారం చేస్తున్నారు. వరద బాధితులకు జగన్ ప్రకటించిన సాయం ఎక్కడుందో' చెప్పాలి.

వరద బాధితులకు ప్రకటించిన రూ.కోటి సాయం ఎక్కడ జగన్?

విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: వరద బాధితుల కోసం మీరు ప్రకటించిన రూ.కోటి సాయం ఎక్కడ జగన్? అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. బాధితులకు ఒక్క వాటర్ ప్యాకెట్ కూడా పంచని జగన్.. ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపైన విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23 లక్షలు ఖర్చయితే.. రూ.23 కోట్లంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, మంచినీళ్లు, కూరగాయలు తదితరాల పంపిణీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, జరిగిన చెల్లింపులు, ఇంకా అందుబాటులో ఉన్న నిధులపై బుధవారం ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు.

జగన్‌లా మా ప్రభుత్వం ప్రజల ఆస్తులను తాకట్టుపెట్టలేదు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మాజీకేంద్ర మంత్రి పనబాక లక్ష్మి ధ్వజం

ఈనాడు, అమరావతి: మాజీముఖ్యమంత్రి జగన్‌లా తమ ప్రభుత్వం.. ప్రజల ఆస్తుల్ని తాకట్టుపెట్టలేదని, కష్ట సాధింపు చర్యలకు పాల్పడలేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గుర్తుచేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై వైకాపా వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. లోటులో ఉన్న ఖజానా నుంచి డబ్బులు తీయలేక, దాతలిచ్చిన నిధులతో సర్దుకుంటూ ఎన్ని లక్షల వాటర్ ప్యాకెట్లు, ఆహారపొట్లాలు ఇచ్చామో అసలు జగన్‌కు తెలుసా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, పార్టీ నేత దారునాయక్‌లతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత జగన్ రెడ్డికి లేదని దుయ్యబట్టారు. ప్రజల ఆకలి తీర్చడానికి చంద్రబాబు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారని పనబాక లక్ష్మి గుర్తుచేశారు.

వైకాపా అప్పుల బాట వేసి వెళ్లిపోయింది

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం రాష్ట్రానికి అప్పుల బాట వేసి తమకు అప్పగించిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో పాలన సాగిస్తుండటంతో ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లగలుగుతున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. విజయనగరంలోని మహారాజ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర మాజీ మంత్రి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు. అశోక్ సతీమణి సునీల గజపతి రాజు అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.1,00,000 చెక్కును అందించారు.

జెన్‌కోలో డైరెక్టర్ల నియామకానికి అనుమతి

ఈనాడు, అమరావతి: ఏపీ జెన్‌కోలో కొత్తగా 5 విభాగాలకు డైరెక్టర్ల నియామకానికి విధివిధానాలను సూచిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైనాన్స్ అండ్ కమర్షియల్, థర్మల్, హైడల్, కోల్ అండ్ లాజిస్టిక్స్, హెచ్‌ఆర్‌లకు సంబంధించిన డైరెక్టర్ల నియామక అర్హతలు, అనుభవం గురించి ఉత్తర్వుల్లో పేర్కొంది. గత మార్గదర్శకాల్లో స్వల్ప మార్పులు చేస్తూ.. రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేసిన సిబ్బందికి అవకాశం కల్పించేలా వీలు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి వరకు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న వారు రాజీనామాలు సమర్పించారు. దీంతో 3 నెలలుగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలన వ్యవహారాల్లో ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త డైరెక్టర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.



ఇతరులతో కాదు.. మీతో పోటీపడండి

ఇతరులతో పోటీ పడే ఉద్దేశంతో పనిచేసేవారు తమ సొంత సామర్థ్యాలను గుర్తించలేరు. మెదడుకు పనిచెప్పకుండా ఎంతసేపూ ప్రతిస్పందన వైఖరితో వ్యవహరిస్తుంటారు. ప్రత్యర్థులను అనుకరించడమో లేదా వారి చర్యలను ఎలాగైనా ఎదుర్కోవాలనే తలంపుతో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడమో చేస్తుంటారు. అదే తమతో తామే పోటీ పడేవారు వివేకంతో వినూత్నంగా ఆలోచిస్తారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకుని విజయం సాధించడానికి అన్ని మార్గాలనూ అన్వేషిస్తారు.

- సిమన్ సినెక్, రచయిత

నకిలీ ఎఫ్‌డీ.. నెలనెలా వడ్డీ

- అధిక వడ్డీల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించిన ఐసీఐసీఐ మేనేజర్
- వాటిని సొంత ఖాతాకు మళ్లించుకుని మోసం
- చిలకలూరిపేట, నరసరావుపేట శాఖల్లో పెరుగుతున్న బాధితులు

ఈనాడు డిజిటల్ - నరసరావుపేట, న్యూస్‌టుడే- చిలకలూరిపేట గ్రామీణ: కంచే చేను మేస్తే.. బ్యాంకు మేనేజరే మోసం చేస్తే? ఖాతాదారులు ఎవరికి మొరపెట్టుకోవాలి? పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకు శాఖల్లో అదే జరిగింది. తాము ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది ఫేకు మోసానికి బ్యాంకులో కదా.. పైగా నెలనెలా వడ్డీ కూడా వస్తుంది కదా అని ఖాతాదారులు ధీమాగా ఉన్నారు. రెండు నెలలుగా ఆ వడ్డీ ఖాతాకు జమ కాకపోవడంతో ఇటీవల బ్యాంకుకు వెళ్లి నిలదీశారు. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లు బాండ్లు చెల్లవని.. అందులో నగదు, బంగారం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో హతాశులయ్యారు. మోసపోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఈ కేసును సీఐడీకి అప్పగించారు.

ఎలా మాయ చేశాడంటే..

ఐసీఐసీఐ బ్యాంకు చిలకలూరిపేట శాఖ మేనేజర్గా డి.నరేష్ చంద్రశేఖర్ 2017 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టాడు. ఖాతాదారులు ఇక్కడ వెళ్లి వారితో మమేకమయ్యాడు. అధిక వడ్డీ వస్తుందని నమ్మించి, చాలామందితో బ్యాంకులో నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, బాండ్లు ఇచ్చాడు. ఖాతాదారుల పోస్టు ఉపయోగించి బ్యాంకు డీడీ (ఓవర్‌డ్రాఫ్ట్) పేరుతో నగదు మొత్తం తన ఖాతాకు జమ చేసుకున్నాడు. కొందరి ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును రెన్యువల్ చేస్తున్నానని చెప్పి.. ఓటీపీ చెప్పించుకుని తన ఓడీలోకి మళ్లించుకున్నాడు. 2021లో నరసరావుపేట శాఖకు బదిలీ అయ్యాక అక్కడా ఇలాగే ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించినట్లు తన ఓడీ ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినప్పుడు నెలనెలా వడ్డీ.. బ్యాంకు నుంచి ఖాతాదారుల ఖాతాలో జమవుతుంది. ఇక్కడ బ్యాంకు నుంచి కాకుండా వేరే ఖాతా నుంచి వడ్డీ జమయ్యేది. నెలనెలా వడ్డీ వస్తుండటం, ఎఫ్‌డీ చేయించింది మేనేజరే కావడంతో ఖాతాదారులెవరికీ అనుమానం రాలేదు. నరేష్ గతేడాది నరసరావుపేట నుంచి విజయవాడకు బదిలీ అయ్యాడు.



చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో బాధితులు

అధిక వడ్డీ ఆశ చూపి..

బ్యాంకులు వయోవృద్ధులకే 8 శాతం మించి వడ్డీ ఇవ్వవు. నరేష్ అంతకంటే ఎక్కువ వడ్డీ అని చెప్పి ఖాతాదారులను నమ్మించాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్మును బ్యాంకుకు కాకుండా ఓడీల ద్వారా సొంత ఖాతాకు మళ్లించుకుని, ఖాతాదారులకు వడ్డీ పేరుతో నెలనెలా రూ.1.10 చొప్పున వేసేవాడు. నూటికి రూపాయికి పైగా వడ్డీ అని చాలామంది ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేలా మాయ చేశాడు. అతనికి గోల్డ్ అప్రైజర్ హరీష్ సహకరించాడు. ఖాతాదారులు లాకర్లలో దాచుకున్న బంగారం కూడా మాయం చేశారు. ఇలా చిలకలూరిపేటలోనే సుమారు 90 మంది ఖాతాదారులు ఒక్కొక్కరు రూ.10 లక్షల నుంచి రూ.1.8 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మోసపోయినట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. నరసరావుపేటలోనూ సుమారు 10 మంది ఖాతాదారులు ఇలాగే మోసపోయారు. వారం రోజులుగా ఈ రెండు శాఖల్లో బాధితులను ఉన్నతాధికారులు గుర్తిస్తున్నారు. ఈ మోసం విలువ సుమారు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. అయితే బ్యాంకు సిబ్బంది, ఉన్నతాధికారులు దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. నిందితుడు నరేష్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. గోల్డ్ అప్రైజర్ ఆత్మహత్యాయత్నం చేసి, గుంటూరులో చికిత్స పొందుతున్నాడు.

ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ మోసాలపై సీఐడీ విచారణ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఐసీఐసీఐ బ్యాంకు చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ శాఖల్లో జరిగిన మోసాలపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. చిలకలూరిపేటలోని ఐసీఐసీఐ బ్యాంకు వద్ద బుధవారం బాధితులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు. గత మేనేజర్ నరేష్ హయాంలో చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ శాఖల్లో అవకతవకలు జరిగాయన్నారు. మూడేళ్ల క్రితమే చిలకలూరిపేట నుంచి నరేష్ బదిలీ అయినా గత నెల 23న ఒక ప్రవాసాంధ్రుడి నుంచి రూ.10 లక్షల డిపాజిట్ తీసుకుని వెళ్లడం విస్మయం కలిగిస్తోందన్నారు. పొలాలు, ఇళ్లు అమ్ముకుని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసినవారు, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు డబ్బు దాచిపెట్టుకున్నవాళ్లను దారుణంగా మోసగించడం బాధ కలిగిస్తోందన్నారు. అనుమానం రాకుండా మాజీ మేనేజర్ చేసిన మోసాలకు చిలకలూరిపేట బ్రాంచిలో వారు ఐదుగురు సహకరించి ఉంటారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిందని, మేనేజర్ నరేష్ విదేశాలకు వెళ్లకుండా లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు అయ్యన్నార్ ఆయనతో చెప్పారని తెలిపారు. గురువారం నుంచి సీఐడీ విచారణ ప్రారంభమవుతుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు తెదేపా అండగా ఉంటుందని ప్రత్తిపాటి వెల్లడించారు.

మనం గుడ్ బుక్ పెట్టాం

- ఈ కష్టకాలంలో పనిచేసే అధికారం వచ్చాక ప్రమోషన్
- మంగళగిరి వైకాపా నేతలతో మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: 'రెడ్‌బుక్‌ను నిర్వహించడం ఏమైనా పెద్ద పనా?..గతంలో ఎప్పుడూ లేని ఇలాంటి దుష్ట సంప్రదాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చింది. వాళ్లు రెడ్‌బుక్ పెడితే..మనం 'గుడ్‌బుక్' పెట్టాం. పార్టీకి మంచి చేసిన వారిని, కష్టపడే వారి పేర్లను రాసుకుంటున్నాం. మనం అధికారంలోకి వచ్చినప్పుడు ఆ పలానా వ్యక్తిని బాగా చూసుకోవాలి, ప్రమోషన్ ఇవ్వాలి..అని ఆ బుక్‌లో రాసుకుంటాం' అని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితో మాట్లాడుతూ.. 'ప్రత్యేక పరిస్థితుల మధ్య ఈ నియోజకవర్గాన్ని ఉన్నందున క్యాడర్‌కు భరోసా ఇవ్వాలి. మితిమీరిన అధికార దుర్వినియోగంతో మన మీద ప్రేమగా దాడి జరిగినప్పుడు, పలానా వ్యక్తి మన



రకు మనం భరోసా కోసం నిల్వాలన్నా. పార్టీ మనల్ని ఆదుకుంటుందన్న నమ్మకాన్ని క్రింది వాళ్లలో కల్పించేందుకే.. బాంతకిరెడ్డి వేమారెడ్డిని నియోజకవర్గ పార్టీ అభ్యర్థిగా, బాధ్యుడిగా నియమించాం. పార్టీలోనూ మార్పులు చేశాం' అని అన్నారు.

నాలుగు నెలల్లో తిరోగమనం...

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు కల్పితంగా ఉంటాయి. ఆ కష్ట కాలంలోనే పార్టీలో నాయకులు, హీరోలు పుడతారు. చంద్రబాబుని అన్నీ మోసాలే, ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే.. మనం ఏ సాకులూ చూపకుండా అన్ని సంక్షేమ పథకాలను అమలుచేసి చూపించాం. ఇప్పుడు నాలుగు నెలల్లోనే ప్రతి విషయంలోనూ తిరోగమనం కనిపిస్తోంది. వ్యవస్థలన్నీ పతనమవుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. 'మన సామాజికవర్గాలు, కార్యకర్తలను గ్రామాల్లో ఏకం చేయాలి. గ్రామ స్థాయి నుంచి బూత్ కమిటీల వరకు బలమైన సంస్థాగత నిర్మాణం జరగాలి. ఎన్నికలు ఎప్పుడైనా రానివ్వండి, మనం డీ అంటే డీ అనేందుకు సిద్ధంగా ఉండాలి' అని జగన్ చెప్పారు.

హరియాణా ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని గందరగోళానికి గురిచేశాయి

- వాటికీ, ఏపీలో ఫలితాలకు తేడా లేదు
- పేపర్ బ్యాలెట్ వైపు మారేందుకు ఇదే సమయం
- మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: 'మరో ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని గందరగోళానికి గురి చేశాయి. హరియాణా ఫలితాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ఫలితాలకు తేడా ఏమీ లేదు. ఏపీకి సంబంధించి ఎన్నికల కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి' అని వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'మనలాంటి ప్రజాస్వామ్య బలంగా ఉండడమే కాదు, అది ఇంకా అభివృద్ధి చెందేలా చూడాలి. ఈ రెండూ జరగాలంటే తిరిగి 'పేపర్ బ్యాలెట్' ఎన్నికలకు వెళ్లడమే ఏకైక మార్గం. అభివృద్ధి చెందిన దేశాలు 'పేపర్ బ్యాలెట్'ని ఎన్నికల్లో వినియోగిస్తున్నాయి. మిగిలిన దేశాలూ ఆ పద్ధతి వెళ్లేలా మార్పులు చేసుకునేందుకు సమయమిది. ఈ మార్పు ఓటర్లలో విశ్వాసాన్ని పెంచుతుంది. చాలలో నమ్మకాన్ని కలిగించేందుకు లా మేకర్స్ ముందడుగు రావాలి' అని పేర్కొన్నారు.



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణా రావు

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ రావు బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తెదేపాలో చేరిన మోపిదేవి, బీద మస్తాన్‌రావు

పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు సమక్షంలో రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావులు తెదేపాలో చేరారు. ఉండవల్లి నివాసంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పిన చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. అనంతరమూ చంద్రబాబును ఆ ఇద్దరు నేతలూ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.



చంద్రబాబుతో మాజీ ఎంపీలు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ

పోలవరం కాఫర్‌డ్యాంల మధ్య నీటి గణాంకాల సేకరణ



దిగువ కాఫర్‌డ్యాం వద్ద నీటిని ఎత్తిపోస్తున్న పంపులు

పోలవరం, న్యూస్‌టుడే: విదేశీ నిపుణుల సూచనల మేరకు పోలవరం ప్రాజెక్టు ఎగువ, దిగువ కాఫర్‌డ్యాంల మధ్య నిత్యం నీటి వివరాలు సేకరిస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. రెండ్రోజుల్లో ఆ నివేదిక వారికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గత నెల 27 నుంచి దిగువ కాఫర్‌డ్యాం వద్ద 68.05 హెచ్‌పీ మోటార్లు 36, 88 సామర్థ్యం కలిగిన మోటార్లు 20 ఏర్పాటుచేసి నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తున్నామని వివరించారు. రెండు కాఫర్‌డ్యాంల మధ్య రోజుకు పది సెంటీమీటర్ల చొప్పున నీరు తగ్గుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నవంబరులో డయాఫ్రమ్‌వాల్ పనులు ప్రారంభించే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈలోగా విదేశీ నిపుణులు మరోసారి ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇచ్చే సూచనల మేరకు అవసరమైన పనులు చేపడతామని అధికారులు వివరించారు.

ఓఎన్‌డీసీలోకి డ్వాక్రా ఉత్పత్తులు

- నెల రోజుల్లో 165 అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించి వారి ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ-కామర్స్‌లోకి ఉత్పత్తులను తీసుకెళ్లాలని గత నెలలో సెర్ప్‌పై నిర్వహించిన సమీక్షలో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కేంద్రం తీసుకువచ్చిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) వేదికగా ముందుకు కదులుతున్నారు. నెల రోజుల్లో 165 డ్వాక్రా ఉత్పత్తులను ఓఎన్‌డీసీలో ఉంచారు. మరో 362 ఉత్పత్తులను రిజిస్టర్ చేశారు. ఏడాదిలో 10 వేలు ఆన్‌లైన్‌లో విక్రయాలకు వీలుగా ఉంచేలా ప్రణాళిక రచించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల వివరాల సేకరణ

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 90 లక్షల మంది డ్వాక్రా మహిళలున్నారు. వీరిలో వేలమంది వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. వీరి ఆదాయాన్ని మరింత పెంచేందుకు వారి ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ సేవల్లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను విస్తృతం చేయాలని అధికారులు నిర్ణయించారు. లెదర్ బొమ్మలు, ఆహార, వ్యవసాయ, గిరిజన ఉత్పత్తులు, జ్యూట్ ఉత్పత్తులు, పచ్చళ్లు తదితరాలన్నీ కలిపి డ్వాక్రా మహిళలు తయారుచేసే ఉత్పత్తులు 50వేల వరకు ఉంటాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫాంలో ఉత్పత్తులను ఎలా అప్‌లోడ్ చేయాలి? ఉత్పత్తి నాణ్యత ఎలా ఉండాలనే దానిపై డ్వాక్రా మహిళలకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. వారి ఆదాయం పెంపుపై నిరంతరం అధికారులు పర్యవేక్షణ ఉంటుంది.

ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలి: షర్మిల

ఈనాడు డిజిటల్, అమరావతి: ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని 'ఎక్స్'లో బుధవారం విమర్శించారు. ఖాళీగా ఉన్న సుమారు లక్ష పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు.

ప్రపంచ వాణిజ్యానికి ఇండో-పసిఫిక్ కీలకం

- 'మలబార్' ప్రారంభ వేడుకలో ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్



మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, వేదికపై ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ నౌకాదళ అధికారులు

ఈనాడు, విశాఖపట్నం: ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలకు ఇండో-పసిఫిక్ ప్రాంతం కీలకంగా మారిందని, ఆ ప్రాంతంలో స్థిరత్వం నెలకొల్పడం సామూహిక బాధ్యతని తూర్పు నౌకాదళం (ఈఎన్‌సీ) ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ పేర్కొన్నారు. విశాఖ వేదికగా భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న 'మలబార్ 2024' విన్యాసాలను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ మాట్లాడుతూ 'ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలకు సముద్ర దొంగల నుంచి ముప్పు పొంచి ఉంది. దేశాల సరిహద్దుల ప్రాముఖ్యతను పెంచేందుకు, మిత్రదేశాల భద్రత కోసం ముందుంటాం. పొరుగు దేశాలకు ముప్పు వాటిల్లితే మన భారత యుద్ధనౌకలు, వేగంగా స్పందించే దళాలను పంపిస్తుంది. భారత్‌తో పాటు పొరుగు దేశాలకు నౌకాదళం అండగా నిలుస్తుంది. ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి మలబార్ భాగస్వామ్య దేశాలు సంసిద్ధంగా ఉన్నాయి. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల ఉమ్మడి ఉద్యమాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకొని, ఈ విధంగా పరస్పర సహకారం, విశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు మలబార్-2024 గొప్ప వేదిక కానుంది' అని పేర్కొన్నారు. అమెరికా నౌకాదళ ఫ్లీట్ కమాండర్ అడ్మిరల్ స్టీఫెన్ కోహెలర్, ఆస్ట్రేలియా నేవీ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ క్రిస్టోఫర్ స్మిత్, జపాన్ నేవీ కమాండర్ కట్సుషి ఓమాచి మలబార్ ప్రాముఖ్యం, విన్యాసాల గురించి వివరించారు. ఆయా దేశాల నౌకాదళ అధికారులు పాల్గొన్నారు.

కాళరాత్రి అలంకారంలో శ్రీశైల భ్రామరి



కాళరాత్రి అలంకారంలో అమ్మవారు

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల ఏడో రోజు బుధవారం భ్రమరాంబాదేవి కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై కాళరాత్రి అమ్మవారిని కొలువుదీర్చారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

తిరుమలలో వైభవంగా స్వర్ణ రథోత్సవం

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి స్వర్ణరథంపై ఊరేగారు. సంప్రదాయబద్ధంగా మహిళలే రథాన్ని లాగేందుకు అవకాశం ఉంటుంది. దీంతో వేల మంది మహిళలు ఈ క్రతువులో పాల్గొన్నారు. రాత్రి వేళ గజ వాహనంపై శ్రీవారు భక్తులను కటాక్షించారు. ఉదయం హనుమంత వాహన సేవలో స్వామివారు శ్రీకోదండరాముడి అలంకారంలో భక్తులకు అభయప్రదానం చేశారు.

–న్యూస్‌టుడే, తిరుమల



శ్రీవారి స్వర్ణ రథం లాగుతున్న మహిళలు

అర్చకుల వేతనం పెంపు హామీని చంద్రబాబు నెరవేర్చారు

ఈడబ్ల్యూఎస్ శాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: అర్చకుల వేతనం పెంచుతామని ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చారని ఈడబ్ల్యూఎస్ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. అర్చకుల గౌరవ వేతనం రూ.7 వేలకు, ధూపదీప నైవేద్యం కోసం రూ.3 వేలకు పెంచుతూ జీవో జారీ చేశారని పేర్కొన్నారు. ఇందుకుగాను ప్రభుత్వంపై ఏడాదికి రూ.32.40 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. విజయవాడలోని బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆమె బుధవారం సమీక్షించారు. 'రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్ పేరుతో ఉన్న భూములు, ఆస్తులను పరిరక్షించాలి. ప్రభుత్వమిచ్చే నిధులే కాకుండా సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకునే మార్గాలను అన్వేషించాలి. జిల్లాకేంద్రాలు, నగర ప్రాంతాల్లో ఉన్న బ్రాహ్మణ కార్పొరేషన్ భూముల్లో వాణిజ్య భవనాలు నిర్మించి అద్దెలకిస్తూ ఆదాయాన్ని ఆర్జించవచ్చు' అని సూచించారు.

వైదిక, ఆగమ అంశాల్లో ఆలయాలకు స్వయంప్రతిపత్తి

ఈనాడు, అమరావతి: ఆలయాల వారీగా వైదిక, ఆగమ అంశాల్లో స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆలయాల పరిపాలన అంశాలు చూసే కమిషనర్ సహా అధికారులెవరూ ఆగమ సంప్రదాయాల విషయంలో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా ఆలయాల్లో పూజాక్రతువులు, సేవల నిర్వహణ, యజ్ఞాలు, కుంభాభిషేకాలు, ఉత్సవాలకు ముహూర్తాల ఖరారు, కొత్త పూజలు, క్రతువులు ప్రవేశపెట్టడం.. తదితరాలు అన్నింటా సీనియర్ అర్చకులే నిర్ణయం తీసుకునేలా వీలు కల్పించారు.

క్రీడామైదానానికి సొంతంగా రూ.60 లక్షలు ఇచ్చిన పవన్

- మైసూరవారిపల్లిలో స్థలం కొనుగోలు
- రిజిస్ట్రేషన్ పత్రాలు పంచాయతీకి అందజేత

ఈనాడు–అమరావతి: అన్నమయ్య జిల్లాలోని మైసూరవారిపల్లి పాఠశాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సొంత నిధులతో క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల మైసూరవారిపల్లి గ్రామసభకు వెళ్లినప్పుడు అక్కడి పాఠశాలకు ఆటస్థలం లేదన్న విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దసరాలోపు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాట మేరకు తన సొంత ట్రస్టు నుంచి రూ.60 లక్షలతో ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను బుధవారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 'రాజకీయాల్లోకి రావడానికి ముందే ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో పవన్‌కల్యాణ్ లెర్నింగ్ సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సు పేరిట ట్రస్టు మొదలుపెట్టాను. విద్యార్థుల చదువుకు సాయం చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడం దీని ఉద్దేశం. ఎంతోమంది చదువులకు సాయం చేసినా బయటకు చెప్పలేదు. మైసూరవారిపల్లిలో ఆటస్థలం కోసం తొలుత రూ.20 లక్షలు ఇచ్చి మిగిలిన మొత్తానికి దాతల సహకారం తీసుకోవాలనుకున్నా. కానీ, ఎవరూ ముందుకు రాకపోవడంతో మొత్తం రూ.60 లక్షలు ఇచ్చాను. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తాం' అని పవన్‌కల్యాణ్ వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట సబ్ కలెక్టర్ నిదియా దేవి, మైసూరవారిపల్లి సర్పంచి కారుమంచి సంయుక్త తదితరులు పాల్గొన్నారు.



మైసూరవారిపల్లి పంచాయతీ సభ్యులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రభుత్వ భూములు ధారాదత్తం చేసిన ముద్దనూరు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్

- ఆ అధికారిణి వైకాపా మాజీ ఎమ్మెల్యే కుమార్తె
- 57 అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసిన కలెక్టర్

ఈనాడు, కడప: ఆమె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారిణి.. అయితేనేం తండ్రి వైకాపా మాజీ ఎమ్మెల్యే కావడంతో అక్రమాలకు తెరతీశారు. రూ.కోట్ల విలువైన గనులున్న వైఎస్సార్ జిల్లా ముద్దనూరులో చట్టవిరుద్ధంగా పదుల కొద్దీ రిజిస్ట్రేషన్లు చేసేశారు. ప్రభుత్వ, ఎసైన్డ్ భూములను పప్పుబెల్లాల్లా పంచిపెట్టారు. మాజీ సీఎం జగన్ సొంత ఇలాకాలో అక్రమాల తంతు ఇది. కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వీరశివారెడ్డి కుమార్తె జి.వీర మృణాళినిదేవి దువ్వూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. 2023 ఆగస్టు 21 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 19 వరకు ముద్దనూరు ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా కొనసాగారు. ఈ ఆరునెలల్లోనే నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు రావడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ విచారించింది. ముద్దనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 53 పత్రాలు, ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద జమ్మలమడుగు మండలంలో ఒకటి, ఎర్రగుంట్ల మండలానికి చెందిన మూడు చొప్పున మొత్తంగా 57 రిజిస్ట్రేషన్లు అక్రమంగా చేసినట్లు గుర్తించింది. తగు చర్యలు తీసుకోవాలన్న రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ శివశంకర్ 57 రిజిస్ట్రేషన్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఉద్యోగినిపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు.

ప్రారంభమైన 'సదరం' స్లాట్ బుకింగ్

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకల్య నిర్ధరణ వైద్య పరీక్షలకు బుధవారం నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమైనట్లు వైద్యారోగ్యశాఖ ఓ ప్రకటనలో బుధవారం తెలిపింది. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఈ నెల 14 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. డిసెంబరు వరకు ఇవి కొనసాగుతాయని.. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపింది.

వరద బాధితులకు రామోజీ గ్రూప్ అండ

పండగపూట నూతన వస్త్రాలు పంపిణీ చేసిన 'మార్గదర్శి'



బాలుడికి దుస్తులు అందజేస్తున్న మార్గదర్శి, కళాంజలి మేనేజర్లు కృష్ణమోహన్, వెంకటేష్

విజయవాడ (చిట్టినగర్), న్యూస్‌టుడే: విజయవాడ బుడమేరు వరద కారణంగా సర్వం కోల్పోయిన వరద బాధితులకు రామోజీ గ్రూప్ అండగా నిలిచింది. దసరా నేపథ్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేసి వారి మోముల్లో సంతోషాన్ని నింపింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కేఎల్‌రావు నగర్, అంబేడ్కర్ నగర్, రాజీవ్‌శర్మ నగర్ ప్రాంతాల్లో బుధవారం 'మార్గదర్శి' చిట్‌ఫండ్స్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దసరా పండగ సమయంలో నూతన వస్త్రాలు పంపిణీ చేయడంతో ఆయా ప్రాంతాల వాసులు ఆనందం వ్యక్తం చేశారు. రామోజీ గ్రూపునకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈనాడు, మార్గదర్శి, కళాంజలి సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాల కోసం బారులు తీరిన మహిళలు

గ్రహం అనుగ్రహం

10–10–2024 గురువారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం;
శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం

సప్తమి: ఉ. 7-18 తదుపరి అష్టమి; **పూర్వాషాఢ:** రా. 1-41 తదుపరి ఉత్తరాషాఢ **వర్జ్యం:** ఉ. 11-10 నుంచి 12-46 వరకు; **అమృత ఘడియలు:** రా. 8-50 నుంచి 10-27 వరకు ;**దుర్ముహూర్తం:** ఉ. 9-50 నుంచి 10-37 వరకు తిరిగి మ. 2-32 నుంచి 3-19 వరకు; **రాహుకాలం:** మ. 1-30 నుంచి 3-00 వరకు, **సూర్యోదయం:** ఉ. 5.55; **సూర్యాస్తమయం:** సా.5.40

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	23.5
విశాఖపట్నం	34.8	26.6
నెల్లూరు	34.8	26.4
నరసాపురం	34.6	27.0
అనంతపురం	34.2	24.0
తిరుపతి	33.7	25.0
రామగుండం	33.6	25.0
ఒంగోలు	33.5	25.9
కర్నూలు	33.5	24.5
గుంటూరు	33.0	26.0
కడప	33.0	25.0
తాడేపల్లిగూడెం	32.9	25.5
విజయవాడ	32.8	26.0
సూర్యాపేట	32.5	26.5
విజయనగరం	32.0	27.0
శ్రీకాకుళం	32.0	26.0
హైదరాబాద్	31.2	23.8

ప్రజలపై భారం లేకుండా చెత్త సేకరణ

ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ప్రజల నుంచి వినియోగ రుసుములు (యూజర్ ఛార్జీలు) వసూలు చేయకుండానే పట్టణాల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) నిబంధనల్లో కొన్ని సవరణలు చేయాలని యోచిస్తోంది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్త తరలింపునకు ప్రస్తుతం వినియోగిస్తున్న ఆటోలను పక్కన పెట్టి ఇందుకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పుర కార్మికులతో వీధులు శుభ్రం చేయించడంతో పాటు చెత్త సేకరించేలా మార్గదర్శకాలు సిద్ధం చేయిస్తోంది. రాష్ట్రంలోని 40 పుర, నగరపాలక సంస్థల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్నందుకు గత వైకాపా ప్రభుత్వం హయాంలో 2021 అక్టోబరు నుంచి ప్రతి నెలా వినియోగ రుసుముల వసూళ్లను ప్రారంభించారు. అప్పటి నుంచి 32 చోట్ల కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.40-90, మరో 8 చోట్ల కనిష్ఠంగా రూ.40-60, గరిష్ఠంగా రూ.100-120 వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఏటా రూ. 170 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ రుసుములపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనా, ప్రజా సంఘాలు ఆందోళనలకు దిగినా నాటి ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించింది. ఈ 'చెత్త పన్ను' రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకున్నారు. చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లుగా ఈనెల 2న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

రూ.170 కోట్ల భారం తప్పినట్లే..

కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను రద్దు చేయడం వల్ల పట్టణ ప్రజలపై ఏటా రూ.170 కోట్ల భారం తప్పినట్లయింది. 123 పట్టణ స్థానిక సంస్థల్లో 50 చోట్ల గత ప్రభుత్వం ఇళ్ల నుంచి చెత్త సేకరణ ప్రారంభించింది. ఏటా రూ. 170 కోట్ల మేర వినియోగ రుసుములు వసూలవుతున్నాయి. ప్రస్తుత ఎన్డీఏ కూటమి చెత్త పన్ను పూర్తిగా రద్దు చేయడం ప్రజలకు పెద్ద ఊరటే. చెత్త సేకరణ నిర్వహణకు అవసరాన్ని బట్టి ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

నేటి మంత్రివర్గ సమావేశంలో చెత్తపన్ను రద్దు అంశం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో చెత్త పన్ను రద్దుపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎజెండాలో చెత్త పన్ను రద్దు అంశాన్ని చేర్చారు. పట్టణాల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్నందుకు గత ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నును రద్దు చేస్తున్నట్లుగా సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై కేబినెట్‌లో చర్చించడంతోపాటు చెత్త సేకరణ నిలిచిపోకుండా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపైనా నిర్ణయం తీసుకోనున్నారు.

దుర్గమ్మ దయతో.. అమరావతి, పోలవరం నిర్మాణం

- సీఎం చంద్రబాబు



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్

ఈనాడు - ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడ దుర్గమ్మ దయతో అమరావతి నగరం, పోలవరం నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని కోరుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. మూలానక్షత్రం రోజైన బుధవారం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున సరస్వతీదేవి రూపంలోని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు.. మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి చంద్రబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా ఆశీర్వదించమని దుర్గమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. 'మనమంతా దేవాలయాల పవిత్రతను కాపాడుకోవాలి. రానున్న రోజుల్లో ప్రతి ఆలయానికి పూర్వవైభవం తీసుకొస్తాం. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిశాయి. రానున్న రోజుల్లోనూ వర్షాలు ఇలాగే పడి. . రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మను వేడుకున్నానని' పేర్కొన్నారు.

భక్తుల కోసం సరికొత్త వ్యవస్థ ఏర్పాటు..

ఈసారి దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తుల సౌకర్యాలకే పెద్దపీట వేశామని చంద్రబాబు తెలిపారు. అందుకే ఉత్సవ కమిటీ కాకుండా సేవా కమిటీనే వేశామన్నారు. 'భక్తులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకుంటూ వెంటవెంటనే పరిష్కరించే వ్యవస్థను ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేశాం. భక్తుల నుంచి ప్రతి రోజు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. క్యూలైన్లు బాగున్నాయని 85 శాతం మంది, ఆలయ అలంకరణ బాగుందని 92 శాతం మంది, పారిశుద్ధ్యంపై 87 శాతం, మంచినీటి సరఫరాపై 95 శాతం, అన్నప్రసాదంపై 94 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం వరకూ ఆరు రోజుల్లో ఆలయానికి 5.8 లక్షల మంది వచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి లడ్డు ప్రసాదం ఉచితంగా ఇస్తున్నాం. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు.

అర్ధరాత్రి నుంచే పోటెత్తిన భక్తులు..

మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఆలయానికి భారీగా చేరుకున్నారు. బుధవారం రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు కొనసాగాయి. రెండు లక్షలమందికి పైగా భక్తులు ఒక్కరోజులో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కుమార్తెతో కలిసి వచ్చిన పవన్ కల్యాణ్

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూలా నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన సరస్వతీదేవిని దర్శించుకున్నారు. కుమార్తె ఆద్యతో కలిసి బుధవారం ఉదయం ఆలయానికి చేరుకున్న పవన్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు తదితరులు దర్శనానికి తోడ్కొని వెళ్లారు. హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు వెంట ఉన్నారు.



కుమార్తె ఆద్యతో కలిసి దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న హోం మంత్రి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్, ఆలయ ఈఓ రామారావు, వేద పండితులు

గత ప్రభుత్వంలో నాకంటే బాధితుడు ఎవరున్నారు?

- నన్ను చంపేందుకు కుట్ర పన్నారన్న ప్రచారమూ జరిగింది
- జైల్లో దోమలు కుడుతుంటే... దోమతెర కూడా ఇవ్వలేదు
- తప్పులు చేసినవారిని ఉపేక్షించను
- మద్యం దుకాణాల్లో ఎమ్మెల్యేల జోక్యాన్ని సహించం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ



ఈనాడు, అమరావతి: ఎవరిపైనా రాజకీయంగా కక్ష సాధించడం తన స్వభావం కాదని, అలాగని తప్పుచేసిన వారెవరూ తప్పించుకోలేరని, తగిన సమయంలో చర్యలుంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ఐదేళ్లలో అందరికంటే ఎక్కువ ఇబ్బంది పడింది నేనే కదా..! గత పాలకులు నన్ను అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. జైల్లో నన్ను చంపేందుకు కుట్ర పన్నారన్న ప్రచారమూ జరిగింది. జైలు పైకి డ్రోన్లు ఎగరవేశారు. జైల్లో నా గదిలో సీసీ కెమెరాలు పెట్టారు. వాటిని నేనే గమనించి తీయించాను. అప్పుడు గదిచుట్టూ సీసీ కెమెరాలు అమర్చి నాపై నిఘా పెట్టారు. కనీసం వేడినీళ్లు ఇవ్వలేదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చల్లటి నీళ్లు ఇచ్చేవారు. దోమలు కుడుతుంటే... కనీసం దోమతెర ఇవ్వలేదు. నన్ను అంతగా ఇబ్బంది పెట్టినందుకు నేను అధికారంలోకి రాగానే వాళ్లను అరెస్టు చేయాలి కదా? కక్ష సాధించుకోవాలి కదా? కానీ నా స్వభావం అది కాదు" అని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో ప్రెస్‌మీట్ ముగిశాక... విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తెదేపా నాయకులు, కార్యకర్తల్ని ఇబ్బంది పెట్టినవారిపై చర్యలు లేవన్న అసంతృప్తి పార్టీ శ్రేణుల్లో ఉంది కదా? అని విలేకరులు ప్రస్తావించగా... ఆయన పైవిధంగా స్పందించారు. మద్యం దుకాణాల లైసెన్సుల వ్యవహారంలో పార్టీ ఎమ్మెల్యేల జోక్యాన్ని సహించబోనని, బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. 'పొలిటికల్ గవర్నెన్స్' అంటే ప్రజలకు, కార్యకర్తలకు మరింతగా అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తప్ప, అన్నింటిలోనూ తలదూర్చడం, కర్రపెత్తనం చేయడం, ప్రజల్ని ఇబ్బంది పెట్టడం కాదని ఆయన పేర్కొన్నారు. పోటీ ఉండాలనే మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పొడిగించామని తెలిపారు.

అందరినీ పంపేస్తే.. ఎవరితో పని చేయించుకోవాలి?

గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులతో అంటకాగిన, వారి కనుసన్నల్లో పనిచేస్తూ అవకతవకలకు పాల్పడిన అధికారులు, ఉద్యోగుల్ని ఎన్డీయే ప్రభుత్వంలోనూ కీలక స్థానాల్లో నియమిస్తున్నారన్న అసంతృప్తి తెదేపా శ్రేణుల్లో ఉంది కదా? అన్న ప్రశ్నకు... అంచనాలు ఎక్కువగా ఉండడం వల్ల కొంత నిరాశ ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. "అధికారులందరినీ పంపేస్తే ఎవరితో పని చేయించుకోవాలి? గత ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ నాశనం చేసింది. కొందరు అధికారులతోనూ తప్పులు చేయించింది. అలాగని అందర్నీ పక్కన పెట్టేస్తే ప్రభుత్వం నడిచేది ఎలా?

ఇసుక ఇబ్బందులు తొలగిస్తాం

ఇసుక లభ్యత విషయంలో కొన్ని ఇబ్బందులున్నాయని, త్వరలోనే వాటిని చక్కదిద్దుతామని ముఖ్యమంత్రి తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల నదుల్లో నీరుండటంతో తవ్వకాలు జరగక ఇసుక లభ్యత తగ్గిందని చెప్పారు. రాత్రిపూట తవ్వకూడదు, లారీల్లో 20 టన్నులకు మించి ఇసుక లోడ్ చేయకూడదనే ఆంక్షలు పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అన్న ప్రశ్నకు... ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు జరిగేటప్పుడు కొన్ని పరిమితులుంటాయని, నిబంధనలు, ఎన్జీటీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన తెలిపారు.

కొత్త జిల్లాలు ఇప్పట్లో కాదు

రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 30కి పెంచుతారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన దృష్టికి తేగా.. దానిలో వాస్తవం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పోలవరం ముంపు మండలాల్ని ఒక జిల్లాగా, మార్కాపురం, మదనపల్లె కేంద్రంగా మరో రెండు జిల్లాల్ని ఏర్పాటుచేయాల్సి ఉందని, కొన్ని జిల్లాలకు సర్దుబాట్లు చేయాలని ఆయన తెలిపారు. కానీ ఇప్పట్లో కాదని, వాటికి కొంత సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

మరీ అరాచకాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఒక ఉన్నతాధికారిని ఇంటికి పంపించడం, ముగ్గురు ఐపీఎస్ అధికారులపై కేసులు పెట్టడం గతంలో ఏ ప్రభుత్వంలోనైనా జరిగిందా? రాష్ట్రానికి అసలే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కొరత ఎక్కువగా ఉంది. దానికితోడు జిల్లాల సంఖ్యను 26కి పెంచడంతో.. .. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లుగా, ఎస్పీలుగా చాలా మంది అధికారులు అవసరం అవుతున్నారు. అధికారుల కొరతతో రెండు మూడు పోస్టుల్లో ఒకరినే నియమించాల్సి వస్తోంది. అయినా పనులు జరగడం లేదు. రాష్ట్రానికి రావలసిన నిధుల కోసం దిల్లీ వెళ్తే.. ఇదివరకు ఇచ్చిన వాటికి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ) అడుగుతున్నారు. వాటిని సిద్ధం చేయడానికి తగినంత మంది అధికారుల్లేరు. వాణిజ్య పన్నులశాఖ (జీఎస్టీ) ప్రధాన కమిషనర్ పోస్టులో ఇప్పటివరకు ఎవర్నీ నియమించలేకపోయాం" అని తెలిపారు.

నెయ్యి కల్తీపై వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది

తిరుమలలో శ్రీవారి ప్రసాదాల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందన్న విషయం తన దృష్టికి వచ్చినప్పుడు... ముఖ్యమంత్రిగా దాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని చంద్రబాబు తెలిపారు. "నేను కూడా ఆ విషయాన్ని దాచిపెట్టి, రేపు ఎప్పుడైనా ఆ రిపోర్టు బయటకు వస్తే... నేను కావాలనే దాచిపెట్టానని అంటారు కదా?" అని వ్యాఖ్యానించారు. "ఎక్కడో ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా డెయిరీ నుంచి తిరుపతి సమీపంలోని వైష్ణవి డెయిరీ నెయ్యి కొనడమేంటి? దాన్ని నష్టానికి ఏఆర్ డెయిరీకి విక్రయించడమేంటి? ఏఆర్ డెయిరీ ఆ నెయ్యిని తిరుమలకు సరఫరా చేయడమేంటి?" అని ఆయన ప్రశ్నించారు.

ఇప్పుడిప్పుడే పరిస్థితులు గాడిన పడుతున్నాయి

దిల్లీకి ఇన్నిసార్లు వెళ్లి... రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కేంద్ర పెద్దలకు వివరించడం, గత వైకాపా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఎంతగా ఛిన్నాభిన్నం చేసిందో చెప్పడంతో పరిస్థితులు ఇప్పుడిప్పుడే కొంత గాడిన పడుతున్నాయని సీఎం తెలిపారు. మన ఇబ్బందుల్ని వారు అర్థం చేసుకున్నారని, వారి పరిమితులకు లోబడి వీలైనంతగా రాష్ట్రానికి చేయూతనిచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. తమ ప్రయత్నం కొనసాగుతుందన్నారు. ' 'ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త, విధ్వంసకర విధానాల వల్ల మన రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు మధ్య ఆర్థికవృద్ధి, తలసరి ఆదాయం పరంగా అంతరం బాగా పెరిగిపోయింది. వచ్చే ఐదేళ్లూ కష్టపడి పనిచేస్తే దాన్ని కొంత పూడ్చవచ్చు" అని తెలిపారు.

త్వరలో మిగతా నామినేటెడ్ పోస్టులు

రెండోవిడత నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం పార్టీ నాయకులు ఆతృతతో ఎదురు చూస్తున్నారు కదా? ఎప్పుడు ఉంటాయన్న ప్రశ్నకు... "వారికంటే మీకే ఎక్కువ తొందర ఉన్నట్టుంది" అని ఆయన చమత్కరించారు. త్వరలోనే మిగతా పోస్టులు భర్తీచేస్తామని ఆయన తెలిపారు.

ఫేక్ ప్రచారంపై ఓపిక పడుతున్నా

ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో అసత్యాలతో, వాస్తవాల్ని వక్రీకరిస్తూ పోస్టులు పెడుతూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నవారి విషయంలో ఓపిక పడుతున్నానని, వారు మరీ మితిమీరితే ఏం చేయాలో తనకు తెలుసునని సీఎం వ్యాఖ్యానించారు. వాస్తవాలేంటో ప్రజలకు వివరిస్తామని, వారిని దోషులుగా నిలబెడతామని తెలిపారు. అప్పటికీ పదే పదే అదే దుష్ప్రచారం చేస్తుంటే అప్పుడు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

నాయకుడిపై నమ్మకమే.. హరియాణాలో గెలిపించింది

- సుస్థిర ప్రభుత్వం, ప్రధాని మోదీ సుపరిపాలనకు దక్కిన విజయమిది
- విలేకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మనం చేసేవి మంచి పనులైతే.. చెప్పే విధానం సక్రమంగా ఉంటే.. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరుగుతాయనేందుకు హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఒక ఉదాహరణ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే ప్రధాని నరేంద్రమోదీ మోడల్‌కు ప్రజలు మద్దతు పలికారు. అందుకే మంచి ఫలితాలొచ్చాయి. అసాధారణ పనితీరు చూపిస్తున్న ప్రధాని మోదీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇది ఎన్డీయేకూ మంచి విజయం. ఒక వ్యక్తి విధ్వంసానికి రాష్ట్రం ఎంత అతలాకుతలమవుతుందో చెప్పేందుకు ఆంధ్రప్రదేశ్ ఉదాహరణ.. సుపరిపాలనతో వచ్చే లాభాలకు ప్రధాని మోదీ పాలన నిదర్శనం' అని పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'హరియాణా ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించి, మంచి విజయం అందుకున్న ప్రధాని మోదీకి ఫోన్ చేసి అభినందనలు తెలిపాను. ఇదొక చారిత్రక విజయం. హోంమంత్రి అమిత్‌షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా తదితరుల సారథ్యంలోని అగ్రనాయకత్వం చూపిన చొరవ ఫలితంగా బ్రహ్మాండమైన విజయం సాధించారు. రాష్ట్రంలో కూటమి ఏర్పాటు ద్వారా.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే కార్యక్రమంలో మేమూ భాగస్వాములం అయ్యామనే తృప్తి ఉంది. హరియాణాలోని 90 సీట్లలో 48 చోట్ల విజయం సాధించిన భాజపా 39.94% ఓట్లు దక్కించుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే 3.54% ఓట్లు పెరిగాయి. జమ్మూకశ్మీర్‌లో భాజపాకు 29 సీట్లు, 25.64% ఓట్లు వచ్చాయి. జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి 42 సీట్లు వచ్చినా, ఓట్లు 23.43% మాత్రమే. వాళ్లకంటే 2.21% ఓట్లు ఎక్కువగా సాధించిన భాజపా అక్కడ బలమైన శక్తిగా ఎదిగింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లోనూ ఇవే ఫలితాలొస్తాయి. అందులో ఎలాంటి అనుమానం లేదు' అని వివరించారు.

> "ప్రధాని మోదీ తన సుస్థిర పాలనతో మూడోసారి గెలవడమే కాకుండా.. ఏ దేశంలోనూ లేనివిధంగా 7% పైగా వృద్ధిరేటు సాధించి ప్రపంచమంతా భారత్‌ను గుర్తించే పరిస్థితి తెచ్చారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా భాజపా అధికారంలో ఉంది. సుస్థిర ప్రభుత్వం వల్లే అన్ని రంగాల్లో ఆ రాష్ట్రం ముందుంది. సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నేను తొమ్మిదేళ్లు పనిచేసినప్పుడు జరిగిన అభివృద్ధి వల్ల హైదరాబాద్ ఉత్తమ నగరంగా తయారైంది. తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. సుస్థిర ప్రభుత్వంతో లాభాలివే. ఏపీలో విభజన వల్ల జరిగిన నష్టం కంటే గత ప్రభుత్వ విధ్వంసకర పాలనతో ఎక్కువ నష్టపోయాం. ఎవరికి ఓటేస్తే సుస్థిర, సుపరిపాలన ఇస్తారనే విషయాన్ని ప్రజలంతా ఆలోచించాలి."

ఒకే దేశం, ఒకే ఎన్నికకు మద్దతివ్వాలి

'ఐదేళ్లలో పదిసార్లు ఎన్నికలు జరుగుతుంటే.. అభివృద్ధిపై దృష్టి పెట్టేదెప్పుడు?' అని చంద్రబాబు ప్రశ్నించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక అనేది ఎన్డీయే నినాదం. లోక్‌సభ, అసెంబ్లీకి ఒకేసారి.. తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్ని ఏకకాలంలో పూర్తిచేసుకుంటే.. మిగిలిన ఐదేళ్లు అభివృద్ధి, సంక్షేమం, సాధికారతపైనే శ్రద్ధ పెట్టొచ్చు. జాతి మొత్తం దీనికి మద్దతివ్వాలి' అని కోరారు.

సిగ్గులేకుండా.. అగ్గిపెట్టెలంటూ విమర్శలా?

వార్త వాస్తవమో, కాదో తెలుసుకునేలోగానే తప్పుడు సమాచారం చివరి వరకు వెళ్తోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. 'పదిరోజులు బురదలో దిగి పని చేశాం. సీఎస్ సహా అధికారులంతా ప్రజల కోసమే శ్రమించారు. ప్రతిపక్షం ఎక్కడైనా కనపడిందా? బుడమేరుకు గండ్లుపెట్టి వరద తెచ్చి సర్వనాశనం చేశారు. పడవలు పంపి ప్రకాశం బ్యారేజిని దెబ్బతీయాలని చూశారు. ఇప్పుడు సిగ్గులేకుండా అగ్గిపెట్టెలు, భోజనాలంటూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. విపత్తు సమయాల్లో 5-10% వృథా అవుతుంది. మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటామా? రాత్రిళ్లు అగ్గిపెట్టె ఇచ్చామా. . లేదా అనేదే ముఖ్యం' అన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకూడదు.. రివైవ్ కావాలి

'విశాఖ ఉక్కుకు కేంద్రంతో మాట్లాడి రూ.1,650 కోట్ల నిధులిప్పించాం. అందులో బ్యాంకులకు రూ.1,100 కోట్లు చెల్లించారు. లేదంటే సోమ, మంగళవారాల్లోనే బీఐఎఫ్ఆర్ (బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్)కు వెళ్లేది. దీనిపై మూడు సమావేశాల్లో చర్చించాం. రెండుసార్లు కేంద్రమంత్రి కుమారస్వామితో మాట్లాడాం. మంగళవారం రాత్రి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కుమారస్వామితో మాట్లాడి ప్రజల మనోభావాలను వివరించాం. ఎంత డబ్బు కావాలి? ఎవరు పెట్టుబడి పెట్టాలి? కేంద్రమే పెట్టుబడి పెట్టాలంటే ఏం చేయాలనే అంశాలూ ప్రధానం. వీటన్నింటిపై కేంద్ర మంత్రివర్గం ముందు చర్చించాలి' అని చంద్రబాబు వివరించారు.

ఫోరెన్సిక్ యూనివర్సిటీ ఏర్పాటుకు అంగీకారం

'గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి నిధులు, రాష్ట్రానికి ఆర్థిక సాయంపై హోంమంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశాం. ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎఫ్ఎస్‌ఐ) అమరావతిలో పెట్టాలని కోరగా అంగీకరించారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఆక్సిజన్ ఇవ్వాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాం' అని పేర్కొన్నారు.

విశాఖలో టీసీఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'ఏ హబ్' పేరిట ఇన్‌క్యుబేషన్ కౌన్సిల్ ఇప్పటికే అందుబాటులో ఉంది. విశాఖ ఐటీ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందడానికి ఇవన్నీ దోహదం చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏపీ వైపు ప్రముఖ సంస్థల చూపు

రాష్ట్రంలో ప్రముఖ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటోంది. ప్రముఖ సంస్థలతో సంప్రదిస్తోంది. లులు, ఓబెరాయ్, బ్రూక్‌ఫీల్డ్, సుజలాన్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత తెలిపాయి. ప్రఖ్యాత ఐటీ కంపెనీల ద్వారా యువతకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని యువగళం పాదయాత్రలో తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా టాటా గ్రూపు ఛైర్మన్‌తో సంప్రదింపులు జరిపారు. ముంబయిలోని టాటా సన్స్ కార్యాలయం బాంబే హౌస్‌లో ఆ సంస్థల ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేశ్ మంగళవారం సమావేశమయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం.. విశాఖపట్నంలో ఐటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను టీసీఎస్ ఛైర్మన్‌కు మంత్రి వివరించారు. సమావేశం అనంతరం విశాఖలో టీసీఎస్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు రాష్ట్రంలో ఈవీ, ఏరో స్పేస్, స్టీల్, హోటల్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'విశాఖలో టీసీఎస్ సెంటర్ ఏర్పాటు ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పించేందుకు ఆ సంస్థ ఛైర్మన్ అంగీకరించడం సంతోషం కలిగించింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ప్రముఖ కంపెనీలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం స్వాగతిస్తోంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామికాభివృద్ధిలో ఏపీని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ పెట్టుబడి తొలి అడుగు అవుతుంది' అని లోకేశ్ పేర్కొన్నారు. టీసీఎస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో టాటా గ్రూపు త్వరలో ఒప్పందం చేసుకోనుంది.

అలాంటి స్నేహితులను వదులుకోవద్దు



నిజమైన స్నేహితులను సంపాదించుకోవడం చాలా కష్టం. అలాంటివారు మీ గెలుపును మనసారా కోరుకుంటారు. పెద్ద కలలు కనేలా ప్రోత్సహిస్తారు. మీరు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడతారు. కష్టంగా అనిపించినా నిజాలే చెబుతారు. బహిరంగంగా మీకోసం పోరాడతారు. అవసరమైతే మీతోనూ ఏకాంతంలో పోరాడతారు. అలాంటి స్నేహాన్ని వదులుకోకండి.

– జిమ్ క్విక్, బ్రెయిన్ కోచ్



కారు కన్నా విలువైనవి అవయవాలు

బ్రెజిల్‌కు చెందిన ఓ సంపన్నుడు తాను మరణించిన తర్వాత తన బెంట్లీ కారునూ తనతోపాటు పాతిపెట్టాలని సహచరులకు సూచించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. అంత ఖరీదైన కారును పాతిపెట్టే బదులు అవసరంలో ఉన్నవారికి దానం చేయవచ్చు కదా అని నెటిజన్లు ప్రశ్నించారు. ఆయన వారికి బదులిస్తూ- కారు కన్నా ఖరీదైన అవయవాలను అవసరమైనవారికి దానం చేయకుండా ఎందుకు మృతదేహాలతో పాటు పాతిపెడుతున్నారని ప్రశ్నించాడు. అవయవ దానంపై అవగాహన కల్పించేందుకే ఆయన ఈ వినూత్న ప్రకటన చేశారు. మన దేశంలోనూ అవయవ దాతల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అవయవ దానం కోసం ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ప్రతిజ్ఞ చేయాలి.

– రేవంత్ హిమత్సింగక, ఆరోగ్యకర ఆహార ప్రచారకర్త

మాపై అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు: సీఎంఆర్



విలేకరులతో మాట్లాడుతున్న కంకటాల మల్లిక్, చిత్రంలో మావూరి వెంకటరమణ, తదితరులు

విశాఖపట్నం (కార్పొరేషన్), న్యూస్‌టుడే: సీఎంఆర్ సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేలా సీఎంఆర్ లోగోను వినియోగించి సోషల్ మీడియాలో చేస్తున్న మార్ఫింగ్ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ ప్రచారాన్ని నమ్మవద్దని ది వైజాగపటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకటాల మల్లిక్ పేర్కొన్నారు. బుధవారం విశాఖలో అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకటాల మల్లిక్ మాట్లాడుతూ.. ముంబయికి చెందిన ఓ వ్యక్తి తన ఎక్స్ వేదికగా చేస్తున్న మత ప్రచారానికి సి.ఎం.ఆర్. లోగోను వాడుకుంటున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై సి.ఎం.ఆర్. సంస్థలు ఉన్న అన్ని ప్రాంతాల్లోని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సీఎంఆర్ ఫౌండర్, ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ... ఈ పోస్టును ఇతరులెవరైనా ఫార్వర్డ్ చేస్తే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. తమ సంస్థపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. అసోసియేషన్ ఛైర్మన్ మురళీకృష్ణ, వీసీసీఐ అధ్యక్షుడు ఎం. సుదర్శన్‌స్వామి, ఏపీ ఛాంబర్స్ పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పారిశ్రామిక ధీరుడు

- అత్యంత నిరాడంబరుడు
- ఘన వారసత్వాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చిన రతన్ టాటా



(ఈనాడు ప్రత్యేక విభాగం)

రతన్ టాటా.. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలుడైన పారిశ్రామికవేత్త. అయినా ఏనాడూ కుబేరులతో కలిసి కనిపించేవారు కాదు.. ప్రపంచ వ్యాప్తంగా 6 ఖండాల్లోని 100 దేశాల్లో టాటా గ్రూపునకు చెందిన 30 కంపెనీలకు ఆయన నేతృత్వం వహించారు. అయినా అత్యంత సాధారణ జీవితం గడిపారు. జేఆర్‌డీ టాటా నుంచి ఘనమైన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆయన, టాటా గ్రూపును ఉన్నత శిఖరాలకు చేర్చారు. కార్పొరేట్ టైటాన్‌గా అత్యంత గౌరవ జీవితాన్ని గడిపారు.

విద్యాభ్యాసం

1937 డిసెంబరు 28వ తేదీన నావల్ టాటా, సోనూలకు రతన్ టాటా జన్మించారు. 8వ తరగతి వరకు ఆయన ముంబయిలోని కాంపియన్ పాఠశాలలో చదివారు. ఆ తరువాత కేథడ్రల్ అండ్ జాన్ కానన్ పాఠశాలలో చదువు కొనసాగించారు. శిమ్లాలోని బిషప్ కాటన్ పాఠశాలలోనూ చదివారు. 1955లో న్యూయార్క్‌లోని రివర్‌డేల్ కంట్రీ స్కూల్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తరువాత కార్నెల్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో పట్టా అందుకున్నారు. అనంతరం హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో చేరి అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశారు.

కెరీర్

1962లో టాటా స్టీల్‌లో చేరడం ద్వారా తన వృత్తి జీవితాన్ని రతన్ టాటా ప్రారంభించారు. తొమ్మిదేళ్ల తర్వాత నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ లిమిటెడ్‌కు డైరెక్టర్- ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. 1977లో సంక్షోభంలో ఉన్న టాటా గ్రూపునకు చెందిన ఎంప్రెస్ మిల్స్‌కు మారారు. టాటా గ్రూప్‌లోని ఇతర ఉన్నతాధికారులు ఆయన ప్రణాళికను అంగీకరించకపోవడంతో అది మూతపడింది.

1991లో టాటా సన్స్ ఛైర్మన్‌గా జేఆర్‌డీ టాటా వైదొలగారు. రతన్ టాటాను వారసుడిగా ప్రకటించారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రతన్ టాటా.. సంస్థను భారీగా విస్తరించారు. పేదవాడి కారైన టాటా నానోతోపాటు టాటా ఇండికా కార్లను మార్కెట్‌కు పరిచయం చేశారు.

2012 డిసెంబరు 28న తన 75వ పుట్టిన రోజు నాడు టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి రతన్ టాటా వైదొలగారు. సైరస్ మిస్త్రీని ఛైర్మన్ చేశారు.

భారీగా విస్తరణ

21 ఏళ్లపాటు ఛైర్మన్‌గా పని చేసిన రతన్ టాటా. . తన హయాంలో టాటా గ్రూప్‌ను భారీగా విస్తరించారు. ఆయన హయాంలో గ్రూప్ ఆదాయం 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. 2016 అక్టోబరు 24వ తేదీన మిస్త్రీని తొలగించి మళ్లీ రతన్ టాటా, టాటా గ్రూప్‌నకు తాత్కాలిక ఛైర్మన్ అయ్యారు. 2017 జనవరి 12వ తేదీన నటరాజన్ చంద్రశేఖరన్‌ను గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్ ఛైర్మన్‌గా నియమించారు. అప్పటి నుంచి రతన్ టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. పదవీ విరమణ తర్వాతా రతన్ టాటా వ్యాపారంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన వ్యక్తిగత హోదాలో 30 అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. అందులో ఓలా ఎలక్ట్రిక్, పేటీఎం, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్, జివామే వంటివి ఉన్నాయి.

★ దేశంలో ఆర్థిక సంస్కరణల సమయంలో టాటా గ్రూపును రతన్ టాటా పునర్వ్యవస్థీకరించారు. అదే సమయంలో స్థానికంగా రూపొందించిన టాటా నానో, ఇండికా కార్లను విడుదల చేసి, సంచలనం సృష్టించారు. 2004లో టీసీఎస్ పబ్లిక్ ఇష్యూ తీసుకొచ్చారు.

★ అంతర్జాతీయంగానూ టాటా గ్రూపును విస్తరించడంలో రతన్ టాటా కృషి ఎనలేనిది. ఆంగ్లో-డచ్ స్టీల్ కంపెనీ కోరస్‌ను టేకోవర్ చేశారు. బ్రిటిష్ వాహన దిగ్గజం జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేశారు. బ్రిటిష్ టీ కంపెనీ టెట్లీనీ కొన్నారు.

★ 1991లో 5.7 బిలియన్ డాలర్లుగా ఉన్న టాటా గ్రూపు సంపదను 2016 నాటికి 103 బిలియన్ డాలర్లకు చేర్చడంలో రతన్ టాటా కృషి ఎనలేనిది. తన 25 లిస్టెడ్ కంపెనీల ద్వారా టాటా గ్రూప్ 2024లో రూ.85,510 కోట్ల లాభాలను ఆర్జించింది.

అవివాహితుడు

అత్యంత నిరాడంబరంగా జీవించిన రతన్ టాటా అవివాహితుడు. ముంబయిలోని అత్యంత చిన్న ఇంట్లో ఆయన నివసించేవారు. తన టాటా సెడాన్ కారును ఆయనే నడిపేవారు. ప్రైవసీని ఎక్కువగా ఇష్టపడేవారు. మీడియా ప్రచారానికి దూరంగా ఉండేవారు. తనతోపాటు పుస్తకాలను, సీడీలను, పెంపుడు కుక్కలను ఉంచుకునేవారు.

సేవల్లోనూ..

రతన్ టాటా సేవాగుణంలో అత్యున్నతుడు. 1970లలోనే ఆయన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగాఖాన్ ఆసుపత్రి, వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారు. 1991లో ఆయన టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక, టాటా గ్రూప్ సేవా కార్యక్రమాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. టాటా ట్రస్టులను మరింతగా విస్తరించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌ను స్థాపించారు. విద్యా రంగానికి మరింత ప్రోత్సాహమిచ్చారు.

అసాధారణ మానవతావాది: ప్రధాని మోదీ

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ ఘన నివాళులు అర్పించారు. 'దార్శనికుడైన వ్యాపార దిగ్గజం, అసాధారణ మానవతా వాది' అయిన రతన్ టాటా మనకు దూరం అయ్యారని మోదీ పేర్కొన్నారు. 'భారీ లక్ష్యాలను ఊహించడం, ఆ ప్రతిఫలాలను సమాజానికి తిరిగి ఇవ్వడం రతన్ టాటా నైజం. విద్య, ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, జంతు సంరక్షణ సేవల్లోనూ ఆయన ఎంతో ముందుండేవారు' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధాని తెలిపారు. దేశంలోనే ఘన చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌నకు రతన్ ఎంతో స్థిరమైన నాయకత్వాన్ని అందించారని.. బోర్డు రూం కార్యకలాపాలకు మించి దేశానికి అమూల్య సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే రతన్ ధోరణి ఆచరణాత్మకమని, దయార్ద్ర హృదయంతో మెరుగైన సమాజం కోసం అనుక్షణం తపించే వారని ప్రధాని కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను ఉన్నప్పుడు, ఎన్నో విషయాలపై అభిప్రాయాలను పంచుకునేవారమని మోదీ వివరించారు. ఆయా అంశాలపై టాటా దృక్కోణం ఎంతో ఉన్నతంగా ఉండేవని పేర్కొన్నారు. రతన్‌టాటా ఇక లేరనే విషయం తనకు ఎంతో వేదన కలిగిస్తోందని.. ఈ బాధాతప్త సమయంలో ఆయన కుటుంబానికి, సన్నిహితులకు ప్రధాని సానుభూతి తెలిపారు.

దేశ నిర్మాణంలో ఆయనది కీలకపాత్ర: కాంగ్రెస్

రతన్ టాటా మరణానికి కాంగ్రెస్ పార్టీ సంతాపం వ్యక్తం చేసింది. వ్యాపారం, దాతృత్వంలో చెరగని గుర్తులను మిగిల్చి వెళ్లిపోయారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. టాటా మరణంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విచారం తెలియజేశారు. కోట్ల మందికి ఆయన స్ఫూర్తిగా నిలిచారని, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు.

సిసలైన మానవతావాదిని కోల్పోయాం: చంద్రబాబు

'అతి కొద్దిమంది మాత్రమే తమ దూరదృష్టి, చిత్తశుద్ధితో ఈ ప్రపంచంపై తమదైన చెరగని ముద్ర వేస్తారు. అలాంటివారిలో రతన్ టాటా ఒకరు. ఈరోజు మనం ఒక వ్యాపార దిగ్గజాన్నే కాదు... సిసలైన మానవతావాదిని కోల్పోయాం. ఆయన వారసత్వం పారిశ్రామిక యవనికపైనే కాక.. ప్రతి ఒక్కరి హృదయాన్నీ ప్రభావితం చేసింది. పారిశ్రామిక రంగానికి, జాతి నిర్మాణానికి ఆయన చేసిన సేవలు భావి తరాలకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. అపార దాతృత్వానికి ఆయన పెట్టింది 'పేరు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు 57,709 దరఖాస్తులు

- ప్రభుత్వానికి రూ. 1,154.18 కోట్ల మేర ఆదాయం
- దరఖాస్తుల స్వీకరణకు నేడు, రేపూ అవకాశం
- వత్సవాయిలో ఒక్కో దుకాణానికి వందకు పైగా దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. బుధవారం రాత్రి వరకు 57,709 దరఖాస్తులు అందాయి. బుధవారం ఒక్కరోజే 16,361 వచ్చాయి. రుసుముల రూపంలో ప్రభుత్వానికి రూ. 1,154.18 కోట్ల ఆదాయం సమకూరింది. ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల గడువును ఈ నెల 11 వరకు పొడిగించింది. గురు, శుక్రవారాల్లో మరో 40 వేల వరకూ దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రెండు దుకాణాలకు అత్యధికంగా పోటీ

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలంలో రెండు దుకాణాలను నోటిఫై చేశారు. వాటిలో 96వ నంబరు దుకాణానికి 110, 97వ నంబరు దుకాణానికి 107 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుము రూపంలో రూ. 4.22 కోట్ల మేర ఆదాయం సమకూరింది. రాష్ట్రంలో అత్యధికంగా పోటీ ఉన్నది ఈ దుకాణాలకే. రాబోయే రెండు రోజుల్లో వీటికి మరిన్ని దరఖాస్తులు అందే అవకాశముంది.

13 దుకాణాలకు ఒక్కొక్కటే..

◆ 13 దుకాణాలకు ఒక్కొక్క దరఖాస్తే అందాయి. వాటిలో తిరుపతి జిల్లాలోనివే ఆరు ఉన్నాయి. పాకాల మండలంలోని నంబరు 136వ దుకాణం, సూళ్లూరుపేట పరిధిలోని 175, 180, 183, 187 నంబర్ల దుకాణాలకు ఒక్కొక్క దరఖాస్తే వచ్చాయి. తిరుపతి జిల్లాలోని అత్యధిక శాతం దుకాణాలకు 5 లోపు దరఖాస్తులే వచ్చాయి. అనంతపురం జిల్లా పామిడిలోని 66వ నంబరు దుకాణం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని 66వ నంబరు దుకాణాలకు ఒక్కో దరఖాస్తే వచ్చాయి.

◆ చిత్తూరు జిల్లా సదుంలోని 101, 102 దుకాణాలకు ఒక్కో దరఖాస్తే వచ్చాయి. ఇది మాజీమంత్రి, వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం.

◆ వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలంలోని 26, 28వ నంబరు దుకాణాలకు, పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని 98వ నంబరు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని 81వ నంబరు దుకాణానికి ఒక్కో దరఖాస్తే అందాయి.

ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికం..

◆ ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాల కోసం రాష్ట్రంలోనే అత్యధికంగా 4,420 దరఖాస్తులు అందాయి. తర్వాతి స్థానంలో ఉన్న ఏలూరు జిల్లాలో 144 దుకాణాలకు 3,843 దరఖాస్తులు వచ్చాయి. మూడో స్థానంలో విజయనగరం జిల్లా ఉంది. ఇక్కడ 153 దుకాణాలకు 3,701 దరఖాస్తులు అందాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 175 దుకాణాలకు 3,513 దరఖాస్తులు వచ్చాయి.

◆ అనకాపల్లి, డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, గుంటూరు, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, వైఎస్సార్ జిల్లాల్లో 2 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. శ్రీసత్యసాయి, పల్నాడు, నంద్యాల, కృష్ణా, అల్లూరి, అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, చిత్తూరు, కాకినాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తక్కువ దరఖాస్తులు వచ్చాయి.

హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తాతయ్యబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన బత్తుల తాతయ్యబాబును నియమిస్తూ సీఎం కార్యాలయం బుధవారం నోట్ విడుదల చేసింది. ఇటీవల ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీచేసింది. అందులో హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా ఆయనను నియమించింది. తాజాగా ఆ నియామకాన్ని రద్దు చేసి.. హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించింది.

లేపాక్షి భూముల కోసం 'ఈడీ'తో సంప్రదింపులు

- త్వరలో సానుకూలత వచ్చే అవకాశం
- ఆ భూముల్లో భారీ పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ప్రతిపాదన
- కేంద్ర అనుమతుల కోసం పంపిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: లేపాక్షి సెజ్ కోసం సేకరించిన భూములను రాష్ట్ర పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు అనుమతించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని కోరుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదన పంపింది. ఆ భూముల్లో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొత్త పారిశ్రామిక నోడ్ (పార్కు) అభివృద్ధి చేస్తామని ప్రతిపాదనలో పేర్కొంది. దీనిపై ఈడీ నుంచి త్వరలో అనుమతులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. లేపాక్షి భూముల వ్యవహారంలో చోటుచేసుకున్న వివాదాల కారణంగా 8,844 ఎకరాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. సుమారు పదేళ్ల నుంచి ఆ భూమి వృథాగా ఉంది. దాన్ని వినియోగంలోకి తెచ్చి.. పారిశ్రామిక అవసరాలకు వినియోగించాలన్నది ప్రభుత్వం ఆలోచన. ఈడీ నుంచి వెనక్కి తీసుకుంటేనే పెట్టుబడిదారులకు కేటాయించగలరు. దాంతో ఈడీ అనుమతుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

నాలుగు కొత్త నోడ్‌లలో ఇదొకటి

రాష్ట్రంలో కొత్తగా నాలుగు పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దొనకొండ, మూలపేట, కుప్పంతో పాటు లేపాక్షినీ కొత్త నోడ్‌ల జాబితాలో చేర్చింది. కొత్త నోడ్‌ల అభివృద్ధికి అనుమతి కోరుతూ ఇటీవల కేంద్రానికి ప్రతిపాదన పంపింది. దానికి కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తమైందని సమాచారం. అందులో భాగంగానే ఈడీ నుంచీ అనుమతులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

కోర్టు అనుమతించినా.. ఈడీ అంగీకరిస్తేనే

లేపాక్షి భూములను పారిశ్రామిక అవసరాలకు కేటాయించేందుకు.. అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు హైకోర్టు అనుమతించింది. అయితే, కొన్ని షరతులకు లోబడి నిర్మాణాలు చేపట్టాలంది. ఆ భూములు ఈడీ స్వాధీనంలో ఉండడంతో.. అందులో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావట్లేదు. భవిష్యత్తులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుతీర్పు వస్తే నష్టపోతామన్న భయం వారిలో ఉంది. ఈ అంశాలన్నింటినీ ప్రభుత్వం ఈడీ దృష్టికి తీసుకెళ్లింది. ఈడీ సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని ఒక అధికారి తెలిపారు. ఈడీ అనుమతులు వచ్చాక.. ఆ వివరాలతో హైకోర్టుకు అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వాటి ఆధారంగా భూముల వినియోగానికి కోర్టు నుంచి అనుమతులు పొందడం సులువుగా ఉంటుందన్నారు.



సీఎం కాన్వాయ్ వెళ్లేదారిలో వీపులకు బోర్డులు తగిలించి ఇలా నిలబెట్టారు

చెప్పినా చెవికెక్కదా..?

'వ్యవస్థ తన పని చేసుకుంటూ వెళ్లాలి. కానీ, అతి చేయొద్దు. మరీ ముఖ్యంగా గత ప్రభుత్వం మాదిరి సీఎం పర్యటన అంటే హడావుడి చేయొద్దు' ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పే మాటలవి. ఇవి పోలీసుల చెవికెక్కనట్లుంది. బుధవారం విజయవాడలోని దుర్గ గుడికి సీఎం వస్తున్నారని తెలిసి పోలీసులు కొందరి వీపులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ఫ్లెక్సీలను కట్టి ముఖ్యమంత్రి వెళ్లే దారిలో నిల్చోబెట్టారు. ఈ అతి చేష్టలను చూసి భక్తులు ముక్కున వేలేసుకున్నారు. – ఈనాడు, అమరావతి



సహారాలో.. ఇదేమి గారడి!
ఎడారిలో వరదల సందడి

రబాత్ (మొరాకో): ఎడారిలో నీటిజాడ కనిపించాలంటే.. కొన్ని కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలి. ఒయాసిస్సుల కోసం వెతుక్కోవాలి. అయినా నీరు కనిపిస్తుందనే నమ్మకం ఉండదు. అలాంటి ఎడారిలో.. అదీ భూమిపైనే అతిపెద్దది, కరవు పరిస్థితులు తాండవించే సహారా ఎడారిలో వరదలు వచ్చాయి. ఉత్తర ఆఫ్రికా దేశం మొరాకోలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాలు ఇందుకు కారణం. లక్షల కిలోమీటర్ల మేర మేట వేసిన ఇసుకదిబ్బల మీదుగా వరదనీరు ప్రవహిస్తోంది. సూర్యుడి చుట్టూ భూమి తిరగటంలో తలెత్తిన మార్పులే సహారాలో వరదలకు కారణమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇదే ఎడారిలో గత యాభై ఏళ్లుగా ఎండిపోయి ఉన్న ప్రసిద్ధ ఇరికీ సరస్సులో తాజా వరదలతో నీరు చేరినట్లు నాసా ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి.

ఖర్జూరచెట్లు, ఇసుకతిన్నెల నడుమ నీరు..

సహారాలో కురిసిన అరుదైన వర్షాలతో ఎడారిలోని ఖర్జూరచెట్లు, ఇసుకతిన్నెల మధ్య నీటి మడుగులు ఏర్పడ్డాయి. గత కొన్ని దశాబ్దాల్లో చూడని విధంగా.. తీవ్ర కరవు పీడిత ప్రాంతాల్లోనూ నీరు ఎక్కువగా చేరింది. ప్రపంచంలోని అత్యంత శుష్క ప్రదేశాల్లో సహారా ఎడారి ఒకటి. వేసవికాలం చివరలో అరుదుగా ఇక్కడ వర్షం పడుతుంది. ఈ ఎడారిలోని పలు ప్రాంతాల్లో సెప్టెంబరు నెలలో రెండు రోజులపాటు కురిసిన వర్షం ఏడాది సగటును (250 మిల్లీమీటర్ల కన్నా తక్కువ) మించినట్లు మొరాకో ప్రభుత్వం తెలిపింది. టాగొనిట్ వంటి ప్రాంతాల్లో 24 గంటల వ్యవధిలో 100 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. దాదాపు 30 ఏళ్ల తర్వాత తక్కువ వ్యవధిలో ఇంత వర్షం కురిసినట్లు మొరాకో వాతావరణ విభాగం వెల్లడించింది. ఈ వర్షాలను అదనపు ఉష్ణమండల తుపాన్లుగా పిలుస్తారు. వీటి వల్ల గాలి ఎక్కువ తేమను నిలుపుకోవడం వలన మరింత బాష్పీభవనానికి (ఆవిరవటం) గురై భవిష్యత్తులో మరిన్ని తుపాన్లకు కారణమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొరాకోలో వరుసగా ఆరేళ్ల ఏర్పడిన కరవు పరిస్థితులతో స్థానిక రైతులు పొలాలను బీళ్లుగా వదిలేశారు. తాజా వర్షాలు వీరికి ఊరట కలిగించనున్నాయి.



20న ఐ.వి.సుబ్బారావు రైతునేస్తం పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, న్యూస్‌టుడే: రైతునేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ.. ఆధునిక మార్గంలో నడుస్తున్న 20 మంది రైతులకు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఐ.వి.సుబ్బారావు రైతునేస్తం పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు రైతునేస్తం వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గన్నవరం సమీపంలోని ఆత్కూర్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెదేపా కేంద్ర కార్యాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ

ఈనాడు, అమరావతి: దసరా సందర్భంగా తెదేపా కేంద్ర కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి బుధవారం దుస్తుల పంపిణీ జరిగింది. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు సమకూర్చిన దుస్తుల్ని మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి తదితరులు వారికి అందజేశారు. ఈ పండుగను అందరూ సంతోషంగా చేసుకోవాలని, ప్రతి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు కలగాలని అభిలషించారు.

హరియాణాలో భాజపా హ్యాట్రిక్ విజయంపై పవన్ కల్యాణ్ హర్షం

ఈనాడు డిజిటల్, అమరావతి: హరియాణా ఎన్నికల్లో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించడంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్‌లోనూ ఆ పార్టీ మంచి ప్రదర్శన కనబర్చిందని 'ఎక్స్'లో బుధవారం ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ, భాజపా అధిష్ఠానం, ఎన్డీయే కూటమికి పవన్ అభినందనలు తెలిపారు. రాజకీయాల్లో, సంక్షేమ పథకాల అమలులో ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వాన్ని ఈ ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయని కొనియాడారు.

పవన్‌ని కలిసిన చిలుకూరి బాలాజీ దేవాలయం అర్చకుడు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని తెలంగాణలోని చిలుకూరి బాలాజీ దేవాలయం అర్చకుడు సీఎస్ రంగరాజన్ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి పాల్గొన్నారు.

ఖరీదైన విందుల్లో కల్తీ బ్రాండ్ల మద్యం

ఈవెంట్ మేనేజ్‌మెంట్ల సిబ్బంది చేతివాటం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూరు సమీపంలో ఎక్సైజ్ సిబ్బంది గత ఆగస్టు 14న విశ్వసనీయ సమాచారంతో ఒక కారును తనిఖీ చేశారు. అందులో డిఫెన్స్ మద్యంగా చెబుతున్న రూ.11 లక్షల విలువైన 42 సీసాలు లభించాయి. వాటిని పరిశీలించగా బ్రాండ్ల కల్తీ జరిగినట్లు తేలింది. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన అంబాదాస్, అభిషేక్ వాటిని తరలిస్తున్నట్లు తేలడంతో అరెస్టు చేశారు. ఆ కేసులో ఎక్సైజ్ అధికారులు లోతుగా ఆరా తీయడంతో ఖరీదైన బ్రాండ్ల సీసాల్లో తక్కువ ధర మద్యాన్ని నింపి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ తరహా మద్యాన్ని ముఖ్యంగా వివాహాలు, జన్మదిన వేడుకల్లాంటి విందులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి వేడుకల్ని నిర్వహించే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల సిబ్బంది ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఒక్కో పార్టీలో రూ.20 లక్షల వరకు మద్యం వినియోగిస్తున్న క్రమంలో ఖరీదైన బ్రాండ్లను కల్తీ చేస్తున్నట్లు ఎక్సైజ్ వర్గాలు గుర్తించాయి. ఖరీదైన మద్యం బాటిళ్ల లేబుళ్లను ఒడుపుగా తొలగించి తక్కువ ఖరీదు మద్యాన్ని వాటిలో నింపి, మళ్లీ లేబుళ్లను బిగిస్తున్నారు. ఈవెంట్లలో కొంత మోతాదులో మద్యం వినియోగించిన అనంతరం ఈ కల్తీబ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అప్పటికే నిషా ఎక్కిన తర్వాత వినియోగదారులు కల్తీబ్రాండ్లను కనిపెట్టలేరనే ఉద్దేశమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే భారీ వేడుకలు జరిగే కన్వెన్షన్ సెంటర్లు, ఫామ్‌హౌస్‌లపై ఎక్సైజ్ అధికారులు నిఘా విస్తృతం చేశారు. ఖరీదైన బ్రాండ్ల లేబుళ్లను ట్యాంపరింగ్ చేసినట్లు అనుమానముంటే టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు ఫిర్యాదు చేయాలని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

ఆగ్రోస్‌లో ఆర్థిక విధ్వంసం

- గోదాముల్లో మూలుగుతున్న బ్యాటరీ స్ప్రేయర్లు
- తుప్పు పడుతున్న ట్రాక్టర్లు, డోజర్లు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా నిధుల వినియోగం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ యంత్ర పరికరాల్ని రాయితీపై ఇవ్వాలని అయిదేళ్లపాటు రైతులు కోరినా గత ప్రభుత్వం మనసు కరగలేదు. కానీ, కమీషన్ల కోసం నాసిరకమైన 1,600 పైగా బ్యాటరీ స్ప్రేయర్లు, వరికోత యంత్రాలు, టార్పాలిన్లు కొనుగోలు చేసి.. పక్కన పడేసింది. అవన్నీ ఏపీ ఆగ్రోస్ గోదాముల్లో రెండేళ్లుగా మూలుగుతున్నాయి. జిల్లాల్లోని ఆగ్రోస్ కేంద్రాల్లో ట్రాక్టర్లు, బేలర్లు (గడ్డి కట్టలు కట్టే యంత్రం), రొటోవేటర్లు తదితర విలువైన యంత్ర పరికరాలెన్నో తుప్పుపట్టిపోతున్నాయి. తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్ర పరికరాల ప్రదర్శన కేంద్రాలు కూడా పనిచేయడం లేదు. వీటిలోని పరికరాలు కూడా నిరుపయోగంగా మారాయి. వీటన్నిటి విలువ రూ. కోట్లలోనే ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రోస్‌కు 15 ప్రాంతాల్లో భూములు, విలువైన స్థలాలున్నాయి. మొత్తంగా రూ. 1,000 కోట్లకుపైగా ఆస్తులుంటాయని అంచనా. గత ప్రభుత్వ హయాంలో అర్హత లేని అధికారుల్ని నియమించి ఆగ్రోస్‌ను దాదాపు నిర్వీర్యం చేయగా, పాలకులు ఇష్టారాజ్యంగా దోచుకున్నారు.

దళారీ పాత్రలో కొందరు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) 1968లో ఏర్పాటైంది. రైతులకు బుల్డోజర్లు, పొక్లెయిన్లు, ఇతర యంత్ర పరికరాలను అద్దెపై తక్కువ ధరకే ఇవ్వడం దీని ప్రధాన లక్ష్యం. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, ఇతర శాఖల ద్వారా రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు, పురుగుమందులు, ఎరువులను తక్కువ ధరకే అందేలా చూడాలి. దీనికి సేవా రుసుము కింద 4% తీసుకుంటుంది. కొందరు అధికారులు మాత్రం కమీషన్ల కోసం తమకు నచ్చిన సంస్థలతో ఒప్పందాలు చేసుకుని, అధిక ధరలకు నాసిరకం పరికరాల్ని కొనుగోలు చేసి.. ప్రభుత్వ శాఖలకు కట్టబెడుతున్నారు. అతిపెద్ద దళారీ పాత్ర పోషిస్తున్నారు. దీంతో గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖలు మీ సేవలు మాకొద్దు బాబోయ్ అని పారిపోయాయి. ఇతర శాఖల పరిస్థితీ అదే.
- గత ప్రభుత్వంలో రూ. 70 లక్షల విలువైన స్ప్రేయర్లు, రేపర్లు ఇతర యంత్ర పరికరాల్ని కొనుగోలు చేశారు. నాసిరకం పరికరాలు తమకు వద్దని సేవా కేంద్రాల నిర్వాహకులు అడ్డం తిరగడంతో వాటిని మూలనపడేశారు. వీటి కొనుగోలులో కొందరు అధికారులకు పెద్ద మొత్తంలో కమీషన్లు అందాయని విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ శాఖలకు ట్రాక్టర్ల సరఫరా కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లనూ తాకట్టు పెట్టి... సొంత నిధులు ఖర్చు చేశారు. వ్యవసాయ యంత్ర పరికరాల తయారీ సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయకర్తగా మాత్రమే ఆగ్రోస్ పని చేయాల్సి ఉన్నా.. ఆ విషయాన్ని విస్మరించారు. 2019 నాటికే ఆగ్రోస్‌కు రూ. 125 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండగా.. వాటినీ కరిగించేస్తున్నారు.
- సంస్థకు చెందిన విలువైన భూముల్ని వైకాపా నేతలు కొల్లగొట్టారు. కర్నూలు జిల్లాలో భూమిని వైకాపా కార్యాలయానికి ఇచ్చేశారు. అనంతపురం జిల్లాలో విలువైన స్థలాల్ని తక్కువ ధరకే అప్పగించారు.
- 2018లో ప్రతి జిల్లాలోని ఆగ్రోస్ కేంద్రంలో రూ. 40 లక్షల విలువైన యంత్ర పరికరాల్ని ఉంచి, ప్రదర్శనా కేంద్రాలను ప్రారంభించారు. వైకాపా హయాంలో వాటినీ పట్టించుకోలేదు. ఆ యంత్రాలన్నీ తుప్పుపట్టిపోతున్నాయి.
- ఆగ్రోస్‌లో చక్రం తిప్పేది ఇద్దరు, ముగ్గురు అధికారులే. అధికశాతం పదవీ విరమణ చేశారు. అర్హత లేకున్నా కొందరిని జిల్లా మేనేజర్లుగా నియమించారు. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం విచారణ చేయించడంతోపాటు.. ఆగ్రోస్ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

నల్లమలలో చిరుత మృతి

కొల్లాపూర్, న్యూస్‌టుడే: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నల్లమల అడవుల్లో మగ చిరుత మృతి చెందింది. అమరగిరి అటవీ ప్రాంతంలో చిన్నగండి దగ్గర ఓ చిరుత మృతి చెంది ఉన్నట్లు వాచర్లు గుర్తించి బుధవారం అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కొల్లాపూర్ రేంజ్ అధికారి చంద్రశేఖర్, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి సిబ్బందితో వెళ్లి చిరుత కళేబరాన్ని పరిశీలించారు. దాని వయసు దాదాపు పదేళ్లు ఉంటుందని, చిరుత వేటగాళ్ల ఉచ్చులోపడి చనిపోయిందా, అనారోగ్యంతో మృతి చెందిందా అనే కోణంలో విచారిస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. చిరుత కళేబరం నుంచి గోళ్లు, ఇతర ముఖ్యమైన అవయవాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. వేటగాళ్ల ఉచ్చుకు బలైనట్లు తేలితే నిందితులను గుర్తించి కఠిన చర్యలు చేపడతామన్నారు. కొల్లాపూర్ నల్లమల అటవీ ప్రాంతంలో ఏడు చిరుతలు, ఒక పెద్దపులి సంచరిస్తున్నాయని, పెద్దపులికి రెండు పిల్లలు ఉన్నాయని రేంజర్ తెలిపారు. అనుమతులు లేకుండా అటవీ ప్రాంతంలోకి చొరబడేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అమరగిరి అటవీ ప్రాంతంలో చిరుతపులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూములు కబ్జా చేసిన వైకాపా నేతలు

జనసేన జనవాణిలో పలువురి ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: పూర్వీకుల నుంచి సంక్రమించిన 43 సెంట్ల భూమిని గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకుల బంధువులు ఆక్రమించుకున్నారని పుంగనూరు నియోజకవర్గం చిన్న నల్లూరుపల్లెకు చెందిన జి.కౌసల్య.. జనసేన జనవాణిలో ఫిర్యాదు చేశారు. హైకోర్టు తమకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయడం లేదని వాపోయారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి వచ్చిన కాకర్ల కొండయ్య, శ్రీనివాసులు సైతం తమ 3.31 ఎకరాల భూమిని ఓ వైకాపా నాయకుడు కబ్జా చేశాడని ఫిర్యాదు చేశారు. విజయవాడలో వైకాపా రౌడీల వేధింపుల నుంచి తమ కుటుంబాన్ని కాపాడాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కీర్తి కుమారి విన్నవించారు. తన భర్త పేరుతో రుణాలు తీసుకుని బంకు శివ, దాము, విజయ్ అనే వ్యక్తులు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని నల్గొండకు చెందిన నాగరాజు.. తన కుమార్తె గుండె శస్త్రచికిత్సకు రూ.4 లక్షలు అవుతుందని, ఆదుకోవాలని కోరగా ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి రూ.లక్ష తగ్గించే ఏర్పాటు చేశారు.

దుకాణాల నుంచి ఖాళీ చేయించకుండా అడ్డుకోండి

హైకోర్టులో చిరు వ్యాపారుల వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: కొరిటెపాడు కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను ఖాళీ చేయించేందుకు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవడాన్ని సవాలు చేస్తూ చిరువ్యాపారులు, చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీఎస్ఆర్ కృష్ణారెడ్డి, మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. 25 ఏళ్లకు లీజు ఒప్పందం చేసుకున్నామని, ఈ నేపథ్యంలో తాము 2030 వరకు దుకాణాల్లో కొనసాగేందుకు అర్హులమన్నారు. తమను ఖాళీ చేయించకుండా ఉండేలా అధికారులను ఆదేశించాలని కోరారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అదనపు కమిషనర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరపనుంది.

వీసీల ఎంపిక కమిటీకి నామినీని ప్రతిపాదించాలని ఉన్నత విద్యాశాఖ లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో వీసీల ఎంపికకు సంబంధించిన సెర్చ్ కమిటీకి నామినీని ప్రతిపాదించాలని ఉన్నత విద్యాశాఖ.. విశ్వవిద్యాలయాలకు లేఖ రాసింది. వీసీల నియామకం కోసం ఉన్నత విద్యాశాఖ ఇటీవల దరఖాస్తులు స్వీకరించింది. వీరి ఎంపిక కమిటీకి విశ్వవిద్యాలయం నుంచి ఒక్కొక్కరిని నామినేట్ చేయాల్సి ఉన్నందున వెంటనే ప్రతిపాదించాలని ఉన్నత విద్యాశాఖ రాసిన లేఖల్లో పేర్కొంది.

జోగి రమేశ్ అండదండలతో తప్పుడు కేసులు

- తెదేపా కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు
- వినతులు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణి, పనబాక లక్ష్మి

ఈనాడు, అమరావతి: 'గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి జోగి రమేశ్ అండదండలతో కొందరు పోలీసులు అక్రమాలకు పాల్పడ్డారు. మా మీద దాడి చేసిన వైకాపా వారిని వదిలి...బాధితులమైన మా మీదే తప్పుడు కేసులు బనాయించారు. సీఐ కేసును ఉపసంహరించుకోవాలని చెప్పినా...ఎస్సై, స్టేషన్ రైటర్‌లు డబ్బులు డిమాండ్ చేస్తూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు' అని ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరుకు చెందిన రాహేలు, రామకృష్ణలు వాపోయారు. దీనిపై విచారణ చేసి తప్పుడు కేసును కొట్టేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన 'ప్రజావేదిక'లో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులు, పోలీసులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. 22 ఏళ్లుగా వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తనను పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కక్షగట్టి ఉద్యోగం నుంచి తొలగించారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురుకు చెందిన సాదనాల సుబ్బారావు ఫిర్యాదు చేశారు. పాతూరి విజయ్‌కుమార్, వంశీలు తన పొలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని పశ్చిమగోదావరి జిల్లా, చేబ్రోలు మండలానికి చెందిన వల్లభనేని మాధవ్ వాపోయారు. నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న తమకు 18 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం జీతాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

కుమారుడి జాడ కనుక్కోవాలంటూ తల్లి ఆవేదన

మూడున్నరేళ్ల నుంచి తన కుమారుడు కనిపించడం లేదని, పోలీసుల దగ్గరకు వెళితే..రోజంతా స్టేషన్‌లో కూర్చోబెడుతున్నారు తప్ప ఆచూకీ కనుక్కోవడం లేదని పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలం, పమిడిపాడుకు చెందిన రమణమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. వైకాపాకు వ్యతిరేకంగా ఉన్నామనే అక్కసుతో తమ భూముల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించలేదని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని నెల్లూరు జిల్లా, కావలికి చెందిన శ్రీనివాసులు అర్జీ ఇచ్చారు. తమకు మినిమం టైం స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏపీ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న అటెండర్లు, వాచ్‌మెన్లు విజ్ఞప్తి చేశారు.





కాళరాత్రి అలంకారంలో సరస్వతీదేవి

★ చదువుల తల్లిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

భక్తులతో పులకించిన చదువుల తల్లి కోవెల

- కాళరాత్రి రూపంలో సరస్వతమ్మ దర్శనం
- బాసరలో 2,230 అక్షరాభ్యాసాలు.. రూ.30 లక్షల ఆదాయం

ఈటీవీ-ఆదిలాబాద్, ముథోల్-న్యూస్‌టుడే: తెలంగాణలోని నిర్మల్ జిల్లాలోని చదువుల తల్లి క్షేత్రం బాసర.. భక్తులతో పులకించింది. తెలుగు రాష్ట్రాలతోపాటు పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి సరస్వతీదేవిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం సరస్వతి అమ్మవారు కాళరాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో వచ్చే అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం 2,230 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ఈవో విజయరామారావు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున మూడు గంటల నుంచి అక్షరాభ్యాసాలు ప్రారంభమవగా.. అమ్మవారి దర్శనానికి దాదాపు 3 గంటల సమయం పట్టింది. అక్షరాభ్యాసాలతో ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. చాలా ప్రాంతాల నుంచి మంగళవారం రాత్రికే భక్తులు బాసరకు చేరుకున్నారు. సరిపడినన్ని గదులు అందుబాటులో లేక చాలా మంది భక్తులు ఆలయ పరిసరాల్లో ఆరుబయటే నిరీక్షించాల్సి వచ్చింది.

బీమాతో రోగులకు ప్రభుత్వ ధీమా!

- 'పీఎంజేఏవై'తో రాష్ట్రం అమలుచేసే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్ల సమతుల పరిశీలన
- ఒక సమస్యకు కేంద్రం అందించేది ఒకే చికిత్స.. ఇక్కడ మాత్రం ఆరు రకాలపై అధ్యయనం

ఈనాడు, అమరావతి: ఆరోగ్యశ్రీ సేవలను బీమా విధానంలో అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున రోగులకు అవసరమైన అన్ని రకాల చికిత్సలను (ప్రొసీజర్లు) అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు కొనసాగుతోంది. నాటి వైకాపా పాలనలో 3,257 రకాల చికిత్సలు (30 రకాల స్పెషాలిటీలతో కలిపి) ఆరోగ్యశ్రీ కింద ఖరారు చేశారు. ప్రస్తుతం వాటినే కొనసాగిస్తున్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద అందే 1,949 రకాల చికిత్సలూ ఇందులో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రచారానికే చికిత్సల సంఖ్యను పెంచి చూపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను బీమా పరిధిలోకి తీసుకెళ్లే క్రమంలో అమల్లో ఉన్న ప్రొసీజర్ల ప్రాధాన్యాలు, ఉపయోగాలపై వైద్య నిపుణులతో పునఃపరిశీలన చేయిస్తోంది. రోగులకు ఆరోగ్య భద్రత కల్పిస్తూనే రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా బీమా విధానాన్ని పకడ్బందీగా అమలుచేయాలని యోచిస్తోంది.

వ్యత్యాసాలిలా..!

ఆర్థోపెడిక్స్ స్పెషాలిటీస్‌లో ఫ్రాక్చర్-లాంగ్-బోన్స్ మెటఫిషియల్ కోసం పీఎంజేఏవై కింద ఒకటే ప్రొసీజర్ ఉంది. ఇదే సమస్యకు ఆరోగ్యశ్రీ కింద నాలుగు రకాల చికిత్సలున్నాయి. జనరల్ సర్జరీ విభాగంలో మరో రెండింట్లోనూ ఇలాంటి వ్యత్యాసాలే ఉన్నాయి. ఉపయోగంలో లేని, తక్కువగా అవసరమయ్యే ప్రొసీజర్ల సంఖ్యను తగ్గించినప్పటికీ ఒకవేళ తప్పనిసరి అవసరమైతే వీటి వరకు ట్రస్టు ద్వారా చెల్లించడంపై ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఖరారు చేసిన 3,257 చికిత్సలలో 170 ప్రొసీజర్లను ప్రభుత్వాసుపత్రులకే పరిమితం చేశారు. ఈ సంఖ్య అదనంగా మరో 600 వరకు పెంచేందుకు నాటి వైకాపా హయాంలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎన్నికలు రావడంతో అమలుపై నిర్ణయం తీసుకోలేదు.

వైద్య నిపుణుల సలహాల స్వీకరణ

రోగులకు అందుతున్న ప్యాకేజీలను యథావిధిగా కొనసాగిస్తూనే ప్రొసీజర్ల సంఖ్యను కొత్త ప్రభుత్వం పరిమితం చేసే అవకాశముంది. బీమా కంపెనీల ఎంపిక సందర్భంగా ప్రొసీజర్ల సంఖ్య నిర్దిష్టంగా ఉంటేనే ఖర్చుకు తగ్గట్టు మెరుగైన వైద్య సేవలందుతాయని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఇందు కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రొసీజర్ల ఖరారులో పాల్గొన్న స్పెషాలిటీ వైద్యుల సలహాలనూ స్వీకరిస్తున్నట్లు వెల్లడించాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు పరిధిలో రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలున్నాయి. 41.56 లక్షల కుటుంబాలు దీని పరిధిలో లేవు. రూ.రెండున్నర లక్షల్లోపు వ్యయమయ్యే చికిత్సలు పొందేవారి సంఖ్య 97% వరకుంది. వైద్య ఖర్చులు రూ.రెండున్నర లక్షలు దాటితే ఆ మొత్తాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



మహిళల టీ20 ప్రపంచకప్.. సెమీస్ రేసులో ఉండాలంటే భారత్‌కు కావాల్సింది కేవలం గెలుపు కాదు భారీ విజయం. ప్రత్యర్థేమో ఆసియా కప్ ఫైనల్లో షాకిచ్చిన శ్రీలంక. ఇలాంటి పరిస్థితుల్లో బరిలో దిగిన మన అమ్మాయిలు.. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో లంకను చిత్తుచేశారు.

కొట్టేసి.. చుట్టేసి

శ్రీలంకపై భారత్ ఘన విజయం



- మెరిసిన హర్మన్‌ప్రీత్, మంధాన
- చెలరేగిన అరుంధతి, శోభన

దుబాయ్

టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు సత్తాచాటింది. బుధవారం గ్రూప్-ఎ మ్యాచ్‌లో శ్రీలంకపై 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 3 వికెట్లకు 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (52 నాటౌట్; 27 బంతుల్లో 8×4, 1×6), స్మృతి మంధాన (50; 38 బంతుల్లో 4×4, 1×6), షెఫాలి వర్మ (43; 40 బంతుల్లో 4×4) రాణించారు. ఛేదనలో ఆశ శోభన (3/19), అరుంధతి రెడ్డి (3/19), రేణుక సింగ్ (2/16) ధాటికి లంక 19.5 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో రన్‌రేట్ మెరుగుపర్చుకున్న భారత్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఆదివారం ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తలపడుతుంది. సెమీస్ చేరాలంటే ఈ మ్యాచ్‌లో భారత్ తప్పక గెలవాలి. లేదంటే ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కలిసిరావాలి.

బౌలింగ్ భళా: భారత బౌలర్లు ఛేదనలో లంకను కట్టిపడేశారు. ఇన్నింగ్స్ రెండో బంతికే పేసర్ రేణుక జట్టుకు వికెట్ అందించింది. బ్యాక్‌వర్డ్ పాయింట్ నుంచి వెనక్కి తిరిగి పరిగెత్తి కింద పడుతూ రాధ అందుకున్న సూపర్ క్యాచ్‌తో విష్మి (0) పెవిలియన్ చేరింది. ఆ వెంటనే యువ ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక బంతిని చక్కగా స్పిన్ చేసి ప్రమాదకర చమరి ఆటపట్టు (1)ను బోల్తా కొట్టించింది. పవర్‌ప్లే ముగిసేసరికి 28/3తో లంక వెనుకబడింది. ఆ దశలో అనుష్క (20), కవిష (21) కలిసి కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకోగలిగారు. కానీ లెగ్ స్పిన్నర్ శోభన ఈ జోడీని విడగొట్టి వికెట్ల పతనానికి గేట్లెత్తింది. ఫామ్‌ను కొనసాగిస్తూ తెలుగమ్మాయి అరుంధతి ఒకే ఓవర్లో నీలాక్షిక (8), కవిషను ఔట్ చేయడంతో లంక పనైపోయింది. ఆ తర్వాత ఆశ స్పిన్‌కు బ్యాటర్లు దాసోహమయ్యారు. చివరి బంతి ఉండగా లంక ఆలౌటైంది.

పునాది బలంగా.. ముగింపు ఘనంగా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు షెఫాలి, స్మృతి బలమైన పునాది వేయగా.. హర్మన్‌ప్రీత్ మెరుపు ముగింపునిచ్చింది. మొదట 5 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 30 మాత్రమే. కానీ మంధాన క్రమంగా జోరు అందుకోవడం.. షెఫాలి కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. రణవీర బౌలింగ్‌లో క్రీజు వదిలి ముందుకు వచ్చిన మంధాన చక్కటి సిక్సర్ కొట్టింది. ఈ ఇద్దరు బౌండరీలతో సాగడంతో 9 ఓవర్లకు 71 పరుగులతో భారత్ మెరుగ్గా కనిపించింది. మంధాన ఫోర్‌తో అర్ధశతకం అందుకుంది. కానీ వరుస బంతుల్లో మంధాన, షెఫాలి ఔటవడంతో భారత జోరుకు కాస్త కళ్లెం పడింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చెలరేగిపోయింది. పాక్‌తో మ్యాచ్‌లో మెడ నొప్పితో రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన ఆమె.. లంకపై బౌండరీలతో సత్తాచాటింది. బంతిని స్వీప్ చేస్తూ, కట్ చేస్తూ షాట్లు కొట్టింది. ఫీల్డర్ల వైఫల్యాలను సొమ్ము చేసుకుంది. ఇన్నింగ్స్ చివరి రెండు బంతులను బౌండరీకి పంపించి అర్ధశతకాన్ని చేరుకోవడమే గాక జట్టు స్కోరును 170 దాటించింది.

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి (సి) గుణరత్నె (బి) ఆటపట్టు 43; స్మృతి రనౌట్ 50; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 52; జెమీమా (సి) ప్రబోధని (బి) కాంచన 16; రిచా నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం:** (20 ఓవర్లలో 3 వికెట్లకు) **172**; **వికెట్ల పతనం:** 1-98, 2-98, 3-128; **బౌలింగ్:** ప్రియదర్శని 2-0-11-0; సుగంధిక 3-0-29-0; ప్రబోధని 3-0-32-0; కవిష 2-0-11-0; రణవీర 3-0-26-0; చమరి ఆటపట్టు 4-0-34-1; కాంచన 3-0-29-1

శ్రీలంక ఇన్నింగ్స్: విష్మి (సి) రాధ (బి) రేణుక 0; చమరి (సి) దీప్తి (బి) శ్రేయాంక 1; హర్షిత (సి) రిచా (బి) రేణుక 3; కవిష (సి) రేణుక (బి) అరుంధతి 21; అనుష్క (స్టంప్డ్) (బి) శోభన 20; నీలాక్షిక (సి) షెఫాలి (బి) అరుంధతి 8; కాంచన (సి) రాధ (బి) అరుంధతి 19; సుగంధిక (సి) రిచా (బి) శోభన 1; ప్రియదర్శని (సి) రాధ (బి) శోభన 1; ప్రబోధని (సి) స్మృతి (బి) దీప్తి 9; రణవీర నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం:** (19.5 ఓవర్లలో ఆలౌట్) **90**; **వికెట్ల పతనం:** 1-0, 2-4, 3-6, 4-43, 5-57, 6-58, 7-61, 8-65, 9-86; **బౌలింగ్:** రేణుక 4-0-16-2; శ్రేయాంక 4-0-15-1; దీప్తి శర్మ 3.5-0-16-1; అరుంధతి 4-0-19-3; ఆశ శోభన 4-0-19-3

పాయింట్ల పట్టిక గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ఆస్ట్రేలియా	2	2	0	0	4	2.524
భారత్	3	2	1	0	4	0.576
పాకిస్థాన్	2	1	1	0	2	0.555
న్యూజిలాండ్	2	1	1	0	2	-0.050
శ్రీలంక	3	0	3	0	0	-2.564

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

చాంపియన్స్

బంగ్లా నుంచి కనీస పోటీనే లేదు. మరో మ్యాచ్ ఏకపక్షం. తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ రెండో టీ20లోనూ బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన టీమ్ఇండియా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకుంది. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్‌రెడ్డి విధ్వంసక బ్యాటింగే మ్యాచ్‌లో హైలైట్. బంగ్లా బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి సిక్స్‌ల మోత మోగించిన ఈ ఆల్‌రౌండర్.. బంతితోనూ రాణించి భారత్ ఘనవిజయంలో కీలక పాత్ర పోషించాడు.

తెలుగోడు దంచేశాడు

నితీశ్ వీరవిహారం

భారత్‌దే రెండో టీ20

- బంగ్లాతో సిరీస్ కైవసం



దిల్లీ: టీమ్‌ఇండియాది అదే జోరు. సూపర్‌ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ బృందం బుధవారం రెండో టీ20లో 86 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. నితీశ్‌కుమార్ రెడ్డి (74; 34 బంతుల్లో 4×4, 7×6), రింకు సింగ్ (53; 29 బంతుల్లో 5×4, 3×6) చెలరేగడంతో మొదట భారత్ 9 వికెట్లకు 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. హార్దిక్ (32; 19 బంతుల్లో 2×4, 2×6) రాణించాడు. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి బంగ్లా 9 వికెట్లకు 135 పరుగులే చేయగలిగింది. వరుణ్ చక్రవర్తి (2/19), నితీశ్ (2/23) అభిషేక్ (1/10), మయాంక్ యాదవ్ (1/30), అర్ష్‌దీప్ (1/26) ఆ జట్టును దెబ్బతీశారు. ఆఖరి టీ20 శనివారం హైదరాబాద్‌లో జరుగుతుంది.

చేతులెత్తేసిన బంగ్లా: ఛేదనలో బంగ్లా చేతులెత్తేసింది. ఏ దశలోనూ పోటీలో లేదు. మూడో ఓవర్లోనే ఎమాన్ (16)ను ఔట్ చేయడం ద్వారా అర్ష్‌దీప్ ఆ జట్టు పతనాన్ని ఆరంభించాడు. 4.2 ఓవర్లలో 40/1తో కాస్త ఫర్వాలేదనిపించింది. ఆ తర్వాత 6 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి ఓటమి బాటలో సాగింది. మహ్మదుల్లా (41) తప్ప ఒక్కరూ నిలవలేదు. బంతితోనూ రాణించిన నితీశ్ రెండు వికెట్లతో బంగ్లాను కుప్పకూల్చడంలో తనవంతు పాత్ర పోషించాడు.

బాదుడే బాదుడు..: 45/3. అంతకుముందు పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా స్కోరిది. ధాటిగా ఆడే ప్రయత్నంలో శాంసన్ (10), అభిషేక్ (15), సూర్య (8) ఔటయ్యారు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్‌లో సంతోషం.కానీ కొత్త కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి రూపంలో సునామీ తమను ముంచేయబోతుందని ఊహించలేకపోయింది. నితీశ్‌కు తోడు రింకు కూడా రెచ్చిపోవడంతో పరుగుల వరద పారింది. నితీశ్ బౌలర్లను ఏమాత్రం లెక్క చేయలేదు. చూడముచ్చటైన షాట్లతో ఎడాపెడా సిక్స్‌లు, ఫోర్లు బాదేస్తూ కేవలం 27 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. నితీశ్, రింకు నాలుగో వికెట్‌కు 49 బంతుల్లో 108 పరుగులు జోడించి జట్టును తిరుగులేని స్థితిలో నిలిపారు. 14వ ఓవర్లో జట్టు స్కోరు 149 వద్ద నితీశ్ ఔటైనా.. రింకు, హార్దిక్ ఇన్నింగ్స్ జోరు కొనసాగించారు. రింకు చివరికి 17వ ఓవర్లో వెనుదిరిగాడు. ఆఖరి మూడు ఓవర్లలో హార్దిక్, పరాగ్ (15; 6 బంతుల్లో 2×6) వికెట్లు సహా నాలుగు వికెట్లు కోల్పోయిన భారత్. . మరో 36 పరుగులు రాబట్టింది.

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) శాంటో (బి) తస్కిన్ 10; అభిషేక్ (బి) తంజిమ్ 15; సూర్య (సి) శాంటో (బి) ముస్తాఫిజుర్ 8; నితీశ్ (సి) మిరాజ్ (బి) ముస్తాఫిజుర్ 74; రింకు (సి) జేకర్ (బి) తస్కిన్ 53; హార్దిక్ (సి) మిరాజ్ (బి) రిషాద్ 32; రియాన్ (సి) మహ్మదుల్లా (బి) తంజిమ్ 15; సుందర్ నాటౌట్ 0; వరుణ్ (సి) ఎమాన్ (బి) రిషాద్ 0; అర్ష్‌దీప్ (సి) లిటన్ (బి) రిషాద్ 6; మయాంక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **221; వికెట్ల పతనం:** 1-17, 2-25, 3-41, 4-149, 5-185, 6-213, 7-214, 8-214, 9-220; **బౌలింగ్:** మెహిదీ 3-0-46-0; తస్కిన్ 4-0-16-2; తంజిమ్ 4-0-50-2; ముస్తాఫిజుర్ 4-0-36-2; రిషాద్ 4-0-55-3; మహ్మదుల్లా 1-0-15-0

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: ఎమాన్ (బి) అర్ష్‌దీప్ 16; లిటన్ (బి) వరుణ్ 14; శాంటో (సి) హార్దిక్ (బి) సుందర్ 11; హృదోయ్ (బి) అభిషేక్ 2; మిరాజ్ (సి) బిష్ణోయ్ (బి) పరాగ్ 16; మహ్మదుల్లా (సి) పరాగ్ (బి) నితీశ్ 41; జేకర్ (సి) సుందర్ (బి) మయాంక్ 1; రిషాద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 9; తంజిమ్ (సి) హార్దిక్ (బి) నితీశ్ 8; తస్కిన్ నాటౌట్ 5; ముస్తాఫిజుర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **135; వికెట్ల పతనం:** 1-20, 2-40, 3-42, 4-46, 5-80, 6-83, 7-93, 8-120, 9-127; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-26-1; నితీశ్ 4-0-23-2; సుందర్ 1-0-4-1; వరుణ్ 4-0-19-2; అభిషేక్ 2-0-10-1; మయాంక్ 4-0-30-1; రియాన్ 2-0-16-1

అమ్మాయిల కంచు చరిత్ర



ఆసియా టీటీలో తొలి పతకం

ఆస్తానా: భారత టేబుల్ టెన్నిస్ అమ్మాయిల జట్టు రికార్డు సృష్టించింది. ఆసియా టీటీ ఛాంపియన్‌షిప్స్ మహిళల టీమ్ విభాగంలో దేశానికి తొలి పతకాన్ని అందించింది. కాంస్యంతో చరిత్ర లిఖించింది. బుధవారం సెమీస్‌లో భారత్ 1-3 తేడాతో నాలుగోసీడ్ జపాన్ చేతిలో ఓడింది. క్వార్టర్స్‌లో రెండోసీడ్ దక్షిణ కొరియాపై అద్భుత విజయం సాధించిన మన మహిళల జట్టు.. సెమీస్‌లో ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోయింది. తొలి మ్యాచ్‌లో ఐహిక 8-11, 11-9, 8-11, 13-11, 7-11తో మివా చేతిలో ఓడిపోయింది. అనంతరం మనిక 11-6, 11-5, 11-8తో సత్సుకిపై గెలిచి జట్టును రేసులో నిలిపింది. కానీ ఆ తర్వాత సుతీర్థ, మరో మ్యాచ్‌లో మనిక పరాజయం పాలవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. మరోవైపు పురుషుల జట్టు ఈ టోర్నీలో వరుసగా మూడో పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్స్‌లో భారత్ 3-1తో కజకిస్థాన్‌పై గెలిచి సెమీస్ చేరింది. మానవ్ 11-9, 11-7, 11-6తో కిరిల్‌పై, శరత్ 11-4, 11-7, 12-10తో ఐడాస్‌పై, హర్మీత్ 6-11, 11-9, 7-11, 11-8, 11-8తో కిరిల్‌పై గెలిచారు. హర్మీత్ ఓడాడు.

రికార్డుల రూట్



ఇంగ్లాండ్ 492/3

ముల్తాన్: ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ రికార్డుల వేట కొనసాగిస్తూనే ఉన్నాడు. తాజాగా పాకిస్థాన్‌తో మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకం దిశగా సాగుతున్న అతను (176 బ్యాటింగ్; 277 బంతుల్లో 12×4) చరిత్ర సృష్టించాడు. 71 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద టెస్టుల్లో ఇంగ్లాండ్ తరపున అత్యధిక పరుగులు (12578) చేసిన ఆటగాడిగా రికార్డు అందుకున్నాడు. అలిస్టర్ కుక్ (12472)ను దాటేశాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అయిదో స్థానానికి చేరుకున్నాడు. సచిన్ (15921), పాంటింగ్ (13378), కలిస్ (13289), ద్రవిడ్ (13288) ముందున్నారు. రూట్‌కు ఇది 35వ టెస్టు సెంచరీ. ఇక రూట్‌తో పాటు హ్యారీ బ్రూక్ (141 బ్యాటింగ్) కూడా శతకంతో సత్తాచాటడంతో ఇంగ్లాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. 96/1తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లాండ్ 492/3తో ముగించింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసింది.

● యువ భారత్‌దే సిరీస్

చెన్నై: యువ భారత్ అదరగొట్టింది. ఆస్ట్రేలియా అండర్-19తో రెండు మ్యాచ్‌ల అనధికార టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అన్మోల్‌జీత్ మ్యాచ్‌లో 9 వికెట్లతో సత్తాచాటడంతో భారత్ ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 142/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 277 పరుగులకే ఆలౌటైంది. ఫాలోఆన్ ఆడిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 492 పరుగులు చేసింది.

లద్దాఖ్‌లో అతిపెద్ద గామా-రే టెలిస్కోప్

ముంబయి: ఆసియాలోనే అతిపెద్దదైన గామా-రే ఇమేజింగ్ టెలిస్కోపు లద్దాఖ్‌లో ఏర్పాటైంది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ప్రాంతంలో అమర్చిన టెలిస్కోపు ఇదే కావడం విశేషం. 4,300 మీటర్ల ఎత్తులో ఉన్న హాన్లే ప్రాంతంలో మేజర్ అట్మాస్ఫియరిక్ చెరెన్‌కోవ్ ఎక్స్‌పరిమెంట్ (ఎంఏసీఈ) అబ్జర్వేటరీ టెలిస్కోపును అక్టోబరు 4న లద్దాఖ్‌లో ప్రారంభించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా దీన్ని అమర్చారు. ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్, ఈసీఐఎల్, ఇతర పారిశ్రామిక సంస్థల సాయంతో దేశీయంగా ఈ టెలిస్కోపును రూపొందించారు.



★ గామా కిరణాలపై పరిశోధనలు చేసే ఖగోళ శాస్త్రవేత్తలకు హాన్లే ప్రాంతం స్వర్గం లాంటిదని అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అజిత్ కుమార్ మొహంతి తెలిపారు. భారతదేశానికి ఇది చిరస్మరణీయ విజయమని, కాస్మిక్ రే పరిశోధనల్లో ఈ టెలిస్కోపు దేశాన్ని ప్రపంచపటంలో అగ్రస్థానంలో ఉంచుతుందన్నారు. అంతేకాకుండా విశ్వంలోని శక్తిమంతమైన పరిణామాలపై లోతైన అవగాహనకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు శాస్త్రీయ పరిశోధనల ప్రగతిలో కీలకపాత్ర పోషించడమే కాకుండా లద్దాఖ్ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కూడా అందిస్తుందని మొహంతి వెల్లడించారు.

ప్రొటీన్లపై పరిశోధనలకు నోబెల్

స్టాక్‌హోం: జీవానికి నిర్మాణ అణువులైన ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలు డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లను రసాయన శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం వరించింది. ప్రొటీన్ల నిర్మాణాన్ని అంచనా వేయడంతోపాటు వాటికి సంబంధించి అనేక కొత్త డిజైన్లను వారు రూపొందించడం విశేషం. ప్రస్తుతం బేకర్ అమెరికాలోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం (సియాటిల్)లో.. హసాబిస్, జంపర్ ఇంగ్లండ్ రాజధాని లండన్‌లోని ఏఐ ప్రయోగశాల గూగుల్ డీప్‌మైండ్‌లో పనిచేస్తున్నారు. అమైనో ఆమ్లాల వరుస క్రమం, ప్రొటీన్ నిర్మాణం మధ్య సంబంధాలను గుర్తించిన పరిశోధనలకు తాజా పురస్కారంతో సముచిత గౌరవం దక్కినట్లయిందని నోబెల్ కమిటీ (రసాయనిక శాస్త్రం) అధ్యక్షుడు హీనర్ లింకె బుధవారం పేర్కొన్నారు. రసాయన శాస్త్రంలో.. మరీ ముఖ్యంగా జీవరసాయన శాస్త్రంలో దశాబ్దాల పాటు మహా సవాల్‌గా కొనసాగిన ప్రొటీన్ నిర్మాణ గుట్టు బేకర్, హసాబిస్, జంపర్‌ల పరిశోధనలతో వీడినట్లయిందని గుర్తుచేశారు.



డేవిడ్ బేకర్ హసాబిస్ జాన్ జంపర్

వీరేం చేశారంటే..

బేకర్ 2003లో ఒక కొత్త ప్రొటీన్‌కు రూపకల్పన చేశారు. అప్పటి నుంచి ఆయన నేతృత్వంలోని బృందం ఒకదాని తర్వాత ఒకటి చొప్పున అనేక ఊహాత్మక ప్రొటీన్లను డిజైన్ చేసింది. ఔషధాలు, టీకాలు, నానో పదార్థాలు, బుల్లి సెన్సర్లుగా ఉపయోగపడే ఎన్నో ప్రొటీన్లు వాటిలో ఉన్నాయి. బేకర్ అభివృద్ధి చేసిన కంప్యుటేషనల్ టూల్‌లతో ప్రస్తుతం శాస్త్రవేత్తలు పూర్తిగా కొత్త ఆకృతులతో, వేర్వేరు పనులు చేయగల ప్రొటీన్లను డిజైన్ చేయగలుగుతున్నారు. దాంతో మానవాళికి అపార లబ్ధి చేకూరుతోంది. మరోవైపు- ఇప్పటివరకూ పరిశోధకులు 20 కోట్ల ప్రొటీన్లను గుర్తించగా.. వాటన్నింటి నిర్మాణాన్ని అంచనా వేయగల సరికొత్త కృత్రిమ మేధ (ఏఐ) మోడల్‌ను హసాబిస్, జంపర్ సృష్టించారు. ప్రొటీన్ల త్రిమితీయ (త్రీడీ) నిర్మాణాన్ని అంచనా వేయాలన్న శాస్త్రవేత్తల సుదీర్ఘ కలను 2020లో తమ ఏఐ మోడల్ ద్వారా ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు సాకారం చేశారు.

హరియాణా కౌంటింగ్‌పై ఆరోపణల పర్వం

- ఈవీఎంలలో లోపాలపై విచారణ జరిపించాలి
- ఈసీకి కాంగ్రెస్ మెమోరాండం
- ఓడిపోయినప్పుడల్లా ఆ పార్టీకి ఇది అలవాటే: భాజపా

దిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఈవీఎంలలో తలెత్తిన లోపాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండు చేసింది. లోపాలు తలెత్తిన ఈవీఎంలను సీల్ చేయాలని, విచారణ జరిగేవరకూ భద్రపరచాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ ఫిర్యాదును భాజపా కొట్టి పడేసింది. ఓడిపోయినప్పుడల్లా ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటని వ్యాఖ్యానించింది. కొన్ని నియోజకవర్గాల్లోని ఈవీఎంలలో లోపాలు తలెత్తాయని, 20 చోట్ల ఫిర్యాదులు వచ్చాయని పేర్కొంటూ బుధవారం కాంగ్రెస్ నేతలు భూపీందర్ సింగ్ హుడ్డా, అశోక్ గహ్లోత్, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, అజయ్ మాకెన్, పవన్ ఖేడాలు ఈసీకి మెమోరాండం అందజేశారు. కౌంటింగ్ సమయంలో 60% నుంచి 70% బ్యాటరీ ఛార్జింగ్‌తోనే ఈవీఎంలు ఉంటాయని, కానీ కొన్నిచోట్ల 99% ఛార్జింగ్ ఉందని అందులో కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

'హరియాణా ఓట్ల లెక్కింపుపై అనుమానాలున్నాయి. కాంగ్రెస్ గెలుస్తుందని అందరూ విశ్వసించారు. పోస్టల్ బ్యాలెట్లలోనూ అందుకు అనుగుణంగానే ఫలితాలున్నాయి. కానీ ఈవీఎంలలో ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి' అని హుడ్డా ఈసీని కలిసిన అనంతరం పేర్కొన్నారు. ఈవీఎంలపై ప్రతిసారీ ఫిర్యాదులు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని భాజపా విమర్శించింది. ఓడిపోయినప్పుడల్లా రాహుల్ నాయకత్వంలో ఈవీఎంలపై ఆ పార్టీ ఆరోపణలు చేస్తుందని భాజపా మీడియా విభాగం హెడ్, ఎంపీ అనిల్ బలూనీ పేర్కొన్నారు. హరియాణా ఫలితాలు ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నేతలు ఆరోపించడాన్ని ఈసీ తప్పుబట్టింది. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య ఘన సంస్కృతిలో వినకూడనివని పేర్కొంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు బుధవారం లేఖ రాసింది. జైరాం రమేశ్, పవన్ ఖేడా వ్యాఖ్యలు ప్రజల తీర్పును అప్రజాస్వామికంగా తిరస్కరించడం కిందకు వస్తాయని అభిప్రాయపడింది.

హరియాణా ఫలితాలను విశ్లేషిస్తున్నాం: రాహుల్

దిల్లీ: హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామన్నారు. ఎన్నికల్లో తమకు మద్దతిచ్చిన జమ్మూకశ్మీర్, హరియాణా ప్రజలకు ఎక్స్ వేదికగా రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. 'జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

బెంగాల్‌లో మరో 35మంది వైద్యుల రాజీనామా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థి హత్యాచార ఘటనను నిరసిస్తూ జూడా(జూనియర్ డాక్టర్)లు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా మరో 35మంది సీనియర్ వైద్యులు రాజీనామా చేశారు. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో 54మంది సీనియర్ వైద్యులు రాజీనామా చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. సిలీగుడీలోని ఉత్తర బెంగాల్ మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో 35మంది వైద్యులు రాజీనామా లేఖలను వైద్య విద్య డైరెక్టర్‌కు పంపినట్లు కోల్‌కతా మెడికల్ కళాశాల రెసిడెంట్ వైద్యుల సంఘం బుధవారం వెల్లడించింది. వైద్య ప్రతినిధులను మరోసారి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. బుధవారం సాయంత్రం 7.45గంటల వరకూ స్వాస్థ్య భవన్‌కు చేరుకోవాలని సీఎస్ మనోజ్‌పంత్ డాక్టర్లకు మెయిల్ పంపారు.

ఆనందంగా ఉండటానికి లోపాలు అడ్డుకాదు




మనలో ఎవరూ పరిపూర్ణులు కారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉన్నట్లే, అందరిలోనూ కొన్ని లోపాలుంటాయి. అయినప్పటికీ మనం ఆనందంగా జీవించడానికి అనర్హులం కాదు. జీవితం మనకిచ్చిన వరం అదే. మనం చేసే పనిలో పరిపూర్ణత కోసం ప్రయత్నించడం ఎదుగుదల ప్రక్రియలో భాగం. కానీ మన లోపాలు, బలహీనతల కారణంగా కొన్నింటిలో విఫలమైనప్పుడు అవమానంగా భావించడం మానసిక ఆరోగ్యానికి హానికరం.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

కులాల పేరుతో.. హిందువుల విభజనకు కుట్ర

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ధ్వజం




నాగ్‌పుర్/దిల్లీ: బాధ్యతారాహిత్యమైన కాంగ్రెస్ పార్టీ ఓటుబ్యాంకు రాజకీయాలతో సమాజంలో విషం చిమ్ముతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. కులాల పేరుతో హిందువులను విభజించి, వర్గాల నడుమ పరస్పర కలహాలకు విద్వేషం రాజేస్తున్న కర్మాగారం లాంటిది కాంగ్రెస్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముస్లింలలోనూ చాలా కులాలు ఉన్నాయని, వాటి గురించి మాత్రం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా నోరెత్తరన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని బుధవారం దిల్లీ నుంచి వీసీ ద్వారా శంకుస్థాపన చేశారు. ఇందులో నాగ్‌పుర్‌లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అభివృద్ధి చేస్తున్న విమానాశ్రయం సహా పలు పనులు ఉన్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. హరియాణాలో భాజపా సాధించిన చారిత్రక విజయం దేశంలో వీస్తున్న గాలిని సూచిస్తోందని, త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ విజయం సాధించాలన్నారు. మరాఠీకి కేంద్రం శాస్త్రీయ భాష హోదా మంజూరుచేయడంపై రాష్ట్రవాసులు తనను అభినందిస్తున్నట్లు మోదీ తెలిపారు. కాంగ్రెస్ ముస్లింలలో భయాందోళనలు సృష్టించి, వారిని కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తోందని ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రసంగానికి ప్రధాని ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎందుకు ఉపయోగించారని ప్రశ్నించింది.

నేడు లావోస్‌కు ప్రధాని మోదీ

రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ గురువారం లావోస్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆసియాన్-ఇండియా శిఖరాగ్ర సదస్సు, తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటారు.

రాష్ట్ర హోదాయే మా తొలి తీర్మానం

- ఒమర్ అబ్దుల్లా వెల్లడి



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా డిమాండే తమ తొలి క్యాబినెట్ తీర్మానమని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉపాధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. అధికారం చేపట్టగానే ఎన్సీ-కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తీర్మానం చేయనుందని తెలిపారు. దానిని ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్తామని వెల్లడించారు. బుధవారం శ్రీనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు నేతలు జమ్మూకశ్మీర్‌ను దిల్లీతో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. కశ్మీర్‌ను దిల్లీతో పోల్చవద్దని.. దేశ రాజధానికి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ చెప్పలేదని, కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని, హోం మంత్రి చెప్పారని పేర్కొన్నారు. కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడం, అభివృద్ధికి బాటలు వేయడం కోసం రాష్ట్ర హోదా తప్పనిసరని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉన్న రాజకీయ పార్టీలను భాజపా లక్ష్యంగా చేసుకుందని.. వాటిని బలహీనపరచడానికి ప్రయత్నించిందని దుయ్యబట్టారు. కానీ ఆ పార్టీ ఎత్తులు ఫలించలేదన్నారు. కౌంటింగ్ రోజున మార్నింగ్ రన్‌కు వెళ్లి, తన మనసులో మెదిలిన అనుమానాలను పటాపంచలు చేసుకున్నానని ఒమర్ వ్యాఖ్యానించారు. 'క్రితంసారి కౌంటింగ్ రోజున మార్నింగ్ రన్‌కు వెళ్లి ఓటమి చవిచూశా. దాంతో ఈసారి వెళ్లాలా.. వద్దా.. అని గందరగోళంలో పడిపోయా. ఇప్పుడు పరిగెత్తడానికి వెళ్లి ఓడిపోతే.. మళ్లీ పరిగెత్తను. కానీ నాలో నెలకొన్న ఈ మూఢ నమ్మకాన్ని దూరం చేసుకోవాలని ఆలోచించుకుని.. చివరకు పరిగెత్తడానికే నిర్ణయించుకున్నా.. గెలిచా. ఇప్పుడు నాకు కావాల్సినప్పుడల్లా పరిగెత్తుతా' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణను భాజపా నుంచి ఆశించడం తెలివి తక్కువతనమని ఒమర్ అభిప్రాయపడ్డారు. అలా అని దానిపై మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు.

ఎన్సీలోకి నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు

జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు చేరనున్నారు. పొత్తులో భాగంగా టికెట్ దక్కక వీరందరూ సొంతంగా పోటీ చేసి గెలిచారు. ఈ క్రమంలో మళ్లీ సొంత గూటికి రావాలని నిర్ణయించుకున్నారు.

2028 డిసెంబరు వరకు పేదలకు ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యం

- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద 2024 జులై నుంచి 2028 డిసెంబరు వరకు పేదలకు ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదముద్ర వేసింది. ఈ పథకానికి అయ్యే ఖర్చును 100% కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ ఫోర్టిఫైడ్ బియ్యం ద్వారా ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా పేదలకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు అందిస్తారు.

★ గుజరాత్‌లోని లోథల్ వద్ద నేషనల్ మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తిచేస్తారు. మనదేశానికి గల 4,500 సంవత్సరాల సముద్రయాన వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ నేషనల్ మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తారు. 2025కల్లా ఇందులో 1ఏ దశను పూర్తిచేస్తారు. దీంతోపాటు రాజస్థాన్, పంజాబ్‌ల్లోని అంతర్జాతీయ సరిహద్దుల్లో రూ.4,406 కోట్లతో 2,280 కిలోమీటర్ల రహదారులు నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. సరిహద్దు ప్రాంతాల్లో మౌలికవసతులను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొంది.

మోదీదే ఈ విజయం

- హరియాణా సీఎం సైనీ వెల్లడి
- ప్రధానితో భేటీ

దిల్లీ: ప్రధాన మంత్రి మోదీ అనుసరిస్తున్న విధానాలే హరియాణాలో పార్టీ విజయానికి కారణమని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పేదలు, రైతులు, యువత, మహిళలు లబ్ధి పొందారని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, అందుకే ప్రధానిని ప్రజలు మెచ్చుకుంటున్నారని, దాని ఫలితమే ఈ విజయమని స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌లో విజయానంతరం బుధవారం సైనీ దిల్లీ వచ్చారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈవీఎంలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది కదా.. అని ప్రశ్నించగా.. అబద్ధాల తుపానును సృష్టించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు.



దిల్లీలో ప్రధాని మోదీని కలిసి జ్ఞాపికను అందజేస్తున్న హరియాణా సీఎం సైనీ

ఆ ముగ్గురి మద్దతు భాజపాకే..

హరియాణా ఎన్నికల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు భాజపాకే మద్దతు ప్రకటించారు. ఆసియాలోనే సంపన్న మహిళా నేతగా నిలిచిన సావిత్రి జిందాల్‌తోపాటు దేవేందర్ కద్యాన్, రాజేశ్ జూన్‌లు బుధవారం పార్టీ అధినాయకత్వంతో భేటీ అయ్యారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన ఎమ్మెల్యేలు కద్యాన్, రాజేశ్ భాజపాకు మద్దతు తెలిపారు.

దక్షిణ కొరియాతో సరిహద్దును మూసివేస్తాం

ఉత్తర కొరియా ప్రకటన



సియోల్: దక్షిణకొరియాతో తమ సరిహద్దును శాశ్వతంగా మూసివేస్తామని ఉత్తరకొరియా బుధవారం ప్రకటించింది. ఆ దేశంతో పాటు అమెరికాతో తలెత్తుతున్న ఉద్రిక్తతలను నిలువరించేందుకు సరిహద్దు వెంబడి రక్షణపరమైన నిర్మాణాలు చేపడతామని వెల్లడించింది. దీనిని దక్షిణ కొరియాపై ఒత్తిడి పెంచే చర్యగా నిపుణులు భావిస్తున్నారు. అయితే కొన్నేళ్లుగా ఇరు దేశాల మధ్యా ఎటువంటి ప్రయాణాలు, రవాణా లేని నేపథ్యంలో తాజా నిర్ణయం ఏ మేరకు ప్రభావం చూపుతుందనేది ప్రశ్నగా మారింది. ఈ పరిణామాలపై దక్షిణకొరియా సైన్యం స్పందించింది. సరిహద్దుల్లో ప్రస్తుతమున్న పరిస్థితిని ఏకపక్షంగా మార్చడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పింది.

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల రోజున ఉగ్రదాడికి కుట్ర



- అఫ్గాన్ పౌరుడి అరెస్ట్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల రోజు ఉగ్రదాడికి కుట్ర పన్నిన అఫ్గానిస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తిని ఎఫ్‌బీఐ అరెస్టు చేసినట్లు యూఎస్ న్యాయశాఖ మంగళవారం వెల్లడించింది. ఐఎస్ఐఎస్ ఉగ్రసంస్థ నుంచి ప్రేరణ పొంది, అమెరికాలో పెద్దసంఖ్యలో గుమిగూడే వ్యక్తులే లక్ష్యంగా దాడికి నిందితుడు ప్రణాళిక రచించినట్లు పేర్కొంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం- 2021 సెప్టెంబరులో నాసిర్ అహ్మద్ తౌహేదీ(27) ప్రత్యేక వలస వీసాపై అమెరికాలో ప్రవేశించాడు. ప్రస్తుతం ఓక్లహోమా సిటీలో నివసిస్తున్నాడు. అమెరికాలో ఎన్నికల రోజున ఐఎస్ఐఎస్ పేరుతో ఉగ్రదాడి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఆ దాడి సమయంలో తౌహేదీ, అతడి సహచరులు ఆత్మాహుతిదళంగా మారిపోవాలనుకున్నట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. అలాగే ఉగ్రదాడి కోసం ఏకే-47 రైఫిల్స్ ఆర్డర్ చేశాడు. భార్యాబిడ్డలకు ఇంటికి(స్వదేశానికి) వెళ్లడానికి టికెట్లు బుక్ చేశాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీఐ- నిందితుడు తౌహేదీ, అతడి సహచరుడిని అదుపులోకి తీసుకుంది. నిందితుడి సహచరుడు మైనర్ కావడం వల్ల అతడి పేరు వెల్లడించలేదు.

విచారణలో విస్తుపోయే నిజాలు

తౌహేదీ ఐఎస్ఐఎస్‌కు మద్దతుగా పనిచేస్తున్నాడని, ఆ ఉగ్రసంస్థకు అండగా ఉన్న స్వచ్ఛంద సంస్థకు సహకరించాడని ఎఫ్‌బీఐ విచారణలో తేలింది. అలాగే ఉగ్రవాదంపై ఆసక్తి ఉన్న వ్యక్తుల నియామకాలు, వారికి బోధనలు చేస్తున్నట్లు వెల్లడైంది. నిందితుడు ఈ ఏడాది జులైలో వైట్‌హౌస్‌ను సందర్శించినట్లు తేలింది. దీంతో తౌహేదీపై నిఘా పెంచి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి ఈ అభియోగంపై 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

13 నుంచి ఆఫ్రికా పర్యటనకు ద్రౌపదీ ముర్ము

దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 13 నుంచి ఆఫ్రికాలోని అల్జీరియా, మౌరిటానియా, మలావిని సందర్శించనున్నారు. రాష్ట్రపతి పర్యటన భారత్-ఆఫ్రికాల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ప్రతిఫలిస్తుందని విదేశీ వ్యవహారాల (ఎంఈఏ) తెలిపింది. మొదట అల్జీరియాలో అడుగు పెట్టే రాష్ట్రపతి అటుపై మౌరిటానియా, మాలావిల్లో పర్యటిస్తారని ఎంఈఏ కార్యదర్శి దమ్ము రవి వెల్లడించారు. తన పర్యటనలో భాగంగా ముర్ము నాలుగు ఒప్పందాలపై సంతకాలు చేస్తారని, ఆఫ్రికాలోని ప్రవాస భారతీయులను కలుస్తారని వివరించారు. ఈ పర్యటనలో భారత్-ఆఫ్రికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.

రాహుల్ పౌరసత్వం కేసులో పత్రాల సమర్పణకు గడువు

సుబ్రమణ్య స్వామి విజ్ఞప్తికి దిల్లీ హైకోర్టు సమ్మతి

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు పత్రాలను సమర్పించేందుకు భాజపా నాయకుడు సుబ్రమణ్యం స్వామికి దిల్లీ హైకోర్టు మరింత గడువు ఇచ్చింది. సంబంధిత పత్రాలను ఎలక్ట్రానిక్ రూపంలో సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం బుధవారం ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 6వ తేదీకి వాయిదా వేసింది. రాహుల్ గాంధీకి బ్రిటన్ పౌరసత్వం కూడా ఉన్నందున భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలన్న తన వినతిపై కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ సుబ్రమణ్యం స్వామి దిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. అయితే, అలహాబాద్ హైకోర్టులో కూడా ఇటువంటిదే మరో పిటిషన్ దాఖలైందని తమ దృష్టికి వచ్చిందని దిల్లీ హైకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. అయితే, ఈ రెండు కేసులు వేర్వేరని సుబ్రమణ్యం స్వామి తెలుపగా వాటిని తాము పరిశీలిస్తామని దిల్లీ హైకోర్టు ధర్మాసనం పేర్కొంది.

దిల్లీ సీఎం సామాన్లు బయట పడేశారు

- అధికార నివాసం నుంచి బలవంతంగా తరలించారని ఆప్ ఆరోపణ

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భాజపాల మధ్య దిల్లీలో మరోసారి ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంది. భాజపా సూచనల మేరకు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయం ముఖ్యమంత్రి ఆతిశీని ఆమె అధికారిక నివాసం నుంచి బలవంతంగా ఖాళీ చేయించిందని ఆప్ నేతలు ఆరోపించారు. ఇదే విషయాన్ని దిల్లీ సీఎం కార్యాలయం కూడా వెల్లడించింది. ముఖ్యమంత్రి ఆతిశీకి సంబంధించిన వస్తువులను బయటకు తీసుకెళ్లిపోయారని తెలిపింది. ఓ భాజపా నేతకు ఆ నివాసాన్ని కేటాయించాలని ఎల్జీ వీకే సక్సేనా చూస్తున్నారని ఆరోపించింది. అయితే, దీనిపై లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఈ వ్యవహారంపై ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ విమర్శలు గుప్పించారు. ప్రజల మద్దతు కూడగట్టలేకనే కాషాయ పార్టీ ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లో దిల్లీ సీఎం అధికారిక నివాసం ఉంది. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అక్కడ నుంచి ఖాళీ చేసిన అనంతరం నూతన ముఖ్యమంత్రి ఆతిశీ రెండు రోజుల క్రితం ఆ నివాసంలో అడుగుపెట్టారు. తాజాగా అక్కడకు చేరుకున్న పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ బృందాలు.. సీఎంకు సంబంధించిన సామగ్రిని రిక్షాలు, ట్రక్కుల్లో తరలించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి.



దిల్లీ సీఎం నివాసం నుంచి సామాన్ల తరలింపు

బ్రిటన్‌లో 'నాగా పుర్రె' వేలం నిలిపివేత

లండన్: నాగాలకు చెందిన మానవ పుర్రెను వేలం వేయాలన్న నిర్ణయాన్ని బ్రిటిష్ వేలం సంస్థ ఉపసంహరించుకుంది. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అంతకుముందు ఆ పుర్రెను బుధవారం ఆన్‌లైన్‌లో వేలం వేయాలని ఆ సంస్థ భావించింది. దీనిపై భారత ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ వేలాన్ని వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌కు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నీఫియు రియో లేఖ రాశారు. మరణించిన వారి అవశేషాలకు అత్యున్నతమైన గౌరవం ఇవ్వడం నాగా జాతి ప్రజల సంప్రదాయమని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి జోక్యంతో వేలం ప్రక్రియ నుంచి నాగా పుర్రెను ఆ సంస్థ తప్పించింది.

చైనా బైబిళ్లను అమ్ముకుంటున్న ట్రంప్

- ఒక్కోటి 59.99 డాలర్లకు విక్రయిస్తూ ప్రచార నిధుల సేకరణ

వాషింగ్టన్: చెప్పేదొకటి చేసేదొకటి. రాజకీయ నాయకులపై జనంలో ఉన్న భావన ఇది. దీన్ని డోనాల్డ్ ట్రంప్ మరోసారి నిజం చేస్తున్నారు. ఆయన అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చైనా చవక వస్తువులను గుమ్మరిస్తూ అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోవడానికి కారణమవుతోందని విరుచుకుపడేవారు. ఆ దేశంపై సుంకాలను పెంచేశారు. తీరా ఇప్పుడు తన ఎన్నికల ప్రచారానికి పనికొస్తాయని చవక బైబిళ్ల కోసం తిరిగి అదే చైనా మీద ఆధారపడుతున్నారు. ఆ బైబిళ్లను ఎక్కువ ధరకు అమ్ముకుంటూ ప్రచార నిధులు కూడగడుతున్నారు. చైనాలోని ఒక ప్రచురణ సంస్థ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి-మార్చిలో 1,20,000 బైబిళ్లను ముద్రింపజేసి అమెరికాలోకి దిగుమతి చేసుకున్నారు. చైనా నుంచి ఒక్కో బైబిల్ ప్రతిని 3 డాలర్లకు కొని అమెరికాలో 59.99 డాలర్లకు అమ్ముతున్నారు. ట్రంప్ సంతకం చేసిన బైబిల్‌ను 1,000 డాలర్లకు విక్రయిస్తున్నారు. ఇటీవలి హత్యాయత్నం నుంచి భగవంతుని దయతో బయటపడ్డాననే ట్రంప్ వ్యాఖ్య బైబిల్ పై ముద్రించి ఉంది. ట్రంప్ వర్గం చైనా బైబిళ్లకు 3,42,000 డాలర్లు వెచ్చించగా అమెరికాలో విక్రయాల ద్వారా 70 లక్షల డాలర్లు పొందనున్నారని అంచనా. అధ్యక్షునిగా ఉన్నప్పుడు ట్రంప్ చైనా వస్తువులపై భారీ సుంకాలను విధించినా బైబిల్ తదితర మత గ్రంథాలకు సుంకం నుంచి రాయితీ ఇచ్చారు.

గాడ్ బ్లెస్ ది యూఎస్ఏ గీతాన్ని పాడిన లీ గ్రీన్ వుడ్ అనే జానపద గాయకునితో కలసి ట్రంప్ బైబిల్ అమ్మకాలను చేపట్టారు. ట్రంప్ ఎన్నికల సభల్లో గ్రీన్ వుడ్ గీతం వినిపిస్తోంది. తమకు ట్రంప్‌తో సంబంధం లేదని చెప్పుకుంటున్న ఓ వెబ్‌సైట్ ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. ట్రంప్ పేరు, చిత్రం వాడుకోవడానికి ట్రంప్ యాజమాన్యంలోని సీఏసీ వెంచర్స్ అనే సంస్థ నుంచి లైసెన్సు తీసుకున్నామని ఆ వెబ్‌సైట్ వెల్లడించింది.

రైలు పట్టాలపై సిమెంటు దిమ్మెలు.. ఢీ కొట్టిన గూడ్స్ రైలు

రాయ్‌బరేలీ: రైలు ప్రమాదాలే లక్ష్యంగా ఇటీవల వరుసగా వెలుగుచూస్తోన్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో బుధవారం ఇటువంటి ఘటనే మరోసారి చోటుచేసుకుంది. రాయ్‌బరేలీలోని లక్ష్మణ్‌పూర్‌లో రైల్వే ట్రాక్‌పై దుండగులు సిమెంట్ దిమ్మెలను ఉంచారు. ఇది గమనించిన లోకోపైలట్ అత్యవసర బ్రేకులు వేసినప్పటికీ రైలు దిమ్మెలను ఢీకొట్టింది. దీంతో స్లీపర్ సెక్షన్‌ను ట్రాక్‌పై నుంచి తొలగించాల్సి వచ్చింది. దీనిపై ఆర్పీఎఫ్ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రష్యా ఆయుధ డిపోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

కీవ్: రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతంలో ఉన్న ఓ కీలక ఆయుధ డిపోపై ఉక్రెయిన్ మంగళవారం రాత్రి డ్రోన్‌తో దాడి చేసింది. ఈ ఘటనలో ఎంత నష్టం జరిగిందనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. అయితే ఆ డిపోలో రష్యా పలు క్షిపణులతోపాటు భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచినట్లు తెలుస్తోంది. ఉత్తర కొరియా నుంచి దిగుమతి చేసుకున్న కొన్ని ఆయుధాలూ అందులో ఉన్నట్లు సమాచారం. దాడి జరిగిన డిపో.. ఉక్రెయిన్ సరిహద్దు నుంచి 115 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఉక్రెయిన్ సైనికుల శిక్షణను పరిశీలించిన మెక్రాన్

తూర్పు ఫ్రాన్స్‌లోని ఓ మిలిటరీ శిబిరంలో ఉక్రెయిన్ సైనికులకు అందుతున్న శిక్షణను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఆ శిబిరంలో 2,300 మంది ఉక్రెయిన్ సైనికులు ఉన్నారు.

జ్ఞాన నేత్రం: చౌకగా ముందస్తు రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే సాధనం

ఇందౌర్: గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను తక్కువ ఖర్చుతో ముందస్తుగా గుర్తించే సాధనాన్ని ఇందౌర్ ఐఐటీ అభివృద్ధి చేసింది. ప్రారంభ దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించి రోగుల ప్రాణాలను కాపాడాలన్న లక్ష్యంతో ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శ్రీవత్సన్ వాసుదేవన్ దీన్ని రూపొందించినట్లు ఇందౌర్ ఐఐటీ అధికార వర్గాలు వెల్లడించాయి. ఫొటోకాస్టిక్ స్పెక్ట్రల్ రెస్పాన్స్(పీఏఎస్ఆర్) సూత్రం ఆధారంగా ఈ పరికరం పనిచేస్తుందని, సాధారణ రోగ నిర్ధారణ పరీక్ష పద్ధతుల ధరలతో పోల్చితే దీని ద్వారా దాదాపు పదో వంతు తక్కువ ధరకే ముందస్తు రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించొచ్చని వివరించాయి. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న, ఖరీదైన ఎమ్మారై, సీటీ స్కానర్ల వంటి పరికరాలనే భారత్‌లో రోగ నిర్ధారణ పరీక్షలకు వినియోగిస్తున్నారని, చాలా మందికి ఇవి అందుబాటులో ఉండటం లేదని ఇందౌర్ ఐఐటీ డైరెక్టర్ సుహాస్ జోషి తెలిపారు. తక్కువ ఖర్చుతో క్యాన్సర్‌ను నిర్ధారించే దేశీయ, పరికరాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఐఐటీ ఇందౌర్ ఆరోగ్య రంగంలో ఒక క్లిష్టమైన అవసరానికి మార్గం చూపినట్లయిందని, గ్రామీణ, వెనకబడిన ప్రాంతాలకు చెందిన వారిలో క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వారి ఆరోగ్య పరిరక్షణకు ఇది దోహదం చేస్తుందని జోషి వివరించారు.

'గ్రీన్ గ్రేస్' పాపంలో 18 మంది అధికారులు

- వారిపై చర్యలకు జీఎంసీ సిఫార్సు
- విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – గుంటూరు (నగరపాలక సంస్థ): కళ్ల ముందే అడ్డగోలుగా అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నా అడ్డుకోవడంలో విఫలమైన అధికారులు సహా 18 మందిపై చర్యలకు సిఫార్సు చేస్తూ గుంటూరు నగరపాలక సంస్థ (జీఎంసీ) కమిషనర్.. పురపాలక సంచాలకులు, ప్రణాళికా విభాగం డైరెక్టర్‌కు వేర్వేరుగా నివేదికలు పంపారు. గుంటూరులోని పట్టాభిపురం ప్రధాన రహదారి పక్కన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ పేరిట 5 అంతస్తుల నిర్మాణానికి వైకాపా నేత అంబటి మురళీకృష్ణ 2015లో అనుమతులు తీసుకున్నారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక దానిని 14 అంతస్తులకు పెంచి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నించారు. అనుమతికి మించి నిర్మిస్తుండటంతో రైల్వేశాఖ ఎన్‌వోసీని ఉపసంహరించుకుని, ఆ సమాచారాన్ని జీఎంసీకి పంపించింది. అడ్డుకోవాల్సిన జీఎంసీ అధికారులు ఏ దశలోనూ పట్టించుకోలేదు. మురళీకృష్ణ సైతం వైకాపా ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని తనవైపు ఎవరూ రాకుండా చూసుకున్నారు. భారీ భవనం నిర్మిస్తున్నప్పుడు జీఎంసీ కమిషనర్, సిటీ ప్లానర్ నెలకోసారైనా పరిశీలించాలి. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఏ అధికారీ అటువైపు వెళ్లలేదు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధారాలతో ఈ వ్యవహారాన్ని బయట పెట్టడంతో జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు స్పందించి విచారణ చేయించారు. అనేక ఉల్లంఘనలున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. మరో వైపు రైల్వే అధికారులు కూడా ఆ భవనాలను తనిఖీ చేసి నిబంధనలను ఉల్లంఘించినట్టు తేల్చి నిర్మాణాలను అడ్డుకోమని జీఎంసీకి లేఖ రాశారు. దీంతో ఈ వ్యవహారంపై ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. గురువారం నుంచి నిఘా అధికారులు రంగంలోకి దిగనున్నారు.

ఐఏఎస్ సహా 18 మందిపై..

నగరంలో ప్రధాన రహదారి పక్కనే నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగంలో పలువురు అధికారులు అడ్డుకోలేకపోయారంటూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తేల్చారు. వీటికి అనుమతుల జారీ చేసిన సమయంలో పని చేసిన కమిషనర్లు, ప్రణాళిక విభాగం అధికారులతోపాటు నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోలేకపోయిన అధికారులు, సిబ్బంది పైనా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

అక్రమ నిర్మాణానికి బాధ్యులంటూ మున్సిపల్ కమిషనర్ తన నివేదికలో పేర్కొన్న అధికారులు, సిబ్బంది వీరే..

అప్పటి మున్సిపల్ కమిషనర్	- కె.కన్నబాబు, ఐఏఎస్
అప్పటి మున్సిపల్ కమిషనర్	- సీహెచ్ అనురాధ (ప్రస్తుతం పురపాలకశాఖ అదనపు సంచాలకులు)
సిటీ ప్లానర్	- ప్రదీప్‌కుమార్
డీసీపీలు	- విశ్వప్రసాద్, సత్యనారాయణ (విశ్రాంత), మహాపాత్ర,
ఏసీపీలు	- రవీంద్రరెడ్డి, పి.మురళి, బాబూరావు
టీపీబీవో	- సువర్ణకుమార్
ఇన్‌ఛార్జి సీపీ	- కె.హిమబిందు
టీపీఎస్‌లు	- సీహెచ్.భవాని, హృదయరాజు, షేక్ రిజ్వానా
ప్రణాళిక కార్యదర్శులు	- కె.అనిల్‌కుమార్, చదలవాడ జగన్‌మోహన్
సూపరింటెండెంట్	- పోలేశ్వరరావు
గుమస్తా	- జి.నారాయణమూర్తి

ఇదంతా అసత్య ప్రచారం: అంబటి మురళీకృష్ణ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సంస్థ పట్టాభిపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌పై అసత్య ప్రచారం జరుగుతోందంటూ ప్రాజెక్ట్ సీఈవో అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము 2015లోనే 2 సెల్లార్లు, జి+4 బిల్డింగ్‌కు అనుమతి పొందినట్లు తెలిపారు. తర్వాత సవరణగా 2 సెల్లార్లు+ఒక స్టిల్ట్+ జి+14కు 2020లో బిల్డింగ్ పర్మిట్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆపై రివైజ్డ్ ప్లానుకు దరఖాస్తు చేసి 19.06.2024న ప్రొసీడింగ్స్ పొందినట్లు తెలిపారు. రైల్వే నుంచి మళ్లీ 15 ఫ్లోర్లకు ఎన్‌వోసీ తీసుకోమని మున్సిపాలిటీ తెలియజేసిందని వివరించారు.

తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమాల గుట్టురట్టు

- నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు
- విదేశాల పేర్లున్న సంచుల్లో చౌకబియ్యం నిల్వల గుర్తింపు



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలోని రైస్‌మిల్లును పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ఈనాడు, రాజమహేంద్రవరం–న్యూస్‌టుడే, నల్లజర్ల, దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమాల వ్యవహారం గుట్టురట్టయింది. కొవ్వూరు మండలం కాపవరంలో బుధవారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుగు ప్రయాణంలో నల్లజర్లలోని శ్రీవేంకట సత్యసాయి రైస్‌మిల్లును తనిఖీ చేశారు. అక్కడ చౌకబియ్యం ఉన్నట్లు గుర్తించారు. విదేశాల పేర్లతో ఉన్న గోనె సంచుల్లో వాటిని నిల్వ చేశారు. సుమారు 50 మెట్రిక్ టన్నుల మేర ఎగుమతికి సిద్ధం చేసినట్లు ప్రాథమికంగా తేల్చి మిల్‌ను సీజ్ చేయించారు. అనంతరం దేవరపల్లిలోని శ్రీవేంకటేశ్వర రైస్‌మిల్లును పరిశీలించి.. గతంలో సీజ్ చేసిన 60 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆ బియ్యాన్ని ఇప్పటికీ అక్కడి నుంచి ఎందుకు తరలించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వరలక్ష్మి రైస్‌మిల్లులో ఆరు నెలల క్రితం సీజ్ చేసి ఉంచిన 270 కిలోల బియ్యం నిల్వలు మాయమైనట్లు తేల్చారు. అన్ని మిల్లులపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే నగదు జమ

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయనున్నట్లు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో ఏర్పాటు చేసిన తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి మనోహర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 32.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 3,420 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం రూ.11,200 కోట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కాకినాడలో 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ నిల్వలను సీజ్ చేశామని అందులో 25 వేల టన్నులు చౌకబియ్యం ఉన్నట్లు వెల్లడించారు.

భాజపా నేత నగ్న వీడియో కలకలం

సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, గుంటూరు జిల్లాకు చెందిన ఓ నాయకుడి నగ్న వీడియోకాల్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. తమ పార్టీకి చెందిన మహిళతో ఆయన వీడియోకాల్‌లో మాట్లాడుతూ అందులో నగ్నంగా కనిపించారు. ఈ వ్యవహారం పార్టీ నాయకత్వం దృష్టికి వెళ్లింది. భాజపా మీడియా వ్యవహారాలు పర్యవేక్షించే నేత ఒకరు దీనిపై విచారణ చేసి.. పార్టీ పెద్దలకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆ పార్టీ జిల్లా ముఖ్యనాయకుడి వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పార్టీ ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే బుధవారం రాత్రి నుంచి మరో నేత నగ్న వీడియో బయటికి రావడం మరింత కలకలానికి కారణమైంది. ఆ ఇద్దరు నేతల వీడియోలు బయటకు రావడం వెనుక సొంత పార్టీ నేతల ప్రమేయమున్నట్లు సమాచారం.

'16 సంక్షేమ పథకాల్ని రద్దు చేసిన గిరిజన ద్రోహి జగన్'

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వం గిరిజనులకు సంబంధించిన 16 సంక్షేమ పథకాలను రద్దు చేసి ద్రోహం చేసిందని తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్‌ఎస్‌టీఎఫ్‌డీసీ నిధులనూ దారి మళ్లించారని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. 'ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు అందాల్సిన రాయితీ రుణాలు, భూమి కొనుగోలు పథకాల్ని రద్దు చేశారు. ఐటీడీసీ ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా నడుస్తున్న అనేక పాఠశాలలనూ మూసేయించారు' అని తెలిపారు.

గుంటూరు ఈఎస్ఐ ఆసుపత్రి భూసేకరణకు కేంద్ర కార్మికశాఖ ఆమోదం

ఈనాడు, దిల్లీ: గుంటూరులో తలపెట్టిన వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి భూమి సేకరించాలని కేంద్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రతిపాదనకు ఈఎస్ఐ కార్పొరేషన్ ఆమోదించింది. కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరిగిన 194వ ఉద్యోగుల రాజ్య బీమా సంస్థ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. గుంటూరు, దాని చుట్టుపక్కలున్న పరిశ్రమల్లో పనిచేసే ఈఎస్ఐ కార్మికుల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో మొత్తం ఏడుచోట్ల ఈఎస్ఐ ఆసుపత్రులు నిర్మించాలని కేంద్రం 2020లోనే నిర్ణయించింది. అందులో విజయనగరం, కాకినాడ, విశాఖపట్నం ఆసుపత్రుల నిర్మాణ పనులు ప్రారంభంకాగా.. గుంటూరు, పెనుకొండ, శ్రీసిటీ నెల్లూరు, అచ్యుతాపురం ప్రాజెక్టులు భూకేటాయింపుల దశల్లో ఉన్నాయి. ఇప్పుడు అందులో గుంటూరు ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు కేంద్రం ఆమోదించింది. భూసేకరణ పూర్తయ్యాక మూడేళ్లలో ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తికానుంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఈ ఆసుపత్రి నిర్మాణ దశకు చేరుకోవడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

వద్దన్నా... ఆగని వైద్యుల బదిలీలు!

ఈనాడు, అమరావతి: విద్య, వైద్య ఆరోగ్య శాఖల్లో బదిలీలు చేపట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించినా.. వైద్యుల బదిలీలు మాత్రం ఆగడం లేదు. తాము కోరుకున్న చోట్లకు బదిలీల కోసం ప్రజాప్రతినిధుల ద్వారా వైద్యులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం సిఫార్సుల బదిలీలే ఎక్కువగా జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు, నెల్లూరు, కడప నుంచి విశాఖ కేజీహెచ్ బదిలీ అయిన వారు ఎక్కువగా ఉన్నారు. కాకినాడ నుంచి కేజీహెచ్‌కు బదిలీపై వెళ్లిన వైద్యులు కూడా ఉన్నారు. అనారోగ్య కారణాలు, స్పౌజ్, ఖాళీలు ఉన్నాయన్న కారణాలతో ఈ బదిలీలు చేస్తున్నారు. మరోవైపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లలో పలువుర్ని మార్చాలని నిర్ణయించినా.. సంబంధిత ఉత్తర్వులు వెలువడటం లేదు. పదోన్నతుల కోసం సుమారు 100 మంది సీనియర్ ప్రొఫెసర్లు నిరీక్షిస్తున్నారు. ఖాళీగా ఉన్న వైద్యులను కొత్తగా ఏర్పాటైన నాలుగు వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంది. వీరితో పాటు సూపరింటెండెంట్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు మారతారు. వీటిపై నిర్ణయాలు వెలువరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లోనే ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌ఓగా వివాదాస్పద అధికారి రత్నావళిని మళ్లీ అక్కడే నియమించడంపై విమర్శలు చెలరేగడంతో ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేశారు.



గన్నవరం నియోజకవర్గం తరఫున రూ.14 లక్షల విరాళం

ఈనాడు, అమరావతి: విజయవాడ వరద బాధితుల్ని ఆదుకునేందుకు గన్నవరానికి చెందిన వివిధ పాఠశాలలు, సంస్థల నిర్వాహకులు రూ. 14,26,821 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు.

ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీగా రామచంద్ర

ఈనాడు, అమరావతి: ఆర్‌అండ్‌బీలోని జాతీయ రహదారుల విభాగం సీఈ వి.రామచంద్రకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా పదోన్నతినిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఆర్‌అండ్‌బీలో 2 ఈఎన్‌సీ పోస్టులు ఉండగా.. ఓ పోస్టులో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. దీంతో ఖాళీని భర్తీ చేసేందుకు రామచంద్రకు పదోన్నతినిచ్చారు. ఆయనకు ఈఎన్‌సీగానూ జాతీయ రహదారుల విభాగాన్నే కేటాయించారు.

కీలకమైన పరిపాలన (అడ్మిన్) విభాగం చూసే ఈఎన్‌సీ వేణుగోపాల్ రెడ్డి పదవీ విరమణ చేశాక మరో ఈఎన్‌సీ నయీముల్లాకు ఆ బాధ్యతలను అప్పగించారు. అయితే కొన్ని అంశాల్లో ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి, నయీముల్లాకు కొంత అంతరం వచ్చింది. దీంతో నయీముల్లా వద్ద ఉన్న పరిపాలన విభాగాన్ని తప్పించి పదోన్నతి పొందిన రామచంద్రకు అప్పగించాలని మంత్రి భావించినట్లు సమాచారం. అయితే సీనియర్ అయిన నయీముల్లాకు రెండు నెలల కిందటే పరిపాలన విభాగం ఇచ్చారని, దాన్ని తొలగించడం సరికాదని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మంత్రికి సర్దిచెప్పినట్లు తెలిసింది. దీంతో రామచంద్రకు బుధవారం ఈఎన్‌సీగా పదోన్నతి ఇచ్చినప్పటికీ పరిపాలన విభాగాన్ని నయీముల్లా వద్దే కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నారు.





EENADU Vol: 51, Iss: 61 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



వాగ్దేవీ.. వందనం

మూలా నక్షత్రం పురస్కరించుకొని దుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆయన సతీమణి భువనేశ్వరి.. మంత్రి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. బుధవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తన కుమార్తె ఆద్యతో కలిసి దుర్గమ్మ సేవలో పాల్గొన్నారు.



ఈనాడు అమరావతి ఎన్టీఆర్

గురువారం అక్టోబరు 10, 2024 15

అఆఇఈ ఉఊ ఎఏఐ ఒఓఔ అంఅః కఖగఘ చఛజఝ టఠడఢణ తథదధన పఫబభమ యరలవ శషసహ ళక్షఱ

అక్షర రూపిణి.. అమృత వర్షిణి

సరస్వతీ దేవి దర్శనానికి తరలివచ్చిన జనసంద్రం



అక్షరాభ్యాసం



తల్లీ వందనం





తరలివచ్చే భవానీలు

వీణాపాణీ.. చల్లగ చూడమ్మా..

ఇంద్రకీలాద్రి ధగధగ

విద్యాధరీ నమోస్తుతే

అంబరం తాకిన వాద్య సంరంభం

ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రమైంది. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు.. లక్షల మంది భక్తులు తరలివచ్చారు. కొండ దిగువన రెండు కిలోమీటర్ల వరకూ క్యూలైన్లు, వాటి పక్కనున్న రహదారులు, ఘాట్‌రోడ్డు మొత్తం భక్తులతో కిక్కిరిశాయి. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా.. సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో బారికేడ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదులన్నీ అర్ధరాత్రి నుంచే భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి రాత్రి 12.30 గంటల తర్వాత భక్తులను క్యూలైన్లలోకి వదిలారు. ఆపై బుధవారం అర్ధరాత్రి వరకూ క్యూలైన్లు రద్దీగానే నడిచాయి. వినాయక ఆలయం దగ్గర నుంచి పైవరకు రెండు కిలోమీటర్లకు పైగా భక్తులు రోజంతా కిక్కిరిసి క్యూలైన్లలో కనిపించారు. ఒక్క రోజులో రెండు లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతీ దేవి రూపంలోని అమ్మ దర్శనానికి విద్యార్థులు, యువత అధికంగా తరలివచ్చారు. ఏడు రోజుల్లో ఇప్పటివరకూ ఆరున్నర లక్షల మందికి పైగా భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఏటా మాదిరిగానే.. ఈసారి కూడా భక్తులు మూలానక్షత్రం రోజు భారీగా పోటెత్తుతారని ముందే అంచనా వేసి పక్కాగా ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. వేకువన మాత్రం భక్తులంతా ఒకేసారి ఘాట్‌రోడ్డు మీదుగా ఆలయం వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు రద్దీ ఏర్పడింది. తర్వాత వారందరినీ క్యూలైన్లలోకి పంపడంతో ఆ తర్వాత నుంచి క్యూలైన్లు సాఫీగా సాగాయి.



దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ......

జయము.. జయము.. దుర్గమ్మ



చదువులమ్మకు జేజేలు

నేటి అలంకారం శ్రీ దుర్గాదేవి

శరన్నవరాత్రి మహోత్సవాల్లో గురువారం జగన్మాత.. శ్రీ దుర్గాదేవి రూపంలో దర్శనం ఇవ్వనుంది.


దర్శన వేళలు: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు...



భక్తి పారవశ్యం

ఆలయ అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శన..

ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మను దర్శించుకుని.. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు బాగా చేశారని కొనియాడటంతో అధికారుల ఆనందానికి అవధులు లేవు. ఆలయంలో అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ముఖ్యమంత్రి కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. తర్వాత సి. హెచ్. ఆంజనేయశాస్త్రి వేదాశీర్వచన మంత్రాల వివరణను తెలియజేయడంతో.. చంద్రబాబు, లోకేశ్ సహా కుటుంబ సభ్యులంతా ఆసక్తిగా విన్నారు. అమ్మవారికి రాజభోగం కింద నివేదించే.. ఐదు రకాల ప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. వీటిలో పులిహోర, పొంగలి, కట్టెపొంగలి, పాయసం, లడ్డూ ఉన్నాయి. ఈ రాజభోగాన్ని అమ్మవారికి ఎందుకు నివేదిస్తారనే అంశాన్ని ఆలయ అర్చకులు శంకర శాండిల్య వివరించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి, కలెక్టర్ సృజన, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు ఉన్నారు.



కమనీయం.. నగరోత్సవం

గంగాపార్వతీ సమేత మల్లేశ్వర ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

మద్యం దుకాణాల లాటరీ వేదిక మార్పు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లాలో మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించే వేదికను గురునానక్ నగర్‌లోని ఎన్.ఎ.సి. కల్యాణ మండపానికి మార్చారు. ఈ మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇబ్రహీంపట్నంలో జరగాల్సిన లాటరీ వేదికను.. తాజాగా గురునానక్‌కాలనీకి మార్చారు. జిల్లాలో 113 మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పొడిగించారు. గురునానక్‌నగర్‌లో ఈ నెల 14న ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

సరిహద్దున.. లెక్కే వేరప్పా!



- వత్సవాయి మండలంలో షాపులకు భారీగా దరఖాస్తులు
- ఒక్కో మద్యం దుకాణానికి వందకు పైగా రాక..
- తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో భలే గిరాకీ

ఈనాడు, అమరావతి

గత ప్రభుత్వ హయాంలోని పరిస్థితులు ఇప్పుడు మారాయి. ఏపీలో నాణ్యమైన మద్యం దొరక్క.. మందుబాబులు సరిహద్దున ఉన్న తెలంగాణ భూభాగంలోకి వెళ్లి తాగేవారు. అక్కడి నుంచి తీసుకొచ్చిన సరకును ఊరూవాడా వెలసిన గొలుసు దుకాణాల్లో విక్రయించేవారు. ఏపీలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వడం.. అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతోపాటు.. తక్కువ ధరకు నాణ్యమైన సరకు విక్రయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ ప్రభావం ఎన్టీఆర్ జిల్లాలో తెలంగాణ సరిహద్దున ఉన్న మద్యం దుకాణాల దరఖాస్తులపై పడింది. వీటిని చేజిక్కించుకునేందుకు పెద్దఎత్తున దరఖాస్తు చేస్తున్నారు.

చిన్న మండలం.. అధిక దరఖాస్తులు

తెలంగాణకు సరిహద్దున ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో వత్సవాయి మండలంపై పలువురి దృష్టి పడింది. ఈ మండలంలో రెండు షాపులను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసింది. వీటికి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి. ఐదేళ్లలో మందుబాబులకు నచ్చిన బ్రాండ్లు దొరకలేదు. కేవలం జె బ్రాండ్లు మాత్రమే విక్రయించేవారు. దీంతో తెలంగాణ భూభాగంలోకి వెళ్లి తాగేవారు. ఊరూపేరూ లేని బ్రాండ్లను తెలంగాణ కంటే అధిక ధరలకు విక్రయించే వారు. ఈదఫా తెలంగాణ వారే ఎక్కువ మంది ఏపీకి వచ్చి తీసుకెళ్తారని దరఖాస్తుదారులు అంచనాకు వచ్చారు. ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న కొత్త ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఐదేళ్ల కిందట మాదిరి అన్ని బ్రాండ్ల మద్యంతో పాటు తక్కువ ధరకు దొరకబోతోందన్న అంచనాల కారణంగా ఎక్కువ పడ్డాయి. క్వార్టర్ సీసా రూ.99 కే తీసుకువస్తామని ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబుతోపాటు.. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. దీంతో ఎక్కువ మంది షాపులను దక్కించుకునేందుకు ఎగబడుతున్నారు.

రికార్డు స్థాయిలో సెంచరీ దాటాయి..

వత్సవాయి మండలానికి అటువైపున.. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలం ఆనుకుని ఉంటుంది. పెనుగంచిప్రోలులోని లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే భక్తులు వత్సవాయి మండలం నుంచి వస్తుంటారు. ఈ నేపథ్యంలో గిరాకీ బాగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. తెలంగాణకు చెందిన పలువురు సొంతంగా, మరికొందరు ఏపీలోని వారితో కలసి సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికే వత్సవాయి మండలంలో నోటిఫై చేసిన రెండు దకాణాలకు రికార్డు స్థాయిలో ఒక దానికి 108, మరో షాపునకు 100 దరఖాస్తులు రావడం చర్చనీయాంశమైంది. పెనుగంచిప్రోలు మండలంలోని నాలుగు దుకాణాలకు 91, 67, 67, 64, 64 చొప్పున భారీగా వచ్చాయి.

ఇసుమంత అనుమతి ఇసుకంతా ఎగుమతి

వైకాపా నాయకుల దందా | **కరిగిపోయిన నిల్వలు**



ఈనాడు, అమరావతి

భారీ వర్షాలు.. పొంగిన వాగులు వంకలు.. భారీ వరదల నేపథ్యంలో తవ్వకాల్లో జాప్యంతో ఉమ్మడి జిల్లాలో ఇసుక లభ్యత కష్టంగా మారింది. నిల్వ కేంద్రాల్లో ఇసుక కరిగిపోయింది. ఎన్టీఆర్ జిల్లాలో నామమాత్రంగా మాత్రమే నిలువ ఉంది. మరో పక్షం రోజుల వరకు ఇసుక లభించడం కొంత కష్టంగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమంగా ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం పేదలందరికీ ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు 'ఉచిత ఇసుక' విధానం అమల్లోకి తెస్తే కొంత మంది చర్యల వల్ల అభాసుపాలవుతోంది. స్థానికంగా లభించని ఇసుక నిత్యం హైదరాబాద్‌కు మాత్రం తరలివెళ్తోంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో తవ్వకాలపై నిఘా కొరవడింది. గనుల శాఖ అధికారులు ఇసుక రేవుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు.

నిల్వ కేంద్రాల్లో ఏదీ..?

ఎన్టీఆర్ జిల్లాలోని కీసర, మాగల్లు, ఆమంచిపల్లి కేంద్రాల్లో మాత్రమే ఇసుక ఉంది. కొరత ఏర్పడిన ప్రారంభంలోనే కీసర నిల్వ కేంద్రం నుంచి దాదాపు లక్ష టన్నుల ఇసుక మాయం చేశారు. ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వం నామమాత్రంగా హ్యాండ్లింగ్ ఛార్జీలు వసూలు చేసిన విషయం తెలిసిందే. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వైకాపా నేతలు తమ లారీలను పెట్టి అధికంగా ఇసుక లోడ్ చేసి తక్కువ పరిమాణానికి మాత్రమే వసూలు చేసేలా నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జులతో కుమ్మక్కయ్యారు. ఒక్క కీసర నుంచే 45 టన్నుల ఇసుక లోడ్ చేసి 20 టన్నులకు మాత్రమే వసూలు చేసినట్లు రికార్డులు చూపారు. దీంతో నిల్వ కేంద్రంలో భారీ వ్యత్యాసం వచ్చింది. దీనిపై గనుల శాఖ అధికారులు విచారణ జరిపారు. ఇన్‌ఛార్జిని తొలగించారు. కానీ ఇసుక నిల్వలు మాత్రం కరిగిపోయాయి. దీనికి కారణం అక్కడ తూకం వేసే వేయింగ్ బ్రిడ్జి లేకపోవడమే. ప్రస్తుతం కీసర, మాగల్లు, ఆమంచిపల్లిలో 50వేల టన్నుల లోపు మాత్రమే ఇసుక నిల్వ ఉంది. దీన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ నమోదైన వారికి రెండు మూడు రోజులకు కూడా సరఫరా కావడం లేదని చెబుతున్నారు. ఇసుక నిల్వలకు మించి నమోదు కావడంతో ప్రస్తుతం నిలిపివేశారు.

యథేచ్ఛగా రవాణా...

ఒకవైపు ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత ఉండగా.. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇసుక హైదరాబాద్‌కు యథేచ్ఛగా రవాణా అవుతోంది. వైకాపా ప్రభుత్వంలో పెద్దల నుంచి ఇసుక కాంట్రాక్టు పొందిన నందిగామ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం ఎస్ఈబీ రద్దుతో రవాణాకు ఆటంకం లేకుండా పోయింది. గతంలో ఓ వైకాపా నేత అనుచరుడిగా పెద్దల ఆశీస్సులతో కాంట్రాక్టు దక్కించుకున్నారు. పేరు జేపీ వెంచర్స్ మీద ఉన్నా ఆ నాయకులే తవ్వకాలు జరిపించారు. ఎన్నికల ముందు వైకాపా నేత తెదేపాలో చేరిపోయారు. ప్రస్తుతం కంచికచర్ల నాయకుడు మాత్రం గత సంబంధాలతో ఇసుక తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. తనకు సొంతంగా ఉన్న వాహనాలతో హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. విజయవాడలో ఇళ్లు నిర్మాణం చేసుకుంటున్నవారికి మాత్రం ఇసుక లభ్యం కావడం లేదు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరవైందని వాపోతున్నారు.

రేవుల గుర్తింపు..!

ఎన్టీఆర్ జిల్లాలో రేవుల గుర్తింపు ప్రక్రియ దాదాపు పూర్తయింది. 15 రేవుల నుంచి ఈ నెల 16 తర్వాత తవ్వకాలు ప్రారంభిస్తామని గనుల శాఖ అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి వెంటనే ఉచితంగా ఇసుక అందిస్తారు. హ్యాండ్లింగ్, రవాణా ఛార్జీలు వసూలు చేయనున్నారు. కృష్ణా జిల్లాలో రేవుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. గతంలోనూ కృష్ణా జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిపారు. పర్యావరణ అనుమతులు సీఎఫ్ఈ, సీఎఫ్ఓలు లేకుండానే ఇష్టానుసారం తవ్వకాలు జరిపారు. దీనికి నాడు స్వయంగా జిల్లా కలెక్టర్ పి.రాజబాబు మద్దతు పలకడం గమనార్హం. ప్రస్తుతం రేవులు గుర్తించి పర్యావరణ అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదిలో చోడవరం, తోట్లవల్లూరు, రొయ్యూరు ప్రాంతాల్లో, పమిడిముక్కల మండలంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ల నుంచి లారీలకు బదిలీ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు అడ్డుకుంటే ఉచిత ఇసుక అంటూ సమాధానం ఇస్తున్నారు. జిల్లాలో మాత్రం ఇసుక లభ్యం కావడం లేదు. విజయవాడలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతోందని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం జీవం పోసుకుంటున్న తరుణంలో ఇసుక కొరతను నివారించాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన

చిన్న పరిశ్రమలకు పారదర్శకంగా అనుమతులు

ఈనాడు, అమరావతి: చిన్న పరిశ్రమలకు అనుమతులను పారదర్శకంగా అందిస్తామని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు పేర్కొన్నారు. క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం అందించే 90 శాతం గ్రాంటును వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని క్లస్టర్ డైరెక్టర్లతో విజయవాడలోని ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా చిన్న పరిశ్రమలను బలోపేతం చేస్తాం. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించడంలో ఎంఎస్ఎంఈల పాత్ర కీలకం. క్లస్టర్ గ్రూప్ సభ్యులు తమ ఉత్పత్తులను త్వరగా ప్రారంభించాలి. చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తామని" పేర్కొన్నారు. కార్పొరేషన్ సీఈవోగా నందిని సలారియా బాధ్యతలు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

నెక్‌కాప్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

[illegible] విజయవాడ జోన్ [illegible] 100 గుడ్ల ధర రూ. 525 [illegible]

వైద్య కళాశాల మారబోమని పత్రం సమర్పించాల్సిందే

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో రెండో విడత కౌన్సెలింగ్ వరకు కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు పొందిన విద్యార్థులు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లో 'రిటెన్' దరఖాస్తు ఇవ్వాలని వర్సిటీ అధికారులు తెలిపారు. బుధవారం(9వ తేదీ) రాత్రి 9 గంటల నుంచి 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల విద్యార్థులు తమ అదే కళాశాలలో సీటు ఉంచుకుంటామని, మారబోమని పత్రాన్ని పంపాలని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ లాగిన్ ఐడీలో ఆయా వివరాలు పొందుపర్చాలని తెలిపారు.

'ఫ్రీ ఎగ్జిట్' అవకాశం..

రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ మొదటి, రెండో విడత కౌన్సెలింగ్లో యాజమాన్య కోటా కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా 'ఫ్రీ ఎగ్జిట్' ఆప్షన్ ఇచ్చుకొనే అవకాశం కల్పించారు. అఖిల భారత కోటా, ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులు తమ సీటు వదులుకునే అవకాశాన్ని విశ్వవిద్యాలయం కల్పించింది. ఒక వేళ వదులుకుంటే విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల్లో రిపోర్టు చేయాలని, ఆయా వైద్య కళాశాలలు అదే రోజు మధ్యాహ్నం 4 గంటల్లోగా విశ్వవిద్యాలయానికి నివేదిక పంపాలని అధికారులు తెలిపారు.

జ్యోత్స్నకు ఘన నివాళులు



జ్యోత్స్న పార్థివదేహం వద్ద అంజలి ఘటిస్తున్న జస్టిస్ ఎ.వి.శేషసాయి తదితరులు



సీపీఎం నేతలు వి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, బాబూరావు తదితరులు..

విజయవాడ నేరవార్తలు, సీతారాంపురం, న్యూస్‌టుడే : ఏపీ బార్ కౌన్సెల్ సభ్యుడు, ఆలిండియా లాయర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, సామాజిక కార్యకర్త గుళ్లపల్లి జ్యోత్స్న(55)కు న్యాయమూర్తులు, బార్ కౌన్సెల్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. జ్యోత్స్న పార్థివదేహాన్ని బుధవారం ఉదయం విమానంలో నగరానికి తీసుకువచ్చారు. సీతారాంపురంలోని స్వగృహం వద్ద ప్రజలు, బంధుమిత్రులు సందర్శనార్థం ఉంచారు. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, ఏపీ బార్ కౌన్సెల్ ఛైర్మన్ ద్వారకానాథరెడ్డి, బార్ కౌన్సెల్ పూర్వ ఛైర్మన్ గంటా రామారావుతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి బార్ కౌన్సెల్ సభ్యులు సుదర్శనరావు, ముప్పాళ్ల సుబ్బారావు, ఎస్.మల్లేశ్వరరావు, కృష్ణారెడ్డి న్యాయవాదులు తరలివచ్చి ఆమె పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సుంకర రాజేంద్రప్రసాద్‌ను, ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహనరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ ఉపాధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, ఏపీ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ అధ్యక్షుడు, బార్ కౌన్సెల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది ఎ.బి.రాజేంద్రప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల లీగల్ సెల్ న్యాయవాదులు జ్యోత్స్నకు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.బాబూరావు, బి.తులసీదాస్, మంతెన సీతారామ్, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ అంజలి ఘటించారు.

క్రీడాకారుల భవిష్యత్తే శాప్‌నకు ముఖ్యం



ఎండీ గిరీషాతో మాట్లాడుతున్న ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే రవికుమార్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడాకారుల భవిష్యత్తే రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్)కు ముఖ్యమని ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రాజకీయ ప్రమేయాల కారణంగా క్రీడాకారులు నష్టపోకుండా శాప్ చర్యలు చేపట్టిందని, అందుకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో ఎండీ పీఎస్ గిరీషా బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. గిరీషా క్రీడా యాప్ డిజైన్, పనితీరును ఛైర్మన్‌కు వివరించారు. సంఘాలు, క్రీడాకారులు, శిక్షకులు, పతకాలు, ధ్రువపత్రాల జారీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో శాప్ ఆస్తుల వివరాలు ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తున్నామని తెలిపారు. క్రీడాకారుల నమోదు నుంచి పతకాలు, ధ్రువపత్రాలు, ప్రోత్సాహకాల వరకు ఆధార్ ఆధారంగా యాప్‌లో పరిశీలించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గిరిజన క్రీడాధికారి ఎస్వీ రమణ, ఈఈ సిద్ధయ్య, క్రీడాధికారులు మహేష్, కోటేశ్వరరావు, సురేంద్ర, ఐటీ ఇంజినీర్ కిషోర్, సూపరింటెండెంట్లు మల్లీశ్వరి, వేణు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమ జిల్లాలోని క్రీడాకారిణి సమస్యను శాప్ ఛైర్మన్‌కు వివరించగా.. ఆయన వెంటనే ఎండీ దృష్టికి తీసుకెళ్లారు.


పోలీసుల తీరుపై భక్తుల ఆగ్రహం



మెలి తిప్పడంతో చిన్నారి చెవి ఇలా


చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రులలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన వారితో పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునే సమయంలో బంగారువాకిలి వద్ద మహిళా ఎస్సై అనుచితంగా వ్యవహరించడంతో పాటు ఓ చిన్నారి చెవిని మెలితిప్పడం, పిల్లల్ని ఇష్టానుసారంగా లాగేయడం, దుర్భాషలాడటం, చెయ్యి చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆక్షేపిస్తున్నారు. మగ పోలీసులు సహకరిస్తున్నారని మహిళా ఎస్సైలు తీరు చాలా దారుణంగా ఉందని గగ్గోలు పెడుతున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి అమ్మ సన్నిధికి వస్తే దర్శనం కూడా చేసుకోలేని విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళా ఎస్సైల తీరుపై మండిపడుతున్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దర్శనానికి వస్తే క్యూలైన్లు నిలిపేశారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పోలీసుల తీరు మార్చుకునే విధంగా, భక్తులకు ఇబ్బంది కలిగించకుండా తగు చర్యలు చేపట్టాలని భక్తులు వేడుకుంటున్నారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు



విజయవాడ(రైల్వేస్టేషన్) : దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07216 ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బండి ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది.

కిడ్నీ బాధితుడి మృతి



ఆదినారాయణ (పాత చిత్రం)

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రెండేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఎ.కొండూరు తండాకు చెందిన భూక్యా ఆదినారాయణ(37) బుధవారం మృతి చెందాడు. గత వారం రోజుల నుంచి వ్యాధి తీవ్రతతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు జె.వెంకటేశ్వరరావు, కుమార్‌నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా కుమ్మరికుంట్ల తండాలో గుగులోతు చిన్న కూడా ఇదే వ్యాధితో మంగళవారం మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందించారు. తెదేపా నాయకులు కృష్ణారెడ్డి, మునియ్య, రమేష్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

✦ కొండపల్లి చైతన్యనగర్ జాతీయ రహదారిలో డ్రెయిన్ నిర్మాణం మధ్యలోనే నిలిపేయడంతో వర్షపు నీరు ఆగిపోయి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా తెలిపిన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. జాతీయరహదారి గుత్తేదారు సిబ్బంది బుధవారం పనులు ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, కొండపల్లి

రాయితీపై టమాటాల విక్రయాలు

మైలవరం: టమాట ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన టమాటాల విక్రయాలను బుధవారం స్థానిక రైతుబజారులో ప్రారంభించారు. కిలో రూ.50ల చొప్పున వినియోగదారులకు అందిస్తున్నట్లు ఈవో చిట్టిబాబు పేర్కొన్నారు. తొలి రోజు 1,200 కిలోల వరకు టమాటాలను దిగుమతి చేశామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మధిర శాఖ కాల్వకు 1,034 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక వద్ద 1,034 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదల చేశారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 371 క్యూసెక్కులు చేరాయి. గంపలగూడెం, పెనుగొలను సెక్షన్ల పరిధిలో మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 40, పెదకొమిర 25, మధిర 35, నిదానపురం 70 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ మహేష్ తెలిపారు. మరోవైపు కాల్వలకు విడుదలైన సాగర్‌జలాలతో ఆయకట్టులోని వరి, పత్తి, మిరప పంటలకు నీటి తడులు అందించడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

జ్యోత్స్న మరణం తీరని లోటు


జ్యోత్స్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాలోత్సవ్ కమిటీ సభ్యులు

తిరువూరు, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో తరుణీ తరంగాల సంస్థ వ్యవస్థాపకురాలు, అమరావతి బాలోత్సవం కార్యదర్శి సుంకర జ్యోత్స్న దుర్మరణం చెందడంతో అత్యంత బాధాకరమని, తీరని లోటని తిరువూరు బాలోత్సవ్ కమిటీ సభ్యులు అన్నారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.రవి, బి.వెంకటేశ్వరరావు, పాపారావు, ఉమ, ప్రకాశరావు, సురేష్ పాల్గొన్నారు.

స్వర్గపురి వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం


తోసా సభ్యులకు నగదు అందజేస్తున్న దాత బేబీ సరోజిని

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక పోతుల చెరువు వద్ద తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం(తోసా)ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో నిర్మించిన స్వర్గపురికి భౌతికకాయాలు తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలు చేయడానికి పట్టణానికి చెందిన జంగాల సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య బేబీ సరోజని, కుమారుడు మురళీకృష్ణ బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు తోసా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మరోసారి కంటనీరే

- పనిచేయని మోటార్లతో రైతుల అవస్థలు
- పంటలు ఎండుతున్నాయంటూ ఆవేదన వ్యక్తంచేస్తూ..

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే

నాడు వరద నేడు వర్షాభావ పరిస్థితులతో రైతులు మరోసారి కంటనీరు పెడుతున్నారు. కొటికలపూడి శ్రీ రామచంద్ర ఎత్తిపోతల ఆయకట్టుదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎత్తిపోతలకు చెందిన మోటార్ల విద్యుత్తు ప్యానల్స్ వరద ముంపునకు గురికావడంతో పథకం పడకేసింది. వరద ముంపునకు గురైన పొలాలను తిరిగి సాగుచేసి వరి, విత్తిన అపరాలు, మొక్కజొన్న పంటలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ కర్షకులు అవస్థలు పడుతున్నారు. దాదాపు 15 ఏళ్ల కిందట రైతాంగం విజ్ఞప్తి మేరకు తెదేపా ఏపీ ఐడీసీ ఆధ్వర్యంలో ఏనుగుగడ్డ వాగుపై ఎత్తిపోతలను నిర్మించి ఆయకట్టుదారుల కమిటీకి అప్పగించారు. ఆనాటి నుంచి వారి పర్యవేక్షణలో మూడు వందల ఎకరాల్లో ఏటా రెండు పంటలు సాగు చేస్తున్నారు. రైతులు ఆవేదన వారి మాటల్లో....


మరమ్మతులకు గురైన ఎత్తిపోతల మోటార్లు, విద్యుత్తు ప్యానల్

రూ.12 లక్షల ఖర్చు కానుంది
– వెంకట్రావు, ఎత్తిపోతల పర్యవేక్షకుడు

ఎత్తిపోతలకు సంబంధించిన నాలుగు మోటార్లతో పాటు విద్యుత్తు ప్యానల్ మూడు రోజులు వరద నీటిలోనే ఉండడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులకు గురయ్యాయి. ఎత్తిపోతల పూర్తి స్థాయిలో బాగు చేయించాలంటే దాదాపు రూ.12 లక్షలు ఖర్చు కానుంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

తీవ్రంగా నష్టపోయాం – మల్లిఖార్జునరావు, రైతు

ఇటీవల వచ్చిన వరదలకు ఆయకట్టులో సాగుచేసి పంటలన్నీ నీట మునిగి తీవ్రంగా నష్టపోయాం. వరద ముంపు తగ్గిన తరువాత మేటలు వేసిన పొలాలను సాగుకు అనుకూలంగా తయారుచేసి అపరాలు, వరితో పాటు మొక్కజొన్న సాగు చేశాం. పంటలు మొలక దశకు వచ్చిన తరువాత వానలు కురవకపోవడం..ఎత్తిపోతల మోటార్లు పనిచేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

ప్రభుత్వమే ఆదుకోవాలి
– నాగరాజు, సర్పంచి

ఆయిల్ ఇంజిన్ల ద్వారా సాగునీటి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఆర్థిక భారంతో పాటు ఆయకట్టు చివరి పొలాలకు నీరందని పరిస్థితి ఎదురవుతోంది. సాగు ఖర్చుకు భరించలేకపోతున్నాం. మరోసారి పంట నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి.

నివేదికలు పంపాం
– రత్నరాజు, డీఈఈ, ఏపీ ఐడీసీ

ఎత్తిపోతలకు సంబంధించిన నష్టం వివరాలు, మోటార్ల రిపేర్లకు అవసరమైన నిధులు తదితరాల అంచనాలను ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు చేస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలో ముచ్చనపల్లి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని మద్దులపర్వ, ముచ్చనపల్లి, శ్రీరాంపురం, కూనపరాజుపర్వ గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ కిరణ్ తెలిపారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఎ.కొండూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పి.హరిప్రియ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఎ.కొండూరు: ఎ.కొండూరు మండలం కృష్ణారావు పాలెంలో సమీపంలో నిర్మించనున్న కాళీమాత ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

మైలవరం: దేవీ నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్ర పూజలను పురస్కరించుకుని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ వితరణతో స్థానిక తారకరామానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పలువురు విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

మద్యం దుకాణాలకు 619 దరఖాస్తులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 16 మద్యం దుకాణాలకు బుధవారం సాయంత్రం వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో 619 దరఖాస్తులు అందినట్లు సీఐ వీరవెంకట సత్యనారాయణ వర్మ, ఎస్సై వెంకటకుమార్ తెలిపారు. ప్రభుత్వం దరఖాస్తు గడువు శుక్రవారం వరకు పొడిగించిందని అప్పటిదాకా దరఖాస్తులు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.


మైలవరం : దరఖాస్తుదారులకు టోకెన్ అందజేస్తున్న సీఐ జె.శ్రీనివాస్

మైలవరంలో 300

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని 10 మద్యం దుకాణాలకు బుధవారానికి మొత్తం 300 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం టెండర్లను దాఖలు గడువును ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించినందున దరఖాస్తులు సమర్పించుకోవచ్చని సూచించారు. ఈ నెల 14వ తేదీ ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ కన్వెన్షన్‌లో టెండర్ల లాటరీ తీస్తారని పేర్కొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎంపీడీవో రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, పారిశుద్ధ్యం, వీధి లైట్ల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ విషయాలు గురించి ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దయానంద్, పంచాయతీ కార్యదర్శులు రామారావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, ఫణిశ్రీ, లక్ష్మీనారాయణ, రాజేష్, యువరాజ్, సాయి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టి.కె.వి.రమణ

గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం

తిరువూరు, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కీలకమని మండలాధ్యక్షురాలు గద్దల భారతి, ఎంపీడీవో పీవీఎస్.నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు ప్రజాప్రతినిధులకు రెండు రోజులుపాటు నిర్వహించే శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పర్యవేక్షించాలని, తమను ఎన్నుకున్న ప్రజల ఆవాసాల్లో తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, మురుగు నీరు పారుదల కాల్వ సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. గుర్తించిన సమస్యలను గ్రామ పంచాయతీ సమావేశాల్లో సర్పంచులు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించి, వారి బాధ్యతలను వివరించారు.



సూచనలిస్తున్న ఎంపీడీవో నాగేశ్వరరావు, పక్కన ఎంపీడీవో భారతి

అన్ని వర్గాలకు సీపీఎం అండ

మైలవరం, న్యూస్‌టుడే: సమాజంలో పేదల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల వరకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకునే వారే నిజమైన కమ్యూనిస్టులన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలతో సంబంధం లేకుండా మానవ సంబంధాలకు ప్రయత్నిస్తున్నామన్నారు. అనంతరం మండల కార్యదర్శిగా చాట్ల సుధాకర్‌ను, సభ్యులుగా వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్, ఇసాక్, సుబ్బారావు, రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, నాయకులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, దేవేంద్ర, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవీ కృష్ణ

డంపింగ్ కేంద్రంలో మార్గాలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలో క్లిష్ట సమస్యగా ఉన్న చెత్త తరలింపుపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. పూరగుట్ట సమీపంలో డంపింగ్ కేంద్రం ఉన్నా..చెత్తంతా ప్రధాన రహదారిపైకే చేరుతోంది. ఫలితంగా దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారికి దూరంగా చెత్తను పారబోసేందుకు వీలుగా ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్యదర్శి రఫి తెలిపారు. అందులో భాగంగా చెత్తను వాగు జాలుకు తరలించేందుకు గ్రావెల్‌తో మార్గం ఏర్పాటు చేస్తున్నామన్నారు.


పూరగుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన రోడ్డు

సిద్ధమైన ఈ పంట నమోదు జాబితాలు

ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి (తిరువూరు), న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు జాబితాలను గురువారం నుంచి 16వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ఉంచుతామని మండల వ్యవసాయాధికారిణి పిట్టల పద్మ తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో కలిసి వరి, పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వ్యాపించే తెగుళ్లు, పురుగులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను ఆమె విశదీకరించారు. మండల పరిధిలో ఈ ఏడాది 8,406 మంది రైతులు 22,755 ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు సాగు చేయగా ఈ పంట నమోదు కూడా నూరుశాతం పూర్తయిందన్నారు. ఈ-కేవైసీ నమోదు కూడా లక్ష్యం మేరకు చేస్తామన్నారు. కర్షకులు ఆర్‌ఎస్‌కేల్లో ఉన్న ఈ పంట నమోదు జాబితాలను పరిశీలించి ఏమైనా తేడాలు ఉంటే వెంటనే తమ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. తప్పులు ఉంటే సరిచేసి తుది జాబితాలను ఈ నెల 18న వెల్లడిస్తామన్నారు. తదుపరి ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించరని స్పష్టం చేశారు.


కొమ్మిరెడ్డిపల్లిలో రైతులతో కలిసి పత్తి పంట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


కొండపల్లి : బొడ్డురాయి సెంటర్‌లో సరస్వతిదేవిగా


గంపలగూడెం : వినగడప ఆశ్రమంలో..


విస్సన్నపేట : పుట్రేల మారెమ్మ గుడిలో..


ఇబ్రహీంపట్నం గ్రామీణం కొటికలపూడిలో..


ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో..


జి.కొండూరు బీసీ కాలనీలో..


తిరువూరు కనకదుర్గ ఆలయంలో అర్ధనారీశ్వరిగా


గొల్లపూడి : రాయనపాడులో భక్తుల పూజలు


తోటమూలలో దీపాలతో..

హంస వాహినీ.. సరస్వతీ రూపిణి

దేవీ శరన్నవరాత్రోత్సవాలను తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి పుట్టినరోజైన మూలా నక్షత్రం పురస్కరించుకొని బుధవారం జగన్మాత ప్రతిమలను సరస్వతీ దేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చిన్నారులు, యువతులు, విద్యార్థులు అమ్మను భక్తితో కొలిచారు.

– న్యూస్‌టుడే బృందం


ఎ.కొండూరు : చీమలపాడులో ఎమ్మెల్యే కొలికపూడి పూజలు


తిరువూరు పోలీసుస్టేషన్‌లో..


రెడ్డిగూడెం : నాగులూరులో..

ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పాటు

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: స్థానిక కోదండ రామాలయంలో నిర్వహణ కమిటీ సభ్యులుగా పి.సర్వేశ్వరరావు, జె.కృష్ణ, సీహెచ్.శ్రీనివాసరావు, జి.కిషోర్, తమ్మిశెట్టి నాగరాజు, జె.వెంకటేశ్వరరావు, తోటపల్లి నాగరాజు, జె.నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్.చిట్టెమ్మ, ఎం.నాగేంద్రరావు బుధవారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. తెదేపా, జనసేన మండల నాయకులు సీహెచ్.రాజేశ్వరరావు, ఆర్.వీరారెడ్డి, డి.వి.కృష్ణారావు, బి.నారాయణ, జె.చెంచురెడ్డి, సీహెచ్.సత్యనారాయణ తదితరులు సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

సత్యమ్మతల్లి సేవలో నందమూరి కుటుంబ సభ్యులు

నందిగామ గ్రామీణం: అంబారుపేట సత్యమ్మతల్లిని బుధవారం తెదేపా నాయకుడు దివంగత నందమూరి హరికృష్ణ సతీమణి, ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తూ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వారిని దేవాలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మంచాల మాధవ్, ఈవో హరిగోపీనాథ్, సభ్యులు స్వాగతించి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మేడూరు సమీప పొలంలో పనిచేసుకుంటున్న తనపై దాడి చేశారని యద్దనపూడి గోపాలకృష్ణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బరిగెల వాసు, నాగేశ్వరరావు, వేణు, భీమేశ్వరరావు, గాజుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు. నిందితులు ఇనుప రాడ్లు, కర్రలతో తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గోపాలకృష్ణను చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

విచారణ వాయిదా

మైలవరం, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ మైలవరంలో అవకతవకలు జరిగాయంటూ వార్డు సభ్యుడు చేసిన ఫిర్యాదుపై డీఎల్పీవో విచారణ మళ్లీ వాయిదా పడింది. బుధవారం ఫిర్యాదుదారుడితో పాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, అధికారులు రికార్డులతో సిద్ధంగా ఉండాలని విజయవాడ డీఎల్పీవో నోటీసులు జారీ చేసి, చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..గడిచిన మూడేళ్లలో పంచాయతీలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటిపై విచారించాలంటూ స్థానిక పంచాయతీ 12వ వార్డు సభ్యుడు ముద్దర నాగచిట్టిబాబు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జులై 21న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఈవో ఆర్‌డీ విచారించి ఆగస్టులో నివేదిక ఇచ్చారు. దానిపై తుది విచారణ చేయాలన్న జిల్లా పంచాయతీ అధికారి సూచనల మేరకు డీఎల్‌పీవోను విచారణ అధికారిగా నియమించగా..బుధవారం పంచాయతీ కార్యాలయానికి వస్తామని నోటీసులు ఇచ్చారు. కానీ విచారణ వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ అధికారులకు సమాచారం పంపారు. గతంలోనూ తన ఫిర్యాదులపై ఇలాగే వాయిదాలు వేస్తూ వచ్చారని ఫిర్యాదుదారుడు చిట్టిబాబు పేర్కొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రఫిని సంప్రదించగా, బుధవారం విచారణ ఉందని చెప్పారని, కానీ అనివార్య కారణాలతో రావడంలేదని డీఎల్పీవో నుంచి ఉదయమే సమాచారం రాగా, అందరికీ తెలియజేశామన్నారు.



సృష్టికి మూలం.. శక్తి రూపం



కృష్ణమ్మకు నదీ హారతి..



నగరోత్సవం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వెళ్లే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీమాతను దర్శించుకోవడానికి బుధవారం తెల్లవారుజాము నుంచే లక్షల మంది బారులుదీరారు. - న్యూస్‌టుడే బృందం



ఆలయంలో పూలతో అలంకారం..



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలిచేందుకు వచ్చిన నృత్యకారిణులు



కెనాల్ రోడ్డు వద్ద క్యూలైన్లలో భక్తులు



కేరళ డప్పు వాయిద్యాలతో..



మహిళలు, చిన్నారుల కోలాటం



మూలానక్షత్రం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున బారులు



వన్‌టౌన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుపై ఆంక్షలతో భక్తుల అగచాట్లు



హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి బస్టాండ్ వైపు నిలిచిన ట్రాఫిక్





భక్తులకు తాగునీరు అందిస్తూ..



నదిలో బోట్లలో ఏర్పాటు చేసిన నవదుర్గల బొమ్మలు

11 నుంచి నారీశక్తి ఉత్సవం

కృష్ణానదీ తీరాన నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు

భవానీపురం, న్యూస్‌టుడే : కృష్ణానదీ తీరాన పున్నమి ఘాట్ వద్ద ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న నారీశక్తి ఉత్సవం కార్యక్రమానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నదీ తీరం వెంబడి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి వేదికల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇసుక తీసుకొచ్చే బోట్లలో నవదుర్గల భారీ బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వేదిక వెనుక వైపున కృష్ణానదిలో వాటిని బోట్లలో ఏర్పాటు చేశారు. స్టాల్స్ పనులు కూడా చేస్తున్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు...

వేద.. స్మార్త.. పాఠాల బోధన

రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న పాఠశాల

దుర్గగుడి ఆధ్వర్యంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం

ఈనాడు, అమరావతి



వేద పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద, స్మార్త పాఠశాలలో ఏటా వందల మంది విద్యార్థులు వేదాభ్యాసం చేస్తున్నారు. 20 ఏళ్ల కిందట 30 మందితో ఆరంభించిన పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ.. దశాబ్దాలుగా వేద, స్మార్త పాఠాలను విద్యార్థులకు నేర్పిస్తోంది. ప్రస్తుతం 110 మంది విద్యార్థులు దుర్గగుడి వేద పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. పదేళ్ల కిందటి వరకూ దుర్గగుడి ప్రాంగణంలోనే ఈ పాఠశాల ఉండేది. దుర్గగుడి పాత మెట్ల మార్గం పక్కనే ఉండే భవనంలో ఈ పాఠశాల కొనసాగేది. ఆ తర్వాత విజయవాడ శివారులోని పోరంకిలో ప్రత్యేకంగా పాఠశాలను నిర్మించి అక్కడికి తరలించారు. ప్రస్తుతం అక్కడే పాఠశాల కొనసాగుతోంది. ఎనిమిది, 12ఏళ్ల కాల వ్యవధితో కృష్ణ యజుర్వేదానికి సంబంధించిన రెండు కోర్సులను అందిస్తున్నారు. ఏటా మే నెలలో వేద పాఠశాలలో ప్రవేశాలకు పత్రికా ప్రకటన ఇచ్చి.. ప్రక్రియ నిర్వహిస్తుంటారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తారు. పాఠశాల ప్రాంగణంలోనే ఉచిత వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తారు. ఉపనయనం పూర్తయిన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. వేదం చదువుకోవాలని ఆసక్తి ఉండి, ఆర్థిక ఇబ్బందులతో ఉపనయనం చేయించుకోలేని వారి కోసం సామూహిక ఉపనయనాలను సైతం దుర్గగుడి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తుంటారు. వేద పాఠశాలలో ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 30 మందితో ఆరంభించగా.. తర్వాత ఏటేటా పెరుగుతూ 40, 50, 70, 100 ఇలా పెరుగుతూ వెళ్తున్నారు. ప్రస్తుతం 110 మంది విద్యార్థులకు చేరారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఏటా బయటకు వెళ్లడం, కొత్తవాళ్లు రావడం జరుగుతోంది.

ఉత్సవ వసతులపై 92 శాతం భక్తుల సంతృప్తి

చిట్టినగర్, న్యూస్‌టుడే: దుర్గమ్మ అనుగ్రహంతో రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కరవులేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. రాజధాని నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కూటమిపై నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు ప్రభుత్వానికి జగన్మాత అనుగ్రహం ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు దేవాదాయశాఖతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చక్కగా చేశారన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని, ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



మంత్రి రామానాయుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో రామారావు, వేదపండితులు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు



మంత్రి సవితకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

అపూర్వం.. జ్ఞానప్రదాయిని దర్శనం

ఇంద్రకీలాద్రి: దసరా శరన్నవ వేడుకల్లో జ్ఞానప్రదాయని సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి సవిత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లలో ఇబ్బందులను భక్తులను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వర్ణవీణాధారిణిగా అమ్మవారి రూపం అపూర్వం అన్నారు. భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాల లోటు లేకుండా అందించామన్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

☛ జగన్మాతను జిల్లా కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో



ఆశీర్వచన మండపంలో సీపీ రాజశేఖర్‌బాబు కుటుంబం

నేటి అలంకారం శ్రీ దుర్గాదేవి


10-10-2024, గురువారం



**విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కంధస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలసద్దస్తాభిరాసేవితాం
హస్తైశ్చక్రగదాసిఖేట విసిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణాం అనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే॥**

దుర్గముడనే రాక్షస సంహారం చేసిన శక్తిస్వరూపం దుర్గాదేవి. కోటిసూర్య ప్రభలతో వెలుగొందే ఈ దేవి భక్తులను సర్వదుర్గతుల నుంచి కాపాడుతుంది. ఈమె మహా ప్రకృతి స్వరూపిణి. ఈ తల్లి ఉపాసన ద్వారా ఈతి బాధలు నశిస్తాయి. గ్రహబాధలు తొలగుతాయి. ఎర్రని వస్త్రాలు ధరించి, ఎర్రని పూలు, అక్షతలతో అమ్మను పూజించి, పులగం నివేదన చేయాలి. **ఓం దుం దుర్గాయై నమః** అనే మంత్రాన్ని జపించాలి. దుర్గాసూక్తం, లలిత అష్టోత్తరం, దుర్గాస్తోత్రాలు పారాయణ చేయాలి. వేదపండితులను ఈరోజు సత్కరిస్తే అమ్మ సంతోషిస్తుంది.

జగన్మాత సేవలో జస్టిస్ దుప్పల వెంకటరమణ



జస్టిస్ దుప్పల వెంకటరమణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ బుధవారం సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం జస్టిస్ వెంకటరమణకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

వైకాపా నేత దేవినేని అవినాష్‌కు అంతరాలయ దర్శనం

- మూలానక్షత్రం రోజున అడ్డదారిలో తీసుకొచ్చిన సిబ్బంది
- ఉన్నతాధికారుల తీవ్ర ఆగ్రహం.. టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు
- విధుల నుంచి ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

ఈనాడు, అమరావతి, ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

విజయవాడ దుర్గగుడిలో నిబంధనలకు విరుద్ధంగా వైకాపా నేత దేవినేని అవినాష్, ఆయన కుటుంబ సభ్యులను అడ్డదారిలో తీసుకొచ్చి మరీ అంతరాలయ దర్శనం బుధవారం చేయించారు. మూలానక్షత్రం రోజున ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులకు మినహా ఎవరికీ అంతరాలయ దర్శనాలు లేవని, అన్ని క్యూలైన్లు ఉచితమేనని అధికారులు ముందురోజే ప్రకటించారు. అంతరాలయంలోకి ఎవరూ ప్రవేశించకుండా గేట్‌కు తాళం వేశారు. కానీ వైకాపా నేతలకు మాత్రం ఎలాంటి నిబంధనలు అడ్డులేవన్నట్టుగా కొందరు దేవస్థానం సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దేవాదాయ శాఖ అధికారులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించిన తర్వాత ఆ సమయంలో విధుల్లో ఉన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రత్నారెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు మరో ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన గార్డులను విధుల నుంచి తప్పించారు.

దసరా ఉత్సవాల్లో ఘాట్‌రోడ్డు వైపు నుంచి తప్ప.. కనకదుర్గానగర్ మీదుగా మహామండపం లిఫ్ట్ మార్గంలో నుంచి ఎవరూ రావడానికి వీల్లేదంటూ దేవాదాయశాఖ మంత్రితో పాటు కమిషనర్ సహా ఉన్నతాధికారులంతా కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అలాంటిది.. మూలానక్షత్రం రోజున ఎలాంటి ప్రొటోకాల్ లేని వైకాపా నాయకుడు దేవినేని అవినాష్, ఆయన కుటుంబాన్ని అడ్డదారిలో దర్జాగా లిఫ్టు మార్గంలో తెల్లవారుజామున ఒంటి గంటన్నర సమయంలో కొండపైకి తెచ్చారు. భక్తులు దర్శనాలు చేసుకుని కిందకు వెళ్లే మార్గం వైపు నుంచి అడ్డదారిలో అంతరాలయం వద్దకు తీసుకొచ్చారు. అంతరాలయం వద్ద వేసిన గేటు తాళం కూడా తెరిచి.. లోపలికి తీసుకెళ్లి తొలి దర్శనం చేయించడం ప్రస్తుతం వివాదంగా మారింది. మూలా నక్షత్రం రోజున ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులకు తప్ప అంతరాలయ దర్శనం ఎవరికీ లేదని దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంగా ప్రకటించారు. దసరా ఉత్సవాలు పూర్తయ్యేవరకు లిఫ్టు మార్గంలో ఎటువంటి దర్శనానికి భక్తులను అనుమతించేది లేదని నగర పోలీసు కమిషనరు రాజశేఖర్ బాబు ప్రకటించారు. కానీ కొందరు సిబ్బందికి ఇవేవీ పట్టడం లేదు. మహామండపం లిఫ్ట్ మార్గంలో పైకి రావాలంటే.. కచ్చితంగా చాలామంది సహకారమే ఉండాలి. పోలీసులు కూడా అడ్డుకుంటారు. అలాంటిది ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు అవినాష్ కుటుంబాన్ని వెంటబెట్టుకుని కొండపైకి ఎలా వచ్చారన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పైగా అంతరాలయ గేటు తాళం తీయాలంటే ప్రధాన ఆలయంలో విధులు నిర్వహించే ఏఈవో, సూపరింటెండెంట్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అనుమతి ఉండాలి. కానీ ఎలాంటి ప్రొటోకాల్ లేనప్పటికీ ఎలా గేటు తాళం తీశారనేది ప్రస్తుతం వివాదంగా మారింది. ఈ ఘటనలో చాలామంది అధికారుల నిర్లక్ష్యమే ఉన్నా.. కావాలని కిందిస్థాయిలో విధులు నిర్వహించే టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌ను బాధ్యుడిని చేసి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

పోతిన మహేష్ విషయంలోనూ వివాదం..

వైకాపా నాయకుడు పోతిన మహేష్ కుటుంబం, అనుచరులతో కలిసి మూడు రోజుల కిందట అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు కూడా ఎలాంటి ప్రొటోకాల్ లేదు. అయినా దర్జాగా మహేష్ కుటుంబంతో పాటు వచ్చిన వాళ్లందరినీ అంతరాలయం లోనికి అనుమతించారు. ఆ తర్వాత ఆశీర్వచనం అందించి, స్వయంగా ఈవో వచ్చి చిత్రపటాన్ని అందజేశారు. ఆ తర్వాత కొండపై ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ మైక్ పాయింట్ వద్దకు మహేష్ వచ్చి మాట్లాడి వెళ్లారు. ఇదికూడా తీవ్ర దుమారాన్ని రేపింది. గతంలో వైకాపా అధికారంలో ఇదే మహేష్ జనసేనలో ఉన్నప్పుడు, ఇలాగే దసరాలో మీడియా పాయింట్‌లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే పోలీసులొచ్చి మైక్ లాగేసి అక్కడి నుంచి పంపించేశారు. ఇప్పుడు మాత్రం దర్జాగా వైకాపా నేతలొచ్చి ఆలయంలో రాజమర్యాదలు అందుకుంటున్నారు.

అన్ని క్యూలైన్లు.. ఉచిత దర్శనాలే

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మూలానక్షత్రం సందర్భంగా అన్ని క్యూలైన్లలో ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశాం. దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నాం. దర్శన ఏర్పాట్లుపై ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. దీనిలో 91 శాతం మంది భక్తులు సంతృప్తి తెలిపారు. ఇందుకు అన్ని శాఖల సహకారం ఉంది. ఉత్సవాల్లో ఆఖరి రోజు తెప్పోత్సవం ఆగమ పండితుల నిర్ణయం ప్రకారం జరుగుతుంది.

మార్కుల విషయంలో పిల్లలపై ఒత్తిడి తేవద్దు

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: మార్కుల విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురాకుండా.. చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన పిల్లలు ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరేలా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం జ్యోతిబా, సావిత్రిబాయి పులే ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఎన్డీయే ప్రభుత్వం బీసీల సంక్షేమంతోపాటు విద్యార్థుల భవితకు పెద్దపీట వేస్తోంది. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. త్వరలో దీనిని కేంద్రానికి కూడా నివేదిస్తాం. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇస్తున్న రూ. 3,000 ఆర్థిక ప్రోత్సాహకానికి అదనంగా మరో రూ. 1,000 వేసి ఇస్తున్నాం' అని తెలిపారు. ఈ సందర్భంగా పది, ఇంటర్‌లో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రతిభా అవార్డులను మంత్రి అందించారు. అవార్డుతోపాటు రూ. 4,000 చొప్పున నగదు, మెరిట్ సర్టిఫికెట్‌లను అందజేశారు.

11, 12, 13 తేదీల్లో 'ప్రజావేదిక' రద్దు

ఈనాడు, అమరావతి: దసరా సందర్భంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగే 'ప్రజావేదిక'ను రద్దు చేస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. 14వ తేదీ నుంచి 'ప్రజావేదిక' యథావిధిగా ప్రారంభమవుతుందని తెదేపా ఎమ్మెల్సీ అశోక్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కోర్టులో లొంగిపోయిన వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

బెయిల్ మంజూరు చేసిన జడ్జి

సత్తెనపల్లి, అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, దాడిచేసిన కేసులో నిందితుడిగా ఉన్న వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి బుధవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి కోర్టులో లొంగిపోయారు. నిందితుడికి జడ్జి బెయిల్ మంజూరుచేశారు. 2022 ఫిబ్రవరిలో పల్నాడు జిల్లా అమరావతిలోని అమరేశ్వరాలయంలో మహాశివరాత్రి రథోత్సవం తిలకించేందుకు తాడికొండ దీక్షాశిబిరం నుంచి మహిళలు బస్సులో బయలుదేరారు. లేమల్లె వద్ద అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అనుచరులతో ఉన్నారు. మహిళలు కిందకి దిగి సురేష్‌ను, అక్కడే ఉన్న అప్పిరెడ్డిని అమరావతికి మద్దతు తెలియజేయాలని కోరారు. దీంతో వారు మహిళలను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. పోలీసులు సర్దిచెప్పి మహిళలను బస్సు ఎక్కించగా.. నందిగం సురేష్ అనుచరులు కర్రలు, రాడ్లతో బస్సును వెంబడించి హంగామా సృష్టించారు. ఈ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. రాజధాని ప్రాంత మహిళ మండవ మహాలక్ష్మి ఫిర్యాదుతో అమరావతి పోలీస్‌స్టేషన్‌లో నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. ప్రస్తుతం నందిగం సురేష్ రిమాండ్‌లో ఉన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. కేసును విచారించిన ఇన్‌ఛార్జి జడ్జి తౌషిద్ హుస్సేన్ అప్పిరెడ్డికి బెయిల్ మంజూరుచేశారు.

రఘురామ కేసులో ఇద్దరు పోలీసుల వాంగ్మూలం నమోదు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు తనపై సీఐడీ కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు దాడికి పాల్పడ్డారని పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఇటీవల గుంటూరులోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారి సునీల్‌కుమార్, మరికొందరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం ఈ కేసులో ఇద్దరు పోలీసుల వద్ద న్యాయమూర్తి వాంగూల్మం నమోదు చేశారు. గుంటూరు రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వి.దీప్తి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసే ఏఎస్‌ఐతో పాటు మరో హోంగార్డు నుంచి 'ఇన్ కెమెరా' పద్ధతిలో బుధవారం వాంగూల్మం నమోదుచేశారు. వారు పోలీసులకు తెలిపినట్లే సంఘటన జరిగిన రోజు చోటుచేసుకున్న విషయాలను న్యాయమూర్తికి వివరించినట్లు తెలిసింది.

మాజీ ఎంపీ నందిగం సురేష్ బెయిల్ పిటిషన్‌పై విచారణ

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై తుళ్లూరు పోలీసులు నమోదుచేసిన హత్య కేసులో ఆయన బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. గుంటూరు ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు బుధవారం రెండువైపులా వాదనలు విన్నారు. నిందితుడు సురేష్ తరపున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి. . పోలీసుల తరపున ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ కేసు వివరాలను న్యాయమూర్తికి తెలిపారు. 2020 డిసెంబరు 27న వెలగపూడిలో జరిగిన మోడెం మరియమ్మ హత్య కేసులో నందిగం సురేష్‌పై తుళ్లూరు పోలీసులు కేసు నమోదుచేశారు. తెదేపా కార్యాలయంపై దాడికేసులో అరెస్టయి జైలులో ఉన్న సురేష్‌పై ఈ కేసును నమోదుచేసి అరెస్టు చూపారు. ఇరువురు న్యాయవాదులు మరికొంత సమాచారంతో వాదనలు వినిపిస్తామని తెలపడంతో న్యాయమూర్తి శరత్‌బాబు విచారణను గురువారానికి వాయిదా వేశారు.



చిన్న అడుగులైనా పర్లేదు.. ఈరోజే మొదలెట్టండి

ఎంత పెద్ద ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. అందుకే చిన్న చిన్న అడుగులతోనే ప్రయాణం ప్రారంభించండి. కానీ ఆలస్యం చేయకుండా ఈరోజే ఆరంభించండి. అలా చేయడం వల్ల అన్ని విధాలుగా సిద్ధమయ్యాకే మొదలుపెడతామంటూ ఎదురుచూసేవారి కన్నా మీరు ముందు వరుసలో ఉంటారు. లక్ష్యం దిశగా సాగే మార్గంలో ప్రతి రోజూ ఏదో అవకాశం ఎదురవుతూ ఉంటుంది. మనం వాటిని అందిపుచ్చుకోవాలంటే నడక కొనసాగిస్తుండటమే ముఖ్యం.

– బ్రియాన్ ఫెరోల్డి, ఇన్వెస్ట్‌మెంట్ కోచ్

పర్యావరణహిత పారిశ్రామికీకరణ అవసరం

- భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించడం పరిశ్రమల బాధ్యత కావాలి
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: పర్యావరణహిత పారిశ్రామికీకరణ ప్రస్తుత సమాజ అవసరమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. అభివృద్ధిలో భాగమయ్యే పరిశ్రమలు.. భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించడాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే అంశంపై సంబంధిత రంగ నిపుణులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో విజయవాడలో పీసీబీ బుధవారం వర్క్‌షాప్ నిర్వహించింది. దీనికి పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రాభివృద్ధి కోసం పరిశ్రమలను ప్రోత్సహించాలని, అయితే వీలైనంత తక్కువ కాలుష్యం ఉండేలా వాటి ప్రణాళికలు ఉండాలని అన్నారు. పీసీబీ అంటే పరిశ్రమలకు వ్యతిరేకమనే భావన సరికాదని వివరించారు. "భావితరాలకు భవిష్యత్తు లేకుండా చేసే అభివృద్ధి సరి కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధిలో ముందుకు సాగడం రెండూ కీలకమైనవే. ఆ సమన్వయం కుదిరేలా అవసరమైన పరిష్కార మార్గాలను ఈ వర్క్‌షాప్‌లో అన్వేషించాలి" అని పవన్‌కల్యాణ్ కోరారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

విశాఖపట్నం సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా తగిన విధానం అవసరమని పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. "పరిశ్రమల్లో కాలుష్యంతో పాటు ప్రమాదాలు అధికమవుతున్నాయి. వీటి కట్టడికి మార్గం అన్వేషించాలి. రాష్ట్రంలో 974 కి.మీ తీర ప్రాంతం ఉంది. దీన్ని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతౌల్యం దెబ్బతినకుండా పరిశ్రమలు ఏర్పాటు కావాలి. జల, వాయు కాలుష్య నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలి. కాలుష్య రహిత పరిశ్రమలు, వాటి విధివిధానాల రూపకల్పనకు నిపుణులు, మేధావులు విలువైన సూచనలు అందించాలి. రాబోయే ఐదేళ్లలో కాలుష్య నియంత్రణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం" అని పవన్‌కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీబీ ఛైర్మన్ పి.కృష్ణయ్య, సభ్య కార్యదర్శి శరవణన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సాంకేతికతలపై చర్చ

ఘన, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, పారిశ్రామిక ఉద్గారాలు, మెరైన్ ఉద్గారాల సవాళ్లు, పరిష్కార మార్గాలపై ఈ వర్క్‌షాప్‌లో సుదీర్ఘంగా చర్చించారు. పరిశ్రమలు, పవర్ ప్లాంట్లు, సిమెంట్ కర్మాగారాలు, స్పాంజ్ ఐరన్ యూనిట్లు, గ్రానైట్ యూనిట్ల నుంచి వెలువడే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు తీసుకున్నారు. కాలుష్య నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలపై చర్చించారు. వీటన్నింటిని నివేదిక రూపంలో పీసీబీ సిద్ధం చేయనుంది.

విచారణలో లోతేది.. అక్రమాలెలా తేలేది?

- విశాఖ భూ కుంభకోణం విచారణ తీరుపై విమర్శలు
- సాంకేతిక అంశాలకే పరిమితం.. వెలుగులోకి రాని అక్రమాలు
- రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ సిసోదియా పర్యటించినా ఇంతేనా?

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విశాఖ భూముల కుంభకోణం విచారణ సక్రమంగా జరుగుతున్న దాఖలాలు కనిపించట్లేదు. అధికార యంత్రాంగం.. సాంకేతిక అంశాల ఆధారంగా విచారణ సాగిస్తూ అక్రమాల లోతుల్లోకి వెళ్లట్లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాటి వైకాపా ప్రభుత్వంలో ఎసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పించే ఉత్తర్వులు రాకముందే ఆ పార్టీ పెద్దలు, ఉన్నతాధికారులు విలువైన భూములను పేదల నుంచి తక్కువ ధరకు కొనేశారు. తర్వాత వీటిని నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తప్పించారు. ఈ క్రమంలో పేదల కంటే వైకాపా పెత్తందారులే భారీగా ప్రయోజనం పొందారు. కొత్త ప్రభుత్వం రాగానే ఈ అక్రమాలు వెలికితీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన చేపట్టింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) సిసోదియా విశాఖ చుట్టుపక్కల విచారణ జరిపారు. జిల్లాలో మొత్తం 626 ఎకరాలు ఫ్రీహోల్డ్ జరిగితే అందులో 135 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. వీటిలో చాలా భూములు వైకాపా బినామీల పేరున రిజిస్ట్రేషన్ జరిగాయి. ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం మండలాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఈ అక్రమాల నిగ్గుతేల్చడంలో యంత్రాంగం విఫలం అవ్వడంతో లోపాయికారీ ఒప్పందాలు బయటకు రావట్లేదు. విచారణ సమయంలోనే చాలామంది ఉపకలెక్టర్లకు బదిలీ అయింది. దీంతో అసంపూర్తిగా దర్యాప్తు చేసి.. మిగిలింది వేరే అధికారితో చేయించారు. ఇదీ ఓ సమస్యగా మారింది.

విచారణ జరిపే విషయం తెలియకుండానే..

ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలపై విచారణ జరుపుతున్నట్లు బహిరంగ ప్రకటనలు ఇవ్వకపోవడంతో విచారణ అంతా రహస్యంగా జరిగినట్లయింది. స్థానికంగా గ్రామసభలు నిర్వహించినా, ఏ గ్రామంలో ఎప్పుడు ఉంటాయో ముందుగా చెప్పలేదు. డిప్యూటీ కలెక్టర్లు తమకు నచ్చిన సమయంలో సభలు నిర్వహించి ఫిర్యాదులు లేవని చేతులు దులిపేసుకున్నారు. తాజాగా భూమి స్వరూపం మారిన వాటిమీద దృష్టిసారిస్తే విషయాలు బయటకొస్తాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌లో క్రయ విక్రయదారులను ఆరాతీస్తే వాటి వెనకున్నది ఎవరు, ఎవరి కోసం చేశారనేది బయటపడే అవకాశం ఉంది.

తెలియకుండానే రిజిస్ట్రేషన్

ఆనందపురం మండలం ముకుందాపురంలో సర్వే నంబరు 130/5లో 28 సెంట్ల స్థలానికి బి.సూర్యనారాయణకు 20 ఏళ్ల కిందట పట్టా ఇచ్చారు. ఆయనకు నలుగురు కుటుంబసభ్యులు. రీసర్వేలో ఆ నలుగురికి చెందాల్సిన స్థలాన్ని వారిలో ఒకరైన బి.సురేశ్ పేరు మీద నమోదుచేశారు. విచారణ సమయంలో తమకు రావాల్సిన వాటాను సురేశ్‌కు ఇచ్చేశారని మిగిలినవారు ఫిర్యాదుచేశారు. మరోవైపు సురేశ్ కూడా.. తనకు తెలియకుండానే తన పేరున స్థలం రికార్డు అయిపోయిందని చెప్పుకొచ్చారు. ఇదంతా బినామీ ద్వారా వ్యవహారం నడిచిందన్న అనుమానాలు కలుగుతున్నాయి.

◆ ఆనందపురంలో 407.774 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా, వాటిలో 123.050 ఎకరాలు రిజిస్టర్ అయ్యాయి. పద్మనాభం మండలంలో 145.741 ఎకరాలకు గాను 10.020 ఎకరాలు, భీమిలిలో 52.513 ఎకరాలకు 2.42 ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి.

కళ్లముందు కనిపిస్తున్నా..

గండిగుండం, మామిడిలోవ మరో రెండు, మూడు గ్రామాల్లో కొందరు పెద్దల బినామీలే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

◆ ఆనందపురం మండలం గండిగుండంలో అదే గ్రామంలోని 20 మంది నుంచి 10.50 ఎకరాలు ఒకే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీని వెనుక వైకాపా నేతలున్నా.. బయట పడనివ్వలేదు.

◆ ముకుందాపురంలో ఐదెకరాలు ఓ వైకాపా కీలక నేత బినామీగా ఉన్న వ్యక్తి కుటుంబసభ్యుల పేరున రిజిస్ట్రేషన్ జరిగింది. ఇదే గ్రామంలో పలు కుటుంబాలకు చెందిన 8 ఎకరాలు ఒకే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్లు అయ్యాయి. మరో రెండు ఎకరాలు వైకాపా నేతల సన్నిహితులకే చేశారు.

విచారణ కమిటీలతో..

ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాల వెలికితీతకు జిల్లా కలెక్టర్ కొద్దిరోజుల కిందట మండలాల వారీగా ఏడుగురు ఉప కలెక్టర్లతో కమిటీలు వేశారు. వారంతా కిందిస్థాయి సిబ్బందితో కలిసి దస్త్రాల తనిఖీతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామసభలు నిర్వహించారు. 20 ఏళ్ల కిందట ఇచ్చిన పట్టాదారు కుటుంబానికే ఫ్రీహోల్డ్ చేశారా లేదా, అప్పట్లో ఇచ్చిన విస్తీర్ణం మేరకు చేశారా ఇంకా అదనంగా ఇచ్చారా అన్నది తనిఖీ చేశారు. లోపాయికారీగా జరిగిన అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టలేదు. ఫ్రీహోల్డ్‌కు గుర్తించిన మొత్తం భూముల్లో తెరవెనుక అక్రమాల నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం మరింత గట్టిగా కృషిచేయాల్సి ఉంది.

విశాఖ డెయిరీ ఛైర్మన్ కుటుంబం చేతిలో రూ.వందల కోట్ల విలువైన సర్కారు భూమి

- జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

విశాఖపట్నం (సీతంపేట), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ కబ్జా దాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందని, ఉద్యోగుల ఇళ్ల కోసం కొనుగోలు చేసిన భూమిని తమ కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జనసేన నాయకుడు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. విశాఖ పౌరగ్రంథాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జీవీఎంసీ పరిధి చినగదిలిలో గతంలో సహకార సంఘానికి కేటాయించిన 7.90 ఎకరాల ప్రభుత్వ భూమి విశాఖ డెయిరీ ఛైర్మన్ కుటుంబం స్వాధీనంలో ఉంది. అక్కడ నిర్మించిన భవనాలకు జీవీఎంసీ అనుమతులు లేవు. ప్రస్తుతం ఈ భూమికి సంబంధించిన వివాదం సీసీఎల్ఏ పరిధిలో ఉంది. దీన్ని సొంతం చేసుకునేందుకు వైకాపా అధినేత జగన్‌కు పెద్దమొత్తంలో సొమ్ము ముట్టజెప్పారు. విజయనగరం జిల్లా గర్భాం ప్రాంతంలో ఎకరా రూ.18 లక్షలకు మించని 50 ఎకరాల భూమిని డెయిరీ డబ్బుతో రూ.38 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో విజయనగరానికి చెందిన కీలక నేత చక్రం తిప్పారు. ఈ భూముల కొనుగోలు పేరిట ఎంప్లాయిస్ ఫండ్ నుంచి రూ.7 కోట్లు తీసుకొని ఛైర్మన్ ఆనంద్‌కుమార్ ఎన్నికల్లో ఖర్చు చేశారు. విజయనగరం జిల్లా వై జంక్షన్ వద్ద డెయిరీ పేరిట అయిదెకరాలు కొనుగోలు చేసి అందులో 20 సెంట్ల భూమిని డెయిరీలోని ఓ డైరెక్టర్ పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. డెయిరీ ఉద్యోగుల ఇళ్ల కోసం సిబ్బంది నుంచి రూ.86 వేలు చొప్పున వసూలు చేసి అలా వచ్చిన మొత్తంతో విశాఖలోని నరవ గ్రామం వద్ద 3.20 ఎకరాలు కొనుగోలు చేశారు. ఛైర్మన్ కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువుల పేరిట ఉచితంగా ఒక్కొక్కరికి 30 సెంట్లు చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ సంస్థ ఎం.డి. ఎస్.వి.రమణ వాల్తేర్ క్లబ్‌లో సభ్యత్వం పొందేందుకు విశాఖ డెయిరీ నుంచి పెద్దమొత్తంలో సొమ్ము చెల్లించారు' అని ఆరోపించారు. వీటికి సంబంధించిన ఆధారాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆదాయపన్ను శాఖ కమిషనర్, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర శాఖలకు ఫిర్యాదు చేసినట్లు మూర్తి యాదవ్ తెలిపారు.

తల్లిదండ్రుల ఆరోగ్యానికి 'డోజీ శ్రవణ్' రక్ష

- ఎక్కడి నుంచైనా వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఏఐ గ్యాడ్జెట్



'డోజీ శ్రవణ్'ను ఆవిష్కరిస్తున్న మోహన్‌దాస్ పాయ్, ముదిత్ దండావతె తదితరులు




◆ పరుపు కింద అమర్చే సెన్సర్ వ్యవస్థతో పనిచేసే 'డోజీ శ్రవణ్'

ఈనాడు, బెంగళూరు: దేశం కాని దేశంలో ఉద్యోగం చేస్తూ.. స్వదేశంలో ఉన్న తల్లిదండ్రుల ఆరోగ్యంపై ఆందోళన చెందేవారు ఎంతో మంది. అలాంటి వారికి ఊరట కలిగించేందుకు ఏఐతో పనిచేసే గ్యాడ్జెట్ ఆవిష్కృతమైంది. తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని నిత్యం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు వారికి సమాచారం అందించే ఈ గ్యాడ్జెట్‌ను బెంగళూరులో ఆవిష్కరించారు. ప్రముఖ రిమోట్ పేషెంట్ మానిటరింగ్ సిస్టమ్స్ సొల్యూషన్స్ సంస్థ 'డోజీ' దీనిని ఆవిష్కరించింది. ఆ సంస్థ సీఈఓ ముదిత్ దండావతె దీని గురించి వివరించారు. 'డోజీ శ్రవణ్ పరికరాన్ని ఆరోగ్య సమస్యలున్న వారి మంచానికి అమర్చాలి. అది సెన్సర్ సాయంతో బాధితుల గుండె, ఊపిరితిత్తుల పనితీరుతో పాటు రక్తపోటు, ఆక్సిజన్ స్థాయి, నిద్ర వేళలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఏఐతో పనిచేసే బాలిస్టోకార్డియోగ్రఫీ గుండె పనితీరును అత్యంత సునిశితంగా అంచనా వేస్తుంది. వీటిని ఎప్పటికప్పుడు రోగుల పిల్లలు, వారి బంధువులతో పాటు ఆసుపత్రిలోని వైద్య బృందానికీ పంపుతుంది. ఏమైనా సమస్యాత్మకంగా ఉంటే అప్రమత్తం కూడా చేస్తుంది. ప్రస్తుతం ఈ సేవలందించే వ్యవస్థలు రోగుల ఆరోగ్యంపై రియల్‌టైమ్‌లో కచ్చితమైన నివేదికలు ఇవ్వడం లేదు. డోజీ శ్రవణ్ ఆ లోటును తీరుస్తుంది' అని పేర్కొన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ పరికరాన్ని తయారు చేశామని తెలిపారు.

చిత్తూరుకు మరో వైద్య కళాశాల

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేయనున్న సీఎంసీ వేలూరు



సమావేశంలో సీఎంసీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ జేవీ పీటర్, ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ విక్రమ్‌మాథ్యూ, ఏపీఎఫ్ సీఈవో అనురాగ్‌బెహర్, చిత్తూరు సీఎంసీ క్యాంపస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెన్నిడేవిడ్

ఈనాడు డిజిటల్, అమరావతి: చిత్తూరుకు మరో వైద్య కళాశాల రాబోతోంది. దీన్ని అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేయనున్నట్లు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ) వేలూరు సంస్థ ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం అక్కడ ఉన్న ఆసుపత్రిని 120 పడకల నుంచి 400కు పెంచుతున్నామని బెంగళూరులో బుధవారం జరిగిన సమావేశంలో ఆ సంస్థ ప్రకటించింది. భాగస్వామ్యంలో భాగంగా అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ రూ.500 కోట్లు సమకూరుస్తుందని తెలిపింది. 2025లో సీఎంసీ వేలూరు 125వ వార్షికోత్సవంలోకి అడుగు పెడుతున్నట్లు తెలిపింది.

భూ వినియోగ మార్పిడిపై కమిటీ పునర్నియామకం

ఈనాడు, అమరావతి: వివిధ నిర్మాణాలకు అనుమతులిచ్చే సందర్భంలో భూ వినియోగ మార్పిడి ప్రతిపాదనల పరిశీలనకు సంబంధించిన రాష్ట్రస్థాయి కమిటీని ప్రభుత్వం పునర్నియమించింది. కమిటీకి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. పురపాలక శాఖ కమిషనర్, విశాఖ మెట్రో ప్రాంతీయ అభివృద్ధి సంస్థ కమిషనర్, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ సభ్యులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ (టౌన్ ప్లానింగ్) ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) కమిటీ సభ్య కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

వివాహ ధ్రువీకరణ పత్రానికి దళారులను ఆశ్రయించొద్దు

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సూచన

ఈనాడు, అమరావతి: వివాహ ధ్రువీకరణ పత్రాన్ని పొందేందుకు ముస్లింలు దళారులను ఆశ్రయించవద్దని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో అబ్దుల్ ఖాదీర్ సూచించారు. వివాహ సమయంలో ఖాజీ ఇచ్చిన వివాహ బుక్‌లెట్ లేదా ప్రొఫార్మా ఆధారంగా వరుడు, వధువు, వారి అధీకృత బంధువు లేదా ప్రతినిధి కానీ విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రూ.300 చెల్లిస్తే 24 గంటల్లోనూ, రూ.200 చెల్లిస్తే రెండు రోజుల్లోనూ ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తామని వివరించారు. ఇందుకుగాను మధ్యవర్తులు, ఏజెంట్లు, దళారులను ఆశ్రయించొద్దని సూచించారు.

వరద మిగిల్చిన వేదన..

సహృదయుల స్పందనతో సాంత్వన

ఏటా కురిసే వర్షాలే.. ఈసారి జడివానై జడిపించేశాయి. ముంచుకొచ్చిన వరదలు.. జీవితాలను అతలాకుతలం చేశాయి. కట్టుబట్టలతో మిగిలినవారు కొందరైతే.. అయినవాళ్లను కోల్పోయినవారు మరికొందరు. ఇలాంటి అభాగ్యులను ఆదుకోవడానికి దాతలు నడుంబిగించారు. తలాకొంత సాయం చేస్తూ సాంత్వన చేకూరుస్తున్నారు.



రావెళ్ళ వెంకట సత్యకుమార్ చక్రవర్తి, హైదరాబాద్ విరాళం: రూ.1,00,000



డా. రావెళ్ళ అనిత, హైదరాబాద్ విరాళం: రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
చందోలు రామకృష్ణారావు, పిడుగురాళ్ళ, పల్నాడు జిల్లా	20,004
కోసూరు జగన్, విశాఖపట్నం	10,500
గుత్తా లలితమ్మ (కీ.శే.గుత్తా రత్నం నాయుడు గారి సతీమణి), ఇరికిపెంట, చిత్తూరు జిల్లా	10,116
ఆలమూరి కనకదుర్గాంబ, (కీ.శే.ఆలమూరి ప్రసాద్ గారి సతీమణి), హైదరాబాద్	10,001
సీహెచ్ రాజేంద్రప్రసాద్, విజయవాడ	10,000
కాసరనేని శ్రీకాంత్, యామిని, రవి, హైదరాబాద్	10,000
దామరాజు సుధాకర్, హైదరాబాద్	10,000
ద్రోణావఝల వెంకటేశ్వరశర్మ, హైదరాబాద్	10,000
ఎం.బసవరాజు, బెంగళూరు	5,001
కె.హరి, భారతి, హైదరాబాద్	5,001
గ్రామాభివృద్ధి సొసైటీ, వేజెండ్ల, గుంటూరు జిల్లా	5,000
శ్యామల రాంభొట్ల, హైదరాబాద్	5,000
పడాల లలిత్‌కుమార్, ఏలూరు	5,000
ఎస్.రాకేశ్, గూడూరు, రంగారెడ్డి జిల్లా	5,000
టి.లబన్‌బాబు, హైదరాబాద్	5,000
మలెంపాటి విఠల్‌బాబు, హైదరాబాద్	5,000
ఐసోల రామచంద్రరావు, హైదరాబాద్	5,000
బొమ్మన వీరభద్రరావు, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన ఝాన్సీలక్ష్మి, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన శ్రీకాంత్, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన సాయి శిరీష, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన షణ్ముఖ సాయి శ్రీహర్ష, రాజమహేంద్రవరం	5,000
బొమ్మన శ్రీహన్స్, రాజమహేంద్రవరం	5,000

ధైన్యం చూడండి ధైర్యం ఇవ్వండి

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి, SB A/C No: 370602010006658 IFSC: UBIN0537063

మన్యంలో మహా పుట్టగొడుగు



సాధారణంగా పుట్ట గొడుగు 3, 4 అంగుళాలు ఉంటుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రాపురం మండలం ఉమ్మడివరంలో ఏకంగా 2 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు పెరిగింది. అదీ కేవలం రెండు రోజుల్లోనే. ఆదివారం సాయంత్రం ఇక్కడ భారీ వర్షం కురిసింది. సోమవారం పుట్ట గొడుగు పెరగడం స్థానికులు గుర్తించారు. మంగళవారం నాటికి అది భారీగా పెరిగిపోయింది. స్థానికులు, చుట్టుపక్కల వాళ్లూ చూసి మొదట ఆశ్చర్యపోయి.. ఆ తర్వాత పూజలు చేశారు. మద్రిగూడెం ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వెంకటరావు దీన్ని పరిశీలించారు. "మూడు గొడుగులు ఒకదానిపై, మరొకటి చాలా పెద్దగా రావడం వింతగా ఉంది. కొద్దిరోజులు మాత్రమే ఇలా ఉంటుంది. తర్వాత వాడిపోతుంది. ఇలాంటి శిలీంధ్రాలు మన్యం ప్రాంతంలో కనిపించడం ఇదే తొలిసారి" అని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం

డీపీవో కార్యాలయాల్లో అక్రమ వసూళ్లపై విచారణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు, బదిలీల కోసం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కార్యాలయాల్లో అక్రమ వసూళ్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీకాకుళం, కర్నూలు, ప్రకాశం, అనకాపల్లి, విశాఖ డీపీవో కార్యాలయాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేయించి నివేదికలు పంపాలని కలెక్టర్లకు సూచించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8న 'బదిలీలైనా, పదోన్నతులైనా.. డీపీవో కార్యాలయాల్లో పండుగే' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన పత్రికలో వచ్చిన కథనంపై ప్రభుత్వం ఈ మేరకు స్పందించింది.

ఈనాడు సినిమా

వచ్చే ఏడాదిలోనే శ్రీకారం


మహేశ్‌బాబు

కథానాయకుడు మహేశ్‌బాబు - దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందనున్న సినిమా కోసం సినీప్రియులంతా ఆసక్తిగా చూస్తున్నారు. పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నా.. ఇంత వరకు చిత్ర బృందం నుంచి ఏ స్పష్టతా రాలేదు. అయితే ఇప్పుడీ విషయంపై ఈ చిత్ర కథా రచయిత విజయేంద్రప్రసాద్ ఓ కార్యక్రమంలో స్పందించారు. మహేశ్ - రాజమౌళిల సినిమా జనవరి నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని చెప్పారు. సాధారణంగా తాను ఓ కథ రాయడానికి మూడు నుంచి నాలుగు వారాలు పడుతుందని.. కానీ, ఈ చిత్ర కథ రాయడానికి రెండేళ్ల సమయం పట్టిందని వివరించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'ఎస్ఎస్ఎంబీ 29'గా పట్టాలెక్కనున్న ఈ సినిమా.. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ చిత్రంగా ముస్తాబు కానుంది. ఇందులో మహేశ్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన గెటప్పులో కనువిందు చేయనున్నారు. దీన్ని కె.ఎల్.నారాయణ నిర్మించనుండగా.. ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ కూడా భాగస్వామిగా వ్యవహరించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రజనీ సినిమాల్లో వేట్టయన్ భిన్నం


రజనీకాంత్

"రజనీకాంత్ ఇప్పటి వరకు చేసిన సినిమాలన్నింటిలో 'వేట్టయన్: ది హంటర్' చాలా భిన్నంగా ఉంటుంది" అన్నారు నటుడు రానా దగ్గుబాటి. రజనీ కథానాయకుడిగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. ఇందులో రానాతో పాటు అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇది ఈరోజు ప్రేక్షకుల ముందుకొస్తున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ.. "డబ్బింగ్ చిత్రాలంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ, ఇప్పుడు అన్ని చిత్రాలు అన్ని భాషల్లోకి వెళ్తున్నాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లో చూడండి. ఓ కొత్త అనుభూతి అందిస్తుంది. రజనీకాంత్ కొత్తగా కనిపిస్తార"న్నారు. "ఈ చిత్రానికి తెలుగులో 'వేటగాడు' అని టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ, అది వేరే వాళ్ల దగ్గర ఉంది. అందుకే అన్ని భాషల్లోనూ ఒకే టైటిల్‌తో విడుదల చేస్తున్నాం" అన్నారు నిర్మాత దిల్‌రాజు.

ఇద్దరిలో ఎవరు?


చిరంజీవి, రామ్‌చరణ్

సంక్రాంతి సినిమాలపై కొత్త సందేహాలు మొదలయ్యాయి. క్రిస్మస్‌కి వస్తుందనుకున్న రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' విడుదలపై ఇంకా స్పష్టత రాకపోవడమే అందుకు కారణం. ఈ సినిమా విడుదల క్రిస్మస్ నుంచి సంక్రాంతికి మారుతోందనే కొత్త ప్రచారం ఊపందుకొంది. అదే జరిగితే సంక్రాంతి కోసం ముస్తాబవుతున్న చిరంజీవి 'విశ్వంభర' విడుదల వాయిదా పడటం ఖాయమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కథానాయకుల సినిమాలు ఒకేసారి విడుదల కావడం కష్టం. అందుకే తండ్రీ తనయుల్లో సంక్రాంతికి సందడి చేసేది ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిన్న మొన్నటివరకూ సంక్రాంతి రేసులో ఉన్న సినిమాలు చిరంజీవి 'విశ్వంభర, బాలకృష్ణ 109వ చిత్రం, వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' మాత్రమే. 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి వస్తే మాత్రం, 'విశ్వంభర' వేసవి సందర్భంగా విడుదలయ్యే అవకాశాలున్నాయి.

"గతంలో నేను చేసిన 'లౌక్యం' తర్వాత మళ్లీ అంత మంచి హాస్యం 'విశ్వం' సినిమాలో కుదిరింది. ఇంటిల్లిపాదీ కలిసి హాయిగా నవ్వుకుంటూ ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం ఉన్న చిత్రమిది" అన్నారు గోపీచంద్. యాక్షన్, కామెడీ మేళవింపుతో కూడిన కథలతో పలు విజయాల్ని సొంతం చేసుకున్న కథానాయకుడీయన. మరోసారి ఆ తరహా కథతో, శ్రీనువైట్ల దర్శకత్వంలో 'విశ్వం' చేశారు. వేణు దోనేపూడి, టి.జి.విశ్వప్రసాద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కథానాయకుడు గోపీచంద్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

తప్పుని గుర్తించి మళ్లీ జరగకుండా జాగ్రత్త పడుతుంటా!


గోపీచంద్

◆ "దసరా సందర్భంగా వస్తున్న మా 'విశ్వం' పక్కా పండగ సినిమా. చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉంటారు. రెండున్నర గంటలు బయటి ప్రపంచాన్ని మరిచిపోయేలా చేస్తుంది. సినిమాని చూశాకే ఇది శ్రీనువైట్ల పూర్వ వైభవాన్ని చాటే చిత్రమని నమ్మకంగా చెప్పాను. కచ్చితంగా శ్రీనువైట్ల మార్క్ ఇందులో కనిపిస్తుంది. ఆయన సినిమాలో ప్రతి పాత్ర ఎందుకు అంతగా గుర్తుండిపోతుందో ఈ సినిమా ప్రయాణం తర్వాత ఇంకా బాగా అర్థమైంది. ఇది హీరో కథ. ఇందులో నా పాత్ర పేరు విశ్వం. ఆ పేరే సినిమాకి ఖరారు చేశారు దర్శకుడు. నా సెంటిమెంట్ ప్రకారం రెండక్షరాల పేరు పెట్టారా అంటే... ఈ సినిమాకి సరైన పేరు ఇదే అని చెప్పారు. మనదేశంలోని ఓ సమస్యని అంతర్లీనంగా చర్చించాం".

◆ "చెప్పాలనుకున్న కథకి హాస్యాన్ని మేళవించి చెబితే ప్రేక్షకులు ఇంకా బాగా స్వీకరిస్తారనేది శ్రీనువైట్ల నమ్మకం. ఆయన విజయాలు అదే విషయాన్ని చాటి చెబుతాయి. కామెడీ, యాక్షన్‌ని చాలా బాగా మేళవిస్తుంటారాయన. ఇందులో భావోద్వేగాలూ బలంగా ఉంటాయి. ఇలాంటి మేళవింపుతో కూడిన చిత్రాలు నాకు బాగా కలిసొచ్చాయి. కామెడీలో శ్రీనువైట్ల శైలి ప్రత్యేకం. చిత్రీకరణ చేస్తున్నప్పుడు శ్రీనువైట్ల టైమింగ్ పట్టుకోవడానికి నాకు తొలి రెండు రోజులు కష్టంగా అనిపించింది. మూడో రోజు నుంచి ఆయన్ని కాపీ కొట్టాను. ఇందులో కామెడీ చాలా బాగుంటుంది. సహజంగా నాకు నవ్వొస్తే ఆగదు. దాంతో సెట్లో నా నవ్వు వల్ల చాలా మంది నటులు ఇబ్బంది పడ్డారు. వాళ్లకు క్షమాపణలు కూడా చెప్పా (నవ్వుతూ). వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్, నరేశ్, ప్రగతితోపాటు, కథానాయిక కావ్య థాపర్... ఇలా అందరి పాత్రలూ గుర్తుండిపోతాయి. ఇందులో ట్రైన్ ఎపిసోడ్ ఉంటుంది. అది అంచనాలకి దీటుగా ఉంటుంది. అందులో హాస్యంతోపాటు, చిన్న ఉత్కంఠ కూడా కొనసాగుతూ చిత్రాన్ని మరింత ఆసక్తికరంగా మార్చేస్తుంది. చేతన్ భరద్వాజ్ సంగీతం, రవివర్మ యాక్షన్, గుహన్ ఛాయాగ్రహణం తదితర సాంకేతిక విభాగాలన్నీ మంచి పనితీరుని కనబరిచాయి. ఇప్పటివరకూ ఎవ్వరూ చిత్రీకరణ చేయని ప్రదేశాలకు వెళ్లి ఈ సినిమా చేశాం. ఆ ప్రభావం సినిమాలో కనిపిస్తుంది".

◆ "ఒక ప్రేక్షకుడిలాగే కథ వింటాను. కథ మొదలయ్యాక అందులో లీనం కావాలి తప్ప, బోర్ కొట్టకూడదు. అలా బోర్ కొట్టిందంటే కనెక్షన్ తెగిపోయిందని అర్థం. ఎన్ని సమీకరణాలు ఉన్నా... చివరికి నన్ను లీనం చేసే కథలవైపే మొగ్గు చూపుతుంటాను. కొన్నిసార్లు కథలు విన్నప్పుడు ఒకలాగా, తీరా అవి తెరపైకి వస్తున్నప్పుడు మరోలా మారిపోతుంటాయి. కొన్ని కథల విషయంలోనే అలా జరుగుతూ ఉంటుంది. తప్పు ఎక్కడ, ఎలా జరిగిందో చూసుకుని తర్వాత సినిమాకి పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతుంటాను. ఇన్నేళ్ల నా కెరీర్‌లో విజయాలున్నాయి, పరాజయాలు ఉన్నాయి. మొత్తంగా ఈ ప్రయాణం మాత్రం సంతృప్తినే ఇచ్చింది. తదుపరి యు.వి.క్రియేషన్స్‌లో సినిమా చేయబోతున్నా. కథ సిద్ధమవుతోంది. దర్శకుడు ఎవరనేది త్వరలోనే చెబుతాం. ప్రభాస్, నేను కలిసి చేసే సినిమా గురించి అడుగుతున్నారు. మాకూ చేయాలనే ఉంది. దానికి అన్నీ కుదరాలి. అప్పుడు తప్పకుండా చేస్తాం".

జనవరి నుంచి యాక్షన్ బాట


కమల్‌హాసన్

కమల్‌హాసన్ మునుపెన్నడూ లేనంత వేగంతో సినిమాలు పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటించిన 'భారతీయుడు 3' విడుదలకు సిద్ధంగా ఉంది. 'థగ్ లైఫ్' చిత్రీకరణ పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాల దశలో ఉంది. ఈ రెండూ తెరపైకి వచ్చేలోపే మరో కొత్త సినిమాని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు కమల్. 'కేహెచ్ 237' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రంతో ప్రముఖ స్టంట్ మాస్టర్స్ అన్బు-అరివు దర్శకులుగా పరిచయం కానున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా జనవరి నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ విషయాన్ని చిత్ర దర్శకులు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడించారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు ప్లాన్ ప్రకారం జరుగుతున్నాయని.. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రతి సినీ ప్రేమికుడికి ఓ విందులా ఉంటుందని తెలిపారు. తమ విజన్‌ను నమ్మి కమల్ ఇంత అద్భుత అవకాశం తమకి ఇవ్వడం అదృష్టమని పేర్కొన్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేయనున్నారు. ఈ సినిమాని కమల్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌పై నిర్మించనున్నారు.

'డియర్ జిందగీ' అవకాశం కత్రినాదే కానీ..!


కత్రినా కైఫ్


అలియా

'డియర్ జిందగీ'.. జీవితం ఎంత గొప్పదో తెలియజేసే సందేశాత్మక చిత్రమిది. బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను గౌరీ షిండే తెరకెక్కించారు. ఇందులో కైరా పాత్రలో అలియా, సైకాలజిస్టు పాత్రలో షారుక్ ఒదిగిపోయారు. ఇందులోని పేషెంట్, డాక్టర్ మధ్య భావోద్వేగ సన్నివేశాలు మనసుల్ని హత్తుకున్నాయి. కానీ.. ముందుగా ఈ చిత్రంలో కథానాయికగా అందాల తార కత్రినా కైఫ్‌ను ఎంపిక చేసుకున్నారట దర్శకుడు. ఆ తరవాత అనుకోని కారణాల వల్ల ఆ స్థానంలో తను నటించాల్సి వచ్చిందని అలియానే స్వయంగా ఓ సందర్భంలో పంచుకుంది. "ఈ సినిమాకు నేను ఫస్ట్ ఛాయిస్ కాదనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు. నేను ఇందులో చిన్న అమ్మాయిగా కనిపిస్తానని దర్శకురాలు షారుక్‌తో నటించడానికి అంగీకరించలేదు. ఏమయ్యిందో తెలియదు కానీ.. ఓ రోజు గౌరీ నా దగ్గరికి వచ్చి ఇందులో నటించమని అడిగింది. కొన్ని రోజుల తర్వాత కరణ్ జోహార్, షారుక్.. నన్ను ఈ చిత్రంలో కథానాయికగా తీసుకోమని గౌరీని ఒప్పించారని తెలిసింది. అలా నేను షారుక్‌తో నటించే అవకాశాన్ని దక్కించుకున్నాన"ని అప్పటి విశేషాలను గుర్తుచేసుకుంది అలియా.

'శ్వాగ్' లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి!


హసిత్ గోలీ, టీజీ విశ్వప్రసాద్, శ్రీ విష్ణు, దక్ష


"కొన్ని సినిమాలు బాగున్నాయనిపిస్తాయి. మరికొన్ని చిత్రాలు థియేటర్ నుంచి బయటకొచ్చాక కూడా మనల్ని వెంటాడుతాయి. దాని గురించి ఓ చర్చ జరిగేలా చేస్తాయి. 'శ్వాగ్' ఈ కోవకు చెందినదే. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి" అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని హసిత్ గోలి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. రీతూ వర్మ కథానాయిక. మీరా జాస్మిన్, దక్ష నగార్కర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "ఇలాంటి కొత్త కథలు, సవాళ్లు ప్రయత్నించకపోతే తర్వాతి తరానికి స్ఫూర్తినివ్వలేం. ఏమీ లేని నాకు ఇంత గుర్తింపు ఇచ్చింది తెలుగు ప్రేక్షకులే. అందుకే వాళ్ల రుణం తీర్చుకునే ప్రయత్నంలో ఇలాంటి గొప్ప కథలు చేయడానికి ప్రయత్నిస్తున్నా. ఈ చిత్రం చూసే కొద్దీ చాలా కొత్త విషయాలు తెలుస్తుంటాయి. ఏ ఉద్దేశంతో సినిమా అర్థమవుతుంది" అన్నారు. "ప్రేక్షకులు గెలవాలని శ్రీవిష్ణు ఈ చిత్రం చేశారు. మేము నమ్మినట్లుగా వాళ్లే గెలిచారు. అదే మాకు ఆనందం. ప్రేక్షకుల ఆదరణ చూసి మా రెండేళ్ల కష్టాన్ని మర్చిపోయాం" అన్నారు దర్శకుడు హసిత్ గోలి. ఈ కార్యక్రమంలో టీజీ విశ్వప్రసాద్, దక్ష, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

సంయుక్త తొలి నాయికా ప్రాధాన్య చిత్రం


సంయుక్త, రానా

తెలుగు చిత్రసీమలోకి అడుగు పెట్టిన అనతి కాలంలోనే వరుస విజయాలతో స్టార్ నాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది సంయుక్త మేనన్. ఇప్పుడామె తొలిసారి నాయికా ప్రాధాన్య చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతోంది. సంయుక్త ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా సమర్పిస్తున్న ఈ సినిమాకి యోగేశ్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రానా దగ్గుబాటి క్లాప్ కొట్టగా.. దిల్‌రాజు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. వశిష్ఠ, రామ్ అబ్బరాజు గౌరవ దర్శకత్వం వహించారు. వెంకీ కుడుముల, కోన వెంకట్ చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. అనంతరం సంయుక్త మేనన్ మాట్లాడుతూ.. 'ఇది ఓ బలమైన మహిళ పాత్ర చుట్టూ అల్లుకున్న ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది. దర్శకుడు ఈ స్క్రిప్ట్‌పై కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఇందులో సామాజిక, రాజకీయ అంశాలు మిళితమై ఉంటాయి. ఇంత అద్భుతమైన కథ నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా" అంది. "ఓ కొత్త పాయింట్‌తో థ్రిల్లర్ జానర్‌లో ఈ సినిమాని రూపొందించనున్నాం" అన్నారు దర్శకుడు యోగేశ్. నిర్మాత రాజేశ్ మాట్లాడుతూ.. "ఇదొక కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్. స్క్రిప్ట్ ఆద్యంతం ఆసక్తి రేకెత్తించేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సురేశ్‌బాబు, జెమినీ కిరణ్, సాహు గారపాటి, చుక్కపల్లి అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ మలయాళ నటుడు టి.పి మాధవన్ మృతి


టి.పి మాధవన్

ప్రముఖ మలయాళ నటుడు టి.పి మాధవన్ (88) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యం కారణంగా కేరళలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన ఆయన బుధవారం మృతి చెందినట్లు మలయాళ చిత్రసీమ వర్గాలు తెలిపాయి. 40 ఏళ్ల వయసులో నటుడిగా కెరీర్ మొదలుపెట్టిన ఆయన 'రాగం' సినిమాతో సినిమాల్లోకి ప్రవేశించి దాదాపు 600పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారు. ఆ తర్వాత కొంత కాలం అవకాశాలు రాకపోవడంతో 'దయ', 'కబాని' తదితర సీరియళ్లకు దర్శకుడిగా కూడా పనిచేశారు. మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (అమ్మ) మొదటి ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరించారు. మాధవన్ మృతిపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

రక్తఘాట్ ప్రజలను వెంటాడుతోన్న మంజులిక


'భూల్ భులయ్యా 3'

'ఈ ప్రపంచం మూర్ఖత్వంతో ఇంకా దెయ్యాలకు భయపడుతూనే ఉంది... ఆ భయాన్ని నా ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటాను' అంటూ 'భూల్ భులయ్యా 3'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు కార్తీక్‌ఆర్యన్. ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న హారర్ కామెడీ చిత్రమిది. అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ, విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'మంజులిక నేను వస్తున్నాను' అనే వ్యాఖ్యను జోడించింది. 'నేను కేవలం ఆత్మలతోనే మాట్లాడతాను' అంటూ రూహ్ బాబాగా కార్తీక్ ఆర్యన్ ప్రేక్షకులను అలరించనున్నారు. రక్తఘాట్‌లోని ప్రజలను వెంటాడేందుకు మంజులిక వస్తోంది.. 'మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయారా.. మా ఇద్దరిలో మంజులిక ఎవరో చెప్పండి' అనే సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. శరవేగంగా నిర్మాణ పనులు పూర్తిచేసుకుంటున్న ఈ చిత్రం దీపావళి సందర్భంగా విడుదల కానుంది.

హెజ్‌బొల్లా కీలక నేతపై గురి!

దమాస్కస్‌పై విరుచుకుపడిన ఇజ్రాయెల్

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లాకు చెందిన ఓ కీలక నేతను లక్ష్యంగా చేసుకుని సిరియా రాజధాని దమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఏడుగురు మృతి చెందారు. దమాస్కస్‌లోని మజ్జే జిల్లాలో నివాస, వాణిజ్య భవనాలపై ఇజ్రాయెల్ మూడు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఏడుగురు పౌరులు మృతి చెందారని సిరియా అధికారిక వార్తా సంస్థ తెలిపింది. అయితే మృతుల్లో ఆ నేత ఉన్నాడా, లేదా అనేది తెలియరాలేదు. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ పౌరులెవరూ మరణించలేదని ఇరాన్ రాయబార కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.



ఇజ్రాయెల్ క్షిపణి దాడుల కారణంగా లెబనాన్ రాజధాని బీరుట్‌లో ధ్వంసమైన భవనాలు

హెజ్‌బొల్లా సొరంగ మార్గం ధ్వంసం

దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు చెందిన సొరంగ మార్గాన్ని తమ బలగాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. 'సుమారు 25 మీటర్ల సొరంగ మార్గాన్ని గుర్తించి దాన్ని ధ్వంసం చేశాం. ఈ సొరంగం లెబనాన్‌లోని మార్వహీన్ ప్రాంతం నుంచి జరిత్ కమ్యూనిటీ సమీపంలోని ఇజ్రాయెల్ భూభాగంలోకి వచ్చింది. దీన్ని కొన్ని నెలల క్రితమే గుర్తించాం. దాడి సమయంలో సొరంగంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యాంటీ ట్యాంక్ క్షిపణులను గుర్తించాం' అని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారీ తెలిపారు. దక్షిణ లెబనాన్‌లోని గ్రామాల్లో సరిహద్దు వెంబడి మరిన్ని సొరంగాల కోసం ఇజ్రాయెల్ దళాలు వెతుకుతున్నట్లు ఆయన తెలిపారు.

42,000 దాటిన మృతులు

డెయిర్ అల్-బలా: ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 42,000 దాటిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. బుధవారం నాటికి ఆ సంఖ్య 42,010 అయిందని తెలిపింది. ఇందులో సగానికిపైగా పిల్లలు, మహిళలే ఉన్నారని పేర్కొంది. 97,720 మంది గాయపడ్డారని వివరించింది.

ఇజ్రాయెల్‌లో ఆరుగురికి కత్తిపోట్లు

ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలో బుధవారం చోటుచేసుకున్న ఘర్షణల్లో ఆరుగురు కత్తిపోట్లకు గురయ్యారు. హదేరా నగరంలో మోటార్ బైక్‌పై వచ్చిన దుండగుడు పలు చోట్ల దాడి చేశాడు. అనంతరం పారిపోయాడు. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే పోలీసులు దుండగుడిని వెంటాడి కాల్చి చంపారు.

హెజ్‌బొల్లా రాకెట్ దాడిలో ఇద్దరి మృతి

లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిన రాకెట్ బుధవారం ఇజ్రాయెల్‌లోని సఫేద్‌లో ఓ ఇంటిని నేరుగా తాకింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. దీంతోపాటు పలు ప్రాంతాలను రాకెట్లు తాకాయని పోలీసులు తెలిపారు. అయితే ఎవరికీ గాయాలైనట్లు తెలపలేదు.

ఇజ్రాయెలీ రిపోర్టర్ అరెస్టు

విదేశీ పాస్‌పోర్టుతో లెబనాన్‌లో ప్రవేశించిన ఇజ్రాయెల్ రిపోర్టర్ జోషువా అరెస్టయ్యారు. బ్రిటిష్ పాస్‌పోర్టుతో రెండు వారాల కిందట ఆయన లెబనాన్‌లోకి వచ్చారని స్థానిక పోలీసులు వెల్లడించారు. ఆయన వద్ద ఇజ్రాయెల్ ఐడీ కార్డు కూడా ఉండటంతో అరెస్టు చేశామని వివరించారు.

ఆత్మాహుతి దాడులకు సిన్వర్ ప్రణాళిక!

హమాస్ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇజ్రాయెల్‌పై ఆత్మాహుతి దాడులు చేయాలని యాహ్యా సిన్వర్ ఆదేశించినట్లు తెలిసింది. ఇస్మాయిల్ హనియే మరణం తర్వాత బాధ్యతలు చేపట్టిన వెంటనే వెస్ట్‌బ్యాంకు నుంచి ఇజ్రాయెల్‌లో ఆత్మాహుతి దాడులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీనిపై కొందరు హమాస్ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిసింది.

హెజ్‌బొల్లా ఆదేశాల లింకు తెగలేదు: రష్యా

హెజ్‌బొల్లా ఆదేశాల లింకు తెగలేదని, బలంగానే ఉందని రష్యా వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడులవల్ల అది దెబ్బతినలేదని పేర్కొంది. 'మాకున్న సమాచారం ప్రకారం.. హెజ్‌బొల్లా మిలిటరీ వింగ్ ఆదేశాల లింకు తెగలేదు. సంస్థ కార్యకలాపాల్లో మార్పు రాలేదు' అని రష్యా విదేశాంగశాఖ ప్రతినిధి జఖరోవా తెలిపారు.

ఇజ్రాయెల్ సరికొత్త 'లైట్ బీమ్' ఆవిష్కరణ

ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ సంస్థ సరికొత్త ఆయుధ సామర్థ్యాన్ని మరికొన్ని రోజుల్లో అమెరికాలో ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది. ఈ సంస్థ లైట్ బీమ్ లేజర్ ఇంటర్‌సెప్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. దీనిని వాషింగ్టన్ డీసీలో ప్రదర్శించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే యాంటీ ట్యాంక్ వ్యవస్థగా వాడుతున్న ట్రోఫీ వ్యవస్థకు దీనిని జత చేయనున్నారు. దీనికి యాంటీ డ్రోన్ సామర్థ్యాన్ని జత చేశారు. షార్ట్ డిఫెన్స్‌లో ఇది మెరుగైన పనితీరును కనబరుస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఐరన్ బీమ్ లేజర్ డిఫెన్స్ సిస్టమ్ పేరిట ఒక దానిని సిద్ధం చేసింది. మరోవైపు లైట్ బీమ్ వ్యవస్థ సామర్థ్యాలను ఇప్పటికే ఇజ్రాయెల్ దళాలు పరీక్షించాయి. వీటిని గాజాలో, లెబనాన్‌లో ఎక్కడ ఉపయోగించిందో మాత్రం వెల్లడించలేదు. ముఖ్యంగా డ్రోన్లపై ఇది సమర్థంగా పని చేయగలదని విశ్లేషకులు చెబుతున్నారు.

చరిత్ర ఇచ్చే తీర్పుపై ఆదుర్దాగా ఉన్నా

- భూటాన్‌లో జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య
- అంకిత భావంతో తీర్పులిచ్చానని వెల్లడి



భూటాన్ రాజుతో సీజేఐ

దిల్లీ: వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ భవిష్యత్తుపై తాత్విక ధోరణి కనబరిచారు. భూటాన్‌లో జిగ్మే సింగ్యే వాంగ్ చుక్ న్యాయ కళాశాల మూడో స్నాతకోత్సవ సభలో ప్రసంగిస్తూ తన పదవీ కాలంపై చరిత్ర ఎలాంటి తీర్పు ఇస్తుందోనని భయాలు, ఆదుర్దాలు వెంటాడుతున్నట్లు మాట్లాడారు. శక్తి మేర అంకిత భావంతో సేవలు అందించానని ఉద్ఘాటించారు. భారత సుప్రీం కోర్టుకు 50వ ప్రధాన న్యాయమూర్తిగా 2022లో బాధ్యతలు చేపట్టిన చంద్రచూడ్ నవంబరు 10న పదవీ విరమణ చేయనున్నారు. "నా రెండేళ్ల పదవీ కాలంలో ఏమైనా సాధించానా, చరిత్ర నా పాలనను ఎలా అంచనా వేస్తుందనే ప్రశ్నలు నన్ను ఆదుర్దాకు గురిచేస్తున్నాయి" అని చంద్రచూడ్ తెలిపారు. ఈ ప్రశ్నలకు కొన్నింటికి జవాబులు దొరక్కపోవచ్చన్నారు. తాను మాత్రం ప్రతి ఉదయం పదవీ బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించానని తెలిపారు. రోజంతా అత్యంత నిబద్ధతతో సేవలు అందించి ఆత్మసంతృప్తితో రాత్రి నిద్రకు ఉపక్రమించేవాడినని చెప్పారు. న్యాయమూర్తులు వృత్తిలో ప్రవేశించాక లక్ష్య సాధన కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంకోచాలను పక్కనపెట్టి లక్ష్యం దిశగా దృఢసంకల్పంతో పురోగమించాలని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో మనకు ఎదురయ్యే సవాళ్లు, అడ్డంకులు, భయాలను అధిగమించడం ద్వారానే మన వ్యక్తిత్వం వికసిస్తుందని న్యాయవిద్యార్థులకు ప్రబోధించారు.



రాష్ట్రపతికి జ్ఞాపికను బహూకరిస్తున్న కేంద్రమంత్రి ప్రతాప్ రావ్ జాదవ్

ఆయుర్వేద ప్రాచుర్యాన్ని దెబ్బతీసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

దిల్లీ: సాంప్రదాయక వైద్య విధానమైన ఆయుర్వేదంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాలతో దెబ్బతీస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. ఆయుర్వేద అవసరం నేటికీ ఎంతో ఉందని, ఈ ఔషధాల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి, అభివృద్ధిపరచడానికి అవసరమైన పరిశోధనలకు పెట్టుబడులను రాబట్టేందుకు కృషి జరగాలన్నారు. దిల్లీలో బుధవారం నిర్వహించిన అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) 8వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. ఆయుర్వేద వైద్యంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నందునే తరతరాలుగా ప్రజల్లో దీనిపై నమ్మకం చెక్కుచెదర లేదన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల స్థాయికి ఈ ఔషధాల నాణ్యతను చేర్చాలని సూచించారు. ఈ వైద్యం పేరుతో ప్రజలను మోసం చేసే వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

బైడెన్, నెతన్యాహు చర్చలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం ఫోన్లో చర్చలు జరిపారు. దాదాపు 7 వారాల తర్వాత వారు మాట్లాడుకోవడం ఇదే తొలిసారి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడులు, లెబనాన్‌లో భూతల పోరుపై వారు మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఈ చర్చల్లో కమలా హారిస్ కూడా పాలుపంచుకున్నారని శ్వేత సౌధం వెల్లడించింది. మరోవైపు ఇటీవలే ట్రంప్‌తో నెతన్యాహు ఫోన్లో చర్చలు జరిపారు.

ఇరాన్‌పై భీకరంగా దాడి చేస్తాం: ఇజ్రాయెల్

జెరూసలెం: ఇరాన్‌పై చేసే దాడి భీకరంగా, ఆశ్చర్యకరంగా ఉంటుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గ్యాలెంట్ స్పష్టం చేశారు. తాము చేసే దాడితో ఇరాన్ అయోమయంలో పడుతుందని, ఏం జరిగిందో అర్థం కానంతగా ఉంటుందని, ఎలా జరిగిందో కూడా అర్థం కాదని బుధవారం గ్యాలెంట్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. ఇటీవల ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారం తప్పదని ఇప్పటికే ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గ్యాలెంట్ ప్రకటన విడుదలైంది.

రూప్ కన్వర్ సతీ సహగమనం కేసు నుంచి 8 మందికి విముక్తి

- సంశయ లబ్ధి కల్పిస్తూ కోర్టు తీర్పు

జైపుర్: నిషేధిత మూఢాచారమైన సతీ సహగమనాన్ని కీర్తిస్తూ, దానిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలపై 37 ఏళ్లుగా అభియోగాలు ఎదుర్కొంటున్న 8 మందిని జైపుర్‌లోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. సంశయ లబ్ధి కింద వీరిని విడుదల చేస్తున్నట్లు బుధవారం తెలిపింది. ఇదే కేసులో 2004లో 25 మందిని న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించింది. మరో నలుగురు నిందితులు ఇప్పటికీ పరారీలోనే ఉన్నారు. ఇంకొందరు మృతి చెందారు. 1987 సెప్టెంబరు 4న రూప్ కన్వర్ అనే యువతి తన భర్త మరణించడంతో ఆయన చితిపై కూర్చుని సతీ సహగమనానికి పాల్పడ్డారు. ఇది జరిగిన ఏడాది తర్వాత రూప్ కన్వర్ సామాజిక వర్గానికి చెందిన కొందరు ఈ మూఢాచారాన్ని కీర్తిస్తూ ప్రచారం చేస్తుండగా 45 మందిని పోలీసులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు.

పోలీసు కస్టడీలో మహిళకు చిత్రహింసలు

- సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

కోల్‌కతా: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన ఓ మహిళను పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడంపై విచారణ జరపాలని కలకత్తా హైకోర్టు సీబీఐను ఆదేశించింది. ఆందోళన చేస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని శారీరకంగా హింసించారని ఇద్దరు మహిళా పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన జస్టిస్ రాజర్షీ భరద్వాజ్ గత నెల 8 నుంచి 11 మధ్య జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని సీబీఐను ఆదేశించారు.

బిగ్‌బాస్ సెట్స్ నుంచి గాడిదను తొలగించండి

- సల్మాన్‌ఖాన్‌కు పెటా ఇండియా లేఖ



దిల్లీ: ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్' 18వ సీజన్ సెట్స్‌లో గాడిదను ఉంచడంపై 'పెటా ఇండియా' అభ్యంతరం వ్యక్తం చేసింది. గాడిదను అక్కడి నుంచి తొలగించాలని కోరింది. ఈ మేరకు బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు బుధవారం లేఖ రాసింది. గాడిదను బిగ్ బాస్ సెట్స్‌లో ఉంచడంపై ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని అందులో పేర్కొంది. "మీ పలుకుబడిని ఉపయోగించి రియాలిటీ షో నిర్మాతలను ఒప్పించండి. గాడిదను సెట్స్ నుంచి తొలగించి.. మాకు అప్పగించండి" అని సల్మాన్‌కు పెటా ఇండియా విజ్ఞప్తి చేసింది.

కోల్‌కతాలో 'ఎయిర్‌బస్ బెలుగా ఎక్స్‌ఎల్'

- ఇక్కడి విమానాశ్రయంలో మొదటిసారి ల్యాండయిన భారీ విమానం



కోల్‌కతా: కోల్‌కతా విమానాశ్రయంలో మొదటిసారి ఎయిర్‌బస్ సంస్థకు చెందిన బెలుగా ఎక్స్‌ఎల్ సీరీస్‌కు చెందిన భారీ విమానం ల్యాండయింది. బహ్రెయిన్ నుంచి బయలుదేరి మంగళవారం రాత్రి 10.43 గంటలకు కోల్‌కతాకు చేరుకోగా, జలవందనంతో దానికి స్వాగతం పలికారు. ఇందులో విమాన భాగాలను రవాణా చేస్తున్నారని.. సిబ్బంది విశ్రాంతి కోసం, ఇంధనం నింపుకోవడానికి కోల్‌కతాలో ఆగినట్లు అధికారులు తెలిపారు. బెలుగా ఎస్‌టీ మోడల్‌ను ఉన్నతీకరించి.. దానికన్నా పెద్దగా ఎక్స్‌ఎల్‌ను తయారు చేశారు. ఇది 207 అడుగుల పొడవు, 62 అడుగుల ఎత్తు ఉంటుంది. దీని ఒక్కో రెక్క పరిధి 197 అడుగుల 10 అంగుళాలని ఎయిర్‌బస్ సంస్థకు చెందిన వెబ్‌సైట్ పేర్కొంది. ఈ మోడల్‌ను ఎయిర్‌బస్ కంపెనీ 2018లో మొదటిసారి ప్రదర్శించింది. 2019లో యూరోపియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ నుంచి ధ్రువీకరణ పొందింది. దీంతో బెలుగా ఎక్స్‌ఎల్ 2020 జనవరి నుంచి సేవలు అందించేందుకు మార్గం సుగమమైంది. కోల్‌కతా విమానాశ్రయంలో గతంలో ఏటీ సీరీస్ విమానాలు ల్యాండయ్యాయి. ఎక్స్‌ఎల్ సీరీస్ ల్యాండవటం ఇదే మొదటిసారని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెలుగా ఎక్స్‌ఎల్ (ఎయిర్‌బస్ ఏ330-743ఎల్) మోడల్ ఎయిర్‌బస్ రూపొందించిన రవాణా విమానం. ఇది భారీ వస్తువులను, ప్రధానంగా విమానం రెక్కలు, ఇతర భాగాలను రవాణా చేయడానికి తయారు చేశారు. కోల్‌కతాలో ఉన్న ఈ విమానం టౌలౌస్ ఎయిర్‌బస్ ఫ్యాక్టరీ నుంచి చైనాలోని టియాంజిన్‌లో ఉన్న మరో యూనిట్‌కు పరికరాలు, విడి భాగాలను తీసుకెళ్తోంది. బుధవారం సాయంత్రం ఇంధనం నింపుకొని, 5.50 గంటలకు బయలుదేరిందని అధికారులు తెలిపారు

ఓటమికి కాంగ్రెసే కారణం: శివసేన (ఉద్ధవ్)

ముంబయి: హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మితిమీరిన ధీమా వల్లే ఓడిపోయిందని మిత్రపక్షం శివసేన (ఉద్ధవ్) పార్లమెంటు సభ్యుడు సంజయ్ రౌత్ బుధవారం విమర్శించారు. కాంగ్రెస్ తాను బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో మిత్రపక్షాల మీద ఆధారపడుతుందని, బలంగా ఉన్న చోట్ల వారిని పక్కన పెట్టేస్తుందని వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్లే అక్కడ ఇండియా కూటమి గెలవగలిగిందని వివరించారు. హరియాణాలో కూడా కాంగ్రెస్ తన మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములైన సమాజ్‌వాదీ, ఆమ్ ఆద్మీ, శివసేన (ఉద్ధవ్) పార్టీలకు సీట్లు ఇచ్చి ఉంటే విజయం సాధించగలిగేదని పేర్కొన్నారు. అలా కాకుండా ఒంటరిగానే గెలవగలననే అతి ఆత్మ విశ్వాసంతో భంగపడిందని రౌత్ వ్యాఖ్యానించారు. కాగా రౌత్ బహిరంగ విమర్శలకు దిగడంపై మహారాష్ట్ర కాంగ్రెస్‌శాఖ అధ్యక్షుడు నానా పటోలే అసహనం వ్యక్తం చేశారు. ఒక కూటమిలో సభ్యులుగా ఉన్నప్పుడు పరస్పరం విమర్శలకు దిగకూడదని, మహారాష్ట్ర, హరియాణాల్లో పరిస్థితులు భిన్నమని పేర్కొన్నారు.

సంపన్న దేశాలకే క్యాన్సర్ కొత్త మందులు

- పేద దేశాల్లో లభ్యత అంతంతమాత్రమే
- అంతర్జాతీయ స్థాయి విశ్లేషణలో వెల్లడి

దిల్లీ: క్యాన్సర్ ఔషధాల లభ్యత ప్రపంచవ్యాప్తంగా ఏకరీతిలో లేదని తాజా విశ్లేషణలో తేలింది. ప్రధానంగా కొత్త రకం క్యాన్సర్ మందులు ధనిక దేశాల్లో వేగంగా అందుబాటులోకి వస్తుండగా.. అల్పాదాయ దేశాలు మాత్రం అంత త్వరగా వాటికి నోచుకోవడం లేదని నిర్ధారణ అయింది. 1990 నుంచి 2022 వరకు 111 దేశాల్లో క్యాన్సర్ ఔషధాల లభ్యతను అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ విశ్వవిద్యాలయం పరిశోధకులతో కూడిన బృందం విశ్లేషించింది. సంబంధిత వివరాలు తాజాగా బ్రిటిష్ మెడికల్ జర్నల్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమయ్యాయి. ఆ వివరాల ప్రకారం-

✦ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మందుల లభ్యతలో అసమానతలు ఎక్కువగా ఉన్నాయి.

✦ క్యాన్సర్ చికిత్స కోసం 1990ల నుంచి 2022 వరకు ప్రపంచంలో మొత్తంగా 568 కొత్త ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి.

✦ వాటిలో అత్యధికంగా అమెరికాలో 345, జపాన్‌లో 224, కెనడాలో 221, బ్రిటన్‌లో 190కిపైగా, చైనాలో 169 ఔషధాలను ఆవిష్కరించారు.

✦ 1990ల్లో సగటున ఒక్కో అధికాదాయ దేశంలో ఏడాదికి 0.5 చొప్పున క్యాన్సర్ కొత్త ఔషధాలను ఆవిష్కరించగా.. 2022 నాటికి ఆ సగటు 8.7కు పెరిగింది. ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, తూర్పు ఆసియా, ఆస్ట్రేలియాల్లో ఎక్కువగా క్యాన్సర్ మందులు అందుబాటులోకి వచ్చాయి.

✦ ఆ ఔషధాలు 1990ల్లో సగటున ఒక్కో ఎగువ మధ్యాదాయ దేశంలో ఏడాదికి 0.1 చొప్పున అందుబాటులోకి రాగా.. 2022 నాటికి అది 1.5కు పెరిగింది.

✦ దిగువ మధ్యాదాయ, అల్పాదాయ దేశాల్లో క్యాన్సర్ కొత్త మందుల లభ్యత పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫలితంగా ఆ దేశాల్లో క్యాన్సర్ రోగుల మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రధానంగా ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో కొత్త మందుల లభ్యత తక్కువగా నమోదైంది.

సంజయ్ రాయ్‌కు వ్యతిరేకంగా 11 సాక్ష్యాలు

- అభియోగపత్రంలో నివేదించిన సీబీఐ

కోల్‌కతా: ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌కు వ్యతిరేకంగా 11 బలమైన సాక్ష్యాలను సీబీఐ తన ఛార్జ్ షీట్‌లో ప్రస్తావించింది. పౌర వాలంటీరు సంజయ్ రాయ్‌కు చెందిన డీఎన్ఏ హతురాలి శరీరంపై లభ్యమైనట్లు అభియోగపత్రంలో పేర్కొంది. సీసీటీవీ ఫుటేజీ, నిందితుడి మొబైల్ ఫోన్ లొకేషన్, ఘటనాస్థలంలో లభ్యమైన వెంట్రుకలతో నిందితుడిని నిర్ధారించినట్లుగా వెల్లడించింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)కింద ఘటనలో ఏకైక నిందితుడైన సంజయ్ రాయ్‌పై వేర్వేరు సెక్షన్ల కింద కేసు నమోదైంది.

మంచి మనిషి.. నరేంద్ర మోదీ

- భారత ప్రధానిపై ట్రంప్ ప్రశంసలు

ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలతో ముంచెత్తారు. ఓ పాడ్‌కాస్ట్‌లో భాగంగా ప్రపంచ నేతల గురించి మాట్లాడుతూ..' 'మోదీ నాకు స్నేహితుడు. మంచి మనిషి. ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించక ముందు వరకు భారత్ పరిస్థితి అస్థిరంగా ఉండేద"న్నారు. ఈ క్రమంలోనే 2019 సెప్టెంబరులో అమెరికాలోని టెక్సాస్ వేదికగా నిర్వహించిన 'హౌడీ మోదీ' కార్యక్రమానికి విశేష స్పందన లభించిన విషయాన్ని ట్రంప్ గుర్తు చేసుకున్నారు. దాదాపు 80 వేలమంది వచ్చారని, అది ఎంతో ఉత్సాహంగా సాగిందని తెలిపారు. మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. పాకిస్థాన్-భారత్ ఉద్రిక్తతలకు సంబంధించి మోదీతో జరిపిన ఓ సంభాషణను ట్రంప్ ప్రస్తావించారు. "కొన్ని సందర్భాల్లో భారత్‌ను బెదిరించేందుకు ఓ దేశం యత్నించింది. ఇటువంటి వ్యవహారాలను చక్కబెట్టడంలో ఆరితేరానని, ఈ విషయంలో సాయం చేస్తానంటే మోదీ చాలా దూకుడుగా స్పందించారు. 'ఈ వ్యవహారాన్ని నేను చూసుకోగలను. అవసరమైతే ఏ చర్య తీసుకునేందుకైనా సిద్ధమే. దశాబ్దాల తరబడి వారిని ఓడించాం' అని మోదీ అన్నారు. ఇది విన్న నేను ఆశ్చర్యానికి గురయ్యాను" అని ట్రంప్ పేర్కొనడం విశేషం.

పెను విపత్తుకు చేరువవుతున్న పుడమి!

దిల్లీ: వాతావరణంలో వేగంగా ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటుండటంపై జర్మనీలోని పాట్స్‌డామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లైమేట్ ఇంపాక్ట్ రీసెర్చ్ పరిశోధకులు తాజాగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'వెనక్కి వెళ్లలేని ప్రకృతి విపత్తు' స్థాయి సమీపిస్తోందని పేర్కొన్నారు. భూమికి సంబంధించిన 35 కీలక సంకేతాల్లో 25 మునుపెన్నడూ లేనంత రికార్డు స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. పెను తీవ్ర వాతావరణ పరిస్థితులు తరచూ తలెత్తుతుండటం, శిలాజ ఇంధనాల నుంచి ఉద్గారాలు భారీగా పెరగడం, భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత రికార్డు స్థాయికి చేరుకోవడం, సముద్ర ఉష్ణోగ్రతలు అధికమవడం, సముద్ర మట్టాలు పెరగడం, మానవ జనాభా ఏటేటా విపరీతంగా పెరుగుతుండటం వంటివి వాటిలో కొన్ని ముఖ్యమైన సంకేతాలని వివరించారు. మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాలు మునుపెన్నడూ లేనంతగా రికార్డు స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. బొగ్గు, చమురు, సహజవాయువు వినియోగం (సంయుక్తంగా) 2022తో పోలిస్తే 2023లో 1.5% పెరిగిందని పేర్కొన్నారు.

మహారాష్ట్రలో చిరుత దాడి.. మహిళ మృతి

ముంబయి: మహారాష్ట్రలోని పుణెకు సమీపంలో గల పింప్రి - పెంధార్ గ్రామంలో బుధవారం సుజాత ధేరే అనే మహిళ చెరకుతోటల చుట్టూ ఉన్న సోయాబీన్ పొలంలో పనిచేస్తుండగా మాటువేసిన చిరుతపులి ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. దాదాపు వంద అడుగుల దూరం లాక్కెళ్లడంతో తీవ్రగాయాలపాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పింప్రి - పెంధార్ తదితర ప్రాంతాల్లో 40 బోనులు, 50 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటుచేసినట్లు అటవీశాఖ డివిజన్ అధికారి తెలిపారు. చిరుతపులి ఆచూకీని గుర్తించడానికి థర్మల్ డ్రోన్లను సైతం ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొంతకాలంగా మహారాష్ట్రలో చిరుతపులుల దాడులు పెరుగుతున్నాయి. చెరకు పొలాలు వీటికి సురక్షితమైన ఆవాసాలుగా ఉంటున్నాయి. జున్నార్ అటవీ డివిజను సమీపంలో మార్చి నుంచి ఇప్పటివరకు చిరుతల దాడిలో మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పింప్రి - పెంధార్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్న 10 చిరుతలను పట్టుకొని మే నెలలో గుజరాత్‌లోని వంతారా జంతు ప్రదర్శనశాలకు తరలించామన్నారు.

తప్పిపోయిన జవాన్ మృతదేహం లభ్యం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో తప్పిపోయిన ఓ జవాన్ విగతజీవిగా కనిపించారు. అనంతనాగ్ జిల్లాలో మంగళవారం కనిపించకుండా పోయిన హిలాల్ అహ్మద్ భట్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం ఉతరుసూలోని అటవీప్రాంతంలో జమ్మూకశ్మీర్ పోలీసులు, సైన్యం సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. రాత్రి వరకూ కొనసాగిన ఈ ఆపరేషన్ అనంతరం హిలాల్ భట్ కనిపించకుండా పోయారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతడి ఆచూకీ కోసం భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే తూటా గాయాలతో ఉన్న జవాన్ భౌతిక కాయాన్ని బుధవారం గుర్తించారు. కాగా జవాన్ మృతితో అతడి స్వగ్రామం నోగామ్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. మరోవైపు జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దు గుండా భారత్‌లోకి ప్రవేశించేందుకు యత్నించిన ఓ పాకిస్థాన్ చొరబాటుదారుడిని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అదుపులోకి తీసుకుంది.

దిల్లీలో ఒంటరి పోరే: ఆప్

దిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అంచనాలు తలకిందులు కావడంతో ఇండియా కూటమి పక్షాలు పునరాలోచనలో పడ్డాయి. ఈ క్రమంలో దేశ రాజధానిలో మరికొన్ని నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పేర్కొంది. కాంగ్రెస్ 'అతి విశ్వాసం' మితి మీరిందని విమర్శించింది. 'దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుంది. అతి విశ్వాసంతో ఉన్న కాంగ్రెస్, అహంకార భాజపాపై పోటీ చేసే సామర్థ్యం మాకుంది' అని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంకా కక్కర్ పేర్కొన్నారు. తన భాగస్వామ్య పక్షాలను హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పట్టించుకోలేదని, వారికి అతి విశ్వాసం మితిమీరడంతోనే ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు.

యూపీ ఉప ఎన్నికల్లో ఎస్పీ ఒంటరిగా పోటీ

లఖ్‌నవూ: హరియాణాలో కాంగ్రెస్ ఓటమితో పునరాలోచనలో పడిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఉప ఎన్నికలకు ఒంటరిగా వెళ్లాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఆఖర్లో జరగనున్న ఉప ఎన్నికలకు బుధవారం అభ్యర్థులను ప్రకటించింది. మొత్తం 6 స్థానాలకు పోటీ చేయనున్నట్లు స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే.

నేడు ఎన్‌సీ శాసనసభాపక్ష సమావేశం

శ్రీనగర్: నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభాపక్ష సమావేశం గురువారం శ్రీనగర్‌లో జరగనుంది. శాసనసభాపక్ష నేతగా ఒమర్ అబ్దుల్లాను ఎన్నుకోనుంది. ముఖ్యమంత్రిగా ఒమర్ బాధ్యతలు చేపడతారని ఇప్పటికే పార్టీ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష సమావేశంలో ఆయన ఎన్నిక కావడం లాంఛనమే. మంగళవారం వెల్లడైన జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో ఎన్‌సీ కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

జపాన్‌లో 27న పార్లమెంటు ఎన్నికలు

టోక్యో: జపాన్ కొత్త ప్రధాని షిగేరు ఇషిబా పార్లమెంటు దిగువ సభను బుధవారం రద్దుచేశారు. ఈ నెల 27న మధ్యంతర ఎన్నికలు జరుపుతామని ప్రకటించారు. అవినీతి ఆరోపణలతో ఫుమియో కిషిదా రాజీనామా చేయడంతో గత వారం ఇషిబా ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ప్రభుత్వ విధానాలపై చర్చ చేపట్టి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిందిపోయి ఆకస్మికంగా ఎన్నికలు జరపడమేమిటని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే, వాటి మధ్య ఐక్యత లేకపోవడం పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి కలసివచ్చే అంశం. ప్రజాభిప్రాయ సేకరణల్లో మాత్రం ఇషిబాకు ప్రజాదరణ 50 శాతానికి లోపే ఉంది.

స్పా సెంటర్ తాళాలు పగలగొట్టి.. అవాక్కైన మహిళా కలెక్టర్

బాడ్‌మేడ్: రాజస్థాన్‌లో బాధ్యతాయుతమైన పాలనా తీరుతో ప్రజాదరణ పొందిన జిల్లా కలెక్టర్లలో టీనా డాబీ ఒకరు. బాడ్‌మేడ్ కలెక్టరుగా ఇటీవల నియమితులైనప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా ఈమె విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వయంగా చీపురు పట్టుకోవడం, ఆసుపత్రుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను హెచ్చరించడం వంటి దృశ్యాలు ఇటీవల వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో ఓచోట అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సదర్ పోలీస్‌స్టేషను పరిధిలో చేపట్టిన పరిశుభ్రతా కార్యక్రమాన్ని కలెక్టర్ టీనా డాబీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూసి ఉన్న ఓ స్పా సెంటర్‌ను ఆమె గమనించారు. అనుమానం వచ్చి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన అధికారులు కంగుతిన్నారు. లోపల అయిదుగురు అమ్మాయిలు, పలువురు అబ్బాయిలు అభ్యంతరకర రీతిలో కనిపించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా ఇటువంటి స్పా సెంటర్లు అనేకం ఉన్నాయని.. పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, నేపాల్ నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి ఇక్కడ వ్యభిచారం నడుపుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. చర్యలు తీసుకోవడం మాత్రం ఇదే తొలిసారి అని స్థానికులు తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

దుర్గా దేవి!

శక్తిరూపం

నవరాత్రుల్లో అష్టమినాడు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరిస్తారు. అమ్మవారి అవతారాలన్నింటిలో ప్రధానమైనదీ దుర్గా స్వరూపమే! దుర్గతి హారిణి... దుర్గతులను హరించి ఉన్నతస్థానంలో నిలబెడుతుంది కాబట్టి, ఈ పేరు అని కొందరంటే దుర్గుడు, దుర్గముడు అనే రాక్షసులను సంహరించినందుకే 'దుర్గ'గా పిలుస్తారని మరికొందరంటారు. దేవీ మహాత్మ్యం ప్రకారం ఈ అమ్మవారు మహిషాసురుడిని చంపడానికి పుట్టింది. కన్య చేతిలో తప్ప చనిపోకూడదని వరం పొందిన మహిషాసురుడు దేవతలు, రుషులనీ కష్టాలపాలు చేస్తుంటాడు. అది విని కోపగించుకున్న



విష్ణువు కనుబొమ్మల మధ్య నుంచి ఓ దివ్యశక్తి వస్తుంది. దానికి ఇతర దేవతల శక్తులూ కలుస్తాయి. అలా ఏర్పడిన అమ్మవారు మహిషాసురుడిపై యుద్ధానికి వెళుతుంది. ఆ రాక్షసుడేమో అమ్మవారి రూపాన్ని చూసి పెళ్లి చేసుకోమంటాడు. తనని ఓడిస్తే చేసుకుంటానంటుందా తల్లి. తొమ్మిదిరోజులు యుద్ధం చేసినా ఓడించలేకపోతాడు. తనే ప్రాణాలు కోల్పోతాడు. అమ్మవారిది ఉగ్రరూపం... దురాలోచనలు ఉన్నవారిని సమీపంలోకీ రానివ్వదట. నమ్మినవారికి మాత్రం శాంతంగా కరుణిస్తుంది. ఎల్లప్పుడూ రక్షణగా నిలుస్తుంది. అందుకే ఆమెను కొలిచినవారికి తీరని కోరికలంటూ ఉండవంటారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల గొప్ప అవతారం... దుర్గాదేవి.

సేవలోనే... నన్ను నేను తెలుసుకున్నా!

'సమాజానికి కొంతైనా తిరిగిచ్చేయాలి...' ఇదేదో సినిమా డైలాగ్ కాదు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) మనదేశంలోకి రాకముందే... దాదాపు మూడు దశాబ్దాల క్రితమే దీన్ని తమ స్లోగన్‌గా చేసుకుంది నాట్కో ఫార్మా. అందుకోసం ఏర్పాటు చేసిన ట్రస్ట్‌ని తన బిడ్డగా భావించారు ఆ ఇంటి కోడలు స్వాతి నన్నపనేని. ట్రస్ట్ హెడ్‌గా ఆహారం, ఆరోగ్యం, విద్య, జీవన నైపుణ్యాలు, ఉపాధి కల్పన... వంటివాటి ద్వారా పేదలకు శక్తినీ ఆత్మవిశ్వాసాన్నీ ధైర్యాన్నీ కలిగిస్తూ దుర్గమ్మలా రక్షణనిస్తున్నారు. ఆమెను 'వసుంధర' పలకరించింది.



చిన్నప్పటినుంచీ 'నేనేంటీ... ఏం చేయాలీ...' అన్న ప్రశ్న నన్ను వేధించేది. అందుకు నేను చదివిన రిషీ వ్యాలీ స్కూల్, నీకంటూ ఓ వ్యక్తిత్వం ఉండాలనే నాన్న మాటలూ కారణం కావచ్చు. మాది వైజాగ్. నాన్న కంఠమణి రత్నకుమార్ న్యాయవాది. అమ్మ రమాదేవి. మా ఇంట్లో వేడుకలేవైనా ఆర్భాటాలు ఉండవు. ఆరోజుల్లో వృద్ధాశ్రమాలకు తీసుకెళ్లేవారు. నాన్న కూడా రిషీవ్యాలీ విద్యార్థి. ప్రపంచం పట్ల అవగాహన వస్తుందని చిన్నప్పుడే నన్నూ, అక్కనీ అక్కడ చేర్పించారు. పచ్చని వాతావరణం, మంచి టీచర్లు, భిన్న రంగాల ప్రముఖులు చెప్పే తరగతులు... నా ఆలోచనలకు పదును పెట్టేవి. ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ, పీజీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఫిల్ చేశా. అందులో నా రిసెర్చ్ టాపిక్... 'ఆఫ్రికన్ అమెరికన్ విమెన్ ఇన్ లిటరేచర్'. ఒకప్పుడు ఆఫ్రికా తప్ప ఏ దేశంలోనైనా సాహిత్యంలో పురుషులదే హవా. కానీ అమెరికాకి బానిసలుగా వచ్చి... పల్లెపదాలు పాడుతూ పనులు చేస్తూ ఆఫ్రికా మహిళలు ఎదిగిన తీరు, ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్యపోయా. అన్నీ ఉన్నా మనకు లేని ఆ ధైర్యం వాళ్లకెలా వచ్చింది అనిపించేది.

ఆడపిల్లల సంఖ్య పెరిగింది

పెళ్లయ్యాక ఓరియెంట్ లాంగ్‌మన్ పబ్లిషింగ్ హౌస్‌లో పిల్లల సాహిత్యం, సోషల్ సైన్సెస్ పుస్తకాల విభాగానికి ఎడిటర్‌గా చేరా. మా సీఓఓ నందిని ప్రోత్సాహంతోనే ఆక్స్‌ఫర్డ్‌కి వెళ్లా. అక్కడి చదువు నాలో కష్టపడే తత్వాన్ని పెంచింది. తిరిగొచ్చాక ఓరియెంట్ లాంగ్‌మన్‌లోనే చేరా. ఓసారి మావయ్య వెంకయ్య చౌదరి నన్నపనేని 'మన దగ్గరే చేయొచ్చు కదా' అనడంతో... అవగాహన పెంచుకోవడానికి తండాలూ నక్సల్ ప్రభావిత ఊళ్లకెళ్లా. వాళ్ల కష్టాలు చూశాక... 'వాళ్లేం పాపం చేశారు' అనిపించేది. కుటుంబం బాగుండాలంటే తల్లి బాగుండాలని గర్భిణులకి పోషకాహారం అందివ్వడం మొదలుపెట్టా. పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా అంగన్‌వాడీలనూ తీర్చిదిద్దుతున్నా. స్కూళ్లకి సౌకర్యాలు కల్పించడం, పునర్నిర్మాణమూ చేస్తున్నాం. ఈమధ్య కొత్తూరులో ఆధునిక సౌకర్యాలతో స్కూలు కట్టిచ్చాం. అక్కడికొచ్చిన టీచర్లు 'ఇంత చక్కని ప్రభుత్వ పాఠశాలను ఎక్కడా చూడలేదు' అన్నారు. ప్రకృతిలోనూ పాఠాలు చెప్పే ఏర్పాట్లూ ఉన్నాయక్కడ. పరిశుభ్రమైన టాయ్‌లెట్లతో ఆడపిల్లల సంఖ్య పెరిగింది. ఇలా ఎన్నో స్కూళ్లను పునరుద్ధరించాం. స్పోర్ట్స్ ప్రాజెక్టులు, కెరియర్ కౌన్సెలింగ్‌తోపాటు గురుకుల ప్రవేశపరీక్షలూ రాయిస్తున్నాం. యువతకీ మహిళలకీ ఉపాధి కల్పించాం.

లక్షలమందికి సేవలు

ఓసారి నీలోఫర్ ఆసుపత్రిలో ఇద్దరు మృతశిశువులను చేతిలో పెట్టుకుని ఏడుస్తున్న తల్లిని చూశా. కనీసం కూర్చోవడానికీ స్థలం లేదామెకు. అది చూసి తట్టుకోలేకపోయా. అక్కడో అవుట్ పేషెంట్ వార్డుని కట్టిచ్చా. గ్రామీణుల కోసం మొబైల్ క్లినిక్‌లు, ఎంఎన్‌జేలో పీడియాట్రిక్ పేలియాటివ్ కేర్, గుంటూరులోని జీజీహెచ్‌లో రూ.45కోట్లతో క్యాన్సర్ సెంటర్ వంటివీ ఏర్పాటు చేశాం. నిజానికి ప్రభుత్వాసుపత్రుల్లో మంచి వైద్యులున్నా రద్దీ కారణంగా ఓపిగ్గా చెప్పే తీరిక ఉండటం లేదు. అందుకే గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్, సరోజినీదేవి... వంటివాటిల్లో రోగుల్ని గైడ్ చేసేందుకే కౌన్సెలర్లను పెట్టాం. ప్రభుత్వ సంస్థలతో కలిసే మేం సేవల్ని అందిస్తున్నాం. తెలుగురాష్ట్రాల్లో 50కి పైగా ఊళ్లల్లో లక్షలమందికి మా సేవలు అందించాం.

నిజానికి ప్రభుత్వమే పెద్ద ఎన్జీవో. ప్రభుత్వ స్కూళ్లూ ఆసుపత్రుల్లో చదువు బాగుండదనీ సౌకర్యాల్లేవన్న కారణంతో జనం వాటికి దూరమవకూడదు. ప్రభుత్వానికీ అన్నీ చేయడం కుదరకపోవచ్చు. అందుకే ఆ ఖాళీని మేం భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

ట్రస్ట్ సేవలు మొదట్లో సంతృప్తికోసం చేశా. ఇప్పుడు సమాజం పట్ల బాధ్యతగా భావిస్తున్నా. ఈక్రమంలో ఎన్నో పురస్కారాలు అందుకున్నా... ఈ రెండు దశాబ్దాల ప్రయాణం... నన్ను నాకు పరిచయం చేసింది. ఏ డిగ్రీల్లోనూ దొరకని జ్ఞానాన్ని పొందా. దైవత్వాన్ని మించిన భావన అది. అందుకే సీఎస్ఆర్ అన్న పరిమితి పెట్టుకోలేదు. మాకిద్దరు పిల్లలు. వాళ్లతోపాటే ట్రస్ట్ కూడా నాకు బిడ్డే. సేవలకు సంబంధించి మావయ్య, మావారు రాజీవ్ చాలా ప్రోత్సహిస్తారు. నేను ట్రస్ట్ పనుల్లో బిజీగా ఉంటే పిల్లల బాధ్యత రాజీవ్ తీసుకుంటారు. మా సిబ్బంది, వాలంటీర్లు... గ్రామాల్లోనే ఉండి బాధ్యతగా విధుల్ని నిర్వర్తిస్తారు. సేవ అంటే... ఇవ్వడం, తీసుకోవడం కాదు, ఎవరి మనోభావాలూ దెబ్బతినకుండా గౌరవం తగ్గకుండా చూసుకోవడం కూడా. ఆ దిశగానే శక్తిమేరకు పనిచేస్తున్నా!

పూల జాతర



బతుకమ్మకు... తామర పూల శోభ!

ఆధ్యాత్మిక పరిమళాల్ని వెదజల్లుతూ అందంగా విరిసే తామర పూలు....పూజలకి విశిష్టమైనవిగా చెబుతారు. వీటిని లక్ష్మీదేవి నివాసంగా కొలుస్తారు. బతుకమ్మని పేర్చడంలోనూ వీటికి ప్రాధాన్యం ఇస్తారు. తెలుపు, ఎరుపు, గులాబీ, ఊదా...ఇలా ఎన్నో రంగుల్లో కనువిందు చేస్తాయివి. తామర పూలే కాదు, కాడలు, గింజలూ అన్నింటిలోనూ పోషకాలు ఉంటాయట. ఔషధ గుణాలు పుష్కలమే. ముఖ్యంగా దీన్ని రక్తస్రావాన్ని నిరోధించడంలో వాడతారు. తామరతైలం మలబద్ధకాన్ని తగ్గిస్తుందట. ఈ పువ్వు రేకల్ని సౌందర్య ఉత్పత్తుల్లోనూ వాడతారు. అనేక చర్మ సంబంధిత సమస్యలకు పరిష్కారంగా సూచిస్తారు.

కురులకు లవంగ స్నానం!

పట్టుకుచ్చులాంటి కురులంటే మనసు పారేసుకోనివారుండరు. ఒత్తైన జుట్టుతో ముఖం మరింత అందంగానూ మారుతుంది. అయితే వాతావరణ మార్పులు, కాలుష్య ప్రభావంతో శిరోజాలు పొడిబారి జీవాన్ని కోల్పోతుంటాయి. ఇలాకాకుండా ఉండాలంటే లవంగ స్నానాన్ని మించిన ఔషధం లేదంటున్నారు నిపుణులు.

రెండు కప్పుల నీళ్లలో రెండు టేబుల్‌స్పూన్ల లవంగాలు వేసి అయిదారు నిమిషాలపాటు మరగనిచ్చి చల్లార్చాలి. దీన్ని ఒక రాత్రంతా ఉంచి, ఆ తర్వాత వడకట్టి పొడిసీసాలో నింపి మూత బిగించి చల్లని ప్రదేశంలో భద్రపరచాలి. తలస్నానం చేసిన వెంటనే ఈ నీటిని తలకు రాయాలి. కుదుళ్లకంతా పట్టించి మాడుపై మృదువుగా పది నిమిషాలపాటు మర్దనా చేసి మరో అయిదునిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత మంచినీళ్లతో జుట్టును కడిగేస్తే సరి.



ప్రయోజనాలెన్నో...

వంట రుచిని పెంచే లవంగాల్లో కురులకు రక్తాన్ని సరఫరాచేసే గ్రంథులను ఉత్తేజపరిచే లక్షణాలూ ఉన్నాయి. ఇన్ఫెక్షన్లను నిరోధించి ఇవి కుదుళ్లను, మాడును ఆరోగ్యంగా ఉంచుతాయి. చైనాలో పురాతన ఔషధంగానూ, మన దేశంలో ఆయుర్వేదవైద్యంలోనూ వినియోగించే ఈ లవంగాల్లో యాంటీ ఆక్సిడెంట్లూ పుష్కలంగా ఉంటాయి. యాంటీమైక్రోబియల్, యాంటీ ఫంగల్ లక్షణాలతో మాడుపై ఇన్‌ఫ్లమేషన్‌నూ ఇవి తగ్గించగలవు. దీంతో శిరోజాలు రాలడం, చుండ్రు, దురదవంటి సమస్యలు దూరమవుతాయి. యుక్తవయసులోనే జుట్టు నెరవడాన్ని ఈ లవంగ స్నానం నియంత్రిస్తుంది. వారానికి రెండుసార్లు చేసే ఈ స్నానంతో మృదువైన శిరోజాలను సొంతం చేసుకోవచ్చు.

సెలవుల్లో బాకీ తీర్చండి!



తనివి తీరా నిద్రపోయి లేస్తే... ఎంత ఉత్సాహంగా ఉంటుందో కదా! అందుకే శరీరం, మనసు ఆరోగ్యంగా ఉండాలంటే నిద్ర తప్పనిసరి అని చెబుతారు. పిల్లల బాధ్యతలు, ఆఫీసు పనులు... కారణమేదైతేనేం చాలామందికి కంటినిండా కునుకే కరవు అయిపోతుంది. కానీ అది గుండెకు ముప్పు తెస్తుంది. కాబట్టి, వారాంతాలు, సెలవులను ఉపయోగించుకోండి. ఆరోజు కాస్త ఆలస్యంగా లేచిగానీ, మధ్యాహ్నం వేళ నడుము వాల్చిగానీ నిద్ర బాకీ తీర్చేయండి అంటున్నారు యూకే పరిశోధకులు. దాదాపు లక్షమందిని రెండు బృందాలుగా చేశారట. ఒకదాన్ని వారాంతాల్లో పడుకోమని యాక్టివిటీ మానిటరింగ్ గడియారాల ద్వారా వాళ్ల నిద్రతీరును పరిశీలించారట. ఇక మరో బృందాన్ని నిద్రలేమి ఉన్నా ఎప్పట్లాగే తమ పనిని కొనసాగించమన్నారట. కొన్నేళ్ల తరవాత పరిశీలిస్తే రోజూ నిద్ర లేకపోయినా వారాంతాల్లో దాన్ని భర్తీ చేసుకున్నవారిలో 19% గుండెజబ్బుల ముప్పు తగ్గిందట. అందుకే సెలవులు, ఆదివారాలను ఉపయోగించుకోండి. ఆలస్యంగా లేచి, తరవాతే పనులు చక్కబెట్టుకోండి. ఉత్సాహంగా లేస్తారు కాబట్టి, పనులూ త్వరగా పూర్తవుతాయి, అనారోగ్యాలూ దరిచేరకుండా ఉంటాయి... ఏమంటారు?

బంగారం వెండి



9న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	77050	77790	74,900	75,560
ఆర్నమెంట్	71,100	71,800	70,300	71,000
వెండి (కిలో)	90,379	92,443	91,000	93,100
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	77,450	78,000	77,350	78,000
ఆర్నమెంట్	71,720	72,230	71,100	71,670
వెండి (కిలో)	91,000	92,100	91,000	92,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	76,420	77,180	------	------
ఆర్నమెంట్	70,300	71,000	7,030	7,100 గ్రా
వెండి (కిలో)	------	94,000	100.00	102.00 గ్రా

వాటిని చూస్తేనే వికారం!

నేను గర్భవతిని. ఈ సమయంలో పాలు తాగాలని వైద్యులు సూచించారు. నాకేమో వాటిని చూస్తేనే వాంతి, వికారంగా అనిపిస్తుంది. కడుపు ఉబ్బరంగానూ ఉంటోంది. మరి పాల ద్వారా వచ్చే పోషకాలను ఎలా భర్తీ చేసుకోవాలి? – ఓ సోదరి

గర్భధారణ సమయంలో కొన్ని రకాల ఆహారాలు తినాలనిపించదు. రుచి, వాసన, టెక్చర్‌కు సంబంధించి సెన్సిటివిటీ పెరగడమే ఇందుకు కారణం. దాంతో కొంతమందికి కొన్ని ఆహారాలు నచ్చకపోవడం, వాంతులు అవడం, గ్యాస్ ఉన్న భావన కలుగుతుంది. మరికొందరికేమో ఎక్కువగా తినాలనిపిస్తుంది. వీటన్నింటికీ హార్మోన్లలో మార్పులే కారణం. అయితే, వారాలు గడిచేకొద్దీ ఈ భావన తగ్గుతుంది. అందుకే, ఇప్పుడు పాలు మీకు నచ్చడం లేదని అసలు తాగడం మానేయొద్దు. రెండు వారాల తరవాత మళ్లీ ప్రయత్నించండి. గర్భిణిగా ఉన్నప్పుడు పాలు, పాల పదార్థాలు తప్పనిసరి. వాటిద్వారా బిడ్డకూ, మీకూ పోషకాలు అందుతాయి. పాలు శరీరానికి అవసరమైన అమైనోయాసిడ్లు అందిస్తాయి. కాల్షియం, విటమిన్-డి, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు లభిస్తాయి. గర్భిణిగా ఉన్నప్పుడు రోజుకు 400- 600మి.లీ పాలు తాగాలి. 100మి.లీ పెరుగు, 30గ్రాముల పన్నీర్ వంటివీ తీసుకోవచ్చు. ఒకవేళ, పాలు నేరుగా తాగలేకపోతే, ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవాలి. పాలలో యాలకులు, పసుపు, నట్స్... లాంటివి ఏదో ఒకటి కలిపి తీసుకోవచ్చు. ఫ్రూట్ కస్టర్డ్, పాన్‌కేక్స్, కూరలతో కలిపి కూడా పాల పదార్థాలు వాడొచ్చు. గ్యాస్ ఇబ్బంది పెడుతుందంటే చల్లనిపాలు తాగండి. దానివల్ల అసౌకర్యంగా అనిపించదు. పోషకాలూ అందుతాయి.

డియర్... వసుంధర




డా. లతాశశి
పోషకాహార నిపుణురాలు

ఆడదామా... కోలాటం!



నవరాత్రుల్లో అందర్నీ ఆకట్టుకునే నృత్యం... కోలాటం. బతుకమ్మ, దుర్గమ్మ పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ రంగురంగుల దుస్తుల్లో మహిళలు గుండ్రంగా తిరుగుతుంటే చూసేవాళ్లకి కన్నులపండగే. ఇక ఆడేవాళ్లకొచ్చే జోష్‌ని మాటల్లో చెప్పలేం. సాయంత్రం ఆరుగంటలకి మొదలైన ఆట... ఓ పట్టాన ఆపాలనిపించదు. అందుకే ఒకప్పటితో పోలిస్తే... కోలాటానికి ఆదరణ పెరిగిందనే చెప్పాలి. విజయనగర రాజుల కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ ఆట... పూర్వం జానపదుల్లోనే ఎక్కువ కనిపించేది. కానీ ఇప్పుడిది అందరి నృత్యం. కోల అంటే కర్రపుల్ల, ఆట అంటే నృత్యం అని అర్థం. పల్లె, పట్టణం; చిన్నాపెద్దా భేదం లేకుండా పండుగల వేళ... అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మహిళలంతా ఒకచోట చేరి సాయంత్రాలు ఒకే రంగు దుస్తులేసుకుని మరీ కోలాటమాడుతున్నారు. పైగా ఈమధ్య అన్ని రకాల పాటల్నీ కోలాటంలో చేరుస్తున్నారు. కానీ, కోలు కోలన్న చెలియ మేలుకోలన్న..., ఆకు వక్క గన్నేరు చెక్క..., అందరాల అడగనే రదు మా పెళ్లికూతురు కొందరాల కసరనే రదు మా పెళ్లికూతురు... ఇలా కోలాటానికి ప్రత్యేకమైన పాటలూ ఉన్నాయి. చేతుల్ని పైకీ కిందకీ కదుపుతూ ఒకరి కర్రల్ని ఒకరు కొడుతూ ఒకే తీరులో అడుగులేయడం శరీరానికి మంచి వ్యాయామం, గుండెకి ఆరోగ్యం. ఇది కండరాల బలాన్ని పెంచి, ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గిస్తుంది. పిల్లలకి దీనివల్ల ఏకాగ్రత, మోటార్‌స్కిల్స్, సమన్వయం... వంటివి పెరుగుతాయి. ఒకరి చేతి కర్రల్ని మరొకరి కర్రలకి తగిలిస్తుంటే వచ్చే శబ్దానికి గాజుల గలగలలు, అందెల రవం, బృంద గానం తోడై వీనులవిందుని కలిగిస్తాయి. మనసు ఆనందంతో నిండిపోతుంది. ఇంకెందుకు ఆలోచన... ఆడటం రాదనో... సిగ్గనో ఓ మూలకి చేరకుండా అందరితో కలిసిపోండి... ఆడి పాడండి!

భిక్షమెత్తిన చేతులు... వైద్యం చేయనున్నాయి!



'నాకే ఆ అవకాశం వచ్చుంటేనా...' ఎవరైనా విజయం సాధించినప్పుడో... ఉన్నత స్థానానికి చేరుకున్నప్పుడో చాలామంది అనుకునే మాటే ఇది! కానీ వచ్చినదాన్ని వినియోగించుకుని తలరాతను మార్చుకునేదెందరు? అలాంటివారికి పింకీ హర్యన్‌ని చూపించాలి. ఇంతకీ ఈమెవరు? ఏం సాధించింది... అంటే...


సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం... నలుగురు జాలిపడి డబ్బులిస్తే కడుపు నిండుతుంది. లేదంటే అమ్మానాన్నలతో కలిసి చెత్తకుండీలో ఏదైనా ఆహారం దొరుకుతుందేమో అని వెతుక్కోవాల్సిందే! ఇదీ పింకీ హర్యన్ పరిస్థితి. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల దగ్గర్లోని మెక్‌లోడ్‌గంజ్ అనే మారుమూల ప్రాంతం ఈమెది. ఆమెనోసారి టిబెట్ బౌద్ధసన్యాసి చూశారు. ఆయన ధర్మశాలలోని ఛారిటబుల్ ట్రస్ట్‌కి డైరెక్టర్ కూడా. నాలుగేళ్ల ఆ చిన్నారి పరిస్థితి చూసి చలించిపోయిన ఆయన తనకు సాయం చేయాలనుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రులతో ఆమెకు చదువు చెప్పిస్తా... తనతో పంపమన్నారు. కానీ వాళ్లు ససేమిరా అన్నారు. కొన్నిగంటలపాటు కష్టపడితేగానీ వాళ్లు ఒప్పుకోలేదు. చిన్నారి పింకీని ధర్మశాలలోని ఆశ్రమానికి తీసుకొచ్చి స్కూల్లో చేర్పించారాయన.



పింకీ

కొత్త మనుషులు, తెలియని ప్రదేశం... తొలిరోజుల్లో అక్కడ ఉండటానికి పింకీ కాస్త భయపడింది. కానీ అక్కడి వాళ్లు ఆమెను ప్రేమగా ఆదరించారు. తరవాత తన తలరాతను, ఇప్పుడు ఆమె పరిస్థితినీ మార్చేది చదువే అని అర్థమయ్యాక కష్టపడి చదవడం మొదలుపెట్టింది. వైద్యవిద్య ప్రవేశపరీక్ష- నీట్‌లోనూ ర్యాంకు సాధించింది. కానీ దానికయ్యే ఖర్చు ఆమెను ముందడుగు వేయనీయలేదు. అప్పుడు యూకేకు చెందిన మరో ట్రస్ట్ ఆమెకు అండగా నిలిచింది. వాళ్ల ఆసరాతో 2018లో చైనాలోని మెడికల్ కళాశాలలో సీటు సాధించడమే కాదు తాజాగా విద్యాభ్యాసమూ పూర్తిచేసుకుని వచ్చింది. విదేశాల్లో చదివింది కాబట్టి, ఇక్కడ ప్రాక్టీసు చేయాలంటే అర్హత పరీక్ష రాయాలి. ఇప్పుడా పనిలో ఉందామె. 'చిన్నతనంలో అత్యంత కఠినమైన పరిస్థితులను చూశా. అవే నన్ను కష్టపడి చదివేలా చేశాయి. చిన్నప్పుడు ఏమవుతావంటే అనుకోకుండానే 'డాక్టర్' అని సమాధానమిచ్చా. ఇప్పుడా విద్యతోనే పేదవారికి సాయపడాలనుకుంటున్నా'నంటోన్న పింకీ స్ఫూర్తితో ఆమె తోబుట్టువులూ స్కూల్లో చేరారు. కష్టంతో తన తలరాతను మార్చుకున్న పింకీ కథ ఆదర్శమేగా మరి?

అలంకరణకు రంగుల కార్నేషన్!





అంచుల్లో వంపులు, ఆకట్టుకునే రంగులు, పొడవైన కాడలతో విచ్చుకునే పూల మొక్క కార్నేషన్. దీన్ని మనం పెంచుకోవాలంటే...

కార్నేషన్ పూలు అలంకరణలకు పెట్టింది పేరు. దీని శాస్త్రీయ నామం డయాంథస్ కారియోఫిల్లస్ లేదా క్లోవ్ పింక్, క్లోవ్ రోజ్ అని పేరు. ఇది వెదజల్లే పరిమళం... సుగంధ ద్రవ్యాలైన జాజికాయ, దాల్చిన చెక్క, లవంగం కలయికగా అనిపిస్తుంది. ఈ వాసనను ప్రముఖ బ్రాండ్లు పర్‌ఫ్యూమ్‌గానూ తెచ్చాయి. ఈ పూలు ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు...వంటి ఎన్నో రంగుల్లో కనువిందు చేస్తాయి. కార్నేషన్ పూల గొప్పతనాన్ని రెండువేల క్రితం నాటి గ్రీకు సాహిత్యంలోనూ వర్ణించారట. ఎర్రటి కార్నేషన్ పూలను పాశ్చాత్యదేశాల్లో కార్మిక ఉద్యమానికి చిహ్నంగా వాడతారట. స్లోవేనియాలో మహిళాదినోత్సవం రోజున వీటిని పంచుకుంటారు. ఇలాంటి సంప్రదాయాలు ప్రపంచమంతా చాలానే ఉన్నాయి.

ఎలా పెంచాలంటే...

మనమూ ఈ కార్నేషన్ మొక్కల్ని పెంచుకోవచ్చు. అయితే, కొన్ని జాగ్రత్తల్ని తీసుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా వీటికి నాలుగైదు గంటలైనా ప్రత్యక్ష కాంతి అవసరం. మరీ ఎండ ఎక్కువైతే షేడ్ నెట్ వేయడం తప్పనిసరి. తేలిగ్గా ఉండే పొడి నేలల్లో ఇవి బాగా పెరుగుతాయి. బంకమట్టిలో ఇవి బతకవు. అయితే, వీటికి నీటి అవసరం పెద్దగా ఉండదు. కొత్తగా మొక్కలు నాటినప్పుడు మాత్రం వారానికోసారి వేర్లు తడిచేలా నీటిని అందించాలి. పూలు ఎక్కువగా రావాలంటే... ఎండిపోయిన పూలను ఎప్పటికప్పుడు తీసేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కకు ఫంగస్ చేరకుండా ఉంటుంది. చిన్నచిన్న పురుగులు, తెల్లదోమ కార్నేషన్‌ని బాగా ఇబ్బందిపడతాయి. వీటిని అరికట్టడానికి అరలీటరు నీటిలో అర చెంచా వేపనూనె, పావుకప్పు బేకింగ్ సోడా కలిపి మొక్క చుట్టూ గాల్లోకి స్ప్రే చేస్తే సరి. కార్నేషన్ మొక్కల చుట్టూ మల్చింగ్ చేయకూడదు. వేళ్లకు గాలి తగలకుండా ఇవి అడ్డుపడితే... మొక్క చనిపోతుంది. ఇక, పోషకాల కోసం ప్రతి పదిహేను రోజులకోసారి పొటాషియం ఎక్కువగా ఉండే ఎరువుని అందించాలి. అప్పుడే ఆరోగ్యంగా, అందంగా కార్నేషన్ పూలు మీ ఇంట పూస్తాయి.



రూ.27,870 కోట్ల హ్యుందాయ్ ఐపీఓ

రిటైల్ మదుపరి కనీస పెట్టుబడి రూ.13,720



దిల్లీ: దేశంలో అతి పెద్ద ఐపీఓకు రంగం సిద్ధమైంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా తొలి పబ్లిక్ ఇష్యూ ఈ నెల 15-17 తేదీల్లో జరగనుంది. యాంకర్ మదుపర్లు 14న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.1,865-1,960గా నిర్ణయించినట్లు కంపెనీ అధికారికంగా వెల్లడించింది. రిటైల్ మదుపర్లు కనీసం 7 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు రూ.13,720 అవుతుంది. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టేవారు రిటైల్ మదుపర్ల విభాగంలోకి వస్తారు కనుక, ఒక్కొక్కరు 14 లాట్ల వరకు దరఖాస్తు చేయొచ్చు. షేరు గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.27,870 కోట్లు సమీకరించనుంది.

ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే: 14,21,94,700 ఈక్విటీ షేర్లను హ్యుందాయ్ మోటార్ కంపెనీ ఈ ఇష్యూలో విక్రయించనుంది. తాజాగా ఎలాంటి షేర్లను జారీ చేయడం లేదు. ఇందుకోసం కంపెనీ విలువను రూ.1.6 లక్షల కోట్లు (19 బిలియన్ డాలర్లు)గా పరిగణించారు.

జనవరి-మార్చిలో క్రెటా ఈవీ

దేశీయ విద్యుత్ వాహన (ఈవీ) విపణిలో ఆధిపత్యం కోసం 4 కొత్త మోడళ్లను విడుదల చేయనున్నట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో క్రెటా ఈవీని విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధమైనట్లు పేర్కొన్నారు. హ్యుందాయ్ ఉత్పత్తుల్లో అత్యంత విజయవంతమైన మోడల్‌గా క్రెటాకు పేరుంది. ఇందులో ఈవీ తీసుకురావడం ద్వారా భారత విద్యుత్ వాహన విపణిలో తమ స్థానాన్ని పదిలం చేసుకుంటామని గార్గ్ తెలిపారు. 2030 నాటికి బలమైన వృద్ధి సాధిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగులకు రూ.186 రాయితీ

అర్హత కలిగిన తమ ఉద్యోగుల కోసం 7,78,400 షేర్లను సంస్థ రిజర్వ్ చేసింది. ఒక్కో షేరును రూ.186 రాయితీపై వీరికి కేటాయిస్తారు. విక్రయానికి ఉంచిన మొత్తం షేర్లలో 50 శాతాన్ని అర్హత కలిగిన సంస్థాగత మదుపర్లకు, 15 శాతాన్ని సంస్థాగతేతర మదుపర్లకు, 35 శాతాన్ని రిటైలర్లకు కేటాయిస్తారు.

ఇప్పటి వరకు అతిపెద్ద ఇష్యూలు	నిధులు	సమయం
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)	రూ.21,000 కోట్లు	2022 మే
వన్ 97 కమ్యూనికేషన్స్ (పేటీఎం)	రూ.18,300 కోట్లు	2021 నవంబరు
కోల్ ఇండియా	రూ.15,199 కోట్లు	2010 అక్టోబరు
రిలయన్స్ పవర్	రూ.11,563 కోట్లు	2008 జనవరి
జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్	రూ.11,176 కోట్లు	2017 అక్టోబరు


ఐకియాలో పండగ ఆఫర్లు

హైదరాబాద్: ఫర్నీచర్ సంస్థ ఐకియా, ప్రస్తుత పండగల సీజన్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందిస్తోంది. గృహ ఫర్నీచర్ నుంచి ఆహారం వరకు వినియోగదారులకు పలు రాయితీలు ఇస్తున్నట్లు ఐకియా తెలిపింది. ఈ ఆఫర్లు నవంబరు 3 వరకు లభిస్తాయి. ఎంపిక చేసిన గృహ ఫర్నీచర్‌పై 70% వరకు రాయితీ పొందొచ్చు. రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ కొనుగోలు చేసిన వారికి రూ.1500 ఓచర్ ఇస్తున్నామని, పండగల సీజన్ తర్వాత కూడా దీన్ని ఉపయోగించి పొదుపు చేసుకోవచ్చని ఐకియా వివరించింది. రూ.5,000కు మించి హోమ్ ఫర్నీచర్‌పై 10% అదనపు రాయితీ, అసెంబ్లింగ్-ఇన్‌స్టలేషన్ సేవలపై 50% రాయితీ పొందొచ్చని వివరించింది. ఐకియాలోని ఇన్‌స్టోర్ రెస్టారెంట్, స్వీడన్ ఫుడ్ మార్కెట్‌లో రూ.750తో కొనుగోలు చేస్తే రూ.150 రాయితీ పొందొచ్చు. ఈ రాయితీని నవంబరు 7 నుంచి డిసెంబరు 15 మధ్య రెడీమ్ చేసుకోవచ్చు.

డిసెంబరులో కీలక రేట్ల కోత!

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష

- తటస్థ విధాన వైఖరికి మారడం ద్వారా సంకేతాలు
- పదోసారీ రెపో రేటు 6.5% వద్దే
- యూపీఐ లైట్ పరిమితి రూ.2,000 నుంచి రూ.5,000కు పెంపు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనాలు		
త్రైమాసికం	రిటైల్ ద్రవ్యోల్బణం	వృద్ధి రేటు
ఏప్రిల్-జూన్	4.9%	6.7%
జులై-సెప్టెంబరు	4.1%	7.0%
అక్టోబరు-డిసెంబరు	4.8%	7.4%
జనవరి-మార్చి	4.2%	7.4%

దిల్లీ: అందరూ ఊహించినట్లే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) కీలక రేట్లలో మార్పు చేయలేదు. 2023 ఫిబ్రవరి నుంచి వరుసగా పదో ద్వైమాసిక సమీక్షలోనూ రెపో రేటును 6.5 శాతంగానే కొనసాగించింది. అయితే డిసెంబరు 4-6 తేదీల్లో నిర్వహించే తదుపరి సమావేశాల్లో కీలక రేట్లను తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019 జూన్ తర్వాత ఆర్‌బీఐ అనుసరిస్తున్న 'సర్దుబాటు విధాన వైఖరి ఉపసంహరణ' నుంచి తొలిసారి తటస్థ విధాన వైఖరికి మారడాన్ని ఇందుకు సంకేతంగా భావించొచ్చు. డిసెంబరులో 0.25%, తదుపరి మరో 0.25% రేట్ల కోత విధించొచ్చని అంచనా వేస్తున్నారు. సోమవారం నుంచి జరిపిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ బుధవారం వెల్లడించారు.

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలు యథాతథం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను 4.5% వద్ద, జీడీపీ వృద్ధి అంచనాను 7.2 శాతంగా ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వృద్ధిరేటు 15 త్రైమాసికాల కనిష్ఠమైన 6.7% కావడం గమనార్హం.

యూపీఐ లైట్ పరిమితి రూ.5,000కు పెంపు

యూపీఐ లైట్ వాలెట్ ద్వారా ఒక రోజులో నిర్వహించే లావాదేవీల పరిమితిని రూ.5,000కు ఆర్‌బీఐ పెంచింది. అంతకుముందు ఇది రూ.2,000గా ఉండేది. ఒక్క లావాదేవీకి పరిమితిని కూడా రూ.500 నుంచి రూ.1,000కు సవరించింది. ఫీచర్ ఫోన్ల వినియోగదార్ల కోసం తీసుకొచ్చిన యూపీఐ 123పే ద్వారా లావాదేవీ పరిమితిని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచింది.

నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌లోనూ పేరు పరిశీలన సౌలభ్యం

నగదు బదిలీ లావాదేవీని ప్రారంభించడానికి ముందు.. మనం ఎవరి ఖాతాకైతే డబ్బు పంపిస్తున్నామో ఆ ఖాతాదారు పేరును పరిశీలించుకునే సదుపాయాన్ని నెఫ్ట్ (నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్), ఆర్‌టీజీఎస్ (రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్) చెల్లింపు వ్యవస్థల్లోనూ ఆర్‌బీఐ అందుబాటులోకి తేనుంది. ప్రస్తుతం ఈ సౌలభ్యం యూపీఐ, ఐఎంపీఎస్‌లో ఉంది. ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎంటర్ చేయగానే అవతలి వ్యక్తి పేరు కనిపిస్తుంది. వేరే వ్యక్తి ఖాతాలోకి పొరపాటున డబ్బులు పంపడం లాంటి సమస్యను ఇది దూరం చేస్తుంది. మోసాలూ తగ్గుతాయి.

అనైతిక ఎన్‌బీఎఫ్‌సీలపై కఠిన చర్యలు

కొన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) అసాధారణ రీతిలో వృద్ధి చెందేందుకు అనైతికత వ్యాపార విధానాలను అనుసరిస్తున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. ఇందువల్ల ఆ సంస్థల ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలోకి జారుకుంటుందని, ఆర్థిక స్థిరత్వానికీ ముప్పు ఏర్పడుతున్నందున.. కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌బీఐ హెచ్చరించింది. సూక్ష్మ రుణ - గృహ రుణ సంస్థలు సహా ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఈ హెచ్చరిక చేసింది.

ఎంపీసీ పునర్నిర్మాణం తర్వాత తొలి సమావేశం

ఎంపీసీ కొత్త సభ్యులుగా రామ్ సింగ్, సౌగత భట్టాచార్య, నగేశ్ కుమార్‌లను ప్రభుత్వం ఇటీవల నియమించాక, జరిగిన తొలి సమావేశం ఇదే. ఎంపీసీలోని ఆరుగురు సభ్యుల్లో అయిదుగురు కీలక రేట్ల యథాతథానికి మొగ్గు చూపారు.

> 'ముందుముందు ద్రవ్యోల్బణం తగ్గుతుందని బలంగా నమ్ముతున్నాం. అయితే అంతర్జాతీయంగా రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల వల్ల, వాతావరణ పరిస్థితులు, కమొడిటీ ధరల రూపంలోనూ ద్రవ్యోల్బణానికి సవాళ్లు ఎదురుకావచ్చు. అందువల్ల కీలక రేట్లను తగ్గించే విషయంపై ఇప్పుడే మాట్లాడటం సరికాదు. దేశీయంగా ధరల పెరుగుదలను సమ రీతిలో పరిశీలించాకే తటస్థ విధాన వైఖరికి ఆర్‌బీఐ మారింది. భవిష్యత్తులో కీలక రేట్ల నిర్ణయం విషయంలో ఎంపీసీకి ఇది వెసులుబాటు కలిగిస్తుంది. అధిక వడ్డీ రేట్లు ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ప్రభావం చూపిస్తున్నట్లు సంకేతాలైతే లేవు. 18 నెలలుగా ఇదే స్థాయిలో కీలక రేట్లున్నా, ఆర్థిక వ్యవస్థ బలంగా రాణించడం ఇందుకు నిదర్శనం'.
>
> - శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నరు

> 'రుతు పవనాలు, ఆహార ద్రవ్యోల్బణంతో పాటు ఆర్థిక వ్యవస్థ తీరును ఆర్‌బీఐ గమనిస్తోంది. నాలుగో త్రైమాసికంలో కీలక రేట్ల కోత ఉండొచ్చని భావిస్తున్నాం'
>
> - అభీక్ బారువా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

> 'ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను నియంత్రిస్తూనే, వృద్ధిని వేగవంతం చేయాలన్న ఉద్దేశంతో ఆర్‌బీఐ కీలక రేట్లను యథాతథంగా ఉంచినట్లు కనిపిస్తోంది'
>
> - అజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఎండీ, సీఈఓ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

స్థిరాస్తి రంగం కోసమైనా: క్రెడాయ్

స్థిరాస్తి రంగ వృద్ధికి ఊతమిచ్చేందుకైనా వడ్డీ రేట్లను ఆర్‌బీఐ తగ్గిస్తే బాగుండేదని క్రెడాయ్ అభిప్రాయపడింది. ప్రస్తుత పండగ సీజనులో కొత్త ఇళ్ల బుకింగ్‌లు పెరిగేందుకు ఉపయోగ పడేదని తెలిపింది. కీలక రేట్లలో మార్పు చేయనందున ఓ మంచి అవకాశాన్ని కోల్పోయినట్లు అయ్యిందని పేర్కొంది.



అయిదేళ్లలో రూ.74,000 కోట్లకు ఆన్‌లైన్ గేమింగ్ విపణి

ఈనాడు, హైదరాబాద్: దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న రంగాల్లో ఆన్‌లైన్ గేమింగ్ ఒకటిగా నిలుస్తోంది. ప్రస్తుతం రూ.26,000 కోట్ల స్థాయిలో ఉన్న ఈ విపణి, అయిదేళ్లలో దాదాపు రూ.74,000 కోట్లకు చేరుతుందనే అంచనాలున్నాయని ఇ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్) సీఈఓ అనురాగ్ సక్సేనా తెలిపారు. 2018-23లో ఈ రంగంలో ఉద్యోగాల సంఖ్య 20 రెట్లు పెరిగిందని వెల్లడించారు. ఆన్‌లైన్ గేమ్‌లలో నైపుణ్యంతో ఆడే వాటికీ, జూదానికీ తేడా గుర్తించాలని అన్నారు. చట్టవ్యతిరేకమైన బెట్టింగ్, జూదంలాంటి వాటిని కట్టడి చేయాల్సిందేనని తెలిపారు. దేశంలో 700కు పైగా సంస్థలు గేమింగ్ రంగంలో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాల కల్పనలో కీలకంగా మారుతున్న ఈ రంగంలో మనదేశం నుంచి ఆవిష్కరణలు పెరగాలన్నారు. 44.2 కోట్ల మంది ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతున్నారన్నారు. అంతర్జాతీయంగా గేమింగ్ విపణికి మనదేశం నాయకత్వం వహించే వీలుందన్నారు. గత ఏడాది కాలంలో గేమింగ్ రంగం రూ.6,909 కోట్ల జీఎస్‌టీ చెల్లించిందని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 4,369 టెక్ అంకురాలు ఉండగా, అందులో 77 గేమింగ్ స్టార్టప్‌లు ఉన్నాయన్నారు.

నాణ్యత లేని మందులపై కఠిన చర్యలు

డ్రగ్ కంట్రోలర్ జనరల్

దిల్లీ: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఔషధాలు తయారు చేస్తున్న కంపెనీలపై కొరడా ఝుళిపిస్తున్నట్లు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) రాజీవ్ సింగ్ రఘువంశి స్పష్టం చేశారు. నాణ్యత లేని 45 మందులను మార్కెట్ నుంచి వెనక్కి పిలిపించినట్లు ఆయన బుధవారం దిల్లీలో వెల్లడించారు. 5 కల్తీ మందులపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి నెలా దాదాపు 2000కు పైగా మందుల శాంపిళ్లను తాము పరీక్షిస్తున్నామని, అందులో 40-50 మందులు నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగా ఉండటం లేదని వివరించారు. నాణ్యత లేని మందుల వినియోగం హానికరం కాబట్టి, వాటిని వెనక్కి పిలిపిస్తున్నట్లు చెప్పారు.

హైదరాబాద్‌లో జడ్ఎస్ కొత్త కార్యాలయం

ఈనాడు, హైదరాబాద్: మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, టెక్నాలజీ సేవల సంస్థ జడ్ఎస్, హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇక్కడి మౌలిక సదుపాయాలు, మానవ వనరుల లభ్యత, ప్రభుత్వ మద్దతు వల్లే ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు జడ్ఎస్ ప్రాంతీయ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 35 కార్యాలయాలున్న జడ్ఎస్‌లో 13,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. మనదేశంలో ఇప్పటికే బెంగళూరు, చెన్నై, దిల్లీ ఎన్‌సీఆర్, పుణె నగరాల్లో జడ్ఎస్ కార్యాలయాలున్నాయి. హైదరాబాద్ కేంద్రం జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) మాదిరిగా తమ క్లయింట్లకు మెరుగైన సేవలు అందిస్తుందని ఆయన వివరించారు.



కోడి గుడ్లు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	538

కర్బన పన్నుతో ఎగుమతులపై ప్రభావం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



దిల్లీ: ఐరోపా సమాఖ్య (ఈయూ) ప్రతిపాదించిన కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం (సీబీఏఎం) ఏకపక్షమని, సహేతుకం కాదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దీని వల్ల భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఐరోపా సమాఖ్య దేశాల్లోకి దిగుమతి అయ్యే ఇంధన సంబంధిత వస్తువులపై సీబీఏఎం పన్నులు పడతాయి. 2026 జనవరి 1 నుంచి ఈ పన్నులు విధించాలని ఈయూ నిర్ణయించింది. ఉక్కు, సిమెంట్, ఎరువులు, ఇంజినీరింగ్ పరికరాలు సహా ఏడు కర్బన సంబంధిత రంగాలపై ఈ పన్నులు ఉంటాయి. ఈయూ ప్రవేశపెట్టిన సరిహద్దు పన్ను వల్ల, వాణిజ్య ఆంక్షలు ఏర్పడతాయని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఫైనాన్షియల్ టైమ్స్ నిర్వహించిన ఎనర్జీ ట్రాన్సిషన్ సమిట్‌లో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. ఈయూతో పలు మార్లు ఈ అంశంపై మాట్లాడామని, లావాదేవీల ఖర్చు తగ్గించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అయితే ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడానికి ఇది అడ్డంకి కాదని వెల్లడించారు. ఈయూ నిర్ణయంతో దేశీయ ఎగుమతిదార్ల లాభాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. దేశం నుంచి ఎక్కువగా ఎగుమతులు వెళ్తున్న దేశాల్లో ఐరోపా ఒకటి.

ఎక్స్‌డీలింక్స్‌కు రూ.59 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: అంతరిక్ష రంగంలోని ఎక్స్‌డీలింక్స్ స్పేస్ ల్యాబ్స్, సీడ్ ఫండింగ్‌లో భాగంగా రూ.58.78 కోట్ల నిధులను సమీకరించింది. లక్కీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన ఆశిశ్ కచోలియా నేతృత్వంలో ఈ2ఎంసీ, మానా వెంచర్స్ ఈ నిధులను అందించినట్లు సంస్థ పేర్కొంది. ఎక్స్‌డీలింక్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ రూపేశ్ గండుపల్లి మాట్లాడుతూ.. రక్షణ, వాణిజ్య అవసరాల కోసం కొత్తతరం ఉపగ్రహాల తయారీకి, అమెరికా, యూకేకు విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

దేశీయంగా 16 కొత్త మందుల అభివృద్ధి

- ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు
- ఎగుమతుల వృద్ధిపై ఆశాభావంతో ఉన్నాం
- ఫార్మాస్యూటికల్స్ విభాగ కార్యదర్శి అరుణిష్ చావ్లా



దిల్లీ: 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొంత మందగమనం ఛాయలు కనిపిస్తున్నాయి, ఎగుమతులు కష్టంగా మారుతున్నాయి. అయినా మనదేశం నుంచి మందుల ఎగుమతులు బాగానే ఉన్నాయి. సమీప భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయి' అని కేంద్ర ప్రభుత్వ ఫార్మాస్యూటికల్స్ విభాగ కార్యదర్శి అరుణిష్ చావ్లా అన్నారు. కొంతకాలంగా మనదేశం నుంచి ఫార్మా, బయోటెక్, బల్క్ డ్రగ్ ఎగుమతులు బాగానే ఉన్నాయని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. మున్ముందు ఈ విభాగంలో ఇంకా అధికంగా ఎగుమతులు నమోదవుతాయని అన్నారు. దాదాపు 16 కొత్త ఔషధాలు మనదేశంలో అభివృద్ధి దశలో ఉన్నాయని, వీటికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందని తెలిపారు. కేన్సర్, మధుమేహ వ్యాధి, హెచ్ఐవీ, టీబీ తదితర వ్యాధులను నయం చేసే ఈ ఔషధాల వల్ల మనదేశం మరిన్ని అధిక ఎగుమతులు సాధించే అవకాశం కలుగుతుందని వివరించారు.

ఉపకరణాలు కూడా: వైద్య ఉపకరణాలు, పరికరాలు, ఇమేజింగ్ వస్తువులు, మెడికల్ ఇంప్లాంట్స్ వంటి మెడిటెక్ ఎగుమతులు కూడా మనదేశం నుంచి బాగా పెరుగుతున్నాయని అన్నారు. మనదేశంలో కొత్త ఔషధాల ఆవిష్కరణలో దేశీయ కంపెనీలు అగ్రగామిగా ఉన్నాయని, ఆ మందులను ఇక్కడే ఉత్పత్తి చేసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ కంపెనీల్లో కొన్నింటికి కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకం ద్వారా మద్దతు ఇస్తోందని అన్నారు. సింథటిక్ ఔషధాలతో పాటు బయొలాజికల్ మందుల ఆవిష్కరణకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అమినో యాసిడ్స్, న్యూక్లియోటైడ్స్, వ్యాక్సిన్ ముడిపదార్థాలు ఉత్పత్తి చేసే కంపెనీలను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. సెల్, జీన్ థెరపీలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనివల్ల మనదేశంలో ఫార్మా, ఆరోగ్య సేవల రంగాలు వృద్ధి బాటలో ఉంటాయని తెలిపారు.

హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టండి

ఫ్రాన్స్ విమానయాన సంస్థలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు


ఈనాడు, హైదరాబాద్: ఫ్రెంచ్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (జీఐఎఫ్ఏఎస్) కు చెందిన 90 మంది సభ్యుల బృందం బుధవారం హైదరాబాద్ విచ్చేసింది. ప్రభుత్వ, పరిశ్రమ వర్గాలతో ఈ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. ఈ అసోసియేషన్‌లో ఫ్రాన్స్‌కు చెందిన 60 అగ్రశ్రేణి విమానయాన సంస్థలకు సభ్యత్వం ఉంది. శాఫ్రాన్, డసాల్ట్, ఎంబీడీఏ, థేల్స్, ఏరియన్ గ్రూపు, సీఎన్ఈఎస్, దాహెర్, హెగ్జెల్ తదితర కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఇటీవల ఇతర దేశాల నుంచి మనదేశానికి వచ్చిన అతిపెద్ద పారిశ్రామిక బృందం ఇదే. హైదరాబాద్‌లో ఏరోస్పేస్, అంతరిక్ష రంగ పరిశ్రమల స్థితిగతులు, పరిశ్రమకు ఉన్న అనుకూలతలు, ఇతర అంశాలను ఈ బృంద సభ్యులు పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ బృంద సభ్యులకు తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉన్న సౌకర్యాలు, వసతులను వివరించారు. విమానయాన, రక్షణ, అంతరిక్ష రంగాల పరిశ్రమలకు హైదరాబాద్ కేంద్ర స్థానంగా మారుతోందని ఆయన తెలిపారు. శాఫ్రాన్, ఎయిర్‌బస్, అమెత్రా, అరేసియా వంటి ఫ్రెంచి సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో తమ భాగస్వామ్య సంస్థలతో కలిసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని, అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. జీఐఎఫ్ఏఎస్ ఛైర్మన్ డైదీర్ కయత్, బ్యూరో దీ ఫ్రాన్స్ డైరెక్టర్ పాస్కల్ లోరే ఈ సందర్భంగా మాట్లాడారు.

భారత్‌లో ఈ ఏడాది చివరకు 3,000 గంటల తాజా కంటెంట్

వార్నర్ బ్రదర్స్. డిస్కవరీ వెల్లడి

దిల్లీ: అంతర్జాతీయ వినోద సంస్థ వార్నర్ బ్రదర్స్. డిస్కవరీ ఈ ఏడాది చివరి కల్లా మన దేశంలో 3,000 గంటలకు పైగా తాజా కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నట్లు బుధవారం వెల్లడించింది. టీవీ ఛానెళ్లతో పాటు వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ 'డిస్కవరీ+' ద్వారా ఈ కంటెంట్‌ను విడుదల చేస్తామని పేర్కొంది. డిస్కవరీ ఛానెల్, యానిమల్ ప్లానెట్, టీఎల్‌సీతో పాటు డిస్కవరీ+, ఛానెళ్ల ద్వారా స్థానిక ఒరిజినల్స్, భారత్‌లో గ్లోబల్ టైటిల్స్ వంటి మిశ్రమ కార్యక్రమాలపై దృష్టి సారించనున్నట్లు వార్నర్ బ్రదర్స్. డిస్కవరీ దక్షిణాసియా ఫ్యాక్చువల్, లైఫ్ స్టైల్ క్లస్టర్ హెడ్ సాయి అభిషేక్ వెల్లడించారు.

డ్రోన్లకు మరో పీఎల్ఐ పథకం



దిల్లీ: డ్రోన్ల రంగం కోసం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని మరోసారి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గతంతో పోలిస్తే, అమలు, డాక్యుమెంటేషన్, ఇతర అంశాల పరంగా మరింత మెరుగ్గా ఈ పథకం ఉంటుందని పౌర విమానయాన కార్యదర్శి ఉమ్లుమాంగ్ వల్నామ్ తెలిపారు. 2021-22 నుంచి మూడు ఆర్థిక సంవత్సరాల కోసం రూ.120 కోట్లతో 2021లో డ్రోన్‌ల కోసం మొదటి పీఎల్ఐ పథకాన్ని ప్రకటించారు. అది ముగిసింది. మొదటి పథకంలోని కొన్ని ప్రక్రియల వల్ల అంకుర సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) ఇబ్బంది పడినందున, మరింత మెరుగ్గా కొత్త పీఎల్ఐ పథకాన్ని రూపొందించే పనిలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం డ్రోన్ల రంగంలో మూడు విభాగాలు ఉన్నాయి. పౌర వినియోగం, భద్రత/రక్షణ దళాల వినియోగం, నియంత్రణ లేని వాటిగా వీటిని గుర్తించారు. ఈ మూడు విభాగాలకు వర్తించే విధంగా కొత్త పథకం ఉంటుందని ఉమ్లుమాంగ్ తెలిపారు. కొత్త పథకం కోసం రూ.1000 కోట్ల వరకు కేటాయించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

+684 నుంచి –168 పాయింట్లకు

సమీక్ష

సెన్సెక్స్ ▼ 168	నిఫ్టీ ▼ 31
81467	24982



రూ.2.63 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో, సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాల్లో ముగిశాయి. ఐటీసీ, రిలయన్స్ వంటి బ్లూచిప్ షేర్లలో మదుపర్ల లాభాల స్వీకరణే ఇందుకు కారణం. డిసెంబరులో వడ్డీ రేట్ల కోతలకు ఆర్‌బీఐ సంకేతాలివ్వడం, ట్రేడింగ్ ఆరంభంలో సానుకూల ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా పెరిగి 83.96 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.87% లాభంతో 77.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో లాభపడగా, మిగతావి నష్టపోయాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ సూచీలు నష్టపోయినప్పటికీ.. మదుపర్ల సంపదగా పరిగణించే, బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.2.63 లక్షల కోట్లు పెరిగి రూ.462.14 లక్షల కోట్ల (5.50 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ బుధవారం బీఎస్ఈలో దాదాపు 184 షేర్లు ఏడాది గరిష్ఠానికి చేరాయి. ఇన్ఫోసిస్, సిప్లా, దివీస్, నౌకరీ, ట్రెంట్, బాష్, కోఫోర్జ్, డిక్సన్ టెక్నాలజీస్, పాలీక్యాబ్, టొరెంట్ ఫార్మా, టొరెంట్ పవర్ షేర్లు తాజా గరిష్ఠాలను నమోదుచేశాయి.

✦ సెన్సెక్స్ ఉదయం 320 పాయింట్ల (క్రితం ముగింపు 81,634.81) లాభంతో 81,954.58 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 684 పాయింట్లు పెరిగి 82,319.21 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకిన సూచీ, తదుపరి అమ్మకాలతో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 81,342.89 వద్ద కనిష్ఠాన్ని తాకి, చివరకు 167.71 పాయింట్ల నష్టంతో 81,467.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 31.20 పాయింట్లు తగ్గి 24,981.95 పాయింట్ల దగ్గర స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 డీలాపడ్డాయి. ఐటీసీ 3.17%, నెస్లే 2.51%, హెచ్‌యూఎల్ 1.68%, రిలయన్స్ 1.64%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.34%, ఎల్ అండ్ టీ 1.32%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.07%, అదానీ పోర్ట్స్ 0.78% నష్టపోయాయి. టాటా మోటార్స్ 2.10%, ఎస్‌బీఐ 1.91%, టెక్ మహీంద్రా 1.86%, మారుతీ 1.80%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.65%, బజాజ్ ఫైనాన్స్ 1.64%, యాక్సిస్ బ్యాంక్ 1.50% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో ఎఫ్ఎంసీజీ 1.31%, ఇంధన 0.78%, చమురు-గ్యాస్ 0.64% పడ్డాయి. స్థిరాస్తి 2.21%, ఆరోగ్య సంరక్షణ 1.68%, విద్యుత్ 1.18%, వినియోగ 1.09%, పరిశ్రమలు 0.96%, వాహన 0.84% రాణించాయి.

✦ **రూ.16,600 కోట్ల సమీకరణ యత్నాల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్:** అర్హత కలిగిన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ) నుంచి 2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.16,600 కోట్లు) వరకు సమీకరించేందుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వంటి సార్వభౌమ సంపద నిధి సంస్థలతో పాటు జీక్యూజీతో చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

✦ **రూ.7500 కోట్ల సమీకరణకు వరుణ్ బెవరేజెస్:** క్యూఐపీ ద్వారా రూ.7,500 కోట్ల వరకు సమీకరించనున్నట్లు వరుణ్ బెవరేజెస్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు కంపెనీ బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది. కంపెనీ వృద్ధి ప్రణాళికల కోసం ఈ నిధులు వినియోగిస్తారు.

✦ **అదానీ విమానాశ్రయాలకు థేల్స్ సాంకేతికత:** దేశంలో అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న 7 విమానాశ్రయాల్లో స్మార్ట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఐరోపా దిగ్గజ సంస్థ థేల్స్ ఏర్పాటు చేయనుంది. ఇందువల్ల విమానాశ్రయ నిర్వహణ, భద్రత, ప్రయాణికుల సేవలు మెరుగుపడతాయని అదానీ గ్రూప్ తెలిపింది. ఇందుకోసం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని థేల్స్, అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ కుదుర్చుకున్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ నిర్వహణలో ముంబయి, అహ్మదాబాద్, గువాహటి, జయపూర్, లఖ్‌నవూ, మంగళూరు, తిరువనంతపురం విమానాశ్రయాలు ఉన్నాయి.

✦ **గరుడా కన్‌స్ట్రక్షన్** ఐపీఓ రెండో రోజుకు 4.10 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,99,04,862 షేర్లను ఆఫర్ చేయగా, 8,16,77,366 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి పదవీ విరమణ చేయనున్నట్లు **స్టాండర్డ్ చార్టర్డ్** సీఈఓ (భారత్, దక్షిణాసియా) జరిన్ దారువాలా ప్రకటించారు. 2016 నుంచి ఆయన బ్యాంక్‌లో పని చేస్తున్నారు.

✦ **వడ్డీ రేట్ల ఆధారిత షేర్ల పరుగులు:** ఆర్‌బీఐ పరపతి సమీక్ష నేపథ్యంలో వడ్డీ రేట్ల ఆధారిత షేర్లు పరుగులు తీశాయి. వాహన షేర్లలో టాటా మోటార్స్ 2.56%, టీవీఎస్ 2.23%, మారుతీ 1.59%, అపోలో టైర్స్ 1.05%, హీరో 0.76% మెరిశాయి. స్థిరాస్తి షేర్లలో మ్యాక్రోటెక్ 4.60%, ఫీనిక్స్ 4.37%, డీఎల్ఎఫ్ 2.14%, మహీంద్రా లైఫ్‌స్పేస్ 1.53%, గోద్రేజ్ ప్రాపర్టీస్ 0.56% దూసుకెళ్లాయి. బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బీఐ 2.47%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.54%, కోటక్ బ్యాంక్ 0.38% పెరిగాయి. ఎన్‌బీఎఫ్‌సీ షేర్లు చూస్తే బజాజ్ హౌసింగ్ 4.01%, ఎస్‌బీఐ కార్డ్స్ 1.35%, ఎల్ఐసీ హౌసింగ్ 0.88% లాభాలు నమోదుచేశాయి.

✦ **గూగుల్‌కు నిరాశే:** యాంటీట్రస్ట్ షాపింగ్ కేసులో ఐరోపా ఉన్నత న్యాయస్థానంలోనూ గూగుల్‌కు నిరాశే ఎదురైంది. వినియోగదారులకు సొంతంగా షాపింగ్ సిఫారసులు ఇస్తుండటంతో, గూగుల్‌పై 2.4 బిలియన్ యూరోల (దాదాపు రూ.22,000 కోట్ల) జరిమానాను యూరోపియన్ సమాఖ్య (ఈయూ) విధించింది. దీనిపై గూగుల్ చేసుకున్న అప్పీలును ఈయూ ఎగువ కోర్టు కొట్టివేసింది.



జనాభా లెక్కల సేకరణ..
మొదలయ్యేది వారి నుంచే!

జనాభా లెక్కల సేకరణ - వివరాలు

ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ మొదటి స్థానంలో ఉంది. 2023 ఏప్రిల్ చివరి నాటికి మన దేశ జనాభా 142 కోట్లు ఉన్నట్లు ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. ప్రభుత్వం జన గణన ద్వారా జనాభా సంఖ్యను గుర్తిస్తుంది. పూర్వ కాలం నుంచే మన దేశంలో జనాభా లెక్కల్ని సేకరించారు. ప్రస్తుతం దీని కోసం ఒక ప్రత్యేక వ్యవస్థ ఉంది.

స్వాతంత్ర్యానికి పూర్వం భారత్‌లో జన గణన

పన్నుల విధానం కోసం జనాభా గణాంకాల సేకరణ పద్ధతులను కౌటిల్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో వివరించారు.

- మొగల్ చక్రవర్తి అక్బర్ జనాభా, పరిశ్రమలు, సంపద మొదలైన వివరాలతో పరిపాలన నివేదికను ప్రచురించాడు.
- భారతదేశంలో మొదటిసారి సమగ్ర జనాభా లెక్కల సేకరణను హెన్రీ వాల్టర్ చేపట్టారు. దీన్ని 1830లో ఢాకాలో నిర్వహించారు.
- భారత్‌లో రెండోసారి జనాభా లెక్కల సేకరణ 1836-37 కాలంలో సెయింట్ జార్జ్ ప్రెసిడెన్సీ నిర్వహించారు.
- మన దేశంలో మొదటిసారి దేశవ్యాప్తంగా ఏకకాలంలో పూర్తిస్థాయిలో జనాభా లెక్కల సేకరణను 1881లో నిర్వహించారు. అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ దీన్ని చేపట్టారు. ఆ సమయంలో సెన్సస్ కమిషనర్‌గా డబ్ల్యూ.సి.ప్లౌడన్ ఉన్నారు.
- దేశంలో తొలిసారిగా కులాల వారీ జనాభా లెక్కల సేకరణను 1931లో చేశారు (స్వాతంత్ర్యానికి పూర్వం).

స్వాతంత్ర్యం తర్వాత భారత్‌లో జన గణన

స్వాతంత్ర్యం వచ్చాక 1948లో జనాభా లెక్కల సేకరణ చట్టాన్ని ఆమోదించారు.

- జనాభా లెక్కల సేకరణ అనేది కేంద్ర జాబితాలో ఉంటుంది. ఇది రాజ్యాంగంలోని 246 అధికరణ, 7వ షెడ్యూల్‌లో ఉంటుంది.
- జనాభా లెక్కల సేకరణ కోసం 1961లో 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా'ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.
- భారత్‌లో ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ నిర్వహిస్తారు.

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1951లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగింది.
- స్వాతంత్ర్యానికి ముందు నుంచి పరిశీలిస్తే, 1872 నుంచి 2011 వరకు దేశంలో జన గణనను 15 సార్లు నిర్వహించారు. 1951 నుంచి 2011 వరకు అయితే 7 సార్లు ఈ సేకరణ జరిగింది.
- 2011 జనాభా లెక్కల సేకరణ రెండు దశల్లో జరిగింది. 2010 ఏప్రిల్‌లో House Census ప్రారంభించగా, 2011 ఫిబ్రవరి 9 నుంచి 28 మధ్య జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. దీనికి రిఫరెన్స్ సమయం 00 : 00 మార్చి 1, 2011.



- 2011లో రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్‌గా డాక్టర్ సి. చంద్రమౌళి ఉన్నారు. ప్రస్తుతం ఈ పదవిలో **మృత్యుంజయ్ కుమార్ నారాయణ్** ఉన్నారు. 2022, నవంబరు 1 నుంచి ఈ పదవిలో కొనసాగుతున్నారు.
- 16వ జనాభా లెక్కల సేకరణ 2020 ఏప్రిల్ 1న జరగాల్సి ఉండగా, కరోనా మహమ్మారి కారణంగా వాయిదా వేశారు. అయితే దాన్ని ఇప్పటికీ నిర్వహించలేదు.
- 2011 జనాభా లెక్కల సేకరణ నినాదం: Our Future - Our Census

- 2011 జనాభా లెక్కల సేకరణ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సెన్సస్ కమిషనర్‌గా వై.వి. అనురాధ ఉన్నారు.
- జనాభా లెక్కల సేకరణను దేశ రాష్ట్రపతి నుంచే మొదలుపెడతారు. తర్వాత వరుసగా ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి వివరాలు తీసుకుంటారు. 2011 జనాభా లెక్కల సేకరణ సమయంలో ప్రతిభా పాటిల్ రాష్ట్రపతిగా ఉన్నారు.
- దేశవ్యాప్తంగా కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించిన సంవత్సరం 2011.

- దేశంలో లింగమార్పిడి (ట్రాన్స్‌జెండర్) జనాభాను మొదటిసారిగా 2021లో లెక్కించారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించిన మొదటి రాష్ట్రం కేరళ. ఆ రాష్ట్రంలో 1968లో దీన్ని నిర్వహించారు.
- భారత పౌరసత్వ చట్టాన్ని 1955లో ఆమోదించారు.

ప్రపంచ జనాభా గణాంకాలు - వివరణ

సంవత్సరం	ప్రపంచ జనాభా (బిలియన్/ కోట్లలో)
1830	ఒక బిలియన్ (100 కోట్లు)
1930	రెండు బిలియన్లు (200 కోట్లు)
1960	మూడు బిలియన్లు (300 కోట్లు)
1975	నాలుగు బిలియన్లు (400 కోట్లు)
1987	అయిదు బిలియన్లు (500 కోట్లు)
1999	ఆరు బిలియన్లు (600 కోట్లు)
2011	ఏడు బిలియన్లు (700 కోట్లు)
2022 (యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ అండ్ సోషల్ అఫైర్స్ పాపులేషన్ డివిజన్ ప్రకారం)	8 బిలియన్లు (800 కోట్లు) (నవంబరు 15, 2022 నాటికి)
2023 (యూఎన్ పాపులేషన్ ఫండ్ - యూఎన్‌పీఎఫ్)	804.5 కోట్లు

జనాభా పెరుగుదల - ముఖ్య తేదీలు



1830లో ఒక బిలియన్ ఉన్న జనాభా 1987 నాటికి అయిదు బిలియన్లకు చేరింది. అయిదో బిలియన్ చివరి శిశువు 11 జులై 1987లో యుగోస్లావియాలో జన్మించాడు. అందుకే జులై 11వ తేదీని ప్రపంచ జనాభా దినోత్సవంగా (World Populatin Day) పరిగణిస్తారు.

- ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) నివేదిక ప్రకారం ప్రపంచ జనాభా 12 అక్టోబరు 1999న 6 బిలియన్లకు చేరింది. కాబట్టి యూఎన్ఓ ఆ తేదీని '6వ బిలియన్ రోజు' (The Day of Six Billion) గా ప్రకటించింది.
- యునైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ (యూఎన్‌డీఈఎస్ఏ) విడుదల చేసిన వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2022 నివేదిక ప్రకారం, 2022 నవంబరు 15 నాటికి మొత్తం ప్రపంచ జనాభా 8 బిలియన్లకు (800 కోట్లకు) చేరింది. అందుకే నవంబరు 15వ తేదీని '8వ బిలియన్ రోజు' (The Day of Eight Billion) అంటారు.
- ఇదే నివేదిక ప్రకారం, 2030 నాటికి ప్రపంచ జనాభా 8.5 బిలియన్లు, 2050 నాటికి 9.7 బిలియన్లు, 2100 నాటికి 10.4 బిలియన్లు పెరుగుతుందని అంచనా.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

2011 జనాభా లెక్కల ప్రకారం ప్రపంచంలో జనాభాలో 10 అతిపెద్ద దేశాలు వరుసగా

- చైనా - 134.01 కోట్లు
- భారత్ - 121.09 కోట్లు
- యూఎస్ఏ - 30.87 కోట్లు
- ఇండోనేసియా - 23.76 కోట్లు
- బ్రెజిల్ - 19.07 కోట్లు
- పాకిస్థాన్ - 18.48 కోట్లు
- బంగ్లాదేశ్ - 16.44 కోట్లు
- నైజీరియా - 15.83 కోట్లు
- రష్యా - 14.04 కోట్లు
- జపాన్ - 12.81 కోట్లు



- 2011 జనాభా లెక్కల ప్రకారం, ప్రపంచ జనాభా వృద్ధిరేటు 1.23%, చైనా జనాభా వృద్ధిరేటు 0.53%, భారత్ జనాభా వృద్ధిరేటు 1.64 శాతంగా ఉన్నాయి.

యూఎన్‌పీఎఫ్ నివేదిక 2024

యూఎన్‌పీఎఫ్ - స్టేట్ ఆఫ్ ది వరల్డ్ పాపులేషన్ నివేదిక 2024 ప్రకారం 2024 నాటికి మొత్తం ప్రపంచ జనాభా 811.9 కోట్లుగా ఉందని అంచనా.

- దీని ప్రకారం ప్రపంచంలో జనాభా పరంగా అతిపెద్ద దేశాలు వరుసగా:

భారత్ - 144.17 కోట్లు, చైనా - 142.52 కోట్లు, యూఎస్ఏ - 34.18 కోట్లు, ఇండోనేసియా - 27.98 కోట్లు, పాకిస్థాన్ - 24.52 కోట్లు, నైజీరియా - 22.92 కోట్లు, బ్రెజిల్ - 21.76 కోట్లు, బంగ్లాదేశ్ - 17.47 కోట్లు, రష్యా - 14.40 కోట్లు, ఇథియోపియా - 12.97 కోట్లు.

- 2054 నాటికి భారతదేశం 169.2 కోట్ల జనాభాతో మొదటిస్థానంలో కొనసాగుతుందని నివేదిక అంచనా వేసింది. చైనా (121.5 కోట్లు), యూఎస్ఏ (38.4 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉంటాయని తెలిపింది.
- అదే విధంగా 2100 నాటికి భారతదేశ జనాభా 150.5 కోట్లుగా (మొదటి స్థానం) ఉంటుందని పేర్కొంది. చైనా (రెండో) జనాభా 63.3 కోట్లు, పాకిస్థాన్ (మూడో) జనాభా 51.1 కోట్లుగా ఉంటుందని అంచనా వేసింది.

ముఖ్యాంశాలు

2011 జనాభా లెక్కల ప్రకారం, ప్రపంచ జనాభాలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో నిలిచింది.

- యూఎన్‌పీఎఫ్ - వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024 నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో భారత్ మొదటి ర్యాంకులో ఉంది. చైనా, అమెరికాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.
- ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 2023లో ప్రపంచ జనాభాలో అతి చిన్న దేశం వాటికన్ సిటీ. ఈ దేశ జనాభా మొత్తం 764.

436 Word of the Day

Jovially

Telugu meaning: ఆనందకరమైన, ఆహ్లాదకరమైన

English meaning: The word jovially is an adverb that describes doing something in a cheerful and friendly manner.

Synonyms: Cheerfully, Happily

Antonyms: Sadly, Grimly

Usage: 1. He greeted everyone jovially at the party, spreading warmth and laughter wherever he went.

2. The team jovially celebrated their victory, enjoying every moment of their success.

Latest Updates

BAMS/ BHMS/ BNYS and BUMS Courses

Kaloji Narayana Rao University of Health Sciences, Warangal, invites applications for admission into BAMS/ BHMS/ BNYS AND BUMS courses in all the AYUSH Colleges affiliated to KNRUHS for the academic year 2024-25 under the Competent Authority Quota. The application fee is Rs.2500. Eligible candidates can apply online before 13 October 2024.

Engineer Posts

Oil India Limited (OIL), is conducting interviews for the vacant Engineer posts on a contractual basis. The total number of posts is 40. The interview dates are 21, 23 and 25 October 2024.

Senior Resident Posts

Employees State Insurance Corporation (ESIC) Hospital - ESIC Medical College, PGIMSR and Medical Hospital, Bangalore is conducting interviews to fill up the Senior Resident posts on a contractual basis. Eligible candidates can appear in the interview on 15 October 2024.


Did You Apply..?

Today (October 10) is the last date for the following Posts/ Admissions

- 604 Teaching/ Non-Teaching posts in AP KGBV.
  Qualifications: Degree, Post Graduation, B.Ed., UGDPEd., BPEd, MPEd in the relevant subject.
- 125 Teaching Faculty posts in NIT Andhra Pradesh.
  Qualification: BE/ B.Tech/ ME/ M.Tech/ MBA/ Ph.D. in Relevant Subject with experience.
- 56 Industrial Trainee (Finance) posts in NLC India Limited.
  Qualification: CA, CMA and work experience.
- 22 Consultant Credit Analyst posts in SIDBI.
  Qualification: CA.
- B.Sc. (Hons) Agriculture course in MJPTBCWREIS.
  Eligibility: Candidates shall qualify PJTSAU AGRICET-2024 of PJTSAU, Telangana State.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ పాలిటీ)



మానవులు సంపూర్ణ అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన కనీస సదుపాయాలే ప్రాథమిక హక్కులు. వీటి ద్వారా వ్యక్తులు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తారు.

✦ భారతదేశంలో ప్రాథమిక హక్కుల అభివృద్ధి క్రమం, చట్టాలపై సుప్రీంకోర్టు తీర్పులు, రాజ్యాంగ వివరణ, రాజ్యాంగ సవరణ చట్టాలు, ఆదేశిక సూత్రాలు మొదలైనవాటిని ఈ-బుక్‌లో సమగ్రంగా వివరించారు.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs


John Hopfield Geoffrey Hinton

U.S. scientist John Hopfield and British-Canadian Geoffrey Hinton won the 2024 Nobel Prize in Physics on 8 October. They got this award for discoveries and inventions that laid the foundation for machine learning, the award-giving body said.

- Machine learning based on artificial neural networks is currently revolutionising science, engineering and daily life.

The 12th Meeting of the India-UAE High Level Joint Task Force on Investments (HLJTFI) took place in Mumbai on 7 October 2024. The HLJTFI was established in 2013 to promote trade, investment and economic ties between India and the UAE.

- On this occation, Union Commerce Minister Piyush Goyal has informed that the Indian and UAE governments are working on interlinking of UPI of India and the AANI of UAE.

World Health Organisation (WHO) has declared that the India has eliminated Trachoma as a public health problem becoming the third country in the South-East Asia Region to achieve this milestone. The announcement was made during the WHO South-East Asia Regional Committee meeting in New Delhi on 8 October 2024.

Union Defence Minister Rajnath Singh inaugurated DefConnect 4.0 in Delhi on 7 October 2024. This was organised by Innovations for Defence Excellence - Defence Innovation Organisation (iDEX-DIO), under the ministry's Department of Defence Production.

For more Current Affairs: Scan QR code

Coding & Decoding

Directions (Qs. 1 - 4): *Study the following information to answer the given questions:*

In a certain code,
'always create new ideas' is written as **'ba ri sha gi',**
'ideas and new thoughts' is written as **'fa gi ma ri',**
'create thoughts and insights' is written as **`ma jo ba fa'** and
'new and better solutions' is written as **'ki ri to fa'.**

1. What does 'fa' stand for?
A) thoughts B) insights C) new
D) and E) solutions

2. 'fa lo ba' could be a code for which of the following?
A) thoughts and action
B) create and innovate
C) ideas and thoughts
D) create new solutions
E) always better ideas

3. What is the code for 'new'?
A) ki B) ri C) to D) fa E) ba

4. Which of the following may represent 'insights always better'?
A) jo ki to B) ki to ri
C) sha jo ri D) to sha jo
E) sha to ba

RRB Exams
Reasoning

Directions (Qs. 5 - 8): *Study the following information carefully and answer the questions.*

In a certain code language, 'newspaper enhance the knowledge' is written as **'yo no co po'**, 'new enhance good version' is written as **'co so ro jo'**, 'good knowledge is necessary' is written as **'bo to ro po'**, 'the new brand book' is written as **'qo jo do yo'**, and 'book is necessary' is written as **'bo do to'**.

5. What is the code for 'version'?
A) so B) ro C) jo
D) Can't be determined
E) None of these

6. Which of the following is the code for 'brand enhance version'?
A) do qo co B) so qo co
C) do ro co D) Can't say
E) None of these

7. What is the code for 'new'?
A) so B) ro C) jo
D) yo E) None of these

8. What is the code for 'necessary'?
A) bo B) to C) ro
D) Can't say E) None of these

Directions (Qs. 9 - 12): *Read the information given below to answer the questions that follow:*

In a certain code language
i) 'you are good' means **'ni za ri'**
ii) 'you are with me' means **'ri si ni ti'**
iii) 'meet good person' means **'ap li za'**
iv) 'you are me' means **'ri ni ti'**
v) 'meet me now' means **'ku ti ap'**

9. In this code language, 'good' refers to
A) ku B) ti C) si
D) za E) Cannot be determined

10. Here 'you' refers to
A) ni B) ri C) za
D) li E) Cannot be determined

11. In this code language 'you are good person' is written as...
A) 'ri ni za li B) ri za li si
C) ri za li ti D) Can't be determined
E) None of these

12. To which word code 'si' stands?
A) with B) me C) meet
D) are E) good

Directions (Qs. 13 – 16): *Study the following information carefully and answer the questions given below:*

In a certain code language.
'shared his valuable experiences' is written as **'sa ro li me'**
'valuable contribution of teacher' is written **'dy sa ha kt'**
'experiences are his teacher' is written **'li ps me dy'**
'shared contribution of success' is written **'ha ro kt cn'**
(All the codes are two letter codes only)

13. What does the code 'dy' stand for in the given code language?
A) either 'are' or 'of
B) either 'his' or 'experiences'
C) teacher D) are E) shared

14. What is the code for 'contribution' as per the given code language?
A) either 'ha' or 'kt' B) sa
C) dy D) ro E) either 'if' or 'ro'

15. What does the code 'sa' stand for in the given code language?
A) teacher B) shared
C) either 'are' or 'his' D) valuable
E) are


16. Which of the following possibly means 'his working experiences' as per the given code language?
A) me dy ro B) li kj me
C) kj me dy D) me cn li
E) cn li kj

For Key scan the QR code

*These model questions were prepared by subject experts of **RACE Institute** Hyderabad*

ఈనాడు ప్రతిభ
గురువారం, అక్టోబరు 10, 2024
25
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



■ 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డు అందుకున్న తొలి భారతీయ నటి ఎవరు?
(77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ నటి అన్‌సర్టెన్ రిగార్డ్ విభాగంలో ది షేమ్‌లెస్ (2024) - చిత్రంలోని నటనకు ఆమె ఉత్తమ నటి అవార్డును అందుకుని ఈ విభాగంలో పురస్కారం పొందిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించారు.) **జ:** అనసూయ సేన్ గుప్తా

■ సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఎవరు?

మాదిరి ప్రశ్నలు

(1989, అక్టోబరు 6 నుంచి 1992, ఏప్రిల్ 29 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఈమె పనిచేశారు. కేరళలోని కొల్లాంలో 2023, నవంబరు 23న మరణించారు.)
జ: జస్టిస్ ఫాతిమా బీవి

■ మెక్సికో నూతన అధ్యక్షురాలిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (200 ఏళ్ల ఆ దేశ చరిత్రలో ఓ మహిళ అధ్యక్షురాలు కావడం ఇదే తొలిసారి. ఈమె అధికార మోరెనా పార్టీకి చెందినవారు. గతంలో పర్యావరణ శాస్త్రవేత్తగా, మెక్సికో మేయర్‌గా పని చేశారు.)
జ: క్లాడియో షేన్‌బామ్

■ జపాన్ ప్రభుత్వం అందించే 'ఆర్డర్ ఆఫ్ ద రైజింగ్ సన్, గోల్డ్‌రేస్ విత్ రోసెట్' పురస్కారానికి ఇటీవల ఎవరు ఎంపికయ్యారు? (హైదరాబాద్‌లోని 'నాగరామ జపాన్ హబ్' సంస్థ అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త అయిన ఈయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.) **జ:** బొడ్డుపల్లి రామభద్ర


మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

ఇరవై అయిదు నుంచి 30 నిమిషాలు చదవాలి. అయిదు నిమిషాలు బ్రేక్ తీసుకోవాలి. ఈ విధంగా కనీసం నాలుగుసార్లు చేయాలి. తర్వాత కాస్త ఎక్కువ విరామం తీసుకోవచ్చు. దీని వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక అలసట తగ్గుతుంది. దాంతో అభ్యసన, అర్థం చేసుకునే సామర్థ్యాలు అధికమై జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది.

డీఎస్సీ - 2024
విద్యా దృక్పథాలు

ముళ్లు మారితే కాలం సాగినట్లే!



పరీక్షల్లో ప్రశ్నలకు కేటాయించిన టైమ్‌లో జవాబులు రాయాలి. సమావేశాలకు సరైన సమయంలో చేరుకోవాలి. ఒక రైలు తర్వాత మరో రైలు ఎంతసేపట్లో వస్తుందో అంచనా ఉండాలి. ఇవన్నీ సక్రమంగా సాగాలంటే గడియారాలు కావాలి. సమయపాలనతో క్రమశిక్షణను అలవాటు చేసే క్లాక్‌లు తార్కిక ఆలోచన నైపుణ్యాలనూ పెంపొందిస్తాయి. వాటిలోని ముళ్ల స్థానాలను ఊహించుకోవడం ద్వారా విజువలైజేషన్ శక్తి ఎక్కువవుతుంది. ఈ సామర్థ్యాలను గుర్తించడానికి రీజనింగ్‌లో 'గడియారాలు' అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతారు. ముళ్లస్థానాల వల్ల సమయం మారుతున్న తీరును అభ్యర్థులు అర్థం చేసుకోవాలి. గంటలు, నిమిషాల ముళ్లు కదిలే దిశలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ స్టడీస్
రీజనింగ్

గడియారాలు

'గడియారాలు' అనే అంశానికి సంబంధించిన పలు రకాల ప్రశ్నలను కింది సూత్రం ఆధారంగా కనుక్కోవచ్చు.

$$M = \frac{2}{11}\left[H \times 30^\circ \pm \theta\right]$$

M = నిమిషాలు, H = ప్రారంభ సమయం

θ = రెండు ముళ్ల మధ్య కోణం

గమనిక: ప్రారంభ సమయం 12 గంటలుగా ఉన్నప్పుడు $H = 0$ గా తీసుకోవాలి

మాదిరి ప్రశ్నలు

మోడల్ - 1

1. 9, 10 గంటల మధ్య ఏ సమయంలో గడియారంలోని రెండు ముళ్లు ఏకీభవిస్తాయి?

1) 10 గంటల $49\frac{1}{11}$ నిమిషాలు
2) 9 గంటల $49\frac{1}{11}$ నిమిషాలు
3) 9 గంటల $54\frac{1}{11}$ నిమిషాలు
4) 10 గంటల $44\frac{2}{11}$ నిమిషాలు

సాధన: $M = \frac{2}{11}\left[H \times 30^\circ \pm \theta\right]$

$H = 9, \theta = 0^\circ$ (ఏకీభవిస్తాయి కాబట్టి)

$M = \frac{2}{11}\left[9 \times 30^\circ \pm 0^\circ\right]$


$= \frac{2}{11}[270^\circ] = \frac{540}{11}$

$M = 49\frac{1}{11}$ నిమిషాలు

$\therefore$ 9 గంటల $49\frac{1}{11}$ నిమిషాల సమయం వద్ద రెండు ముళ్లు ఏకీభవిస్తాయి. **జ:** 2

మోడల్ - 2

గమనిక: గడియారంలో ఏ సమయంలో రెండు ముళ్లు వ్యతిరేకంగా ఉంటాయని అన్నప్పుడు కోణాన్ని కింది విధంగా తీసుకోవాలి.



మొదటి అర్ధభాగ సమయానికి (12 − 6) = +180°

రెండో అర్ధ భాగ సమయానికి (6 − 12) = −180°

2. 4, 5 గంటల మధ్య ఏ సమయంలో గడియారంలోని రెండు ముళ్లు వ్యతిరేక దిశలో ఉంటాయి?

1) 4 గంటల $55\frac{5}{11}$ నిమిషాలు
2) 5 గంటల $33\frac{2}{11}$ నిమిషాలు
3) 5 గంటల $44\frac{5}{11}$ నిమిషాలు
4) 4 గంటల $54\frac{6}{11}$ నిమిషాలు

సాధన: $M = \frac{2}{11}\left[H \times 30^\circ \pm \theta\right]$

$H = 4, \theta = 180^\circ$ (మొదటి అర్ధ భాగ సమయం)

$M = \frac{2}{11}\left[4 \times 30^\circ + 180^\circ\right]$

$= \frac{2}{11}[120^\circ + 180^\circ]$


$= \frac{2}{11}[300] = \frac{600}{11}$

$M = 54\frac{6}{11}$ నిమిషాలు

$\therefore$ 4 గంటల $54\frac{6}{11}$ నిమిషాల సమయం **జ:** 4

మోడల్ - 3

గమనిక: గడియారంలో ఏ సమయంలో రెండు ముళ్లు లంబంగా ఉంటాయన్నప్పుడు ప్రతీ ఒక గంట సమయానికి రెండుసార్లు లంబ కోణాన్ని ఏర్పరుస్తుంది. కాబట్టి కోణాన్ని కింది విధంగా తీసుకోవాలి.



12 − 3 గంటల మధ్య సమయానికి (θ) = +90°, +270°

3 − 9 గంటల మధ్య సమయానికి (θ) = +90°, −90°

9 − 12 గంటల మధ్య సమయానికి (θ) = −90°, −270°

3. 12, 1 (ఒంటి గంట) గంటల మధ్య గడియారంలో రెండుముళ్లు ఎప్పుడు లంబ కోణాన్నిఏర్పరుస్తాయి?

1) 12 గంటల $15\frac{2}{11}$ నిమిషాలు, 12 గం. $54\frac{2}{11}$ నిమిషాలు
2) 1 గంట $16\frac{2}{11}$ నిమిషాలు, 1 గం. $54\frac{1}{11}$ నిమిషాలు
3) 12 గంటల $16\frac{4}{11}$ నిమిషాలు, 12 గం. $49\frac{1}{11}$ నిమిషాలు
4) ఏదీకాదు

సాధన: I. $M = \frac{2}{11}[0 \times 30^\circ + 90]$

$= \frac{2}{11}[90^\circ] = \frac{180^\circ}{11}$

$M = 16\frac{4}{11}$ ని.లు $\therefore$ 12 గం. $16\frac{4}{11}$ ని.లు

II. $M = \frac{2}{11}\left[0 \times 30^\circ + 270\right]$

$= \frac{2}{11}[270^\circ] = \frac{540^\circ}{11} = 49\frac{1}{11}$ ని.లు

$\therefore$ 12 గంటల $49\frac{1}{11}$ ని.లు **జ:** 3

మోడల్ - 4

గమనిక: గడియారంలో రెండు ముళ్ల మధ్య ఏర్పడే పరావర్తన కోణం కనుక్కోవడానికి ముందుగా, కోణాన్ని కనుక్కుని దాన్ని 360°ల నుంచి తీసివేయాలి

4. గడియారంలో 4 గంటల 20 నిమిషాల వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే కోణం ఎంత?

1) 10° 2) 20° 3) 15° 4) 30°

సాధన: $M = \frac{2}{11}\left[H \times 30^\circ \pm \theta\right]$

$20 = \frac{2}{11}[4 \times 30^\circ \pm \theta]$

$20 \times \frac{11}{2} = 120 \pm \theta \Rightarrow 110 = 120 \pm \theta$

$\theta = 120^\circ - 110^\circ \Rightarrow \theta = 10^\circ$ **జ:** 1

5. గడియారంలో 3 గంటల 40 నిమిషాల వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే పరావర్తన కోణం ఎంత?

1) 130° 2) 230° 3) 320° 4) 203°

సాధన: $M = \frac{2}{11}\left[H \times 30^\circ \pm \theta\right]$

$40 = \frac{2}{11}[3 \times 30^\circ \pm \theta]$

$40 \times \frac{11}{2} = 90^\circ \pm \theta \Rightarrow 220^\circ = 90^\circ \pm \theta$

$\theta = 220^\circ - 90^\circ \Rightarrow \theta = 130^\circ$

పరావర్తన కోణం = $360^\circ - 130^\circ = 230^\circ$ **జ:** 2

మోడల్ - 5

- అద్దంలో ప్రతిబింబ సమయం కనుక్కోమన్నప్పుడు ఇచ్చిన సమయాన్ని 12 గంటల్లో నుంచి తీసివేయాలి.
- నీటిలో ప్రతిబింబ సమయాన్ని కనుక్కోమన్నప్పుడు ఇచ్చిన సమయాన్ని 18:30 నిమిషాల సమయం నుంచి తీసివేయాలి.
- ప్రతిబింబ సమయాలు ఇచ్చి సరైన సమయం కనుక్కోమన్నప్పుడు కూడా పై నియమాలనే పాటించాలి.

6. గడియారంలో సమయం 8:37AM అయితే అద్దంలో చూసినప్పుడు ఏర్పడే ప్రతిబింబ సమయం ఎంత?

1) 3:23 PM 2) 3:23 AM
3) 4:18 AM 4) 4:18 PM

సాధన:
12 : 00 ⇒ 11 : 60
08 : 37
03 : 23
జ: 2




రచయిత: గోలి ప్రశాంత్‌రెడ్డి

పదోతరగతి



తెలుగు



అదే మొదటి దృష్టాంత శతకం!

4 మార్కులు — శతక మాధుర్యం — ప్రశ్నలు జవాబులు

1) మారద వెంకయ్య గురించి రాయండి.
జ: కవి పేరు: మారద వెంకయ్య
కాలం: 1550 - 1600 మధ్య జీవించారు.
రచనలు: భాస్కర శతకం (అరసవెల్లి సూర్యదేవాలయంలోని సూర్యుడిని భాస్కరా! అని సంబోధిస్తూ అదే మకుటంతో భాస్కర శతకం రచించారు.)
నివాసం: శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో నివసించారు. ఈయనను కళింగ కవి, మారయ వెంకయ్య, మారవి వెంకయ్య అనే పేర్లతో పిలుస్తారు. **ప్రత్యేకతలు:** భాస్కర శతకం తెలుగులోని మొదటి దృష్టాంత శతకం.

2) ధూర్జటి మహాకవి గురించి రాయండి.
జ: కవి పేరు: ధూర్జటి **కాలం:** 16వ శతాబ్దం
తల్లిదండ్రులు: సింగమ్మ, నారాయణ అనే పుణ్యదంపతులు.
రచనలు: శ్రీకాళహస్తీశ్వర శతకం, శ్రీకాళహస్తి మహాత్మ్యం
జననం, నివాసం: శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా).
ఉద్యోగం: శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజ కవుల్లో ఒకరు.

3) పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గురించి రాయండి.
జ: కవి పేరు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి
కాలం: 17వ శతాబ్దం **తల్లిదండ్రులు:** ప్రకృతాంబ, పరిపూర్ణయాచార్యులు. **పెంచిన తల్లిదండ్రులు:** యనమదల వీరపాపమాంబ, వీరభోజాచార్యులు. **స్వస్థలం:** కడప జిల్లా, కందిమల్లయపల్లె
రచనలు: కాళికాంబ సప్తశతి, సిద్ధగురుబోధ, కాలజ్ఞానం, వీరకాళికాంబ శతకం మొదలైనవి. **భార్య:** గోవిందమ్మ
సంతానం: ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె.

4) వేమన గురించి రాయండి.
జ: కవి పేరు: వేమన
కాలం: 1367-1478 మధ్య జీవించారు
జన్మస్థలం: గుంటూరు జిల్లాలోని కొండవీడు.
రచనలు: వేమన శతకం
ప్రత్యేకతలు: సి.పి.బ్రౌన్ ద్వారా 1839లో వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయి.

మరికొన్ని ముఖ్యమైనవి.. (4 మార్కులు)
1) ఏనుగు లక్ష్మణ కవి గురించి రాయండి.
2) శ్రీమతి దార్ల సుందరీమణి గురించి రాయండి.
3) త్రిపురనేని రామస్వామి గురించి రాయండి.
జవాబుల కోసం

- చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

ఆ కీటకం గుండెలో పదమూడు గదులు!



చూడగానే జుగుప్స కలిగించే బొద్దింకల గురించి జీవశాస్త్రం అనేక ఆసక్తికరమైన విశేషాలను అందిస్తుంది. అవి చల్లటి, వేడి ప్రదేశాలతోపాటు తిండి తక్కువ దొరికే ప్రాంతాల్లోనూ జీవించగలుగుతాయి. సర్వభక్షక జీవులు. వేగంగా ప్రత్యుత్పత్తి జరుపుతాయి. వివిధ వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే ఆ కీటకాల శరీర నిర్మాణం, జీవ క్రియలు, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, అవయవాల పనితీరు, ఇతర ప్రత్యేకతల గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి. శాస్త్రీయ నామాలు, జాతులపై అవగాహన కలిగి ఉండాలి.

డీఎస్సీ - 2024: బయాలజీ

బొద్దింక - నమూనా అధ్యయనం

1. కిందివారిలో కీటకశాస్త్ర స్థాపకుడు ?
1) విలియం కిర్బీ 2) విలియం జేమ్స్
3) విలియం హార్వే 4) పైవారంతా

2. బొద్దింక పోషకరీత్యా..
1) మాంసాహారి 2) శాకాహారి
3) సర్వభక్షకి 4) పూతికాహారి

3. కర్సోరియల్ అంటే?
1) నడవడం 2) పరిగెత్తడం
3) గెంతడం 4) పాకడం

4. బొద్దింకలో బాహ్య అస్థిపంజరం దేంతో తయారవుతుంది?
1) లిగ్నిన్ 2) సూబరిన్ 3) ఖైటినస్ 4) లిపిడ్లు

5. బొద్దింక ఆర్థ్రోడియల్ త్వచంలో అతికి ఉండే ఫలకలను ఏమంటారు?
1) స్ల్కెరైట్స్ 2) టాగ్మేలు
3) క్లైపియస్ 4) ఒక్సిపిట్

6. బొద్దింక శాస్త్రీయ నామాన్ని ప్రతిపాదించిన వ్యక్తి?
1) విలియం కిర్బీ 2) విలియం జేమ్స్
3) బర్మిస్టర్ 4) ఎర్నెస్ట్ హెకెల్

7. భారతదేశంలో ఉన్న సాధారణ బొద్దింక జాతి?
1) పెరిప్లానెటా అమెరికానా
2) బ్లాటా ఓరియంటాలిస్
3) మెగాస్కోలెక్స్ 4) 1, 2

8. కిందివాటిలో బొద్దింక శరీరంపై బాహ్యంగా ఉండే మైనపు పొరను స్రవించేవి?
1) ఈనోసైట్స్ 2) స్ల్కెరైట్స్
3) అధశ్చర్మ కణాలు 4) 1, 2

9. బొద్దింకలో ఖండీభవనం ఉండే శరీర భాగాలను ఏమంటారు?
1) టాగ్మాలు 2) ఒక్సిపిట్
3) జీనే 4) క్లైపియస్

10. బొద్దింక తలలోని అనుకపాల మహారంధ్రాన్ని కప్పి ఉంచే స్ల్కెరైట్‌కు ఏమని పేరు?
1) జీనే 2) క్లైపియస్
3) ఒక్సిపిట్ 4) 2, 3

11. బొద్దింకలో కనిపించే స్పర్శ శృంగాలు ఏ ఖండితంలో ఏర్పడతాయి?
1) 1వ 2) 2వ 3) 3వ 4) 4వ

12. బొద్దింక మొదటి జంభికలోని ప్రథమ పాదాంగం వేటి కలయికతో ఏర్పడుతుంది?
1) కార్డో 2) స్టైపిస్
3) పాల్పిజర్ 4) 1, 2

13. కిందివాటిలో బొద్దింక టాగ్మా కానిది?
1) వక్షం 2) తల
3) మెడ 4) ఉదరం

14. బొద్దింక కాళ్లలోని పాదఖండితాల సంఖ్య?
1) 5 2) 3 3) 4 4) 6

15. వాదన-ఎ: మగ జీవుల్లో 9 ఉరః ఫలకాలుంటాయి. కానీ స్త్రీ జీవుల్లో 7 ఉరః ఫలకాలుంటాయి.
వాదన-బి: స్త్రీ జీవిలోని 8, 9 ఉరఃఫలకాలు కలసి గుడ్ల సంచిని ఏర్పరుస్తాయి.
1) ఎ సత్యం 2) ఎ అసత్యం, బి సత్యం
3) ఎ, బి లు సత్యం 4) ఎ, బి లు అసత్యం

16. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
1) కార్పోరా ఎడిపోసా	ఎ) కొవ్వును స్రవిస్తుంది
2) ట్రోఫోసైట్స్	బి) కొవ్వు దేహాలు
3) మైసిటోసైట్స్	సి) సహజీవన బ్యాక్టీరియాను కలిగి ఉంటుంది
4) ఈనోసైట్స్	డి) ఆహారం నిల్వ ఉంటుంది

1) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
3) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
4) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

17. బొద్దింక జీర్ణనాళంలో ఏ భాగం పిండిమర, జల్లెడలా పనిచేస్తుంది?
1) అన్నాశయం 2) ఆహారవాహిక
3) అంతర జఠరం 4) మాల్పీజియన్ నాళికలు

18. కిందివాటిలో బొద్దింకలో నమిలే బలమైన దంతాలున్న పరికరం గల ప్రాంతం
1) ఆస్యకుహరం 2) అంతర జఠరం
3) ముఖభాగం 4) ఏదీకాదు

19. వాదన-ఎ: బొద్దింక మధ్యాహార నాళంలో 6 - 8 కాలేయ అంధనాళాలుంటాయి.
వాదన-బి: కాలేయ అంధనాళాలు బొద్దింకకు ఆహార పదార్థాల జీర్ణక్రియ, శోషణలో సహాయపడతాయి.
1) ఎ, బి లు సత్యం 2) ఎ సత్యం, బి అసత్యం
3) ఎ, బి లు అసత్యం 4) ఎ అసత్యం

20. కిందివాటిలో అసత్య వాక్యాన్ని గుర్తించండి.
1) మధ్యాంత్రంలో మూడు భాగాలుంటాయి.
2) మధ్యాంత్రంలోని పరభాగం శోషణలో ఉపయోగపడుతుంది.
3) మధ్యాంత్రంలోని పూర్వ స్రావకభాగం జీర్ణక్రియలో ఉపయోగపడుతుంది.
4) మధ్యాంత్రంలోకి ఆహార ముద్ద వెళ్లిన వెంటనే పెరిట్రాఫిక్ త్వచం కప్పి ఉంచుతుంది.

21. బొంద్దిక లాలాజల గ్రంథుల్లోని అతిసూక్ష్మ నిర్మాణాలను ఏమంటారు?
1) సెన్సిల్లా 2) లేబియం 3) పాల్పిజర్ 4) ఎసినై

22. బొద్దింకలో రక్తప్రసరణ వ్యవస్థ?
1) బంధిత రక్తప్రసరణ వ్యవస్థ
2) స్వేచ్ఛా రక్తప్రసరణ వ్యవస్థ
3) 1, 2
4) రక్తప్రసరణ విసరణ ద్వారా జరుగుతుంది

23. కిందివాటిలో రక్తకుహరాల్లో కెల్లా పెద్దది ఏది?
1) పృష్ఠ కోటరం 2) మధ్య కోటరం
3) ఉదర కోటరం 4) 1, 3

24. బొద్దింక హృదయంలోని గదుల సంఖ్య?
1) 4 2) 3 3) 13 4) 6

25. కిందివాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
ఎ) బొద్దింక ప్రసరణ ద్రవం ఆహార పదార్థాల రవాణాలో సహాయపడుతుంది.
బి) బొద్దింకల ప్రసరణ ద్రవం శ్వాస వర్ణకాన్ని కలిగి ఉండి శ్వాసక్రియలో పాల్గొంటుంది.
సి) బొద్దింక ప్రసరణ ద్రవం విసర్జన ప్రక్రియలో తోడ్పడుతుంది.
డి) ప్రసరణ ద్రవం.. భక్షక కణాలు, వినాళ గ్రంథి స్రావకాల రవాణాలో ఉపయోగపడదు.
1) ఎ, బి, సి 2) ఎ, సి
3) ఎ, బి, సి, డి 4) బి, సి, డి

26. కిందివాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
ఎ) బొద్దింకలో మూడు జతల క్రియాత్మక శ్వాస రంధ్రాలుంటే దాన్ని పాలీన్యూస్టిక్ రకం అంటారు.
బి) 10 జతల క్రియాత్మక శ్వాసరంధ్రాలుంటే దాన్ని హోలోన్యూస్టిక్ రకం అంటారు.
సి) శ్వాసరంధ్రాలు కవాటయుతంగా ఉండి, కైటిన్‌లో ఏర్పడిన పెరిట్రీమ్‌ను కలిగి ఉంటాయి.
డి) బొద్దింక శ్వాసరంధ్రమైన చివరి విశాలమైన భాగాన్ని ఏట్రియం అంటారు.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
3) బి, సి, డి 4) డి

27. బొద్దింకలోని వాయునాళికల్లో ఏ ప్రొటీన్ ఉంటుంది?
1) టినీడియా 2) ఇంటిమా
3) ట్రేకిన్ 4) ట్రాఖియోబ్లాస్ట్

28. వాయునాళం ముకుళించుకుపోకుండా నిరోధించే నిర్మాణాలు?
1) ఇంటిమా 2) టినీడియా
3) ట్రేకిన్ 4) 1, 2

29. కిందివాటిలో బొద్దింక దేనికి చెందుతుంది?
1) యూరికోటెలిక్ 2) యూరియోటెలిక్
3) అమ్మోనోటెలిక్ 4) పైవన్నీ

30. బొద్దింకలోని మాల్పీజియన్ నాళికలను 'వాసావెరికోసా' అని ఎవరు పేర్కొన్నారు?
1) మెకెల్ 2) మైకేలి
3) మార్సెల్లో మాల్పీజి 4) హార్వే

31. స్పర్శశృంగాల నుంచి స్పర్శశృంగ నాడులు ప్రచోదనాలను మెదడులోని ఏ భాగం నుంచి గ్రహిస్తాయి?
1) ప్రోటోసెరిబ్రం 2) డ్యూటోసెరిబ్రం
3) ట్రైటోసెరిబ్రం 4) పైవన్నీ

32. కిందివాటిలో అతిపెద్ద నాడీసంధిని గుర్తించండి.
1) 5వ 2) 7వ 3) 8వ 4) 6వ

33. బొద్దింకలో ఏ అవయవాల కదలికను స్వయంచోదిత నాడీవ్యవస్థ నియంత్రిస్తుంది?
1) ఆహారనాళం 2) గుండె
3) రెక్కల కండరాలు 4) 1, 2

34. బొద్దింక ఒక..
1) ఏకలింగ జీవి 2) ఉభయ లైంగిక జీవి
3) లైంగిక ద్విరూపకతను ప్రదర్శిస్తుంది
4) 1, 3

35. కిందివాటిలో శుక్రకణాలకు పోషణ ఇచ్చేది?
1) యుట్రికులై బ్రివోర్స్ 2) యుట్రికులై మేజోర్స్
3) ఫేలిక్ గ్రంథి 4) టైటిల్లేటర్

36. బొద్దింకలో లార్వా దశ నుంచి ప్రౌఢ దశగా మారే రూపవిక్రియకు ఉండే పేరు?
1) సరూప శాబకం 2) కుబుస విసర్జన
3) పారామెటాబోలస్ 4) 2, 3

37. బొద్దింకలో అభివృద్ధి చెందుతున్న అండాలున్న స్త్రీ బీజకోశనాళికను ఏమంటారు?
1) పోడోమియర్ 2) ఒవేరియోల్
3) జర్మేరియం 4) టాగ్మా

38. కీటకాల కాలు ఖండితాన్ని ఏమంటారు?
1) పల్విలస్ 2) పోడోమియర్
3) టాగ్మా 4) ఒవేరియోల్

39. కిందివాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
ఎ) స్త్రీ జీవి, మగజీవితో సంపర్కం కోసం ఫెరమోన్స్‌ను ఏర్పరచదు.
బి) సంపర్కం వేసవి కాలం, రాత్రి సమయంలో జరుగుతుంది.
సి) బొద్దింకలో సగటున స్త్రీ జీవి 9-10 గుడ్ల కోశాలను ఏర్పరుస్తుంది.
డి) బొద్దింకలో గొనోపోఫైసిస్‌ల సంఖ్య 8 జతలు.
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) ఎ, డి

40. బొద్దింకలో ఆహారం నమిలేటప్పుడు పట్టుకునేందుకు సహాయపడేవి?
1) లసీనియే 2) గేలియే
3) గ్లోసే 4) పైవన్నీ

41. కిందివాటిలో బొద్దింక తీసుకునే ఆహారంలో ప్రొటీన్లను జీర్ణం చేసే ఎంజైములు
1) ప్రోటియేజ్ 2) ఇన్వర్టేజ్
3) సుక్రేజ్ 4) మాల్టేజ్

42. బొద్దింక శరీరంపై ఉండే రెక్కల సంఖ్య?
1) ఒక జత 2) 2 జతలు
3) 3 జతలు 4) 4 జతలు

43. బొద్దింక లార్వాను ఏమంటారు?
1) గ్రబ్ 2) నింఫ్
3) కాటర్‌పిల్లర్ 4) టాడ్‌పోల్

44. బొద్దింక ఏ ప్రజాతికి చెందిన జీవి?
1) పెరిప్లానేటా 2) అమెరికానా
3) బ్లాట్టిడే
4) ఇన్‌సెక్టా



రచయిత: పట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1, 2-3, 3-2, 4-3, 5-1, 6-3, 7-4, 8-1, 9-1, 10-3, 11-2, 12-4, 13-3, 14-1, 15-3, 16-1, 17-3, 18-2, 19-1, 20-1, 21-4, 22-2, 23-2, 24-3, 25-2, 26-1, 27-3, 28-4, 29-1, 30-3, 31-2, 32-4, 33-4, 34-4, 35-1, 36-3, 37-2, 38-2, 39-2, 40-4, 41-1, 42-2, 43-2, 44-2.

అద్భుత అవకాశాలిచ్చే నర్సింగ్!

తక్కువ ఖర్చుతో, కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగం ఆశించేవారు నర్సింగ్ విద్యలో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వొచ్చు. ఇంటర్ గ్రూపు ప్రకారం... ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో చేరవచ్చు. వీటిని రెండేళ్ల నుంచి నాలుగేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. ఏ కోర్సులో చేరినప్పటికీ ఉన్నత విద్య, ఉద్యోగం రెండింటికీ దారులున్నాయి. నైపుణ్యం ఉన్న వారు ప్రభుత్వ ఆసుపత్రులు, విదేశాల్లో మేటి అవకాశాలు అందుకోవచ్చు.



ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సుల్లో ఇంటర్ అన్ని గ్రూపుల విద్యార్థులకూ అవకాశం ఉంది. వీటిలో ప్రవేశం పొందిన వారికి నర్సింగ్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలుంటాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సులోకి బైపీసీ వాళ్లే అర్హులు. దీన్ని విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుపుతారు. ఏఎన్ఎం కోర్సులో నర్సింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. అయితే దీనితోనూ ఉపాధి పొందవచ్చు.

మేటి అవకాశాలు ఆశించేవారు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్‌కు ప్రాధాన్యమిస్తారు. ఇవి పూర్తయిన తర్వాత ఎమ్మెస్సీ నర్సింగ్, నర్సింగ్‌లో పీహెచ్‌డీ చేసుకోవచ్చు. నర్సింగ్ విద్యలో మహిళలకే అధిక ప్రాధాన్యం. పరిమిత సంస్థల్లోనే మేల్ నర్సింగ్ అందుబాటులో ఉంది. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు చేరిన విద్యా సంవత్సరం డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండాలి.

ఏఎన్ఎం

ఆక్సిలరీ నర్స్ అండ్ మిడ్‌వైఫ్ (ఏఎన్ఎం) లేదా మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యు) కోర్సు వ్యవధి రెండేళ్లు. తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఈ కోర్సు అందిస్తున్నాయి. ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. ఏఎన్ఎం అనంతరం వరుసగా.. జీఎన్ఎం, పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. ఏఎన్ఎం కోర్సుతోనే ప్రభుత్వ పరంగా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలోని ఉప కేంద్రా (హెల్త్ సబ్ సెంటర్స్)ల్లో ఉద్యోగాలుంటాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ వీరిని సీనియర్ నర్సులకు సహాయకులుగా తీసుకుంటారు.

జీఎన్ఎం

జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇంటర్ అన్ని గ్రూపుల వాళ్లూ అర్హులే. తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఈ కోర్సు అందిస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ జీఎన్ఎం చదువుకోవచ్చు. ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్‌తో అవకాశం లభిస్తుంది. దీన్ని పూర్తి చేసుకున్నవారు రెండేళ్ల వ్యవధితో పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదువుకోవచ్చు. లేకుంటే ఏదైనా సంస్థలో ఉద్యోగం చేస్తూ.. దూరవిద్యలో ఇగ్నో నుంచి మూడేళ్ల వ్యవధితో పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసుకోవచ్చు. అనంతరం పోస్టు బేసిక్ డిప్లొమా లేదా ఎమ్మెస్సీ నర్సింగ్‌లో చేరవచ్చు. ఆ తర్వాత ఆసక్తి ఉంటే నర్సింగ్‌లో పీహెచ్‌డీ చేయొచ్చు. జీఎన్ఎం అర్హతతో ప్రభుత్వ వైద్యశాలలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో విరివిగా ఉద్యోగాలు పొందవచ్చు.

బీఎస్సీ నర్సింగ్

నర్సింగ్ విద్యలో అధిక ప్రాధాన్యమున్న కోర్సు బీఎస్సీ నర్సింగ్. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. జాతీయ సంస్థలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఈ కోర్సు అందిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశానికి ఈఏపీసెట్ (బైపీసీ) స్కోరు తప్పనిసరి. కౌన్సెలింగ్‌తో ప్రవేశం లభిస్తుంది. బీఎస్సీ నర్సింగ్ తర్వాత పోస్టు బేసిక్ డిప్లొమా లేదా ఎమ్మెస్సీ నర్సింగ్ ఆ తర్వాత పీహెచ్‌డీ పూర్తిచేసుకోవచ్చు.

ఉన్నత విద్య

పోస్టు బేసిక్ డిప్లొమా: బీఎస్సీ/ పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ తర్వాత ఏడాది వ్యవధితో ఉన్న పోస్టు బేసిక్ డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చు. కార్డియో థొరాసిక్, క్రిటికల్ కేర్, మిడ్ వైఫరీ, న్యూరో సైన్స్, అంకాలజీ, ఆర్థోపెడిక్ అండ్ రిహాబిలిటేషన్, సైకియాట్రిక్, నియోనేటల్, ఆపరేషన్ రూమ్, ఎమర్జెన్సీ అండ్ డిజాస్టర్, ఆప్తాల్మిక్, టీబీ, లెప్రసీ.. ఇలా కోరుకున్న స్పెషలైజేషన్ ఎంచుకోవచ్చు. కోర్సు పూర్తయిన తర్వాత సంబంధిత స్పెషల్ డాక్టర్ల పరిధిలో/వార్డుల్లో సేవలు అందించవచ్చు.

ఎమ్మెస్సీ నర్సింగ్: ఇందులో కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, మెడికల్ సర్జికల్ నర్సింగ్, అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ నర్సింగ్, మెంటల్ హెల్త్ నర్సింగ్, చైల్డ్ హెల్త్ నర్సింగ్... తదితర స్పెషలైజేషన్లు ఉంటాయి. కోర్సుల వ్యవధి రెండేళ్లు. బీఎస్సీ నర్సింగ్, పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసుకున్నవారు వీటిలో నచ్చిన స్పెషలైజేషన్ ఎంచుకోవచ్చు. అనంతరం సంబంధిత విభాగాల్లో విధులు నిర్వర్తించవచ్చు.

బీఎస్సీ నర్సింగ్/ పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తిచేసుకున్నవారు.. నర్స్ ప్రాక్టీషనర్ క్రిటికల్ కేర్ పోస్టుగ్రాడ్యుయేట్ రెసిడెన్సీ ప్రోగ్రాం పూర్తిచేసుకుంటే కెరియర్‌లో మరింతగా రాణించగలరు. అత్యవసర సేవలను సమర్థంగా నిర్వహించగలిగేలా ఈ కోర్సు రూపొందించారు. ఆసుపత్రుల నిర్వహణపై ఆసక్తి ఉన్నవారు ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సునూ చదువుకోవచ్చు. అదనపు నైపుణ్యాలు ఆశించేవారు ఇగ్నో అందించే నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్లొమా కోర్సును పరిశీలించవచ్చు.

ఉద్యోగాలెక్కడ?

సుశిక్షితులైన నర్సులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, హెల్త్ సెంటర్లు, విద్యా సంస్థలు, ఓల్డేజ్ హోంలు, ఎన్జీవోలు, సేవా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు.. వీటిలో ఎక్కడైనా ఉపాధి దొరుకుతుంది. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసుకున్నవారు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో ఆకర్షణీయ వేతనంతో రాణించగలరు. కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, రైల్వేలు, ఇతర కేంద్రీయ సంస్థల్లో నర్సు ఉద్యోగం పొందినవారు రూ.44,900 మూలవేతనంతో మొదటి నెల నుంచే రూ.80 వేలు అందుకోవచ్చు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసుకున్నవారిని పరీక్ష ద్వారా ఆర్మీలో నేరుగా లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుని రూ.లక్షకు పైగా వేతనం చెల్లిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, హెల్త్ సెంటర్లు, సంక్షేమ వసతి గృహాల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. వీరికి ప్రారంభ మూలవేతనం రూ.36,750, మొదటి నెల నుంచే రూ.50 వేల జీతం పొందవచ్చు. కార్పొరేట్ ఆసుపత్రులు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివినవారికి ప్రారంభంలో రూ.18 వేల నుంచి రూ.25 వేల వేతనం అందిస్తున్నాయి. పీజీ పూర్తిచేసుకున్నవారు ఆకర్షణీయ జీతంతో కార్పొరేట్ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో ప్రత్యేక సేవలు అందించవచ్చు. బోధన రంగాన్నీ ఎంచుకోవచ్చు. పీహెచ్‌డీతో నర్సింగ్ కళాశాలలకు ప్రిన్సిపల్‌గానూ, ఆసుపత్రుల్లో హెచ్‌ఓడీలుగానూ సేవలందించవచ్చు.

> ‘ఈ వృత్తిలో రాణించాలంటే ఓర్పు తప్పనిసరి. రాత్రివేళల్లో పని చేయడానికి సిద్ధపడాలి. శ్రమించే, సేవ చేసే తత్వం, మానసిక సామర్థ్యం, వృత్తి పరిజ్ఞానం, నిర్వహణ నైపుణ్యాలు ఉండాలి.’

విదేశాల్లో....

నర్సింగ్ సేవలపై పూర్తి అవగాహన, ఆంగ్లంలో కమ్యూనికేషన్ నైపుణ్యం ఉంటే అమెరికా, కెనడా, సింగపూర్, గల్ఫ్, మిడిల్ ఈస్ట్.. దేశాల్లో పెద్ద మొత్తంలో వేతనాలు అందుకోవచ్చు. విదేశాల్లో ఉద్యోగాన్ని ఆశించేవారు ఆ దేశం నిర్వహించే పరీక్షలో అర్హత సాధించాలి. కొన్ని దేశాలు రెండు మూడేళ్ల అనుభవం ఉంటే ఇంటర్వ్యూతోనే అవకాశమిస్తున్నాయి.

జాతీయ స్థాయిలో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) న్యూదిల్లీ, బీబీనగర్, మంగళగిరితోపాటు వివిధ కేంద్రాలు, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (సీఎంసీ), వెల్లూరు, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్ (ఏఎఫ్ఎంసీ), పుణె, జిప్‌మర్, పుదుచ్చెరి, పీజీఐఎంఈఆర్, చండీగఢ్, మణిపాల్ అకాడెమీ.. ఇవన్నీ బీఎస్సీ నర్సింగ్ విద్యకు దేశంలో పేరున్న సంస్థలు. నీట్ యూజీ స్కోరుతో వీటిలో ప్రవేశం పొందవచ్చు.

తాజా ప్రకటనలు

- తెలంగాణలో జీఎన్ఎం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. **చివరి తేదీ:** అక్టోబరు 17. **వెబ్‌సైట్:** https://dme.telangana.gov.in/
- ఏపీలోనూ జీఎన్ఎం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. **చివరి తేదీ:** అక్టోబరు 25. **వెబ్‌సైట్:** https://dme.ap.nic.in/
- తెలంగాణలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశానికి **గడువు:** అక్టోబరు 14. **వెబ్‌సైట్:** https://tsparamed.tsche.in/
- నర్సింగ్ విద్యకు జాతీయ స్థాయిలో మేటి సంస్థలో ఒకటైన జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్మర్), పుదుచ్చెరి బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. నీట్ యూజీ స్కోరుతో అవకాశం కల్పిస్తారు. **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** అక్టోబరు 24. **వెబ్‌సైట్:** https://jipmer.edu.in/

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో...

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, హౌరాలోని ప్రభుత్వరంగ సంస్థ హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 6 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
▲ డిప్యూటీ జనరల్ మేనేజర్: 01 ▲ అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 01 ▲ మేనేజర్: 01 ▲ డిప్యూటీ మేనేజర్: 03
విభాగాలు: ప్రాజెక్ట్ ఆపరేషన్స్, షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్, మెకానికల్, ఎస్టేట్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్, సేఫ్టీ, హ్యూమన్ రిసోర్స్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వేతనం: డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు నెలకు రూ.1,86,120; అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,65,440; మేనేజర్ పోస్టుకు రూ.1,24,000; డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.1,03,000.
వయసు: 35 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: పవర్ పాయింట్ ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** రూ.1000; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24-10-2024.
వెబ్‌సైట్: https://hooghlycsl.com/

ఎస్ఈసీఐ దిల్లీలో యంగ్ ప్రొఫెషనల్స్

దిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐ).. ఒప్పంద ప్రాతిపదికన 8 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
విభాగాలు: ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యూమన్ రిసోర్స్, కార్పొరేట్ ప్లానింగ్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, సీఏ/సీఎంఏ, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీఏతో పాటు పని అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు మొదటి ఏడాది రూ.70,000; రెండో ఏడాది రూ.75,000; మూడో ఏడాది రూ.80,000.
ఎంపిక: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2-11-2024
వెబ్‌సైట్: https://www.seci.co.in/

అప్రెంటిస్‌షిప్

కొంకణ్ రైల్వేలో గ్రాడ్యుయేట్/ డిప్లొమా అప్రెంటిస్ ఖాళీలు

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వశాఖకు చెందిన నవీ ముంబయిలోని కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్.. 190 మందికి అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను కోరుతోంది.
▶ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 80 ▶ డిప్లొమా అప్రెంటిస్ (టెక్నీషియన్): 80 ▶ జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్: 30 **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్. **అర్హత:** విభాగాన్ని అనుసరించి డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్.
వయసు: 1-09-2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
శిక్షణ కాలం: ఒక సంవత్సరం. **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.4500; డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.4000. **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ మహిళ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. **ఎంపిక:** విద్యార్హతల్లో మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02-11-2024.
వెబ్‌సైట్: https://konkanrailway.com/

ఆర్థిక శాస్త్రంలో బీఏ తర్వాత?

బి.ఎ. ఎకనామిక్స్ చేశాను. ఈ కోర్సుతో ఉన్నత విద్యా ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? – ఎం. రాజశేఖర్



■ ఆర్థిక శాస్త్రంలో బియ్యే చేసిన వారికి ఎకనామిక్ అనలిస్ట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, పాలసీ అనలిస్ట్, మార్కెట్ అనలిస్ట్, డేటా అనలిస్ట్, క్రెడిట్ అనలిస్ట్, రిస్క్ అనలిస్ట్, అక్చూరియల్ అనలిస్ట్ లాంటి ఉద్యోగాలుంటాయి. ఇవేకాకుండా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో కూడా వివిధ కొలువుల్లో చేరవచ్చు. వీటిలో చాలా పోస్టులకు ఎకనామిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉంటే అదనపు అవకాశాలు లభిస్తాయి. బోధన రంగంపై ఆసక్తి ఉంటే బీఈడీ చేసి, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడవచ్చు. డిగ్రీ అర్హత ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కోసం కూడా ప్రయత్నించవచ్చు.

ఉన్నత విద్యావకాశాల విషయానికి వస్తే- ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్, అప్లైడ్ ఎకనామిక్స్, డెవలప్‌మెంటల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్‌ల్లో పీజీ చేయొచ్చు. ఆసక్తి ఉంటే మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, డెవలప్‌మెంట్ స్టడీస్, అక్చూరియల్ సైన్స్, బిజినెస్ అనలిటిక్స్, డేటా సైన్స్, లా, జర్నలిజం, సైకాలజీ లాంటి సబ్జెక్టుల్లోనూ పీజీ చేసే అవకాశం ఉంది. మీరు ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్ చదివి ఉంటే మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ చదవొచ్చు.

విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్, సమస్యా పరిష్కార, టెక్నికల్ నైపుణ్యాలు కూడా ఉంటే మెరుగైన హోదాలు పొందొచ్చు. ఇటీవల ఎకనామిక్స్‌తో పాటు మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఎంఎస్ ఎక్సెల్, ఆర్ ప్రోగ్రామింగ్, పైతాన్, అరిమా, ఎస్‌పీఎస్ఎస్, ఈవ్యూస్ లాంటి వాటిల్లోనూ ప్రావీణ్యం ఉన్నవారికి ఎక్కువ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

జేఈఈ లేకుండా ఐఐటీ కోర్సులు!

ఐఐటీల్లో చదవాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులు కావాలన్నది తెలిసిందే. దీనితో సంబంధం లేకుండా.. ఐఐటీలు అందించే వివిధ షార్ట్ టర్మ్ కోర్సులను చదివే వీలుందని కొందరికే తెలుసు. అందుకే వాటి వివరాలు, చేరాలంటే కావాల్సిన అర్హతలు.. అన్నీ తెలుసుకుందామా?

ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో (ఐఐటీ) కొన్ని సర్టిఫికేషన్ కోర్సులను నేరుగా చదవచ్చు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ.. ఎక్కువమందికి అందుబాటులో ఉండేలా వీటిని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారు, ఇంకా చదువుతున్నవారు, ఎవరైనా వీటిలో చేరవచ్చు.

ఐఐటీ మద్రాస్: బీఎస్సీ ఇన్ డేటాసైన్స్

ఈ ప్రోగ్రామ్‌లో చేరేందుకు విద్యార్థులకు పదోతరగతి స్థాయి గణితం చేయడం బాగా రావాలి.. ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. కోర్సులో చేరాక విద్యార్థులు దానిలో కొనసాగేందుకు నెల రోజుల అనంతరం ఓ పరీక్ష ఉత్తీర్ణులు కావాలి. ఈ ప్రోగ్రామ్‌ను మూడు భాగాలుగా విభజించారు.... ఫౌండేషనల్, డిప్లొమా, డిగ్రీ. ఏ స్థాయిలో అయినా విద్యార్థులు కోర్సు నుంచి బయటకు రావొచ్చు. వచ్చిన ఏడాదిని బట్టి సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ తదితర సర్టిఫికెట్లు లభిస్తాయి. ఇందులో వయసు లేదా చదివిన కోర్సులను బట్టి తారతమ్యాలు లేవు. ఏ సబ్జెక్టుల వారైనా చేరవచ్చు. ఇతర వివరాలు, ఫీజు వంటివి అధికారిక వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు.

ఐఐటీ కాన్పూర్: ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ విత్ పైతాన్

ఇది నాలుగు వారాల ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు. ఏఐఎంఎల్, పైతాన్ ప్రోగ్రామింగ్ నేర్పిస్తారు. టెన్సర్ ఫ్లో, పాండాస్ వంటి వాస్తవికంగా ఉపయోగించే టూల్స్ మీద ఇది దృష్టి పెడుతుంది. విద్యార్థులు, పరిశ్రమలో ఉన్న నిపుణులు, ఆర్ అండ్ డి సిబ్బంది ఎవరైనా దీన్ని నేర్చుకోవచ్చు. ఇందుకోసం ముందుగా ప్రోగామింగ్ అనుభవం అవసరం లేదు. పూర్తిగా కొత్తవారు కూడా నేర్చుకోవచ్చు.

ఐఐటీ రూర్కీ: సర్టిఫికెట్ ఇన్ జెనరేటివ్ ఏఐ & మెషిన్ లెర్నింగ్

‘ఐహబ్ దివ్య సంపర్క్’ సంస్థతో కలిసి ఇది 11 నెలల సర్టిఫికెట్ కోర్సును అందిస్తుంది. ఇది జనరేటివ్ ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ గురించి తాజా వివరాలు నేర్పించేలా ఉంటుంది. వర్చువల్ తరగతులు, ప్రాజెక్టులు, రెండు రోజుల క్యాంపస్ సందర్శన వంటిది ఇందులో భాగం. ఇది కెరియర్‌లో ఉన్న వారి కోసం ఉద్దేశించినది. లోతైన సబ్జెక్టును నేర్పించేలా ఉంటుంది.

ఐఐటీ దిల్లీ: యూఐ, యూఎక్స్ డిజైన్ సర్టిఫికేషన్

ఐఐటీ దిల్లీ ఆరు నెలల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. యూఐ, యూఎక్స్ డిజైన్ గురించి పూర్తిగా నేర్చుకోవచ్చు. కనీసం ఏడాది పాటు పని అనుభవం కలిగిన గ్రాడ్యుయేట్ల కోసం దీన్ని రూపొందించారు. ఈ సర్టిఫికేషన్ అందుకోవాలంటే 50 శాతం హాజరు, 60 శాతం మార్కులు అవసరం. ఇది అందుకోలేని వారు పార్టిసిపేషన్ ధ్రువపత్రాన్ని తీసుకెళతారు.



ఐఐటీ కాన్పూర్: సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ డెవోప్స్

ఈ అండ్ ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ఐఐటీ కాన్పూర్ ఈ ఎనిమిది నెలల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను అందిస్తుంది. ఇందులో క్లౌడ్ కంప్యూటింగ్, డెవోప్స్ గురించి పూర్తిస్థాయిలో నేర్పిస్తారు. కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు ఇందులో చేరేందుకు అర్హులు. దీనిలో వివిధ స్థాయుల్లో 30 విభిన్నమైన ప్రాజెక్టులు ఉంటాయి. మూడు డొమైన్స్‌లో కేప్‌స్టోన్ ప్రాజెక్టుల వంటివి ఇందులో ఉంటాయి. ప్రోగ్రామింగ్ చదవుకోని విద్యార్థులు సైతం నేర్చుకునేలా దీన్ని రూపొందించారు.



తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

వీడియోగ్రఫీ
సంస్థ: టాప్ ట్యాలెంట్ బ్రిడ్జ్ కెనడా
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/2711b8

లైవ్ మార్కెట్ ట్రేడింగ్
సంస్థ: ఎర్న్‌వెల్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ మోడలింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/9c3664

డెంటల్ ఇన్సూరెన్స్ పేమెంట్ పోస్టర్
సంస్థ: టుడేస్ డెంటల్ సర్వీసెస్
నైపుణ్యం: అకౌంటింగ్ స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/80daed

పాడ్‌కాస్ట్ ప్రొడక్షన్
సంస్థ: ద రైట్ డాక్టర్స్
నైపుణ్యం: పాడ్‌కాస్ట్ ప్రొడక్షన్
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ internshala.com/i/35bd16

టెలికాలింగ్
సంస్థ: హంట్ డిజిటల్ మీడియా
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/1fefd5

డౌట్ సాల్వింగ్ ఎక్స్‌పర్ట్ (స్టాటిస్టిక్స్)
సంస్థ: కుందుజ్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఆన్‌లైన్ టీచింగ్, స్టాటిస్టిక్స్ టీచింగ్ స్టైపెండ్: రూ.5,000-6,000
☛ internshala.com/i/23c512

బ్రాండ్ మార్కెటింగ్
సంస్థ: వేస్పైర్ ఎడ్యుటెక్ ప్రై.లి.
నైపుణ్యం: బ్రాండ్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,500-5,000
☛ internshala.com/i/f23433

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 30

బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్
సంస్థ: అర్బనో ఇన్ఫోటెక్ ప్రై.లి.
నైపుణ్యం: రస్ట్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/659600

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: క్యానిబాల్స్ మీడియా ప్రై.లి.
నైపుణ్యం: డిజిటల్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/69e614

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 31

హైదరాబాద్‌లో

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్‌లో

1. ఆర్డర్ ప్రాసెసింగ్ (ఆపరేషన్స్)
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ internshala.com/i/de2865

2. డేటా ఎంట్రీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.7,000-10,000
☛ internshala.com/i/c11a64

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: బ్లోసమ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000-12,000
☛ internshala.com/i/79cc2c

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 28

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: ఐడియల్ డిజైన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 21
☛ internshala.com/i/b5bcfc

కంటెంట్ రైటింగ్
సంస్థ: ఇన్‌క్రా సాఫ్ట్ ప్రై.లి.
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం స్టైపెండ్: రూ.3,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 20
☛ internshala.com/i/d218fc

ఎఫ్ఎంసీజీ రిసెర్చ్
సంస్థ: లిక్విడ్ రిసెర్చ్ మీడియా సొల్యూషన్స్ ప్రై.లి. నైపుణ్యం: బిజినెస్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 26
☛ internshala.com/i/b2ff7a

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: హెన్స్‌సోషల్ - వన్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
☛ internshala.com/i/579ed6

మకరందం

makarandam@eenadu.in

27 గురువారం అక్టోబరు 10, 2024

ఈనాడు

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్ - 501 512

అప్పుడిక దుఃఖమే ఉండదు..




'భవతీ భిక్షాందేహి' అంటూ వచ్చిన సాధువుకు కాస్త అన్నం సమర్పించి, తమ పుత్రుడు మాట వినడం లేదంటూ బాధపడిందో మహిళ. అంతా విన్న ఆయన 'మనిషికి మూడు రుణాలు ఉంటాయమ్మా. అందులో మాతాపితృ రుణం ఒకటి. పిల్లల్ని పెంచి పెద్దచేయటం తల్లిదండ్రుల ధర్మం. అది బరువుగా భావించకూడదు, ప్రతిఫలం ఆశించకూడదు. ఎవరికి వారు తమ కర్మలను ఫలితాన్ని ఆశించకుండా చెయ్యాలి. గీతలో శ్రీకృష్ణుడు-

దూరేణహ్యావరం కర్మ బుద్ధి యోగాద్ధనంజయ
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫల హేతవః

అంటాడు. అంటే... అర్జునా! సమత్వ బుద్ధితో కూడిన నిష్కామకర్మ కంటే ఫలాపేక్షతో కూడిన కామ్య కర్మ అల్పమైంది. అందువల్ల నిష్కామ కర్మాచరణను ఆశ్రయించు- అన్నాడు. ఫలాన్ని ఆశించేవారు అల్పులు, దీనులని భావం. కుమారుడి బాధ్యత నీ కర్మగా భావించి ఉంటే ఈ దీనత్వం ఉండేది కాదు. పెంచినందుకు పుత్రుడు గౌరవించాలి, ఆదరించాలి, అన్నీ సమకూర్చాలి- అంటూ ఫలితాన్ని ఆశిస్తున్నావు. అంటే నీది కామ్యకర్మ. అందుకే ఇలా బాధ పడుతున్నావు. అతడు ఆదరించడం లేదన్న ఆలోచన వదిలి, భగవంతుడిపై మనసు లగ్నం చేయి. కడుపున పుట్టినవాళ్లే కాదు.. ఎవరి నుంచీ, దేన్నుంచీ ఫలితాన్ని ఆశించకుండా విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చటం, లాభం నష్టం, గెలుపూ ఓటమి- ఇలా దేన్నయినా సమంగా స్వీకరించడం నేర్చుకో. అప్పుడిక దుఃఖమే ఉండదు.. మోక్షమూ ప్రాప్తిస్తుంది' అంటూ వివరించాడు సాధువు. – పద్మజ

అక్టోబరు 12 విజయదశమి

మహిషమర్దనికి నవమి హారతులు.. దనుజహారిణికి దశమి పూజలు



యుగయుగాలుగా వెంటాడుతూ తరతరాల శిష్ట జనాలను బాధిస్తున్న అసుర మూకను సంహరించింది జగదంబిక. సృష్టిలో స్త్రీశక్తి ధైర్య స్థైర్యాలను చాటింది. అసురుల మీద వరుసగా ఒంటి చేత్తో ఎనిమిది రోజుల పాటు ఏకబిగిన యుద్ధం చేసిన ఆ అమ్మ నవమినాడు లోకకంటకుడైన మహిషాసురుణ్ణి మట్టుపెట్టింది. దశమినాడు దేవతలను అనుగ్రహిస్తూ రాజ రాజేశ్వరీదేవిగా అవతరించింది.

భక్తుల పాలిట కరుణార్ద్రహృదయ అయిన రాజరాజేశ్వరీదేవి దశమినాటి జాబిలిలా ప్రకాశిస్తూ శ్రీమాతగా, శ్రీమహా రాజ్ఞిగా స్తుతులు అందుకుంటోంది. శ్రీమత్ సింహాసనేశ్వరిగా దర్శనమిచ్చి విశ్వశాంతిని వికసింపజేస్తోంది, విజయాలు చేకూరుస్తోంది. అందుకే దేవీనవరాత్రుల్లో మహానవమి, విజయ దశమి తిథులకు అంత ప్రాముఖ్యత వచ్చింది. ఆచార సంప్రదాయాలను అనుసరించి నవమి నాడు నవదుర్గలలోని సిద్ధిదాత్రిని, దశమినాడు రాజరాజేశ్వరీ మాతను అర్చిస్తుంటారు అమ్మవారి భక్తులు.

ముగురమ్మల మూలపుటమ్మ.. చాల పెద్దమ్మ

నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు మహా నవమి మహోత్సవం. దుర్గాదేవి రూపమైన సిద్ధిధాత్రిని ఈ రోజున ఆరాధిస్తారు. దుర్గామాత ఈ అవతారంలోనే మహిషాసురుణ్ణి మట్టి కరిపించి లోకానికి కల్యాణం చేకూర్చింది. భక్తుల కోర్కెలను సిద్ధింపచేస్తుంది. అందుకే ఆ చల్లని తల్లిని.. 'అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ' అంటూ స్తుతిస్తాం. ఆ ముగ్గురమ్మలే మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపాలుగా పూజలు అందుకునే తల్లులు. 'చాల పెద్దమ్మ' అంటే మహాశక్తి స్వరూపిణి అని అర్థం. అండపిండ బ్రహ్మాండాలంతటా నిండిపోయిన శక్తిస్వరూపమే ఆమె. ఈ శక్తి స్వరూపిణి సమస్త జీవరాశుల్లోనూ ఇమిడి ఉంటుంది.

సృష్టి ప్రారంభంలో అవతరించిన దివ్యశక్తి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సృజించింది. లక్ష్మీ, సరస్వతులను సృష్టించి విష్ణువు, బ్రహ్మలకు ఇచ్చింది. ఈ జగన్మాతను ఆరాధించే శివయ్య సకల సిద్ధులనూ పొందాడు. తనలో సగం చేసుకుని శివుడు అర్ధనారీశ్వరుడు అయ్యాడు. శివుని శరీరంలో ఎడమ వైపున ఉండే తల్లే సిద్ధిదాత్రీ దేవి అన్నది సాధకుల విశ్వాసం. ఆ శక్తిస్వరూపిణి అతీంద్రియ శక్తులను సైతం సిద్ధింపచేస్తుంది.

సిద్ధిధాత్రి రూప విలాసం

మహానవమి నాడు పూజలందుకునే దుర్గమ్మ సిద్ధిధాత్రి రూపంలో నాలుగు చేతులతో పద్మం మీద కూర్చుని ఉంటుంది. కమలం, గద, శంఖ, చక్రాలను ధరించి ఉంటుంది. ఈ రూపంలో దుర్గ అజ్ఞానాన్ని తొలగించి బ్రహ్మాన్ని గ్రహించేందుకుగానూ జ్ఞానాన్ని అందిస్తుంది. చుట్టూ ఉన్న సిద్ధులు, గంధర్వులు, యక్షులు, దేవతలు, రాక్షసులు అమ్మను పూజిస్తుంటారు. అణిమ (దేవునికి సమానమైన కీర్తిని గడించటం), మహిమ (ఘనత వహించే శక్తి), గరిమ (బరువును పెంచుకోగల శక్తి), లఘిమ (బరువును తక్కువచేసి చూపగల శక్తి), ప్రాప్తి (అదృష్టం), ప్రాకామ్యం (దూర దర్శనం, దూర శ్రవణం, ఆకాశ గమనం తదితర శక్తులు), ఈశాత్వం (దిక్పాలకులను నియంత్రించే శక్తి), వశిత్వం (సకల జీవరాశులనూ అదుపుచేయగల శక్తి) అనే ఎనిమిది అతీంద్రియ శక్తులు ఈ తల్లి వశంలోనే ఉంటాయి. ఈ కారణం వల్లే శక్తి స్వరూపాలైన ఆయుధాలకు నవమినాడు భక్తిగా ఆయుధ పూజలు చేస్తుంటారు.

చల్లని తల్లి దుర్గమ్మ

మహిషమర్దనం తరువాత విశ్వశాంతి కోసం తన రౌద్ర రూపాన్ని విడిచి చల్లని తల్లిగా దుర్గమ్మ అవతరించి భక్తులను కరుణిస్తోంది. అప్పటి ఆ అమ్మ రూపమే రాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకాన్ని ఆసనంగా చేసుకుని, చేతిలో చెరకుగడతో, చిరుదరహాసంతో శోభాయమానమై ప్రకాశించే జగన్మాతను భక్తితో పూజించాలి. అనంతశక్తి స్వరూపిణి అయిన ఈ తల్లిని ప్రసన్నం చేసుకోవడానికి కుంకుమార్చనలు, సువాసినీ పూజలు చేస్తుంటారు.

అవి కూడా విజయోత్సవాలే!

అమ్మవారు మహిషాసురుణ్ణి వధించిన రోజు విజయదశమి అన్నది ప్రశస్తం. కానీ ఆయా పురాణాలను అనుసరించి ఇతర సందర్భాలూ ఉన్నాయి. పాల సముద్రం నుంచి అమృతభాండం ఆవిర్భవించిన రోజే విజయదశమి అన్నారు. త్రేతాయుగంలో రావణాసురుణ్ణి శ్రీరాముడు సంహరించిన రోజును విజయ దశమిగా చెప్పారు. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను శమీవృక్షం తొర్రలో ఉంచారు. తిరిగి వచ్చిన అనంతరం ఆ చెట్టుకు పూజచేసి, ఆయుధాలను తీసుకున్నారు. యుద్ధంలో కౌరవులపై విజయం పొందిన రోజే విజయదశమి అని కూడా చెబుతారు.

రాజరాజేశ్వరీదేవి స్వప్రకాశ జ్యోతి స్వరూపిణి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ఈ మూర్తి తన భక్తులకు వరాలుగా అనుగ్రహిస్తుంది. ఈమె యోగమూర్తి. అనంతశక్తి స్వరూపమైన శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత. రాజరాజేశ్వరీ అష్టకంలో ఆదిశంకరాచార్యులు అమ్మ రూప గుణ లావణ్యాలను వివరించారు.

విజయదశమి సందర్భంగా అమ్మవారికి కలశం పెట్టి, శ్రీరాజరాజేశ్వరీ అష్టోత్తరం పఠిస్తూ పూజలు చేసి, ఆ తల్లికి ఇష్టమైన లడ్డూతో పాటు షడ్రసోపేతమైన భోజన పదార్థాలతో మహానివేదన చేస్తారు. విజయదశమిరోజు అమ్మవారికి సామూహికంగా అర్చనలు చేసి, ఉద్వాసన పలికి, నిమజ్జనం చేసే సంప్రదాయం కూడా ఉంది.

శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని రోజుకో రూపంగా అలంకరించడం తెలిసిందే. చివరి అలంకారంగా శ్రీ రాజరాజేశ్వరీదేవిని దర్శింపచేస్తారు. సకల భువన బ్రహ్మాండాలకు రాజరాజేశ్వరీదేవి ఆరాధ్య దేవత. మహాత్రిపురసుందరిగా, అపరాజితాదేవిగా కూడా భక్తులు పూజిస్తారు. రాజరాజేశ్వరీ అమ్మవారిని పూజించే వారికి విజయాలు కలుగుతాయని దేవీపురాణం తెలియచేస్తోంది. ఈ పర్వదినాల్లోనే కాదు.. నిత్యం అమ్మను స్మరించి, సుఖసంతోషాలతో వర్ధిల్లుదాం.

– డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు

వందే విష్ణుం!


పుండరీకాక్షః



విష్ణుసహస్రనామావళిలో 111వది. పుండరీకం అంటే తామరపువ్వు. పుండరీకాక్షః (ఓం పుండరీకాక్షాయ నమః) అంటే పద్మాలను పోలిన సుందరమైన నేత్రాలు గలవాడు అనేది సామాన్య అర్థం. భక్తుల హృదయ కమలాల్లో నివసించి ఆ స్వామి సమస్తాన్నీ చూస్తుంటాడు అన్నది అంతరార్థం. పరంధామమే పుండరీకం. పరంధామం అంటే దేవుడు ఉండే ప్రదేశం. దేవదేవుడు ఆ దివ్యలోకవాసులను కంటికి రెప్పలా కాపాడుతుంటాడు కనుక ఆయనను పుండరీకాక్షుడంటూ కీర్తిస్తున్నాం. – వై.తన్వి

క్రీస్తువాణి


దైవసన్నిధిలో రక్షణ



ప్రస్తుత సమాజంలో ఏది సత్యమో, ఏది అసత్యమో అర్థం కాని అయోమయ పరిస్థితి. అబద్ధమే నిజం అనుకునే దుస్థితి. దుర్మార్గుడైన సాతాను అవాస్తవాలే నిజాలన్నట్టుగా భ్రమింపజేస్తాడని బైబిల్ చెబుతోంది. అబద్ధాలను ఎక్కువమంది నమ్మి ఆచరిస్తున్నారు, వాళ్లని చూసి మరెందరో అనుసరిస్తున్నారు కదాని అవి నిజాలైపోవు. కాలమాన పరిస్థితులు, అనుకూలతలను బట్టి నిజం అబద్ధంగా, అబద్ధం నిజంగా మారదు. ఎందుకంటే 'నేనే సత్యం, మార్గం, జీవం అయ్యున్నాను' అన్నాడు ఏసుక్రీస్తు. దేవుని నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సత్యం. మరోపక్క సాతానుడు అపవాది, అబద్ధాలకు జనకుడై ఉన్నాడు. దేవుని సత్యమార్గం కాంతులు వెదజల్లుతుంది. అది మనలో ఉండే చీకటి బంధనాల నుంచి విముక్తులను చేసి వెలుగులోకి నడిపిస్తుంది. అందుకే భక్తుడైన యోహాను 'నా పిల్లలు సత్యమార్గంలో నడుస్తున్నారని వినటం కంటే సంతోషకరమైంది వేరొకటి లేదు' అన్నాడు. దైవాన్ని విశ్వసించి, ఆయనను అనుసరించే ప్రతి ఒక్కరూ ఆయన సన్నిధిలో, రక్షణలో నిరంతరం నిశ్చింతగా ఉంటారు.

– బందెల స్టెర్జి రాజన్

పగలు పడుకున్నావా!



సోయెన్ అనే జెన్ మాస్టర్ అరవయ్యొక్క సంవత్సరాల వయసులో ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆయన మాటలూ చేతలూ ఎంతో ఆదర్శప్రాయంగా ఉండేవి. మహోన్నత గురువు అంటూ కితాబులు అందుకున్నారు. ఆయన వద్ద అభ్యాసం చేసే శిష్యుల్లో కొందరు ఎండాకాలంలో పగటిపూట వేడికి తాళలేక నిద్రపోయేవారు. అది గమనించినా సోయెన్ ఎప్పుడూ కోప్పడలేదు. మాస్టర్ ఏమీ అనరన్న ధైర్యంతో వాళ్లు కొంచెం ఎక్కువసేపే నిద్రలో జోగేవారు. శిష్యులు పగలు నిద్రపోయినా పట్టించుకోక పోవటానికి ఓ కారణముంది. ఆయనకు పన్నెండేళ్లు వచ్చేసరికే తాత్విక అంశాలకు సంబంధించి అభ్యాసం చేస్తున్నారు. ఒకరోజు గురువు భోజనానికి వెళ్లి ఇంకా రాలేదు. వేసవి తాపం ఎక్కువగా ఉంది. వడగాలులు వీస్తున్నాయి. చిన్ని సోయెన్ కళ్లు సోలిపోతున్నాయి. నిద్ర తమాయించులేక.. మెల్లగా కాళ్లు జాపి పడుకున్నాడు. ఎంత సమయం గడిచిందో తెలీదు. గురువు వస్తున్న అలికిడికి సోయెన్ ఉలిక్కిపడి లేచాడు. అప్పటికే ఆలస్యం అయ్యింది. ఆయన లోనికి రానే వచ్చారు. సోయెన్ తాను తప్పు చేశానని చింతిస్తూ జీరపోయిన స్వరంతో 'నన్ను క్షమించండి మాస్టర్' అంటూ పదేపదే వేడుకున్నాడు. గురువు కోప్పడకపోతేనేం.. పగలు పడుకున్నావా - అన్న నిష్ఠూరంతో మౌనంగా ఉండిపోయారు. అలా మాట్లాడకపోవటం మరింత వేధించింది. అంతే.. సోయెన్ ఇక జీవితంలో పగటిపూట ఎన్నడూ నిద్ర పోలేదు. కానీ తాను గురువయ్యాక.. శిష్యులు అలసటతో నిద్రిస్తే అర్థం చేసుకునేవారే తప్ప ఆగ్రహించలేదు, ఆంక్షలు విధించలేదు. ఆయన మట్టుకు క్షణం వృథా చేయక బాధ్యతలు నిర్వహించేవారు.

– నాగరత్న

హృదయపూర్వకంగా ప్రార్థిస్తే...



తన కుమారుడు మరణావస్థలో ఉన్నాడంటూ దుఃఖిస్తున్నాడో వ్యక్తి. కనిపించిన వారినల్లా బిడ్డను బతికించుకునే ఉపాయం చెప్పమని బతిమాలుతున్నాడు. అది విన్న ఓ వ్యక్తి- 'దీనికో మందు ఉంది. కానీ ఆ ఔషధాన్ని సంపాదించడమే కష్టం. స్వాతి నక్షత్రం ఉన్న రోజున కురిసే వాన నీళ్లు ఒక పుర్రెలో పడాలి. ఆ నీటిని తాగటానికి ఓ కప్ప రావాలి. అది చూసిన పాము దాని వెంటపడాలి. కప్పను కాటేసే సమయంలో పాము చిందించే విషం పుర్రెలో పడాలి. ఈలోగా కప్ప తప్పించుకోవాలి. విషం చిందిన పుర్రెలోని జలాన్ని తెచ్చి రోగికి తాగించాలి' అంటూ వివరించాడు. ఆ మాటలు విన్న తండ్రి దాన్నెలానైనా సాధించాలనుకున్నాడు. స్వాతి నక్షత్ర సమయంలో మనసారా దేవుణ్ణి స్మరించి బయల్దేరాడు. అదే సమయంలో వర్షం మొదలైంది. అప్పుడా వ్యక్తి 'భగవంతుడా! ఈరోజు స్వాతి నక్షత్రం, వర్షం కురుస్తోంది. తక్కింది కూడా సాధ్యం చెయ్యి' అని ప్రార్థించాడు. అలా ముందుకు వెళ్తుండగా వర్షపు నీటితో నిండిన పుర్రె కనిపించింది. అప్పుడతను 'ఓ దేవదేవా! కరుణించావు! ఇప్పుడు కప్ప, పాములను కూడా రప్పించు' అంటూ దైవానికి మొరపెట్టుకున్నాడు. చూస్తుండగానే కప్పను వెంటాడుతున్న పాము కనిపించింది. ఆ సర్పం కప్పను కాటేయబోతుండగా.. పాము విషం పుర్రెలో పడింది. ఆ వ్యక్తి కోరుకున్న ఔషధం దక్కినట్లయింది.

రామకృష్ణ పరమహంస తన వద్దకు వచ్చిన భక్తులకు ఈ కథ చెప్పి 'అపనమ్మకం లేని చిత్తంతో హృదయపూర్వకంగా ప్రార్థించాలి. అలాంటి ప్రార్థనల్ని భగవంతుడు తప్పక వింటాడు. ఎలాంటి విపత్కర పరిస్థితులనయినా సానుకూలంగా మార్చేస్తాడు' అని వివరించారు.

– చక్రి

ఇస్లాం సందేశం

ఆధ్యాత్మికతను పెంచే గ్యార్వీ షరీఫ్

అక్టోబరు 14న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం ఆరంభం

సూఫీ ఆధ్యాత్మిక గురువు హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీని (రహ్మాత్ ఉల్లాహ్ అలైహి) స్మరించే పవిత్ర ఉత్సవం గ్యార్వీ షరీఫ్. ఇరాక్‌లో జన్మించిన ఆ మహాత్ముడు బహుముఖ పండితుడు. ఆధ్యాత్మిక వ్యాసంగాలతో అల్-గౌస్ అల్-ఆజం (గొప్ప సహాయకుడు) అనే బిరుదు పొందారు. ఇస్లామిక్ కాలెండర్‌ను అనుసరించి రబి-ఉల్-థానీ నెల 11వ రోజున (అక్టోబరు 14) గ్యార్వీ షరీఫ్ పర్వదినాలు ఆరంభమై రబి-అల్-థానీ నెల చివరి రోజున (నవంబరు 2) ముగుస్తాయి. ఈ సందర్భంగా ఖాదిర్ సూక్తులూ సందేశాలను గుర్తు చేసుకుంటారు. ఖురాన్ పారాయణ, ప్రార్థనలు, దానాలు చేస్తారు.



పాపప్రక్షాళన అనేది గ్యార్వీ షరీఫ్ ఉద్దేశం. ఆర్థిక లాభాలు, వ్యక్తిగత స్వార్థాలతో ఆందోళన చెందుతున్న ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక చింతనను ప్రబోధిస్తుందీ పండుగ. ఇస్లాంలో రెండు ప్రధాన విభాగాలైన సున్నీ, షియాలను సమానంగా గౌరవించారు ఖాదిర్. ఆయన బోధనలు మత విభజనను వ్యతిరేకిస్తూ ఐక్యతను చాటేవి. గ్యార్వీ షరీఫ్‌లో దానాలు చేయమని ఉపదేశించారు. ఖాదిర్ పేదలను, అనాథలను ఆదుకోవడంలో ప్రాచుర్యం పొందారు. అనేక ఇస్లామిక్ సమాజాలు ఆ రోజున దానధర్మాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయి. గ్యార్వీ అంటే పదకొండు. ఇది ప్రత్యేక సంఖ్య. ఖాదిర్ పదకొండుమంది శిష్యులు ఆయన ప్రబోధించిన ప్రేమ, దయ, ఐక్యతాభావాలను విస్తృతంగా వ్యాప్తి చేశారు. ఈ రోజున ఎవరికి వారు స్వీయపరిశీలన చేసుకుని, తమ లోపాలను సరిదిద్దుకుంటారు. ఇది వ్యక్తిగత, ఆధ్యాత్మిక జీవనాన్ని పెంపొందిస్తుంది. – డా.మొహమ్మద్ నయీం


అసూయతో పతనం

ధృతరాష్ట్రుని అర్ధాంగి గాంధారి.. పాండురాజు సతీమణి కుంతీదేవి కన్నా ముందే గర్భం దాల్చింది. కానీ కుంతీదేవే తొలుత ధర్మరాజుకు జన్మనిచ్చింది. కురువంశ పరంపరలో పాండురాజుకు ప్రథమ సంతానంగా ధర్మస్వరూపుడైన కుమారుడు జన్మించటంతో.. ఆ శుభవార్త హస్తినాపురమంతా వ్యాపించింది. ఆ సంగతి గాంధారి అంతఃపురానికి కూడా చేరింది. ఆమె అసూయతో రగిలిపోయింది. ధర్మరాజుకే భవిష్యత్తులో సామ్రాజ్యపగ్గాలు అప్పజెబుతారని ఈర్ష్య చెందింది. తట్టుకోలేక నిండుగర్భాన్ని విచ్ఛినం చేసుకుంది. అది తెలిసిన వ్యాసమహర్షి తక్షణం అంతఃపురానికి చేరుకున్నాడు. ఆ మాంసపు ముద్దను నూటొక్క ముక్కలుగా చేసి, నేతి కుండల్లో పెట్టించాడు. తదనంతరం వాటి నుంచే నూరుగురు కొడుకులు, ఒక కూతురు జన్మించారు. అపురూపమైన ఆ దృశ్య ప్రపంచాన్ని దర్శించుకునే భాగ్యాన్ని త్యాగం చేసి, అంధుడైన భర్త కోసం జీవితాంతం కళ్లకు గంతలు కట్టుకుంది గాంధారి. సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానుడినే శపించగలిగిన ఆధ్యాత్మిక సాధకురాలు ఆమె. కానీ అసూయతో రగిలినందువల్ల తన పారమార్థిక శక్తినంతా కోల్పోయింది. కులనాశకులైన కుమారులకు జన్మనిచ్చింది. అందుకే.. కురుక్షేత్ర సంగ్రామానికి కౌరవులో, కృష్ణపరమాత్ముడో కారణం కాదు, నిండుచూలాలుగా ఉన్నప్పుడు గాంధారికి కలిగిన అసూయ, మనోవికారాలే అందుకు దారితీశాయి అంటారు పండితులు.



– ప్రహ్లాద్

దేవుడి కంటే గొప్ప!



పూర్వం ఒక రాజు ప్రజలను కన్న బిడ్డల్లా ఆదరిస్తూ వారి మన్ననలు అందుకుంటున్నాడు. అయితే.. పండితులను పిలిచి 'నేను ఎవరికీ ఏ ఇబ్బందీ కలగకుండా చూసుంటున్నాను. నా పాలనలో ప్రజలు సుఖసౌఖ్యాలతో ఉన్నారు కనుక నేను భగవంతుడితో సమానం కదా!' అనేవాడు. రాజు వల్ల లబ్ధి పొందేవారు, ఆయనతో విరోధం ఇష్టంలేని వారు.. 'అవును, మీరు దేవుడే' అంటూ పొగిడే వారు. కానుకలు అందుకునేవారు. అలా ప్రశంసించడం ఇష్టం లేనివారు మౌనంగా ఉండిపోయేవారు. అంతేతప్ప నిజం చెప్పడానికి ఎవరూ సాహసించలేదు. ఎవరెన్ని రకాలుగా చెప్పినా రాజుకి సంతృప్తి కలగలేదు. వారి మాటల్లో నిజాయితీ కనిపించలేదు. ఇలాంటి సమయంలో ఒక సాధువు రాజదర్శనానికి వచ్చాడు. అతడి కళ్లలో కాంతి చూశాక తనకు సరైన జవాబు చెప్పగలడు అనిపించింది. అతిథి మర్యాదల అనంతరం 'మహాత్మా నేను దేవుడితో సమానమా, కాదా? నిర్మొహమాటంగా చెప్పండి' అనడిగాడు. సాధువు తడుముకోకుండా 'రాజా! నువ్వు భగవంతుడితో సమానం కానేకాదు' అన్నాడు. అది విని విస్తుపోయాడు రాజు. అంతలోనే సాధువు గొంతు సవరించుకుని 'అంత కంటే ఎక్కువే' అన్నాడు. ఆ మాటతో ఉప్పొంగిపోయాడు రాజు. కానీ ఇందులో ఏదో మెలిక ఉందనిపించి 'ఎలా?' అనడిగాడు. సాధువు నవ్వి- 'నువ్వు ఆగ్రహిస్తే రాజ్య బహిష్కరణ చేయగలవు. దేవుడలా చేయలేడు! ఈ రాజ్యమొక్కటే కాదు, లోకమంతా తనదే అయినా బహిష్కరించడు మరి' అంటూ బదులిచ్చాడు. ఆ మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించిన రాజు ఇన్నాళ్లూ అహంకారంతో సృష్టికర్తను తక్కువగా అంచనా వేసినందుకు సిగ్గుపడి సాధువుకు నమస్కరించాడు. – రమా శ్రీనివాస్

> **బంధుమిత్రులు, భోగభాగ్యాలు, అనుబంధాలు, యుక్తవయసు లాంటివి చూసుకుని గర్వించవద్దు. ప్రతిదీ క్షణభంగురమే. కాలం రెప్పపాటులో లాగేసుకుంటుంది. అన్నీ చేజారిపోతాయి. ఈ భ్రమలను వదిలేసి శాశ్వతమైన పరమాత్మున్ణి తెలుసుకుని, ఆయన కృప పొందేందుకు ప్రయత్నించండి.**
> – ఆదిశంకరాచార్య

